శ్రీ

# నైషధీయ చరితము

## శృంగారతరంగిణి

శ్రీమహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ, కవిరాజ, కవిసార్వభౌమ

శ్రీ పాదకృష్ణమూర్తిశాస్త్రి

ప్రణీతము.

894-8131
KRI-N

చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్‌సన్స్‌వారి

'వావిళ్ల'ప్రెస్సున

ముద్రితము

1941

[వెల రు 1-0-0

కాపీరైటు]

26071
25.3.73

Printed by

V. VENKATESWARA SASTRULU

of V. RAMASWAMY SASTRULU & SONS

AT THE 'VAVILLA' PRESS,

Madras.—1941.

# విమర్శకపీఠిక.

కేవలపీఠిక, విమర్శకపీఠిక— అని పీఠిక ద్వివిధము అందు, గ్రంథోద్దేశమేకాని, కథలోని మార్పులు మొదలగునవి కూడఁగాని తెలుపునది కేవలపీఠిక. గ్రంథప్రాశస్త్యమును వలయునెడల దోషసూచనలను దెలుపునది విమర్శకపీఠిక. మొదటిది కృతికర్తలును, రెండవది విమర్శకులును వ్రాయనగు. కవిహృదయము పరులకు సుస్పష్టము కామించేసి కృతికర్తలే రెండవదిమాత్ర మేల వ్రాయరాదని యెవరేని ప్రశ్నింప వచ్చును. నిండుగాను— అంతటనుగాకున్నను మొత్తముమీఁదనైనను విమర్శకులు కవిహృదయమును గ్రహింపఁజాలక పోరు గావునను, కృతికర్తలు తమగ్రంథముల ప్రాశస్త్యము తామే పొగడుకొనుట యొప్పదు గావునను, తామే దోషసూచనలం దెలుపుట పొసఁగదుగావునను, విమర్శకులే ప్రశస్తకావ్యముల పీఠికలు వ్రాయుట యెంతయు నొప్పు.

విమర్శనమునకు దోషాన్వేషణముకంటె గుణగ్రహణమే ముఖ్యలక్షణముగా నుండనగు. వలయునెడల దోషములేవేని చూపవలసియున్నను వానికే ప్రాధాన్య మీయరాదు. దోషములనేనియు సూచనలుగాఁ దెలుపుట, అరయికకు మతీంతనాజూకుతనము తేఁజాలిన వెరవు. అట్లని మేఱమీఱిన పొగడికలకుం దావిచ్చు పొరపాటునకు లోనగుటయుం దగదు. ఇది సత్కావ్యములంగూర్చి. ఇంక దుష్కావ్యములం గూర్చియన్ననో, వ్యక్తిప్రధానముగాఁగాక విషయప్రధానముగా, దోషములను బాగుగా నిరూపించి చూపనగు.

విమర్శకపీఠిక నెమ్మదిగా వ్రాయవలసినదిగాని తొందరపాటున వ్రాయవలసినదికాదు. అది వ్రాయువారికి గ్రంథము పలుసార్లు చదువుటకు వలయు వ్యవధి యుండవలయును. తొందరతొందరగా వ్రాసిన విమర్శనము పొత్తపువిలువను సరిగా వెల్లడింపఁజాలదు.

ఇక్కడ మా కొకచిక్కు వచ్చినది. దీనికృతికర్త కవిసార్వభౌ ముఁడు కాఁజాలినదిట్ట. ఆయన వ్రాసినకావ్యము విమర్శించి, పీఠిక వ్రాయు వారు వారితో సమానులు కావలయు. కాని, విమర్శకబిరుదముల వాసనయే లేని మే మొక్కసారి విమర్శకసార్వభౌముల మెట్లు కాఁగలము? అయిన, దీనివిమర్శకపీఠిక వ్రాయ మీ రేలసిద్ధపడితి రనవచ్చు. కృతికర్తృవిద్వత్ప్రాశకరాజహంసములు మాపీఠికలోని గుణక్షీరము లనే గ్రహించుననుని విశ్వాసముచేతనే; భరోసాచేతనైత మనుటకును జంకము. కాని, యిక్కడ మే మొకముక్క చెప్పవలసివచ్చినది. విమర్శకులము ముగ్గురము; పై పెచ్చు మూఁడుళ్లవారము; కార్యాంతరనిమగ్నులము; దానికిందోడు గ్రంథప్రతియు మా కొక్కటియే. ఇదంతయుఁ దెలిసియే కృతికర్తగారు వ్యవధి యిచ్చినారు. కాని, పైవారు వారిం దొందరపెట్టుటంబట్టి వారు దానినిగూర్చి వ్రాయవలసివచ్చె. అందువలనఁ దుదకు మేము తొందరపడవలసియే వచ్చినది. దానికి మా తొందరపనులును సాయపడినవి. కాన, దాని లోటుండునని వగచెదము. ఇంతకుఁ దృష్టి కంత మెక్కడ? కవిసార్వభౌమునికిఁ దనివి కలిగించు పీఠిక వ్రాయఁగలుగుదు మనుకొనుటకంటె వెఱ్ఱి వేఱొండు కలదా? కొండంత దేవుని నేభక్తులు కొండంతపత్తిరి పెట్టి పూజింపఁగలరు? కనుక, మాపని మే ముడుతభక్తిరీతి నొనర్చువారము. ఈపీఠిక వ్రాయఁగోరి మమ్ము గౌరవించిన కవిసార్వభౌమునకు మాకృతజ్ఞత తెలుపు వారము.

మే మీపీఠిక వ్రాయవలసివచ్చుట కేవలము దైవికము. మాలో నొకరు మధురకవి శ్రీనాథము కృష్ణరాయషష్టిపూర్తిమహోత్సవసమయమున జరిగిన గ్రంథాలయమహాసభపనిమీఁద రాజమహేంద్రవరమునకుఁ జని శాస్త్రిగారియాతిథ్యము పొందుట తటస్థించినపుడు, వారు మువ్వూరను నైషధీయచరితపీఠిక వ్రాయఁగోరిరి. అందొకరభిప్రాయము మాత్రము వ్రాసియిచ్చిరి. తక్కినయిరువురమును మఱొకరిని మాతోఁ జేర్చుకొని యిది వ్రాసితిమి. ఇట్లు శాస్త్రిగారుకోరిన మువ్వూరముగాకున్నను, మువ్వూరమే వారిశృంగారతరంగిణీపీఠిక వ్రాయుట జరిగినది. ఈపద్ధతియు మంచిదే యగుఁగాక!

## ఆక్షేపములకు సమాధానము

నలచరిత్ర మెందఱో యింతకుముందు వ్రాసియుండ మరల నిది యేల? యని యెవరేని యందురేమో! రామకథ పలువురు వ్రాయుట కేమి, నలకథ పలువురు వ్రాయుటకేమి, సత్కథాగౌరవమే కారణము. ఇంతకు వ్రాతకారులు తమకు నచ్చిన కథ కైకొందురు. అటులే శాస్త్రి గారును నలకథ కైకొనిరి. దానికిఁదోడు కృతిపతియు నదే కోరె. మఱొకమాట. "ముఖే ముఖే సరస్వతీ" అను పెద్దలమాట పాటింప వలదా? ఎవరిముఖముననుండి సరస్వతి యెట్లు పలికించునో చూచి, రసా స్వాదన మెనరించుటకదా రసజ్ఞులపని? కాన, మనకవిసార్వభౌముఁడు శృంగారతరంగిణిరచింపఁబూనుట ముదావహమేకాని వే ఱొండుకాదు. ఇది చదువరులకు బోధపడకపోదు.

ఇఁక, నైషధీయచరితమునకు శృంగారతరంగిణి యను మఱొక పేరు పెట్టనేల? యను ప్రశ్న మొకటి బయలుదేఱవచ్చును. దానికత ము, శాస్త్రిగారు కవిసార్వభౌమబిరుదాంకితు లగుటచే మునుపటికవి సార్వభౌముఁడగు శ్రీనాథుఁడు శ్రీహర్షమహాకవీంద్రుని విద్వద్దౌషధ మగు నైషధము శృంగారనైషధ మనుపేర నాంధ్రీకరించియుండుటం బట్టి తాము నాకథ కావ్యముగా రచించునెడ దానికి శృంగారపదసమే తమగు నామ మిడఁదగు నని తలంచుట కానోపును. అగుఁగాక! అది సార్థక మగున ట్లిది సార్థకమా? యందురేని, కావ్యములోని హెచ్చు భాగము శృంగారరసప్రధానమే యగుటచే సార్థకమే యని యంగీక రింపవచ్చును.

## కావ్యావశ్యకత

"సంసారవిషవృక్షస్య, ద్వే ఫలే అమృతోపమే;
కావ్యామృతరసాస్వాదః; సల్లాప స్సజ్జనై స్సహ".

సంసారము విషవృక్షము, కాన దానిఫలము లన్నియు విషఫల ములే కావలె. అయినను దైవానుగ్రహమున రెండుపండ్లు మాత్ర మమృతోపమము లఁట; మొదటిది కావ్యామృతరసాస్వాదము; రెండ వది సజ్జనులతోడి సల్లాపము. కాన, సత్కావ్యము మానవుల కావశ్య కమే. కాని, సుకవులవలనఁగాని సత్కావ్యము లభింపదు.

"నరత్వం దుర్లభం లోకే; విద్యా తత్ర సుదుర్లభా;
కవిత్వం దుర్లభం తత్ర; శక్తి స్తత్ర సుదుర్లభా". అగ్నిపురాణము.

కవితాశక్తి గలిగి కావ్యముం గూర్చు సుకవిని స్తుతింప నెవరి తరము?

"జనినాథాగ్రణి యాత్మరాజ్యమున నిచ్చల్ పూజ్యుఁ డానీమఁ బా
సినఁ దా గర్వయుఁ జేయఁ డన్నికడలక్ శ్రేష్ఠుండు విద్వాంసుఁ డా
యనకన్నం గవి మేటియా "సుకవితా యద్యస్తి రాజ్యేన కి"
మ్మను వాక్యంబు నిజంబు దీనిఁ గని కావ్యంబుల్ రచింపంవగున్". అప్పకవీయము.

## కృతికర్తృసమర్థత.

"జగ మెఱిఁగిన బ్రాహ్మణునకు జంధెం బేలా?" యనునట్లు మహా మహోపాధ్యాయ; కళాప్రపూర్ణ, కవిరాజ, కవిసార్వభౌమ బిరుదాంకితులై వెలయు శ్రీవేదమూర్తులగు బ్రహ్మశ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి నెఱుఁగనివార లాంధ్రపాఠకలోకమున నెవరు గలరు?

"అవధానములను విద్వేలఁ దవిలితిఁ గడు కబ్బములను దగ సలిపితి నేఁ
గవిసార్వభౌమబిరుదం బవునన నైకొంటి".

అని శాస్త్రిగారే తమసమర్థతం దెలిపినారు. వీరు గ్రాంథికాంధ్ర భాష కొనర్చిన సేవ యిఁతం తనరానిది. ౧౧వ శతాబ్దమునఁనే నన్నయ భట్టు ప్రారంభించినను, తిక్కనసోమయాజియు, ఎఱ్ఱాప్రెగడయు ముగించునప్పటికి ౧౪వ శతాబ్దమువఱకును సంపూర్ణత్వ మొందినది కాదు మనమొదటియాంధ్రమహాభారతము. అట్టిచో, మూలానుసార ముగను, రసవంతముగను శ్రీకృష్ణభారతమును రచించి, తెనుఁగుకవుల మెప్పందిన వీరికవితాశక్తి యనంత మైన దనిన నతిశయోక్తి కానేరదు. అదిగాక, నాటకములు, విమర్శనములు, ప్రహసనములు మొదలగు పొత్తములు ౧౩౦ కంటె హెచ్చుగా వ్రాసి, తెనుఁగువ్రాఁగమి పెంపొందించినారు. "కలావతి", "వజ్రాయుధము" అను మాసపత్రికలు నెలకొల్పి, పెక్కేం డ్లవి నడపినారు, ఇపుడు నైషధీయచరితము రచించి నారు. ఇట్టిమహాకవిబుణము తెనుఁగువా రెట్లు తీర్చుకొనఁగలరు? బిరుదు లీయ లేదా? యని యెవరేని యనవచ్చును. ఇచ్చినారు; నిజమే.

కాని గౌరవదాయకములయ్యును బిరుదులు గాలిప్రోగులు; అవి నా నాఁడుకాదుగదా యొక్కనాఁడేని పిడికెఁడు మెతుకు లిడఁజాలవు. కాన, బిరుదు లిచ్చువా రవి యిచ్చుటతోడనే కాక వానితో స్థిరోపాధులు సైత మమర్పఁజాలినపుడే తనియనగును. పైనిదెలిపిన 130 కి మించిన పొత్తములను శాస్త్రిగారియెడ నభిమానముగలకొందఱు పెద్దలు రాజ మహేంద్రవరమున "గ్రంథప్రకటనసంఘము"గా నేర్పడి, సంపుట ములుగా ముద్రింప సంకల్పించినారు. ఆసంఘవిజ్ఞాపన మీపొత్తము తుదిని గలదు. అది చూచి, దాని ననుసరించి మాతృభాషాభిమానులగు వారు చందాదారులై, శాస్త్రిగారియెడఁ దమకున్న కృతజ్ఞతను గ్రియా రూపముగాఁ జూపి, వారిఋణము తీర్చుకొందురుగాక!

## కృతికర్తృసుగుణములు, వినయము.

సమర్థులయ్యును శాస్త్రిగారు వినయభూషితులు. ఇందలి క్రింది పద్యమే యిందులకు నిదర్శనము.

"ప్రమదం బేర్పడఁ దొల్లిటం గురుకులావాసంబునన్ నేర్చి కా
వ్యములున్ నాటకముల్, పరిమ్మృతులు, శబ్దార్థంబులున్, సత్పరి
శ్రమచే నీకృతి సర్వసమ్మతముగా సంధింతు నట్లైన దో
షము లెంచే నగు దిద్దుఁ డార్యులు నమస్కారంబు లర్పించెదన్". 1 త. 16.

## దేశాభిమానము.

"దక్షిణకాళి...ప్రభవించె నాప్రదేశ మాంధ్రమాతకుఁ బుట్టిని ల్లయ్యె నధిప".
2 త. 53.

అర్జునుని తీర్థయాత్రాసందర్భమున నన్నయభట్టు వేగీదేశవిభవము వర్ణించినట్లు మనకవిరాజు దాంధ్రమాతకుఁ బుట్టిని ల్లని రాజమహేంద్రవరమును వర్ణించుటేకాక, ఆంధ్రకవివలన నలునికి దమయంతియెడఁ గల యనురాగము నెంతో పెంపొందింపఁజేసె.

## అతిథిసత్కారము.

శాస్త్రిగారు తమయింటికి వచ్చినవారికేకాక, తమపురమున నెక్కడకో వచ్చినవారినిసైత మింటికిఁ దీసికొనిపోయి, వారి కతిథిసత్కా-

రము లాచరింతురు. వారిసతీమణి కార్యార్థులగు నాయతిథు లెప్పుడు వచ్చినను వారికొఱకు వేచియుండి, అన్నపూర్ణాదేవివలె నన్నదాన మొనర్చి యాదరించును.

## కృతిపతిప్రశంస.

నెల్లూరిలో న్యాయవాదియై కవితాప్రీతి గలిగి, మన్ననలందు చున్న శ్రీతూములూరి వేంకటశివరామయ్యగారి సుగుణములు విని, మన శాస్త్రిగారు రాయనను దర్శింపఁజని, అతిథిసత్కారము పొంది, ముదమంది,

"ఉత్తమనాయకుండ వని యుల్లము పల్లవితంబుగావునన్
మెత్తనిపాకమున్ గలుగ మేలుకృతిన్ రచియించి నీ కిడన్
చిత్తము చేసితిన్ గొనుము శ్రీయును సంపదయున్ యశంబు నిన్
హత్తగవచ్చు నందున ననంతములై ద్విజరాజశేఖరా". 1 త. 34.

అని రఁట. దాని కాయన యియ్యకొని, సంతసించి,

"కవిసార్వభౌమ, నాయెడ, నవిరళమగు కరుణ గలుగు నట్టిదయేనిన్
దవు నటు కలికల్మషహర, మవు కథ రచియించి యొసఁగు మాశీకృతిగన్."
1 త. 38.

అని కోరినా రఁట. ఆకోరిక తీర్చుటకు శాస్త్రిగారు తా "మించుక రచించియుంచిన నలకథాభాగంబున మఱికొన్నిక్రొత్తలుం గలయఁ గూర్చి పేర్చిన విజ్ఞానంబున "శృంగారతరంగిణి" యను మారుపేర నైషధీయచరితంబు రచియింప నెంచి" తలంచినటులే యది ముగించినారు.

మారయామాత్యకుమారుఁడగు శ్రీనాథుఁడు, తోడిసింగనామాత్యునకుఁ దనశృంగారనైషధ మంకిత మొనర్ప శ్రీకృష్ణమూర్తిశాస్త్రిగారు తోడి వెలనాటివైదికబ్రాహ్మణులగు శివరామయ్యగారికిఁ దమ శృంగారతరంగిణి యంకిత మొనర్పఁగలుగుట యెంతయు సొంపుగానున్నది.

శ్రీశివరామయ్యగారు తమసుగుణములచేత నింతకుముందే తెనుఁగునాట వాసిగాంచి యున్నారు. ఇపుడు కవిసార్వభౌముని మెప్పొంది, కృతిపతిత్వమునకుఁ బాత్రులగుటవలనఁ దమపేరు స్థిరపఱుచు కొనఁజాలినారు; ధన్యులయినారు. ఆయనయే యన నేల? కృతిముఖ

మున వర్ణితులై, వారివంశమువారు పురుషులును, స్త్రీలును—ధన్యులు కాఁజాలినారు. సుగుణవంతులగు పురుషులతోను పతివ్రతలగు స్త్రీల తోను వెలసినవారివంశము కవిసార్వభౌమునిస్తుతిచే ధన్యము కాఁజాలినది.

## కావ్యభేదములు.

కావ్యములు సంస్కృతమున మూఁడుతెగలు:—౧ పద్యకావ్యములు; ౨ గద్యకావ్యములు; 3 మిశ్రకావ్యములు. తెనుఁగున గద్యకావ్యములు వచనకావ్యము లన నొప్పు. ఋషివంశాదులగు సంస్కృత పద్యకావ్యములు గద్యరహితములు. అట్టివి తెనుఁగున నిర్వచనోత్తర రామాయణాదు లేవో కొన్నిమాత్రము కలవు. ముఖ్యములగు తెనుఁగుకావ్యములు మిశ్రకావ్యములే. వీనిని, నిర్వచనపద్యకావ్యములను సైతము ప్రబంధము లనియే తెనుఁగువారు వ్యవహరించుచున్నారు. "గద్యపద్యమయం కావ్యం చంపూ రిత్యభిధీయతే" అను నిర్వచనమునంబట్టి తెనుఁగుమిశ్రకావ్యములు చంపువులే. తెనుఁగుసవచన నిర్వచనకావ్యభాగములకు సాధారణముగు పేరు "ఆశ్వాసము" 18 వర్ణనములు గలది సంస్కృతమున మహాకావ్యము; అట్టిది తెనుఁగున మహాప్రబంధము. మహాకావ్య మను వాడుకయు లేకపోలేదు.

## 18 వర్ణనములు.

"పుర సింధు నగర్తు ర్వన శశి సరసీ వన మధు రతి ప్రసంగ విరహముల్
పరిణయ తనయోదయ నయ విరచన యాత్రా జి శైత్య విభు వర్ణనముల్".

నరసభూపాలీయము.

"పుర వారాశి మహీధ రర్తు శశభృ త్సూషో దయో ద్యాన పు
ష్కర శైలీ మధుపాన మోహన విదోగ క్షేమ యాన స్వయం
వర పుత్రోత్సవ మంత్ర దూత్య రణ దోర్వైకుంఠి సంకీర్తనా
కర మష్టాదశవర్ణనాన్వితము తత్కావ్యంబు భవ్యం బిలన్".

కావ్యాలంకారచూడామణి.

"ఇరువదియుఁరెండువర్ణనలు గూర్చి చెప్పఁబడియుఁ బ్రబంధంబు శ్రీనివాస".

అప్పకవీయము.

కాని, యివి కాలభేదముంబట్టియు, అభిరుచిభేదముంబట్టియు మాఱును. కాన, వీనిలోఁ గొన్ని తగ్గవచ్చును. క్రొత్తవి కొన్ని చేర వచ్చును. దీనింబట్టియే,

''ఇందు నొకకొన్ని కడమైన నెంచి చూడ,నదియు నవని మహాకావ్య మనఁగఁబరఁగు''.

అనినాఁడు నరసభూపాలీయకర్త.

## కావ్యలక్షణము.

''విగతదోషంబులును గుణాన్వితము లఘికలసదలంకారభావోపలక్షితములునైన శబ్దార్థ ములు గావ్య మనఁ జెలంగు''. నరసభూ.

''రసాత్మకం వాక్యం కావ్యమ్''. సాహిత్యదర్పణము.

పై రెండును దెలిపినది కావ్యలక్షణమే. మొదటిది విస్తరించి తెలుపఁ, రెండవది సంగ్రహించి తెలిపె. కాన, రసాత్మక మగునదే కావ్య మని మనము గ్రహింపనగు.

## నైషధీయచరిత మెట్టి కావ్యము?

కృతికర్త ప్రతినంబట్టి యిది సర్వసమ్మతముగా సంధించిన మెత్తని పాకముతోడి మేలుకృతి. ధర్మార్థకామమోక్షదాయకమై, కీర్తిప్రీతుల నొసంగఁజాలునది కావ్యనిషేవణమే యని యెఱింగి, "అద్ధానివలన నొందు నానందమే బ్రహ్మానంద మని గుర్తించి "స్వయం తీర్ణఃపరాం స్తారయేత్" అను నార్యోక్తి ననుసరించియే మనకలాప్రపూర్ణుఁడిది సృష్టించె. ఇయ్యది నాచనసోమునికవితయందలి నాడెమును, తిమ్మనార్యుని ముద్దుపలుకులలోని తీయందనమును, చేమకూరవానిలోని చమత్కారమును, కూచిమంచివారిలోని మంచితనము నొక్కసారియే కొంతకొంత పుణికి పుచ్చుకొన్నది. అంతేకాదు. అఖండగౌతమీతీరనివాసులైన నన్నయశ్రీనాథులరచనాప్రాబల్యము కూడ నిందు బాగుగా గోచరించు చునే యున్నది. పుర ఋతు విరహ వివాహ పర్వత స్వయంవర చంద్రో దయ పుత్రోత్పత్తి సూర్యాస్తమయాదివర్ణనములతో వన్నె గాంచుటం జేసి యిది మహాప్రబంధమే. అయినను, శాస్త్రిగారు గద్యమున నటు తెలుపక వినయమును వెల్లడించుట యెంతయు శ్లాఘనీయము.

## భాగములపేరు.

చంపువగు నైషధీయచరితము శృంగారతరంగిణి కాన దీనిభాగములపేరు 'తరంగ' మయ్యె. ఇట్టి ఓ తరంగములతో నిది చెలంగుచున్నది.

## ఇష్టదేవతా ప్రార్థన.

కృతికర్త లాశ్వాసములమొదట నొకయిష్టదేవతను వేడికొనుట యాచారము. సర్వదేవతాసమత్వముం దెలుప నాయాచారము మార్చి, ప్రథమద్వితీయపంచమతరంగముల శివుని, తృతీయతరంగమున రంగవిభుని, చతుర్థతరంగమున శ్రీశుని, షష్ఠతరంగమున రాముని బేరొక్కొని, కృతిపతిని రక్షింపఁ గొన్నియెడలఁ బ్రార్థించియు, కృతిపతి వారికరుణచే వర్ధిల్లుఁగాక యని కోరియు, శాస్త్రిగారు తమమహామహోపాధ్యాయ విశిష్టతను గనఁబఱిచిరి. అదియునుగాక, కథాప్రారంభమున "విరాట్స్వరూపుఁడగు దేవుఁడు మమ్ముఁ బ్రోచుతక" అని క్రొత్తచేర్పు చేర్చి, తమ వ్యక్తిత్వమును వెల్లడించిరి.

## పద్యగద్యపరిమితి.

ఇందలి పద్యగద్యములు ౧౦౨౭ పంక్తులమొత్తము ౪, ౫౦౦; అందు వచనపంక్తులు ౮౩౦. కాన, వచన మిందు సుమా రైదింట నొకపాలు. దానిరీతి నన్నయభట్టారకుని వచనరచనను స్ఫురింపఁజేయుచున్నది.

## వృత్తములు.

చంపకమాల మొదలగు సాధారణవృత్తములేకాక అలసగతి, సుగంధి, పద్మనాభము మొదలగునవి వాడుటచే దీనికి వైవిధ్యము కలిగి, సొగసు హెచ్చినది.

## కావ్యప్రాశస్త్యము.

కథాసంవిధాననైపుణ్యము, శీలపోషణము, సలక్షణమును రసవంతమునగు భాష, లోకజ్ఞానము, ప్రతిభ మొదలగునవి కావ్యప్రాశస్త్యమునకు సాధనములు. అవి యన్నియుఁ గాకున్న ముఖ్యములైన వానిఁ గైకొని, నైషధీయచరిత మెట్లు మేటికృతియో చూతము.

## కథాసంవిధానమున పుణ్యము.

కుమారసంభవము, భారవి, మాఘము అను కావ్యకథలకువలెనే నైషధకథకును భారతరత్నాకరము పుట్టినిల్లు. వనవాస మొనరించు ధర్మరాజునకు బృహదశ్వమహర్షి నలోపాఖ్యానము చెప్పి, అతని నూఱడించె. షట్చక్రవర్తులలో రెండవవాఁడగు నలుఁడు, సప్తవ్యసనములలో రెండవదగు జూదమునకు బానిసయై, పలుబాధల పాలయ్యె. జూదమువలన గలిగినపాటును నేర్పుగా వర్ణించి, చదువరుల కంటఁగట్టునట్లు చేసినజూదము కూడనిదని తెలుపునది కావున నలకథ సత్కథ; సుప్రసిద్ధము; కలికల్మషహరము. కావుననే కృతిపతి దీనిం గోరె.

ఇట్టితొంటిసత్కథయగు పుట్టురత్నమును జేకొని, మనకవిసార్వభౌముఁడు వసుచరిత్రమునఁ దెలిపినట్లు తనకల్పనలచే నలంకరించి, శృంగారతరంగిణి యను సానఁబట్టిన జాతిరత్నముగా సంతరించె. ౨౯౯ పద్యవచనములలో నలోపాఖ్యానమున నిమిడిన కథయే యిందు వర్ణనాదులతో ౯౨౫ పద్యవచనములపరిమితికిఁ బెరిఁగినది. కథకు వన్నె తెచ్చుటకయి కళాప్రపూర్ణుఁడు తననైపుణ్యము చూపి చేసిన యీక్రిందిచేర్పుమార్పులు గనుఁడు —

(౧) దమయంతి నలునియెడ ననురాగము తెలుపునపుడు,

"నడుమ న్నా కతికష్టమైన సుఖమైన న్వానితో లోకమా
నడవుల్ వీడులు నొక్కరూప కద నా కాతండు నే నుండినన్". 2 ఆ. 32.
"ఆతనింగాక...కాలసర్ప మెపరంగా నోడ నొక్కింతయున్". ,, 33.
"నాపాలిపెన్నిధానము నలుం డాతనిఁగోరి చింతామణిఁ గోరఁబోవ". 3 ఆ. 66.

అని దమయంతిచే ననిపించి, ముందుకథ సూచించె.

(౨) దమయంతిగుణములు నలునికి వర్ణించి తెలుప నొకవై దేశికుని సృష్టించి, ఆతనిస్థితి చెప్పించునెపమున రాజమహేంద్రవరమును, గౌతమిని వర్ణించి జన్మభూమియందలి గౌరవమునేకాక, తనమనుగడకూడ నేర్పుగా నెఱిఁగించి, తాను రాజసన్మానము పొందినట్లు నైతము తెలిపె.

(3) దేవేంద్రుఁడు దమయంతికడకు దేవదూతికలను పంపినట్లు కల్పించె.

(౪) పుష్కరుఁడు స్వయంవరానంతరము నలు నెదిరించి యోడి పోయినట్లు చేసె.

(౫) ఆదర్శప్రాయమగు నలునిరాజ్యపరిపాలనము చేర్చి, వర్ణించె.

(౬) దమయంతి కార్చిచ్చులోఁ బ్రవేశింప నది చల్లఁబడినట్లు కథాకల్పన మొనరించె.

ఇట్టి సంవిధాననైపుణ్యము సామాన్యకథకు మహాప్రబంధపదవి చేకూర్చుట కొకసాధన మైనది.

## శీలపోషణము.

కథాసంవిధాననైపుణ్య మెంత చూపఁగలిగినను, కథలో వచ్చు స్త్రీపురుషులశీలము పోషించునేర్పు చూపనిచో, కావ్యగౌరవము పోవును; ఆనే ర్పెంత హెచ్చుగాఁ జూపిన గౌరవమంత హెచ్చును. అందు, నాయికానాయకుల శీలపోషణము ప్రధాన మని వేఱె చెప్ప నక్కఱలేదు. అందును నాయికాశీలమునకే ప్రాముఖ్య మీయవలయు. అటులే చేసి, కవిసార్వభౌముఁడు కథాప్రాణమగు దమయంతీశీలముం జక్కఁగాఁ బోషించె.

జూద మాడరా దని పురాణాదులేకాక ప్రభుసమ్మితమగు వేద మును శాసనముగాఁ దెలిపినది. ఋగ్వేదమున ౧౦-వ మండలములోని 3౪-వ సూక్తమందలి క్రిందిఋక్కులు పాచికలను గూర్చియు, జూద మునుగూర్చియు, ఎంతచక్కఁగాఁ దెలిపెనో కననగు.—

౨. నమామి మే ధన జిహేళ ఏషాశివాసఖిభ్యఽ ఉత మహ్య మాసీత్
అక్ష స్యాహ మేక పరస్య హేతోరనువ్రతా మపజాయ మరోధం.

౯. నీచా వర్తంతఽ ఉపారిస్ఫురంత్యహస్తోసో హస్తవంతం సహం తే
దివ్యాఽ అంగారా ఇరిణేన్యుప్తాః శీతాః సంతో హృదయం నిర్దహంతి.

౧౦. జాయా తప్యతే కితవస్య హీనామాతాపుత్రస్య చరతః క్వ క్వ సిత్.

౧3. అక్షై ర్మా దీవ్యః కృషి మిత్కృషస్వవిత్తే రమస్వ బహుమన్యమానః.
తత్ర గావః కితవ తత్ర జాయాత న్మే విచష్టే సవి తాయ మర్యః.

తాత్పర్యము (౬. ఆ.)

౭. ఈపాచిక న న్నెఫుడును విసికింపదు; ఎప్పుడును నాపై నలు గదు. అంతేకాదు, నామీఁదనేమి, నానెయ్యురమీఁదనేమి, కనికరమే కురియుచుండును. దానియొంటిచుక్కతో ఆట సరి. ఇట్టిపాచికకొఱకు నన్ను వలచు నాయిల్లాలి నెడచేసితి.

౯. (పాచికలు) క్రిందివైపు దొర్లును; అంతలో వడిగా పై కెగు రును; చేతులులేనివయ్యా, మానిసిని మెడముప్పి, వానిచేతులతో తమ్ము కొలిపించుకొనును. తాము చల్లనివయినను పలకమీఁద పడఁగానే గారడినిప్పులకుప్పలవలె గుండెను బుగ్గిగా కాల్చివేయును.

౧౦. జూదరియిల్లాలు దీనురాలై తపించును. తలదాఁచుకొనుట కిల్లు లేక, అల్లాడు కొడుకునుగూర్చి తల్లి దురపిల్లును.

౧౩. పాచిక లాడకుము; ఆడకుము. నీపంటపొలము దున్ను కొనుము. ఉన్నసొత్తు వాడుకొని, నెమ్మిగనుము; అదే చాలు నని తని యుము. నీగొడ్లెక్కడ? నీయిల్లా లెక్కడ? ఓజూదరీ! ఇట్టు లీమంచివే వెలుంగే నాతో వక్కాణించినాఁడు.

దమనుఁడను మహాముని వరప్రభావమున దమయంతి జన్మించి నది. చిన్నతనమున బాలికలందఱవలెనే గుడుగుడుగుంచములు మొద లగు నాటలాడుకొనుచుఁ బెరిఁగినది. ఆమె దయాసత్యశౌచనిరతయు, గురుజనభక్తిభరితయునై, నిఱువేదల నాదరించుచు, దిక్కుమాలినవారి కొక్కవిధమున దిక్కు గల్పించుచు, పోషించుచుండినది. నలమహారాజు గుణగణములప్రశంస వచ్చినపుడు చెవులు "దోరవెట్టి" వినుచుండినది. పలుకులును, హృదయమును నలార్పణము చేసి, కట్టెమాత్రము కదలు చున్న ట్లామెదేహము తిరుగు స్థితికి వచ్చినది. నలుఁడామెపాలిటిపెన్నిధి. నలార్పితమైన యామెచిత్తమును, చింతామణి లోనగు స్వర్గలోకవిశేష ములుగాని, దేవేంద్రుని త్రిభువనసామ్రాజ్యవిభవముగాని, ఆకర్షింపఁ జాలకపోయె. తనసర్వస్వము నలుని కర్పించి, తదన్యములనెల్ల నామె తృణప్రాయముగఁ దిరస్కరించె. ఆమెగాఢానురాగవాహినిని మరల్ప దేవదూతికలకును దేవతలతరఫున దూతయై వచ్చిన నలునకును గూడ నసాధ్య మయ్యె.

వెక్కిరింపఁబోయి వెల్లకిలఁబడినట్లు దమయంతిని వంచింప నల రూపధారులై వచ్చిన దిక్పాలురు, నలునియంచామెకున్న పవిత్రానురాగ జ్యోతిప్రభంజేసి పరాజితులై, నిలువుగ్రుడ్లు పడి, నేలకుఁ గా ళ్లందక, తికమకలుపడవలసివచ్చె. వారియెదుటనే దమయంతి నలుని వరించె.

వివాహ మైనది. సంతానము కలిగినది. సుఖంచువేళ నేదో విఘ్నము—నలునిజూదపువెల్లి—వచ్చినది. అపుడు దమయంతి జూదము మాను మని యతని వేఁడుకొనినది. కాని, లాభము లేకపోయినది. అది పరికించి బిడ్డలను వెంటనే పుట్టినింటి కంపినది. తాను నలుని విడువక, అతనితోడునీడయై యుండినది. అంత, భార్యాభర్త లిరువురు నడవుల పాలైరి. ఏకవస్త్రధారులైరి. భార్యదురవస్థ చూడఁజాలక భర్త తన మానము కాచుకొనుట కామెచీరలో సంగోరు చించి, ఆమె నెడఁబాసి పోయె. చీఁదరపడి, పాప మాయిల్లాలు మేల్కొని, పతింగానక, వెదకి, అలసి, సొలసి, పలుకడగండ్లు పడినది.

నలచక్రవర్తిభార్యకు, చక్రవర్తినికి, దమయంతికి, ఎంత పాటు! ఎంత దురవస్థ!! ఎంత జాలి!!!

"పారద మది సోకఁ బస చెడు బంగారమన వెలవెలఁబోవు తనువు గలిగి
చము రెఱుంగక మట్టిఁ జమురుట నడగట్టి నఱిసి న ట్లగపడు నెఱులు గలిగి
బొట్టుగా కొకనల్లపూసయుం దాల్పమి జా నేదు వికృతవేషంబు గలిగి
నెఱిమాసితోలు నా నెఱిఁ బాసి తుండెమై నరిపోని యేకవస్త్రంబు గలిగి
కోల యగు మోము లో తైనవాలుఁగనులు, వాడి వత్తలై కిక్కిస కాడలైన
కాలుసేతులు గలిగి యిక్కడ మెలంగు, నీమె యొక పేదముత్తైదు వేమొ యనుచు".

చేదిపురంబున సునందకడ నుండునపు డామెం జూచిన సుదేవుఁ డడసుకొనవలసిన దుస్థితికి వచ్చినది దమయంతి.

ఎట్లో పుట్టినిల్లు చేరుకొనినది. సమర్థములగు పలుకులు సభలలోఁ బలికించి, ప్రతివచనంబులంబట్టి నలునిజాడ తీసినది. మిథ్యాభిపుసస్వయం వరమిషచే నలునెట్లో తనతండ్రినగరమునకు రప్పించుకొనినది. అగ్ని శోధితముగాక బంగారు ప్రకాశింపదు. కఠినపరీక్షకులోనుగాక పాతివ్రత్యము ప్రసిద్ధి పొందదు. కాన, వాయుభట్టారకునిచే దమయంతి తన

నిష్కల్మషత్వమును వెల్లడింపఁజేసినది. మఱేమి కావలె? సతి కపుడ పతి పొందు చేకూరినది. పతితోడ మోదవార్ధి నోలలాడినది. త్వరలోనే సామ్రాజ్యము చేకూర దమయంతి తొంటియట్ల నలచక్రవర్తితో సకల సుఖంబులం దేలఁ జాలినది.

ప్రశస్తమగు దమయంతిశీలమువలన మానవజాతి దేవతాజాతిని ధిక్కరించి, నైతికోన్నతి పొందఁగలిగినది. ఇట్టిదివ్యసందేశ మెంద ఱెన్నిచందముల నందిచ్చిన నందీయఁదగియుండును. దేవేంద్రాదిదేవతా తృణీకరణనైపుణివిశేషంబుచే విభ్రాజితంబగు దమయంతీపాతివ్రత్యమహిమాభివర్ణనంబుతో భాసిల్లు నైషధీయచరిత మాంధ్రవాఙ్మయమునకు నిరుపమానభూషణము కాదా? ఇట్టిచో నైషధీయచరితము—దమయంతీచరితమనిన మఱెంత యొప్పునది— తెసుఁగున ననవసర మెట్లగును?

నలునిశీలమునకును, భీమఋతుపర్ణాదులశీలమునకును వలయు పోషణము చేకూరినది.

## కావ్యభాష

"నిజదేశంబుల వేషభాషలపయి న్నిర్మాభిమానస్థులై
ప్రజ మెచ్చఁ రసలుబ్ధబుద్ధు లగుచుం బ్రాజ్ఞుల్ స్వదేశ్యంబులే
నిజ మంచుం గొని యన్యదేశములవాని న్మెచ్చ రేపట్టునన్". అప్పకవీయము.

కాన, స్వదేశ్యంబులయెడ రసలుబ్ధబుద్ధులగు ప్రాజ్ఞు లభిమానము చూపెదరు.

"అమరోక్తులు సకలభూములందును వెలయున్". అప్పకవీయము.

అందువలన సంస్కృతపదములును దేశ్యములకు సాయపడఁజనును. అట్లని మితిమీఱుటమాత్రము తగదు.

దేశ్య తత్సమ తద్భవాత్మకమగు నాంధ్రభాష మహామహోపాధ్యాయబిరుదాంకితులగు శాస్త్రిగారికి స్వాధీన యనియు, గ్రాంథిక భాషాపోషకులగు వారిభాష సలక్షణ మనియు వేఱే చెప్పవలయునా? ఏభాషలోఁగాని మఱుఁగులును, నానుడులును, వాడుకనుడులును రస

పోషణమునకు ముఖ్యసాధనములు. ఇవి విరివిగా వాడుటచే శృంగార తరంగిణి కెంతో మెఱుఁగు వచ్చినది. ఈక్రిందివి కనుఁడు.—

| | |
|---|---|
| "ఆట నేనుంగంత విద్వాంసుఁడుం గడిమి న్నోరు మెదల్పలేఁ డనుట..." | 1 త. 22 |
| "అంకెకు వచ్చినట్టి కవియై...1 వేంకటరాయశాస్త్రి..." | 1 త. 26 |
| "ఆయనభాగ్యము పండె నాఁగ" | 1 త 58 |
| కాలు వెట్టినమొదల్...ధనదునిల్గా మాఱె..." | 1 త. 59 |
| "ఆఁడుదానిదియె యదృష్ట మనెడు మాట" | 1 త. 61 |
| "మంచివా రిక యింతలో మరణ మనెడు, మాటబడి నేమొ..." | 1 త. 70 |
| "ధుమధుమలు" | 1 త. 77 |
| "పుట్టి నేర్చె, నొక్కొ పుట్టక నేర్చెనొక్కో" | 2 త. 12 |
| "మల్లెయ త్తరు" | 2 త. 45 |
| "చివు రాని జివ గల్గి" | 2 త. 43 |
| "నిత్యకల్యాణము పచ్చతోరణమునై" | 2 త. 59 |
| "కా లూనలేక" | 2 త. 101 |
| "ఎ ల్లాగున" | 2 త. 123 |
| "గిల్లినఁ బా ల్గారెడు మేక" | 2 త. 133 |
| "ఏమె తల్లి" | 3 త. 12 |
| "నీదుకాళ్ళ కడ నిడ మొక్కొ?" | 3 త. 13 |
| "మనసు విఱుగకుండ మాటలాడుచు" | 3 త. 20 |
| "పోయివచ్చిన దెల్లఁ బూస గ్రుచ్చినయట్ల వినిచితి" | 3 త. 81 |
| "గోరంతలు గొండయంత లని...పోఁగాలముం గంటిరే" | 3 త. 102 |
| "ఇక్కడివారి గౌరవము నేటను గల్పి బుభుక్షుఁ డేఁగి తా నక్కడ మూట గట్టుకొనునట్టిది యెట్టిదొ మీఁద విందు రీ రక్కట! దైవతంత్ర మొకయట్లుగనై నకి దొంగకోడిచేఁ జిక్కక తోసిరా జనినఁ జెప్పెడిదే మిఁక వీరిభాగ్యమున్". | 3 త. 104 |
| "నిలుపుఁగుడ్డుల వారని" | 3 త. 106 |
| "*గిట్టులక్" | 3 త. 108 |

* ఇది నేను గడించి, నుడికడలిలోఁ జేర్పఁ దాఁచుకొనియుంచిన నుడులలో నొకటి. శాస్త్రిగారు నిది గడించి వాడుటచే నాయాస్తి కొంత తగ్గిన ట్లనిపించినది. మా॥ రా॥ శా.

"బంగరువు న్విడి వెట్టఁ గోరుటే" 3 త. 190
"గ్రుడ్డిగవ్వకే కొఱవడు నన్ను" 3 త. 193
"నాకు, వారికిఁ బొందది దోమకు, వారణమున కట్టు లుండు" 3 త. 194
"వెడతలఁ బట్టె నీదుమతి" 3 త. 196
"కంట నీరు గ్రుక్కుకొనుచు" 3 త. 197
"పూరికింగాని నైషధు" 3 త. 202
"పోయిన ప్రాణంబులు మరలం గూటం బడినట్లు" 3 త. 209
"మీఁదుమిక్కిలి వచ్చెడి" 3 త. 216
"పట్టఁ బగ్గము లేకుండఁ బరఁగె నపుడు" 4 త. 8
"తాలెబొట్టు" 4 త. 101
"నైషధునిరూప మచ్చు గ్రుద్దినట్లు నైకొని" 4 త. 11
"కంచెయే చేను మేసె" 4 త. 62
"నాపుణ్యం బ దెట్లున్నదో" 4 త. 65
"డొ శ్వేరును లేని వానికి" 4 త. 83
"నాతులు చేతులు దట్ట బెట్టుగన్" 4 త. 93
"పుణ్య మంచుఁ బోఁబోవ మెమరొక్కానెన్" 4 త. 102
"ఆధ్వగులు విశ్రమింపం గట్టిన యొకచట్టిం గని" 5 త. 27
"ఎండకన్నును వానక న్నెఱుఁగకుండ" 5 త. 35
"చీమ చిటుక్కు మన్న" 5 త. 128
"ఫులుల్; గ్రోరికఁ బొట్టఁ బెట్టుకొని" 5 త. 201
"నీకట్టుకొన్న మగనికతమున" 5 త. 202
"తలఁచెద నిన్ను నీదయను నాతను వుండినయంతకాలమున్" 6 త. 40
"కీడులో నడిచె నొకింతమే లనఁగ" 6 త. 47
"ఱెక్కలు గలిగినయట్లు" 6 త. 62
"ధేయన్" 6 త. 84
"రథ్యంబుల కిలువ సూపుటయు" 6 త. 102
"ఏయింత కల్మషమున్" 6 త. 150

## అచ్చ తెనుఁగుసొంపు

వ్యావహారికభాషావాదులు బాగుగా వాడుకలోనికిరాని యింగ్లీషునుడులును సంస్కృతపదములును వాడుచుండ, గ్రాంథిక

భాషావాదులు వాడుకనుడులు తమకావ్యములలో నైతము వాడు చుండుట బుద్ధిమంతులగు భాషాభిమానులు గుర్తింపనగు. శాస్త్రిగారు సంస్కృతపండితులయ్యు నీక్రిందిపద్దెములలో వాడి, అచ్చతెనుఁగు నుడులపైఁ జూపిన మక్కువ మెచ్చనగు. తొలుత నచ్చతెనుఁగుసొంపు మచ్చుచూపిన తెనుఁగుకవిసోమ్ముఁడు నాచనసోమ్ముఁడు.

| | |
|---|---|
| "పాలు నీ శేర్పర్పఁజాలిన వెలిజొక్కపక్కి..." | 1 త. 6 |
| "బ్రదుకు ప్రొద్దుల నొసఁగుల వ్రాగుపేల్పు..." | 1 త. 39 |
| "కమ్మనిమావిపూవులను..." | 2 త. 44 |
| "గమగమలాడు తావిఁ గడుఁ గ్రమ్మెడు పున్నజవాది..." | 2 త. 45 |
| "చలువల్ గ్రమ్మెడు..." | 2 త. 46 |
| "కోడెకాండ్రమదులు పట్టఁగోరి మరుఁడు..." | 2 త. 72 |
| "పున్నమచందురుఁడగు..." | 2 త. 73 |
| "పువ్వువిలుతుఁడీఁడ..." | 2 త. 74 |
| "మేటితమ్ములతోడనో..." | 2 త. 75 |
| "కొలఁకుల నీట బోటులను..." | 2 త. 109 |
| "సంపఁగెఁ దలరాసి చక్కనౌ నెఱకలు..." | 4 త. 17 |
| "ఒండొంటితో నుండు దండికొండలు..." | 5 త. 23 |

సజీవభాషలకు సమగ్రనిఘంటువ్యాకరణాదు లుండుట దుర్లభము. అందువలననే యొకప్పుడు సమగ్రము లనుకొనునవి వెనుకఁబడి, క్రొత్తవి బయలుదేఱుట తటస్థించుచుండును. ఆయాభాషలు వాడువారినోళ్లును, పండితులమెదడును నుడులుపుట్టు గనులు. సాధారణకవులు లోకులు వాడునుడులను మార్చియో మార్పకయో, తమపాత్రములలో వాడుకొందురు. పండితకవులు వానిని వలయునెడ సానంబట్టి, వాడెదరు. అంతేకాదు. తగునుడులులేనిచో భాషాజ్ఞానబలమునంజేసి క్రొత్తవి కూర్చికూడ భాష పెంపొందఁజేయుదురు. కాని, యిట్టివారు కడునరుదు. కవి కావచ్చునుగాని నుడితీర్పరి కాఁజాలుట కడిదిపని. పండితకవి యన శబ్దశాసనసమర్థుఁడగు కవియే. మనమొదటి పండితకవి నన్నయభట్టారకుఁడు భారతము రచించు తనసమర్థతను గూర్చియు, అర్హతనుగూర్చియు,

".....అవిరళజపహోమతత్పరు విపులశబ్ద,శాసను సంహితాభ్యాసు బ్రహ్మాండాది
నానాపురాణవిజ్ఞాననిరతుఁ, బాత్రు...సద్వినుతావదాతచరితు
లోకజ్ఞు నుభయభాషాకావ్యరచనాభి, శోభితు సత్ప్రతిభాభియోగ్యు
నిత్యసత్యవచను మత్యమరాధిపా,చార్యు సుజను నన్నపార్యు..."

అని నాఁటికిఁ దగినట్లు, వినయముం జూపఁ బ్రథమపురుషమున దెలిపె. ఇం దాయన తెలిపిన లక్షణములెల్ల మనవారు కొంద ఱిప్ప డక్కఱ లే దనుకొనినను, పండితకవులకుఁ జాలవఱకేని కావలసినవే పొత్తపుంగూర్పరుల కెంత జ్ఞాన మున్న నంతమంచిదే కదా? ఇంతక ముందు చూపినవిగాక క్రింద వాడిన మఱికొన్ని క్రొత్తనుడులంబట్టియ నుడికూర్పులంబట్టియు మనకవిసార్వభౌముఁడు మాతృభాష కొనర్చినసేవ గుర్తింపనగు.—

## క్రొత్తనుడులు

కాళ్లగజ్జెలు, చిపచిప్పగోళ్లు, చిళ్ల, వానలప్ప, వెన్నెలవత్తులు— ఇవి బాలిక లాడుకొనునాటలపేళ్లు. క్రొత్తగా వెలువడిన "ఆంధ్రవాచ స్పత్యము"లో సైత మీనుడులు కానరావు. ఈయాటలనుగూర్చి కృతికర్తగారు పొత్తముతుదిని దెలుపుట మంచిది. అటుచేసినఁగాని వానినిగూర్చి సరియగు జ్ఞానము కలుగదు.

## సక్కెము చక్కెరకేళులు

## క్రొత్తనుడికూర్పులు

మాటబడి, కాదాడు, ఉహ్వాయను, దొంగకోడి, క్రొంజూపుల దొంగలు, కెంపుడా ల్చక్కరకేళులు, చదువుంబూఁబోఁడి మొదలగు నవి. "పురుగు గొఱికిన కఱ్ఱనక్కర మొకండు దేలు నటు" అనునది "ఘుణాక్షరన్యాయమున" అను దానియచ్చ తెనుఁగురూపు.

నలశబ్దము సఖులు వాడినట్లు దమయంతికి గోచరింపఁజేయఁ గూర్చిన క్రిందిపద్యములోని నుడులకూర్పు నేర్పు సొంపు నింపుచున్నది. కనుఁడు.—

"నలుగడఁ గమ్మవాసనలు నల్వుకొనెన్ నన లొప్పెఁ దీవకూ
నలు నలు వొందె నంగనలు నానలు వీడి గతాభిమానలున్

లలనలుసై మనోహరులలాలనలుక్ నయగారము ల్గానక్
గలిగి తదీయయాచనలు సైకొని సైకొనుచుండ్రు పయ్యెరన్" 2 త. 37

## సంస్కృతపాండిత్యప్రకర్షము

"మనసునక్ వాక్కునక్ గాయమున నకార, మెన్నఁడును జేరనీయని సన్నుతమతి
వగుచు దానిని ఖండించినట్టిఁడవయి, నలవరాహ్వయమంబితోనరవరేణ్య"
3 త. 125

కృతికర్త దీనింగూర్చి తెలిపిన యర్థము చూడనగు.

"నీవు కఱవు మనిన నేను గఱచితి నే, కాదులను గణించునప్పుడు దశ
యంటి వనినఁ గఱవు మని యర్థ మవుఁగాదె, యిందు నాదుదోష మింతగలదె?"
5 త. 187

ఇది కరోటకుఁడు నలుని గఱచుటను సమర్థించుకొనుచుఁ జెప్పిన సమాధానము.

## ప్రౌఢప్రయోగములు

"నెల్లురు" 1 త. 20. "మోసరూపమున్" 2 త. 15; "దృష్టకున్" 4 త. 19. "పొల్చెద రాల్మగల్లొగిన్" 2 త. 45. "జరీసరిగంచు" 2 త. 111.

## రసములు

"భావరుచిరస్వప్రసన్నవిభవంబు రసంబు" కావ్యాలంకారచూ.

ఈశృంగారతరంగిణిలో శృంగారరసము ప్రధాన మని యెవరికి స్ఫురింపకుండును?

## శృంగారము

"అతులానందాత్మికయగు, రతియె విభావాదిభావరంజనముల సం
పృతమై శృంగారరసా,కృతిఁ జెందు మనోనురాగకీలితగతులన్." కా. చూ.

సంభోగవిప్రలంభభేదములచే ద్వివిధమగు శృంగారమున, నల దమయంతుల విప్రలంభమే హెచ్చుగావర్ణితమగుటచే నిందలిప్రధాన రసము విప్రలంభశృంగారమే.

''లలిత శ్రవణాలోకన, కలహాసూయా ప్రవాసకలనలచేత
గలిగెడు దశావిశేషము, చెలువారఁగ విప్రలంభశృంగార మగున్.'' కా. చూ.

అందుసైతము దూతయగు రాజహంస వచించినమాటలంబట్టి నాయికానాయకుల కొండొరులకు నిష్కల్మషమగు గాఢానురాగ మంకురించుటచే,

''శ్రవణా ద్దర్శనా ద్వాపి మిథఃసంరూఢరాగయోఃి,
దశావిశేషో యో ప్రాప్తో పూర్వరాగఃి స ఉచ్యతే.''

అను సాహిత్యదర్పణనిర్వచనముంబట్టి, అయ్యది పూర్వరాగ రూపవిప్రలంభము. అందు,

## నలవిరహము

''ఇఁక నే నాసతిఁ జూచు టెన్నఁడొ మనోఽభీష్టంబు సిద్ధింపఁగా
సుకముం గాంచుట యెన్నఁడో సుదతితో శోభించుచుఁ సంసృతిం
బ్రకటింపఁగల భాగ్య మెన్నఁడో జగద్వర్ణ్యంబుగాఁ గాలమున్
సకలశ్రేయము లందుచుం గడపు టెన్నండో కదా చేకుఱున్.'' 3 త. 7

## దమయంతీవిరహము

''సరగున లేచి యాకసము సందిటఁ జేర్చెడు మోవిపానకం
బరయఁగ మోముఁ ద్రిప్పెడుఁ బ్రియంబున నేమియొ పల్కరించెడున్
జుర్రుజుర్రఁ జూచెడున్ గినిసి సోలెడు వ్రాలెడు నవ్వెడున్ గడున్
విరహము నొందెడున్ చెలివి వీగి నెలంత దురంతచింతమై.'' 3 త. 18

వివాహానంతరము జూదమున నోడి, అడవిలో నొండొరుల నెడబాసిన నలదమయంతుల విరహము,

''ప్రవాసో భిన్నదేశత్వం కార్యా చ్ఛాపాచ్చ సంభ్రమాత్.''
అను సాహిత్యదర్పణనిర్వచనముంబట్టి, ప్రవాసవిరహము.

''నిదుర పోవు నన్ను నెఱి వీడి ఘోరాట,విని మృగాళిఁ బడఁగ విడిచిపోతి
వకట! నష్ట మైతి నతిభీతి కైతిఁ జ,చ్చితి నయొ! యింక నేమి సేయుదాన.''
5 త. 43

విస్తరభీతిచే విరమించితిమిగాని, పూర్వరాగ,ప్రవాసరూపముల కెన్నియేని నిదర్శనములు కలవు.

## కరుణము

ప్రధానమగు వైవిప్రలంభశృంగారమునకు ముఖ్యాంగము కరుణము.

"శోకము విభావముఖభా,వాకలనముచేతఁ గరుణమను రస మయ్యెన్" కా. చూ.

"ది క్కిసుమంత లేక యిట దేవుడగొట్టిన మెట్టుచున్న న
న్నిక్కడ మొక్కలీఁ డగుచు నీవెనుఁబామ గ్రసించె నక్కటా!
యెక్కడ కేగినాఁడవొ హృదీశ్వర! న న్విడి నేగి యయ్యె నీ
వక్కటికంబునం గదియ నై హృదయేశ్వరి నన్నుఁ గావవే" 5 త. 54

వీరాద్భుతభయానకరసము లితరాంగములు.

### వీరము

"అనుచుక్ సన్నద్ధుఁడై శౌర్యమున నిషధరా జట్టె..." 4 త. 87

### అద్భుతము

"ఒకచో నింతులు....." 3 త. 135

### భయానకము

"పెదపెదనల్లమచ్చ లతిభీష్మములై యొడ లెల్ల మొల్లమై
బెద రిడుమండఁ గొండవలె విగ్రహ మాగ్రహమే యనంగ నై
పొదల మహాగుహం బెగడు పోలిక నాలిక లార్చునోటితో
నదటున వచ్చి పట్టుకొనె నట్టిటు మెట్టెడు నత్తలోదరిన్" 5 త. 51

### వర్ణనములు

నిషధపురము—"ధరణీమండలమండనంబు..." 1 త. 105
వసంతఋతువు—"చిరకాలా హ్వపనాంగనావిరహమున్..." 2 త. 42
సూర్యాస్తమయము—"వనజముఖియైన..." 3 త. 20
చంద్రోదయము—"గర్భవతి గాన..." 3 త. 25
వివాహము—"తెరచీర నెత్త..." 4 త. 101
అంధకారము—"పుడమి యిది యాకసం బిది..." 5 త. 75
అరణ్యము—"ఒండొంటితో నుండు—" 5 త. 23
జలాశయము—"చదుకము విశాలతయుఁ గల్గి..." 2 త. 97

విరహము—"పూవిలుకానివిం ట్లగును..." 3 త. 9
నాయకుఁడు—"శూరుఁ డశ్వకోవిదుండు..." 1 త. 122
నలపరిపాలనము—"పువ్వు నొవ్వకయుండఁ బూదేనె గొను మధుపమురీతి..." 4 త. 129
కాటుకకన్నీరు—"కలికి వేఁడివేఁడికాటుకకన్నీరు, కాల్వ లగుచు నిలకుఁ గాఱుచుండ గంధకోష్ణమైన గనినుండి కాళింది, పఱచుచున్న దనఁగ నరయ నయ్యె" 3 త. 205

ఇందు ధాతుశాస్త్రసంబంధమగు సత్య మొకటి యెంతో హృద యంగమముగా వర్ణిత మైనది. గంధకమునకు స్వర్ణముతో సమ్మేళనము ఘటిల్లునపు డేర్పడు గంధకవిధము (Sulphide) నల్లగా నుండుట ధాతు శాస్త్రప్రసిద్ధము. ప్రకృతిశాస్త్రవిజ్ఞానము లెనిసక మొదలగు నాంగ్ల కవులు తమకావ్యములలో వెల్లడించుటచే శ్లాఘ్యు లగుచున్నారు. మన కవివరులుసైత మారీతి ననుసరింతురుగాక!

ఉత్తమరథాశ్వములు—"అవి పృథుప్రోతములు..." 6 త. 76
"ఒకటి నుదుటను రెండు మస్తకమునందు..." 6 త. 78
రథగమనవేగము—"దవులం బ్రక్కలఁ బొల్చు వస్తువులు..." 6 త. 89
"నడుమక వాఁగులు నేఱు లడ్డ మయినక..." 6 త. 90
విమానములు—"ఇరుగడ సొన్నపుందళుకు..." 3 త. 99
"కని కనునంతలో మఱియుఁ గ న్గొన నోపని..." 3 త. 100
దృష్టి—"తరుణవయస్కుఁడైన నృపతల్లజుదృష్టి విదర్భరాట్సుతా
వరపదమందుఁ బొందుపడి వై ననటుల్ స్పృశియించి పోయి యం
బరమున భావిలోఁ బడి క్రమంబున బంగరుమెట్ల నెక్కి భూ
ధరములసందునక బడి షడం బరయం బస లేక దద్దిఱెన్" 3 త. 144

ఈపద్యమందలి భావ మించుమించుగా గ్రీందిశ్లోకములోని దానిం బోలియున్న ది.

"లగ్నం పాదతలేషు జానువిలుఠత్సంసక్త మూర్వో ర్యుగే
విశ్రాంతం జఘనే స్థలే నిపతితం నాభీసరోమండలే,
శూన్యం మధ్య మవేక్ష్య రోమలతికా మాలంబమానం క్రమా
దారూఢం స్తనయోశ్చ లుఠితం నయనయో ర్లీనం మనశ్చైశికే."

అయినను శ్లోకమందలి చమత్కారము వాచ్య మగుటచే నం తగా నొప్పకయుండ, మనకవిసార్వభౌమునిపద్యము విషయనిగరణముం దెలుపున దగుటచే వ్యంగమర్యాదతో నొప్పి, ఎంతయు రమణీయముగ నున్నది.

దమయంతి—"నడుము మాయ కేదారము నాభి కుచయుగమ్ము శ్రీగిరి కూర్మము కాళ్లమీదు మోవి మధురాంక మని కాంచి పువ్వుఁబోడిఁ దైర్థికులు దలంచె దరు జేత్రచయ మనుచు" 2 త. 22

ఈపద్య మీక్రిందిశ్లోకమును బోలియున్నది.—

"మధ్యం విష్ణుపదం కుచౌ శివపదం వక్త్రం విధాతుః పదం
ధమ్మిల్లం సుమనఃపదం ప్రవిలసత్కాంచీ నితంబస్థలీ
వాణీ చేన్మధురాధరో ఽరుణధరః శ్రీరంగభూమి ర్వపు
స్తస్యాఃకిం కథయామి ధన్యచరితం మాన్యా సదా నిర్జరైః."

ఈశ్లోకమున శ్లేషము గలదు. కాని, "మాన్యా సదా నిర్జరైః" అనుచోట, అది పామరమర్యాద నసుసరించియున్నది. ఇఁక, నాయి కాశీలపోషణబాధ్యత నెఱిఁగిన మహామహోపాధ్యాయుఁడు, శ్రుతి రతుల నేకీభవింపఁజేసిన పెద్దనామాత్యునివలె, దమయంతీసౌందర్య వర్ణనమును, ఆమెశీలపోషణము నొనరించి, అవి జోడించి, సెబా సని పించుకొనఁజాలె.

బాల్యవర్ణనము—"దాఁగరుమూఁతలాడు మని..." 2 త. 15
"నీతికి వెలి యని తోఁచిన..." 2 త. 16

"ఆటలసందడింబట్టి పాటలు మఱచినట్లు" వర్ణనోద్రేకమున శీల పోషణము మఱచుట ప్రబంధములలో గొన్నియెడలఁ గానవచ్చును. పైపద్యములనుగూర్చి పర్యాలోచించుచో వర్ణన మొనర్చునప్పుడును శాస్త్రిగారు తమకవిసార్వభౌమత్వమును వీవిగాఁ జూపినా రననగు. దమయంతీసౌందర్యవర్ణనపద్యములు మనోహరము లగునవి పెక్కులు కలవు

## చరిత్రాంశములు.

1 త. 24, 25, 26 లోను, 2 త. 53, 54, 55 లోను, చరిత్రాంశ ములు వర్ణితములయినవి.

## నీతులు.

3 త. 124, 134 లును, 4 త. 108, 109, 129 లును, 5 త. 13. 14, 18, 44, 64, 65 లును, 6 త. 21, 67, 143 లును నీతులు తెలుపును.

## శైలి.

"కనియెఁ భీమసుతన్..." 3 త. 143

ఇట్టిపద్యములశైలి సోమన, పోతన, పెద్దనల శైలిం తలఁపించు చున్నది.

## పాకము.

"పాక ముదీరితార్థపరిపాకము." నరసభూ.
పాకమనంగానర్థనిరాకులగంభీరయుక్తి" కా. చూ.

శృంగారనైషధము నారికేళపాకమున నున్న దనిరి కీ॥ శే॥ కలా ప్రపూర్ణ వేదము వేంకటరాయశాస్త్రిగారు. మనకలాప్రపూర్ణుఁడు శృంగారతరంగిణిని మెత్తనిపాకమున ద్రాక్షాపాకమున రచింతుననితెలిపి, అటులే చేసె. ఇప్పటి కీపీఠికలో వచ్చిన పద్యములే దానికి నిదర్శనములు. కథాసందర్భావశ్యకతం బట్టియో, చమత్కారవర్ణనావశ్యకతంబట్టియో, పాండిత్యప్రకర్షప్రదర్శనావశ్యకతంబట్టియో, కొన్నిపద్యములు నారికేళ పాకమునఁ బడినఁ బడుఁగాక! మొత్తముమీఁద శాస్త్రిగారు తమప్రతిన ననుసరించి మెత్తని ద్రాక్షాపాకముననే తమకృతి కూర్చినారని యొప్పు కొనక తప్పదు.

"బహిరంతఃస్ఫురితార్థో, బహితరసప్రసర మగుచుఁ బద్యము సుఖసం
గ్రహపద మెచ్చట నది వో,మహి ద్రాక్షాపాక మనఁగ మధురం బెపుడున్." కా.చూ.

ద్రాక్షాపాకమున కుదాహరణము లిచ్చుటకంటె శృంగారతరం గిణియంతయుఁ జదువుఁడని చదువరులఁ గోరుటయే మంచిది.

## అలంకారములు

"కావ్యశ్రీల నలంకరించుట నలంకారంబులై" కా. చూ.
"అలంక్రియావితానము సొమ్ములే" నరసభూ

ఇవి శబ్దాలంకారములు, అర్థాలంకారములు— అని రెండు తెఱంగులు. అందు ముఖ్యము లర్థాలంకారములే. అందు, ఉత్ప్రేక్ష-అతిశయోక్తి మొదలగునవి స్వభావవిరుద్ధము లని యింగ్లీషుకావ్యములు చదివినవారు పెక్కురు వానిని మెచ్చరు. ఇంతకు వర్ణించు వస్తువు కన్నులకుఁ గట్టునట్లు చేసి, దానికి మెఱుఁగిడునదే— అలంకారము.

నిషధపురికోటకొమ్మలమీఁదివజ్రములు తాఁకుటచే సూర్యుఁడు పండ్రెండువ్రక్కలై, త్రుళ్లిడఁగి, ముంచువెనుకల కూఁగుచుండుటవలననే, ఉత్తరదక్షిణాయనములును—సూర్యునికి ద్వాదశాత్మకతయుఁ గలిగిన వని (1 త. 106) వర్ణించుటచేత, మనకవిసార్వభౌముఁడుకూడ నుత్ప్రేక్షౌచిత్యాలంకారరచనమున వెనుకటిప్రబంధకవుల కేమాత్రము తీసిపోనట్లు స్పష్టమగుచున్నది.

## ఉపమ

"అందమునకుఁ జందమునకు, నెందులకుం దగినమీర లిద్దఱు గూడం
గుందనము మణియుఁ గూడిన, చందం బగుఁ గాదె రాజచంద్రా! తలఁపన్" 2త.79

• ఈపద్య ముపమతో నందచందములకు మూలకందంబై, నలుని డెందముం దనియింపఁజాలినది; చదువరులడెందముం దనియింపఁజాలదా?

## రూపకోత్ప్రేక్షలు

"పాలుపుగ నొక్కటిక్ విరియఁబూచిన మల్లెపొదం గడంగి తేఁ
టులు గలయంగ వ్రాలి యెపుడుక్ విడకుండఁగ నొప్పె నప్డు పెం
పలరఁగఁ బెండ్లియాడి యట నామనివెన్నుఁడు తోఁటలచ్చియున్
దొలిఁ గఱిడాలుముత్తెములునుం దలఁబ్రాలుగఁ గొన్న ప్రోవనన్" 2 త. 48

"ఆమనివెన్నుఁడు", తోఁటలచ్చి"— ఎంత సొంపగు రూపకములు! అచ్చతెనుఁగులు!! ఉత్ప్రేక్షయు యథార్థస్థితిని దెలుపుటలో మఱింత తోడ్పడుటంబట్టి యెంతో యొప్పియున్నది.

## అర్థాంతరన్యాసము

"అహహా! సత్కులజుండ వీవు.....
సహవాసంబున దోస మబ్బు నను బాసల్ రిత్త వో నేర్చునే?" 3 త. 33

## భ్రాంతిమంతము.

"మెలి గొని యొం డొకం డరయ...యిపుడడ బమ వాడు నత్తఱిన్." 2 త. 47

## నిరుక్తి.

"నలునిసోయగము న్వినినిలుచుట ననిమేషు లైరి వారు" 3 త. 55

## సందేహము.

"ఎవతెవు తల్లి!...వనదేవివో తెలియఁ బర్వతదేవివొ లేక వారిదేవివో..."
5 త. 115

## శ్లేషము.

"కచకుచోరునితంబకమ్ములు గురువులు...
సకియఁ గవు లెంత్ర లక్షణశాస్త్ర మనుచు" 2 త. 22

## స్వభావోక్తి.

"చల్లఁగ గాలి వీచెను...సుత గల్గు నత్తఱిన్" 2 త. 7

ఇట్టివర్ణనము ప్రకృతివిరుద్ధమని నవనాగరకులు కొందఱు పరిహసించెదరు. కాని, మహాపురుషు లుదయించినపుడు ప్రకృతి చల్లఁగనుండుటయు, మహోపద్రవములు రాఁగలకాలమునఁ దోఁకచుక్కలు పుట్టుట-ఉల్కలు రాలుట మొదలగునవి సంభవించుటయు సహజమూ యూరపు ఖండమున జరుగుయుద్ధము మహోపద్రవకారణ మగునని తెలుపుటకో యన నిపుడు తోఁకచుక్క పుట్టుటయే దీనికి నిదర్శనము. తెలియనివారి కిది వింతయనిపింపవచ్చునుగాని తెలిసినవారికి రవంతయు వింతగాదు. కనుఁ డీక్రిందికాళిదాసునిశ్లోకము.—

ప్రసన్నది క్ష్వాంసువివిక్త వాతం శంఖస్వనానంతరపుష్పవృష్టి
శరీరిణాం స్థావరజంగమానాం సుఖాయ తజ్జన్మదినం బభూవ"

## క్రమము.

"ఇందుబింబమునందుఁ గందుచేసిన రట్టు..." 2 త. 130

ఇవి మచ్చుగా నిచ్చితిమి. అలంకారప్రియులు తక్కినవి పాత్తము చదువునెడ గుర్తింపనగు.

## కొన్ని సూచనలు.

ఇప్పటికి మాకు నచ్చిన కావ్యగుణములు కొన్ని తెలిపితిమి. మిగిలినవెల్ల రసజ్ఞులు గ్రహింతురు గాక! గుణములు దెలుపుటతోడనే విమర్శకులపని ముగియదు. కాన, వలయు నని తోఁచిన కొన్ని సూచనలఁ దెలిపెదము. ఎంత మెలఁకువగా నుండఁ దలఁచినగూడ నెప్పుడో యే మఱుపాటుతఱినేని పొరపాటు లెవరికేని రావచ్చును. "ప్రమాదో ధీమతా మపి" అనుమాట పుట్టుటకు హేతు వదియే. ఇది యెఱింగియే కవిసార్వభౌములయ్యను శాస్త్రిగారు "దోషము లెండే నగు" నని తెలిపినారు. అయినను, మావిమర్శననియమము ననుసరించి, ఇం దేదిగాని దోష మనియేని, ప్రమాద మనియేని తెలుపఁజాలము. సంస్కరణ మావశ్యక మని తోఁచినపట్టుల, మాధర్మముంబట్టి కావ్యగౌరవము హెచ్చింపఁగోరి, కొన్ని సూచనలు చేసెదము. అందులకు శాస్త్రిగారు మమ్ము మన్నింతు రని నమ్మెదము

అచ్చుతప్పులను గూర్చికాని, వ్రాతపొరపాట్లనుగూర్చి కాని కృతికర్తగారే చూచుకొందురు. కాన, వానింగూర్చి మే మెత్త నక్కఱ లేదు. రెండవకూర్పున మీఁదఁదెలిపినట్లు మేము చేయుసూచనలంబట్టి సంస్కరణము చేయఁగోరెదము.—

(ఁ) నలుఁడు దూతగా వచ్చినపుడు శృంగారనైషధము ననుసరించియేయైనను దమయంతిచెలులశీలమునకు భంగకరముగ వారిచర్యలు వర్ణించిన వర్ణనములు తొలఁగింప నగును.

(ం) ద్వితీయస్వయంవరసందర్భముననున్న "బ్రదికెనో చచ్చెనో" అనుపద్యము మార్పనగును.

(3) "తిరుగుచుండిరి" (3 త. 43), "చెన్నలరారుచుండెనో" (3 త. 148), "వాఁడెట నుండెనో" (5 త. 107), "తెల్పుచు నుంటి" (3 త. 93), "అర్థించు చుంటి" (3 త. 128), "నీ కుండెనో" (4 త. 86) మొదలగు భూతార్థక క్రియాప్రయోగములు నన్నయాది పూర్వకవి ప్రయోగపద్ధతి ననుసరించి సంస్కరింపనగు.

## కొలికిముక్క.

చమత్కారకల్పనాకల్పవల్లియు, సత్కావ్యలక్షణలక్షితయు, శ్లోదమయయు, రసస్వరూపిణియు, నలదమయంతిశీలాశంసినియు నయి శృంగారతరంగిణి యను రెండవపేరఁ జెలంగు నైషధీయచరితము పూర్వ మహాప్రబంధశ్రేణిలోఁ జేరి, కృతికర్తృకృతిపతులకు మంచిపేరు తెచ్చి, తాను బేరొందుఁగాక!

ఈప్రబంధరత్నముం గొని, చదివి, తద్రసము క్రోలి, రసజ్ఞులానంద మొందుదురుగాక!!

ఇది చదివిన "విద్వాన్" శ్రీగంటి జోగిసోమయాజి, ఎం. ఏ., ఎల్. టి., గారు, ఆంధ్రవిశ్వకలాపరిషదుపన్యాసకులు, "ప్రాచీనుల పోకడల ననుసరించి థారాశుద్ధి గలిగి పాండిత్యమునఁ గబ్బములు వ్రాయువారు నేఁడు లేనే లేరుగదా. అట్టిసందర్భమున నాలోటును లేకుండఁ జేసి నిజముగ శ్రీనాథాదులను మఱిపించు నట్లు లీగ్రంథమును వ్రాసి కవిసార్వభౌమబిరుదమును వీరు సార్థకపఱుచుకొని రనుట మిక్కిలి ముదావహము. శ్రీకృష్ణభారతాద్యనేకకృతికర్త లైనశ్రీకవిసార్వభౌము లిట్లు సొంపుగ నైషధీయచరితమును వ్రాయఁగల్గి రనుట యొకవిశేషము" కాదనియుఁ జెప్పనొప్పను."

అని యభిప్రాయ మిచ్చియున్నారు.

దీనియందే చేసిన కవిసార్వభౌమని యీశ్వరస్తుతితోడనే మా విమర్శకపీఠిక ముగింతుము.

"వెలయఁగ వేయిశీర్షములు వేయిపదంబులు వేయికన్నులుం
గలిగి విరాట్స్వరూపము జగంబుల నించి సృజించి పెంచుచుఁ
విలయ మొనర్చుచుఁ వెలుఁగువేల్పు నిరంజన నిర్వికల్ప ని
శ్చల నిరుపద్రవాఖ్యుల నెసంగెడు దేవుఁడు మమ్ముఁ బ్రోచుతన్"

దిన-౨-౧౯౪౧,
కవితాసమితి,
విశాఖపట్టణము.

మారేపల్లి రామచంద్రశాస్త్రి.
గొబ్బూరు వేంకటానందరాఘవరావు.
నిరోగి రామమూర్తిశాస్త్రి.

**VIDWAN**
**G. J. SOMAYAJI. M.A., L.T.,**
LECTURER, ANDHRA UNIVERSITY.

MAHARANIPETA P.
**VIZAGAPATAM.**

*Dated 21—2—1941.*

"ప్రాచీనుల పోకడల ననుసరించి ధారాశుద్ధి గలిగి పాండిత్య మునఁ గబ్బములు వ్రాయువారు నేఁడు లేనే లేరుగదా. అట్టిసందర్భ మున నాలోటును లేకుండఁజేసి నిజముగ శ్రీనాథాదులను మఱిపించు నట్టు లీగ్రంథమును వ్రాసి కవిసార్వభౌమబిరుదమును వీరు సార్థకపఱిచు కొని రనుట మిక్కిలి ముదావహము. శ్రీకృష్ణభారతాద్యనేకకృతికర్తలైన శ్రీకవిసార్వభౌము లిట్లు సొంపుగ నైషధీయచరితమును వ్రాయఁగల్గి రనుట యొకవిశేషము కాదనియుఁ జెప్పనొప్పును."

గంటి. జోగి. సోమయాజి వ్రాలు.

# విజ్ఞప్తి.

సుమారు మూఁడుసంవత్సరములక్రిందట నేను నెల్లూరికిం బోయి యున్నప్పు డీగ్రంథ మిట్లు చేయవలసిన యదృష్ట మేర్పడినది. దీనికి కృత్యాదిమధ్యాదులుం జరిగినవి. ఇప్పటికి ముద్రించుముచ్చటలుం దీరినవి. దీనిని మొదట నాయెదుటనే ముద్రించుట కంగీకరించియుఁ గన్ను చక్కఁగ లేనికతంబున నాకార్యము శ్రీతూములూరి వేంకటశివరామయ్య గారిమీఁదనే మోపంబెట్టితిని. వా రెవరిచేతనో తగినవారిచేతనే ప్రూఫులు దిద్దించియుందురు. కడపటిది నాకును వచ్చుచుండెంగాని పై కారణంబున నేనును సరిగాఁ జూడలేకపోయితిని. దీనిప్రూఫుచూచినవా రరసున్నలు లోనగునవి చక్కఁగాఁ బరిశీలింతురు. సామాన్యముగా గణముపోయినను, యతి పోయినను, ప్రాసము పోయిన నంతగా గమనింపరు. అది కవితప్పే యనుకొనరు. కవియుఁ గంపోజిటరు నొకేగతిఁ బ్రమ్మాదము గలవా రని తలంపరు. ఆకారణమున నిందుఁ బెక్కులు తప్పులుపడినవి. ఇపుడు వాని కొకపట్టిక వ్రాయుట తప్ప నొండేమియుం జేయవీలు లేదు కదా! దీనికి రెండవముద్రణ మగు భాగ్య మున్నచో నప్పటివారు సవరింతురని నమ్ముచున్నాను.

ఇప్పటియాచారమునుబట్టి యీగ్రంథమున కొకపీఠిక వ్రాయ నెంచియున్నప్పుడు రాజమహేంద్రవరములో మధురకవి నాళము కృష్ణ రావుగారి షష్టిపూర్త్యుత్సవముం బురస్కరించుకొని విశాఖపత్తనము నుండి శ్రీమారేపల్లి రామచంద్రశాస్త్రిగారు మాయింటి కతిథులుగా దయచేసిరి. ఆసందర్భమున వారిచేత దీనికిఁ బీఠిక వ్రాయింపవలయు ననియభిలాష జనించినది. రామచంద్రశాస్త్రిగారు—ఇంగ్లీషు, తెలుఁగు, సంస్కృతము, చక్కఁగా నెఱింగిన విమర్శకులు. పెక్కుకృతులు రచించినవారు. ఇప్పు డొకయపూర్వమైన తెలుఁగునిఘంటువు వ్రాయుచున్నారు. అట్టివారు గ్రంథమునకుఁ బీఠిక వ్రాసినచో లేని ప్రాశస్త్య మేర్పడు నని తలంచుకొని వారికి విన్నవించితి. వా రనేకములు ప్రతికూలోక్తు

లాడియు నాప్రార్థనముం ద్రోసివేయఁజాలక "గొబ్బూరు వేంకటానంద రాఘవరావుగారు లోనగువారు నాకు మిత్రులు కలరు. వారు మీకును మిత్రులు, విమర్శకులు వారునునేనునుం గలసి పీఠిక వ్రాయుదు" మని సెల విచ్చుటం జేసి నాయొద్దనున్న పుస్తక మొక్కటియు వారి కిచ్చితిని. వారు మిక్కిలిశ్రమ చేసి యిట్లు పీఠిక వ్రాసియిచ్చినందులకు నేనెంత యుం గృతజ్ఞుఁడ నయి ఆత్రిమూర్తుల కభివందన మాచరించుచున్నాను.

పీఠిక యనునప్పుడు తప్పొప్పులను జెప్పునదియే పీఠికగాని తక్కిన పీఠికలు పీఠికలు కాఁజాలవు వీరు ముప్పురును మూఁడుమూర్తులై నా గ్రంథముం బరిశీలించి నాకుఁ గొన్ని సూచనలు చేసియున్నారు. లోగడ గ్రంథగుణాభివర్ణనము చేసినప్పటికన్న నీసూచన చేసినప్పుడు చదివిన నే నెంతయో సంతసించితి ననుట సత్యదూరము కాదు. "హేమ్న్న స్సంలక్ష్యతే హ్యగ్నౌ విశుద్ధి శ్శ్యామికాపి వా" కాల్చినప్పుడుగాని బంగారమువన్నె తెలియరాకుండునట్లో యిట్టి సూచనలు చేసినప్పుడే గుణదోష ప్రకటన మగుననుట నిశ్చయము. వారు చేసిన సూచనలప్రకారము నా దోషములను నేను సవరించుటకే ప్రయత్నింతునుగాని ఆయాచోట్ల నేను బడినప్రమాదము లోకమున కించుక తెలుపుట సముచితము కాక పోదు.

1 "నలుఁడు దూతగా వచ్చినప్పుడు దమయంతిచెలుల శీలము నకు భంగకరముగ వారిచర్యలు వర్ణించిన ఘట్టము తొలఁగింప నగు" తొలఁగించెదను గాని—చెలులశీలమునకు భంగకరములుగనైన వారి చర్య లెవ్వియో? చర్చించుకొందము:— 3 త. 134 పద్యము.

మ. "నరనాథాగ్రణి బాహుకీర్తిమణులక్ లగ్నంబుగా లాగికో
వరచేలాంచల మల్ల జాఱిపడుటక్ వక్షోజముల్ గప్పకే
తరుణీరత్న మొకర్తు పోవఁ గనుటల్ తప్పించుఁ దప్పించి మో
మరితిక్ వేఱొకవైపు గాఁ గలిగెఁ గాంతాంగాతిసంస్పర్శమున్".

అది యేకాంతస్థలము. స్త్రీలు మాత్రమే యుండునది. పురుషులందుఁ బ్రవేశించుట మిక్కిలి తప్పు. దేవతలు పుచ్చుట నలుఁ డటకు వచ్చుట మొదటితప్పు సరే యుండనిండు. తరుణి పయ్యెట జాఱిపోయినది. అది సరిచేసికొనలేదు. సిగ్గు లేక వక్షోజములు గప్పుకొనలేదు.

పురుషు లున్నప్పుడే సిగ్గు స్త్రీలలో స్త్రీలకు సిగ్గుండదు. ఇందు స్త్రీల శీలము పోయియుండునా? అది యెట్టిదోషమైనఁ జేసియున్నదా? అట్లున్న స్త్రీనిఁ జూచుట దోష మని నలుఁడు మాఱుమోము పెట్టినాఁడు. ఇం దతనితప్పు కనఁబడుచున్నదా? అటుమోము పెట్టునప్పుడు మఱియొక స్త్రీశరీరము తాఁకినది ఇది దోష మందురా? ఎవరిది? నలునిదా? స్త్రీలు క్రిక్కిరిసియున్నచోటికిఁ బోయెఁ గావున నతనిదే యనవలయును. పోక తప్పినది కాదు పాపము!! 134 పద్యము:—

మ. "ఒకచో నింతులు బంతు లాడుకొనఁగా నుత్సాహముం జేసి మీఁ
దికి బంతి న్విసరంగఁబోయి నలధాత్రీనాథుచేఁ జిక్క ము
ద్రికచే నొక్కి యతండు దాని మరలన్ వ్రేయంగ వా ర్విస్మయో
త్సుకలై చూపిరి దానిపై నలలిపుల్ గన్పట్టుటల్ భైమికిన్".

స్త్రీలు బంతు లాడుకొనుచున్నారు. బంతి వచ్చి సమీపమున సంచరించు నలునిచేతఁ జిక్కినది. దానిపై తనముద్రిక నొక్కి తిరుగ వ్రేసె. ఇందు స్త్రీలశీలము పోయినట్టు పోకడ కలదా? 136 వ పద్యము:-

మ. "సుకుమారుం డట నైషధుండు "ముకమల్ సోఫా" పయిన్ మేను సే
ర్చి కడం గందుకకేళిఁ దేలు సఖులం బ్రీతి న్విలోకించుచో
సకి యొక్కర్తుక వచ్చి సంభ్రమముతో క్ష్మానాథుపై వ్రాలి లో
సుకమైన న్వెఱఁ గౌట నెచ్చెలుల కాచొ ప్పెల్లఁ జెప్పెం దగన్".

సుకుమారుఁడగు నలుఁ డటఁ దిరిగి తిరిగి యలసి యట నొక సోఫా యుండ దానిపై మేను చేర్చియుండె. అప్పుడొక స్త్రీ దానిపైఁ బురుషుఁ డున్న సన్నయెఱుంగక తొందరతో వచ్చి పండుకొని, మనుష్య సంపర్కమైనట్లు తలంచి నివ్వెఱంపడి నెచ్చెలులకుం జెప్పినది. ఇందు శీలమునకు లవమాత్రమైన లోటు వాటిల్లునా? 137 వ పద్యము:—

తే. "నిషధరా జొక్కచవికలో నిలువ నటకుఁ,దటుకున న్వచ్చి యొకచేఁడె తనయురోజ
ముల నతని నొత్తి నలుగడం గలయఁ జూచి, పడియె నబ్రము తనసుఖస్పర్శమునకు"

ఇదియు పైపద్యములవంటిదే. చవికలో నిషధరా జున్న ట్లెఱుం గదు. స్వైరవిహారమును చేయుచు నటరా నట్లు జరిగిన సుఖస్పర్శమున

కచ్చెరువు పడినది. ఇందు నలునిదోషమును జూపట్టదు. తాను దొలంగి యున్న నట్లు తటస్థింపవచ్చును. 138 వ పద్యము:—

క. "ఆనాఁ డష్టమిఘటికలు, గాన సుఖస్పర్శ మగుటఁ గళ గరఁగి కడున్
మానసమున నానందము, మానిని దా ననుభవించె మఱియున్ మఱియున్".

అష్టమినాఁడు స్త్రీకిఁ గళ యురోజముల నుండును. అట దైవ ఘటనం జేసి పురుషదేహస్పర్శ మైనది. కళ గరగినదని కల్పనము. ఇందు దానిశీలమునకు భంగపాటు వాటిల్లెనా? అది యేమి తప్పుచేసినది? అష్టమి చేసినది. 139-వ పద్యము—ఇందు దమయంతీప్రీతికై స్త్రీ లం దఱుగలసి నాటకముం బ్రదర్శించిరి. ఇది శీలముం బోగొట్టునా? రంగస్థల ములో మహారాజులసమక్షమున గాదు. అంతఃపురములో నాఁడువాం డ్రలో నాఁడువాండ్రే. 140—ఇందులో మాయలాఁ డెవ్వఁడో యిటకు రాఁబోలు నని భయావృతాబలస్వాంతలై వెదకఁబూనుట, పురుషుఁ డంతిపురిలోనికి వచ్చెనన్నచో రాజువలనిభయము, అంతిపురము నందలి కట్టుబాట్లు తెలియుచున్నవి. ఇవియే సూచనలో విమర్శకులు శీలముం బాపునవి యని వ్రాసియున్నారు. ఇదియంతయును దిరస్కరిణీ ప్రభావముగాని మఱియొకటికాదు. ఇందు చెలులశీలము రక్షింపఁబడి యేయున్నదని నే ననుకొంటి. మఱియును అంతిపురములలోని స్త్రీలు స్వేచ్ఛావిహారము సేయుచుందురు. దమయంతిచెలికత్తె లనంబడు నీ స్త్రీలెవ్వరు? భర్తలతో సంసారము చేయుపుణ్యస్త్రీలా? కారు. వా రంతి పురంబులకు రారు. పరిచర్య చేయరు. వీరు పరిచర్య సేయు దాసీలవంటి వారు. వీరికి సామాన్యముగా వివాహము చేసికొనుట యుండ దని తలంచెదను. ఇట్లు నేనేకాదు, నైషధములో శ్రీహర్షుఁడు:— 6-వ సర్గము:—

శ్లో. "దోర్మూల మాలోక్య కచం రురుత్సో స్తతః కుచౌ తా వనులేపయన్త్యాః,
నాభీ మధైక్ష శ్లథవాససోను మిమీల దిక్షు క్రమకృష్టచక్షుః".

శ్లో. "హతః కయాచిత్పథి కందుకేన సంఘట్య భిన్నః కరజైః కయాపి,
కయా చ నాక్తః కుచకుంకుమేన సంభుక్తకల్పస్య బభూవ లాభిః".

ఇట్లు చెప్పియున్నాఁడు. ఈయర్థములనే వెల్లడించుచు శ్రీ నాథుఁడు తనశృంగారనైషధములో నిట్లు చెప్పియున్నాఁడు. 3 ఆశ్వా సము 86-వ పద్యము:—

క. "ప్రిదిలిన నీవి కేల సవరించు తలోదరి యోర్తుఁ గాంచి లోఁ
గదిరిన పాపభీతిఁ బతికన్నులు మోడ్వ నొక ల్లోకళ్లకై
యెదురుగ వచ్చి వచ్చి యొకయిద్దఱుముద్దియ లూ త్తి రవ్విభుఁ
మదగజరాజకుంభముల మచ్చరికించు కుచద్వయంబులన్".

14 వ పద్యము:—"విరినెను నీవిబంధ మది విస్మయ మొందఁగఁ దోడి భామినుల్".

15 వ పద్యము:—"కాంచనపుబంతులఁ గ్రచ్చఱవాటు లాడఁగా
ధరణిపుఁ డడ్డమై చనుడుఁ తద్భుజదండముఁ దాకి మెట్టి".

ఇట్లు మూలకవిని మించి యెన్ని యో విధములఁజెప్పియున్నాడు. నదియుంగాక వ్యాసభగవానులు తనశ్రీమహాభారతములో ఆరణ్య పర్వము 56-వ అధ్యాయమున:—

శ్లో. "తతస్తా నైషధం దృష్ట్వా సంభ్రాంతాః పరమాంగనాః
ప్రశశంసుశ్చ సుప్రీతా నలం తా విస్మయాన్వితాః
న నైన మభ్యభాషంత మనోభి స్తస్యథపూజయన్
అహో రూపమహో కాంతి రహో ధైర్యం మహాత్మనః
తేజసా ధర్షితా స్తస్య లజ్జావత్యో వరాంగనాః."

అని వ్యాసియుండె. ఇందు—సుప్రీతాః, మనోభి స్తస్యథ పూజ యన్, అహోరూప, మహోకాంతి, రహో, తేజసా ధర్షితా స్తస్య, లజ్జా వత్యః, ఇత్యాదులచే దమయంతిచెలికత్తియలు నలునిఁ జూచి మోహవివశలై మాటలాడలేక మనస్సునఁ బూజించి రనఁగా మనస్సు లోనే కోరికిం జేసి రని యభిప్రాయము. ఇట్లు మహాపురుషునిం జూచి లించి రనుటలో ఆస్త్రీలశీలమున కించుకలోపము చూపట్టక మాన దని తెలంపు.

2 ద్వితీయస్వయంవరసందర్భమున నున్న "బ్రతికెనొ చచ్చెనో?" నునది యశ్లీల మనియు మార్పవలయు ననియు సూచన. బ్రదికెనొ చ్చెనో యనునప్పుడు విన్నవారికిఁ గష్టముగా నుండు నేమొ కాని,

ఇక్కడ నిట్లే చెప్పవలయు నేమో యని వ్రాయుట నాపారపాటు కా వచ్చును. ఏ కారణమున నిట్లు దమయంతిచేతఁ జెప్పింపవలసి వచ్చెనో కాని మూలమున నిట్లున్న ది. శ్రీమహాభారతము నలోపాఖ్యానము 71 అధ్యా యము 28-వ శ్లోకము:— "న హి న జ్ఞాయతే ధీరో నలో జీవతి వా న వా" అని దమయంతి పలికిన ట్లున్న ది. నే నిది చూచియే "బ్రదికెనొ చచ్చెనో" అని వ్రాసితిని. ఇది సూచనలో సవరింపు మనిరి గావున నట్లు చేయుటయే నావిధి. మఱియుం గొన్ని భూతార్థక్రియలవిషయమై సూచించియున్నా రు. వాని నెల్ల యథాన్యాయంబుగ సవరించుటకై ప్రయత్నింతును. మఱియు నెల్లరు, దృష్టకూ లొనగునవి సూచించిరి. కోటి, పిప్పల్యాదుల కీరూప మొప్పు నని బాలవ్యాకరణము చెప్పుటయే కాక బహుప్రయోగములును గలవు. భారత మాదిపర్వమున నన్నయ భట్టారకుఁడు "దృష్ట్లు" అని వ్రాసియున్నా ఁ డని విన్నవించుచు వా రీపీఠిక వ్రాయుటలోఁ బడిన పరిశ్రమకు మఱియు మఱియు నభినందించు చున్నా ను. ఇందుపై నేను గోరకుండ నాయందలి కృపాతిశయముచే మంచియభిప్రాయ మొసంగిన విద్వాన్ శ్రీగంటి జోగి సోమయాజులు, యం. యే., యల్. టి., గారికి నాయభివందనము లర్పించుచున్నా ను. ఇందుఁ గొన్ని కొన్ని దేశీయపదములు, మాండలికములు చొప్పించుటయే కాక ఱ. ర. లకు యతిప్రాసముల మైత్రి గలిగించితి. దానికిఁ బండితులు నన్ను గర్హింపకుందురుగాక యని ప్రార్థించుచున్నా ను.

శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి.

# తప్పులపట్టిక

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 6 | 22 | కరణి | రమణ |
| 8 | 16 | నవియ | నవయ |
| 9 | 13 | వావార్వ్వ | వారార్వ్వ |
| 10 | 19 | పడఁగ | కూడ |
| 15 | 13 | అద్దెపవి | అద్దెపలి |
| 15 | 15 | లక్ష్మఁబొండ్లి | లక్ష్మిమమతఁబొండ్లి |
| 21 | 6 | గడకుమాసపు | గళకుమాసము |
| 27 | 10 | పెట్టి | పెట్టి |
| 27 | 16 | దాగ | దాఁగ |
| 27 | 16 | దాగు | దాఁగు |
| 28 | 10 | దోప | దోఁప |
| 29 | 2 | చూపఱు | చూపఱ |
| 29 | 27 | తేండ్లు | తేంట్లు |
| 31 | 10 | పయ్యెర్ద | పయ్యెర్ద |
| 34 | 5 | పెట్టుపెట్టు | పెట్టుఁపెట్టు |
| 44 | 1 | మొగముఁజేత | మొగముచేత |
| 44 | 26 | పెంపు | కెంపు |
| 50 | 21 | దాపురము | దాఁపురము |
| 54 | 4 | దూరుచు | దూఱుచు |
| 54 | 28 | జారు | జాఱు |
| 55 | 4 | బ్రాకె | బ్రాఁకె |
| 56 | 11 | గంజాక్షి | కంజాక్షి |
| 74 | 9 | జలియింపఁగలేక | జలియింప |
| 75 | 12 | బైమి | భైమి |

| పుట. | పం క్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 78 | 20 | తల్లివౌ | తల్లికా |
| 78 | 27 | గోర్కులిఁ | గోర్కులీఁ |
| 79 | 13 | వారిక్ | వానిక్ |
| 84 | 3 | నీవే | నీవో |
| 91 | 1 | ఓమలి | కాంతను |
| 106 | 18 | గజారోహణంబు | గజావరోహణంబు |
| 106 | 9 | ఏగుబెండ్లి | ఏగుపెండ్లి |
| 116 | 8 | సేవితుఁడు | సేవకుఁడు |
| 121 | 7 | యెక్కిడి | యెక్కుడ |
| 134 | 20 | ముట్టి | వట్టి |
| 146 | 26 | గుడుసు | గఱుసు |
| 155 | 12 | యెవర్తో | యెవర్తా |
| 156 | 12 | నన్ను | నిన్ను |
| 156 | 23 | పొగలి | పొగిలి |
| 162 | 9 | నిర్జన | నిర్జర |
| 163 | 4 | డరయనతండా | డితఁడయెన్నంగా |
| 171 | 3 | మణి! | మణీ! |
| 172 | 15 | ధరయెల్లక్ | నభమెల్లక్ |

శ్రీ ర స్తు.

# నై ష ధీ య చ రి త ము

## శృం గా ర త రం గి ణి

### ప్ర థ మ త రం గ ము

ఇష్టదేవతాప్రార్థనాదికము.

మీఱు గిరిరాజపుత్రిక మెయిం జేకో సగం బెంతయేఁ
బ్రేమ గంగయు శీర్ష మెక్కి గరిమం బెంపం గుమారుల్ మహో
ద్దామేచ్ఛ విపులోరుయుగ్మమును బొందం బొల్చుదేవుండు ని
ర్వ్యామోదంబునఁదూములూరిశివరామార్యుఁ దయంబ్రోచుతన్.

1. అరుణశరీరకాంతి దెస లంతర మింతయు లేక నిండుకో
గలముల నాల్గిటం గళయుఁ గంజము పుస్తక మక్షమాలయుం
బరఁగ శివాంకసంస్థ యయి బాలిక వైఖరి భక్తకోటులఁ
సురుచిరలీల నేల్ త్రిపురసుందరి మాశివరాము నేలుతన్. 2

2. విక్రమసింహపత్తనము వేడుకఁ జేసి వసించి యచ్చోటఁ
సక్రమపద్ధతిం బ్రజల సాఁకుచుఁ బాకపరాదిదేవతా
చక్రసమర్చితుం డయి పొసంగెడు రంగవిభుండు ప్రోచు ని
ర్వ్యక్రదయాతిసాంద్ర శివరామబుధేంద్రునిఁ గీర్తిచంద్రునిన్. 3

3. కరుణాపాంగవిలోకనంబులను లోకంబందుఁ దా నింత యా
నరుఁ గొండంతగఁ జేసి వానిఁ గనుచుండం జూచి రక్షించునా
సిరి పద్మాలయ పద్మ పద్మముఖి మే ల్సేకూర నెల్లప్పుడున్
సిరులున్ సంపద లిచ్చి ప్రోచుత దయన్ సీతామనోవల్లభున్. 4

---

విక్రమసింహపత్తనము=నెల్లూరు; పాకపరుఁడు=పాకారి, ఇంద్రుఁడు.

చ. తలఁచినమాత్రమాధవునుదంచితనాభిసరోజమందుఁ బెం
పలర స్వయంభువై వెలసినట్టిఁడయై శ్రుతిసుప్రసంగతిఁ
గలజగముల్ సృజించు నెఱకాఁ డగువాగధినేత నిత్యని
ర్మలమతిఁ దూములూరిశివరామున కిచ్చుఁ జిరాయురున్నతుల్. 5

సీ. పాలు నీ రేర్పర్పఁ జాలినవెలితొక్క
పక్కి యేదేవత యొక్కిరింత
చక్కెర ల్మెక్కి యు క్కెక్కిన చదువుల
పులుఁ గేపొలంతికిఁ బలుకుతోడు
వెన్నెల ల్వెదచల్లు చిన్నిజాబిల్లి యే
చెలియకుఁ బాపట చేరుచుక్క
కలిగించు మగని మేల్నలుతలవాకిళ్లు
హెచ్చునేసకియకు రచ్చపట్టు

తే. లట్టిసైకతసుశ్రోణి యజునిరాణి, పరమకల్యాణి ఘనవేణి పద్మపాణి
సిద్ధనిశ్రేణి నవితసచ్ఛ్రేణి వాణి, రాణ లెసఁగ వేంకటశివరాము నేలు.

మ. గ్రహరాజై నిజతేజ మెల్లకడలం గ్రాలంగ లోకాళికిఁ
స్పృహ గల్గించుచుఁ గర్మసాక్షి యగుచుఁ బెంపొందిన సప్తాశ్వుఁడై
బహుమార్గంబు పరిభ్రమించుచుఁ బ్రజఁ బాలించుదేవుండు ధూ
ర్వహుఁడై శ్రీశివరామపుత్రునకు శేవం గూర్చు నారోగ్యమున్. 7

చ. అనిలవరప్రసాదమున నంజనకుం బ్రభవించినంతనే
యినుని మహాఫలం బనుచు నెంచి గ్రహింపఁగ మిన్ను ముట్టి పెం
పునఁ జను సత్త్వమూర్తి, జవముం గలఁ డై లవణాబ్ధి దాఁటి సీ
తను గని రాముని దెలుచుదఱుఁడు మాకృతినాథు నేలుతన్. 8

మ. నలుగుంబిండిని బొమ్మ చేసి యమ ప్రాణంబుం బ్రతిష్ఠింప ము
ద్దులబిడ్డం డయి వాకిటఁ హరునిఁ బోఁ ద్రోలం గజాస్యంబునుం
గలలుం గల్గి గణాధిపత్యమున వేడ్కఁం గాంచుదై వమాతురుం
డెలమిఁ శ్రీరమణాంబికాసుతుమనోఽభీష్టంబులం దీర్చుతన్. 9

వ. అని కృతిపతి నాశీర్వదించి మఱియును. 10

క. తొలుదొల్త నెవని రసనాం,చలమునఁ గవితావధూటి సమ్యగ్ఘనరీ
తుల నాట్య మాడె నక్కవి,తిలకుఁ వాల్మీకివాఁనిఁ దిలకింతు మదిన్.

క. ఆదిం బ్రోవగు నాలుగు, వేదంబుల వేఱుపఱిచి పిదపఁ బురాణా
ష్టాదశకం బొనరించిన, వేదవ్యాసుని నుతింతు విశ్రుతఫణితిన్. 12

క. ఘను వాగనుశాసనుఁ ది,క్కన నెట్టాప్రైగడ నాంధ్రకవితాజుని నూ
తనచండి సహజపండితు, వినుతింతుం బొండురంగవిభు శ్రీనాథున్.

క. కవితం గూరిచి విద్వ,త్కవు లేమని యన్నఁ గౌతుకంబ పెరల్ కా
దవు నం చాడిన లోన వ,గవ నలరంగాఁ బ్రబంధకవులకుఁ బనియే.

క. అవధానము లనువిద్దెలఁ, దవిలితిఁ గడుకబ్బములను దగ సలిపితి నేఁ
గవిసార్వభౌమబిరుదం, బవుననఁ గైకొంటిఁ గృష్ణుఁడనియెడివాఁడన్.

మ. ప్రమదం బేర్పడఁ దొల్లిటి గురుకులావాసంబునఁ నేర్చి కా
వ్యములుఁ, నాటకముల్, పరిష్కృతులు, శబ్దార్థంబులుఁ, సత్పరి
శ్రమచే నీకృతి సర్వసమ్మతముగా సంధింతు నచ్చైన దో
షము లెంచే నగు దిద్దుఁ డార్యులు నమస్కారంబు లర్పించెదన్. 16

వ. అని పూజ్యపూజాతత్పరుండనై యొక్కకాలంబునఁ జెన్నపురికిం
బోయివచ్చుచు మూర్ధమధ్యమంబున్న నెల్లూరు న న్నాకర్షించుటం
జేసి యట ధూమశకటావరోహణంబు గావించితి నదియును. 17

## విక్రమసింహపుర వర్ణనము.

సీ. ప్రవహించు నేప్రోలి పశ్చిమోత్తరముల
సొన్నలమణివేరు పెన్నయేఱు
తళుకొత్తు నే పురి దక్షిణంబున జ్ఞాన
వాపి కోపిన బుద్ధివాపి వాపి
రమణించు నేపీటి ప్రాగ్దిశ నింతలో
నీశ్వామి వాకలగుర్వు సామి

యింపొందు నేయూరి యీశౌన్యమున నెప్పు
పాయకుండును రంగనాయకుండు

తే. వఱులు నెచ్చట సంస్కృతవాగ్విశాల
యగు కళాశాల హూణవిద్యార్థిశాల
మండలన్యాయసభయు సన్మహితమగుచు
నొప్ప నొప్పుచునుండు నెల్లూరుపురము. 18

మ. గురువిద్యావిభవం బదంతయును గైకొ మ్మంచుఁ బో గ్రక్కి భా
స్కరునిం గొల్చి మహామహా త్వమున శుక్లం బైనవేదంబు గ
హ్వారికిం దెచ్చినయాజ్ఞవల్క్యముని లోకారాధ్యుఁడై లోకముం
బరిపాలింపఁగ నప్పరిక్ వెలయుటఁ వర్ణింపఁగా నయ్యెడిన్. 19

ఉ. ద్రావిడభాష 'నెల్ల'నఁగ ధాన్యవిశేషము చెప్ప వచ్చెడిన్
ద్రావిడు లాదికాలమునఁ దత్పరభూముల నల్కలంకులన్
బ్రోవులు గాఁగ ధాన్యములు పోయుచు నుండినదాన సార్థకం
బై విలసిల్లె నెల్లు రనునాహ్వయ మిప్డును నిప్డు నొప్పుగన్. 20

ఉ. విక్రమసింహుఁ డన్బిరుదువే ర్గలరాజమహేంద్రుఁ డప్డు ని
ర్వక్రపరాక్రమంబున ధరాతల మేలుచు నందు నుండుటన్
విక్రమసింహనామమున విశ్రుత మయ్యెను బత్తనంబు భూ
చక్రమునందు దాని కెన సల్పఁగ రా వితరంబు లన్గతిన్. 21

మ. పుడమిన్ సింహపురంబు శౌర్యగరిమం బొల్పొందు నచ్చోటఁ బే
ర్వడి పాటింపఁగ నైనయేనికలు నిద్రం బొందఁ బోవంచు నా
నుడి దేశంబుల మ్రోసి యుండె నట నేనుంగంతవిద్వాంసుఁడుం
గడిమి న్నోరు మెదల్పలేఁ డనుట నిక్కం బెల్లరు న్విజ్ఞులే. 22

చ. అట నొకబావి యుండె నట యందలినీళ్లను ద్రావినంతనే
పటుతరవాగ్విలాసములు పర్వఁగ బుద్ధిమదగ్రగణ్యులై
దిటపడి యుక్తియుక్త మగుధీ గలవా రయి జీవు లంతలన్
స్ఫుటగతి గెల్చువా రనుచుఁ బెద్దలు చెప్పుచునుందు రొద్దిక. 23

ఉ. తిక్కనసోమయాజి యటఁ దియ్యని కైతలు నేర్చి పెన్నఁ బై
చక్కిన యున్న దేవళముసామినిఁ గొల్చుచు భారతంబు న

మ్మక్క యనఁ రచించెఁ బదియైఁవగుపర్వము లుర్వి మెచ్చ నీ
యెక్కువకుం బురిం గలయహీనమహాత్త్వమె కారణం బగున్. 24

మ రణతిక్కం డటఁ బుట్టినట్టిఁ డగుటఁ రారాజు లగ్గింపఁగా
రణమందుఁ రిపురాజి నోర్చి నృపతిఁ రక్షించె ము న్నాతితిఁ
గణుతింపఁ గుణమే ప్రధాన మగుచుం గన్పట్టు నప్పట్టునఁ
రణసింహుల్ కవిసింహు లిప్పటికినిఁ రాజిల్లుచుం ద్రెన్నఁగన్. 25

ఉ. అంకెకు వచ్చినట్టికవి యై మొనమొన్నఁ గవీంద్రవంద్యుఁడై
వేంకటరాయశాస్త్రి యనువేదముపంశకులార్ణవాబ్జుఁ డా
తంకము లేనివై ఖరులఁ దా వెలయింపఁడె తెల్గుబాస ని
శ్శంకుఁడు తత్ప్రబంధములె చాటెడు సింహపురీప్రభావమున్. 26

చ. అభినవకాళిదాస బిరుదాంకితులై కుకవీభసింహులై
విభవసమేతులై వివిధవిశ్రుతకావ్యకలాకలాపులై
ఋభుగురుతుల్యులై కవు లనేకులు నేటికి మేటివేర్మిమైఁ
బ్రభవము నొందియుందు రని పత్తపరాజము ప్రస్తుతిం గనున్. 27

వ. ఇట్లఖిలాంధ్రదేశాభరణాయమానంబై కరంబు డంబుమీఱు నప్పురీ
వరంబున. 28

## కృతిపతిప్రశంస.

సీ. అడిగినయర్థంబు లర్థుల కఱలేక
యిచ్చెడిముచ్చట నెసఁగువాఁడు
ఘనతర మీయుపకారంబు నీచేతఁ
గాఁ దగు నన్నచోఁ గడఁగువాఁడు
పరుఁ డైన బాధలఁ బడనున్నఁ జేత నై
నంతలోఁ దొలఁగింప నలరువాఁడు
భూతదయాళుత్వబుద్ధి నెల్లెడ మంచి
వాఁ డని పే రంది వఱలువాఁడు

తే. అతఁడు నలువొందు సత్యవాక్యప్రవర్త
కుండు శాంతుఁడు సుగుణసాంద్రుండు మృదుల

హృదయుఁ డాచారనిరతుండు సదమలుండు
తూములూరివేంకటశివరామసూరి. 29

చ. ఘనుఁ డయి న్యాయవాది యయి కావ్యరసానుభవాంతరంగుఁ డై
ధని యయి కార్యదక్షుఁ డయి దైవతభక్తిసమేతుఁ డై మహా
మునిజనసేవకుం డయి సుపుత్రకళత్రసుమిత్రయుక్తుఁ డై
తనరుచు నుండు నంచు విని దర్శనముం బొనరింప నేగితిన్. 30

ఉ. ఏగినయంత నన్నతఁ డనేకవిధంబుల నాదరించుచున్
వీగనిభక్తితో నెపుడు వేడుకఁ గూర్చుచు భక్ష్యభోజ్యసం
యోగమునందుఁ దండ్రి తనయుం బలెఁ జూచుచు నాకవిత్వమున్
నాగుణగౌరవాదులు మనంబున నెంచుచుఁ బెంచె హర్షమున్. 31

క. మనుగుడుపు సేయువియ్యం, బన నే నాబుధునియింట నభ్యవహారం
బొనరించుచుండి నెమ్మన, మున నెంతయు సంతసంబు ముప్పిఱిగొనఁగన్.

ఉ. ఆతనిఁ గాంచి యొక్కదినమం దిటు లంటి, బుధేంద్రచంద్ర! "నీ
నీతియు నీదుదాత్మతయు నీదగుయోగ్యత నీదుపాండితీ
రీతియు నీదుగౌరవగరిష్ఠత నీకవితాప్రియత్వమున్
చేతము పల్లవించునటు చేసె నటంచు నిజంబు చెప్పితిన్. 33

ఉ. ఉత్తమనాయకుండ వని యుల్లము పల్లవితంబు గావునన్
మెత్తనిపాకముం గలుగ మేలుకృతిన్ రచియించి నీ కిడన్
జిత్తముచేసితిన్ గొనుము శ్రీయును సంపదయున్ యశంబు నిన్
హత్తగ వచ్చు నందున ననంతములై ద్విజరాజశేఖరా." 34

క. అనినం గా దన కాతఁడు
ననుఁ గని యి ట్లనియె వినయనయవాక్యచయం
బనువొంద "నాదువంశము
తనరెడు నది యయ్యె నేను ధన్యుఁడ నైతిన్. 35

శా. ఓవిద్వత్కవిరాజ, నీదుకవనం బోహో యనం బొల్చెడున్,
నీ వొండొక్కదినంబులో నొకకృతి న్నిర్మింపఁగా నేర్తు, నీ
ప్రావీణ్యంబు జగం బెఱుంగు, సుతియింపం జాల, నీ వన్నిటన్
జేవ ల్దేఱితి వంచు నీదుకృతులే చెల్వొచ్చు వాక్కుచ్చెడిన్. 36

క. కవిసార్వభౌమ, నాయెడ, నవిరళ మగుకరుణ గలుగునట్టిద యేనిఁ
దవు నటుకలికల్మషహర,మవుకథ రచియించియొసఁగు మాశీఃకృతిగన్."

వ. అని సబహుమానంబుగం బలికి నూటపదియాఱురూప్యంబులతోఁ గరూపారతాంబూలం బొసంగినం బుచ్చుకొని వానియిచ్చకుం దగ మున్ను నే నించుక రచించి యుంచిననలకథాభాగంబున మఱి కొన్ని క్రొత్తలుం గలయ గూర్చి వేర్చిన విజ్ఞానంబున "శృంగారతరంగిణి" యనుపేర నైషధీయచరితంబు నొక కావ్యంబుగా రచియింప నెంచి ముందు మంగళాచరణంబుగా నమ్మహీదేవకులావతంసంబు వంశావతారం బభివర్ణించెద. 38

## కృతినాయకునివంశావతారవర్ణనము.

సీ. శ్రీరమణీమణీజీవితేశ్వరునాభి,సరసిజ మేస్వామిజన్మభూమి
తలవాకిళుల మెల్లఁ గలిగిలోకము లేలు,తరళాక్షియే వేల్పుధర్మపత్ని
క్షీరనీధవిభాగ మారసి చేసెడు,పక్కి యే దేవరయెక్కిరింత
దేవమునీంద్రులు దీపించునిక్కపు,జగ మేమహాత్మునితగిన కొంకి

తే. అతఁడు నలువొందు శ్రీకాయజాగ్రజుండు
బ్రహ్మకుప్రౌద్దుల నొసళుల వ్రాయువేల్పు
వేల్పులకుఁ బెద్ద వెలిదమ్మి వెలుఁగుమేటి
జగములం జేయుదిట్ట మేల్ జన్నిగట్టు. 39

క. ఆతనివంగసమందుఁ
భూతలమున హరితుఁ డనఁగ మునిపుంగవుఁడై
ఖ్యాతిం గనెఁ దద్గోత్రో
ద్భూతులు పెక్కండ్రు ద్విజులు పొలిచిరి పృథ్విన్. 40

క. వారలు నానాదేశము, లారూఢిఁ మెట్టి మెట్టి యందం దుంటఁ
బే రయ్యె నాఁడునాఁటికి, వారికి నానాఁట నాఁటివా రన నందున్.

సీ. అఖిలవిద్యాధ్యయనాధ్యాపకాంచిత, నయకోవిదులు వెలనాటివారు
పాండరీకాదిసవనకాండసుకరణా,నందసాంద్రులు వెలనాటివారు
ధిక్కృతశిబికర్ణదివ్యాగమవితర,ణప్రకాశులు వెలనాటివారు
అవ్యయజీవేశ్వరాద్వైతమతవర్త,నస్వభావులు వెలనాటివారు

తే. వారిలోపలఁ జెక్కఁడ్రు వరుసఁ జనిన
యంతఁ దూములూరను గ్రామమందుఁ దొలుతఁ
గాపురంబుగ నుండినకతనఁ దూము
లూరివా రన నొకకొంద ఱొప్పి రందు. 42

క. కామేశ్వరసన్నిభుఁ డై, కామేశ్వరశాస్త్రి శాస్త్రకలితో త్తమమే
ధామహితుఁ డగుచు విద్వ, త్సోమస్తుతుఁడై తలిర్చె శ్రీనణీస్థలిలోకన్.

సీ. నలువయే వేనోళ్లచిలువయే రా నిమ్ము
వేదశాస్త్రమ్ముల వా దొనర్ప
జీవుఁడే కానిమ్ము దేవుఁడే కానిమ్ము
బుద్ధిస్పృహం జేసి పోకడంతు
నింద్రుఁడే కాని యుపేంద్రుఁడే కాని నా
వైభవంబున సిగ్గుపడ సలుపుదుఁ
గానీనుఁడే కాదు వానీనుఁడే కాదు
వితరణంబునఁ జేసి వెడల నడఁతు

తే. రుద్రుఁ డైనను మఱి వీరభద్రుఁ డైన
నాహవాగాయుధంబుల నవియ నేర్తు
ననుచుఁ గైఁ గంగణము గట్టుకొనియె ననఁగఁ
ద్యాగియై భోగియై యొగి యయ్యె నతఁడు. 44

తే. అతనికిఁ శివకామ పట్టాభిరాము
లనఁగ నిర్వురుపుత్రకు లలరి రీశ్వ
రునకు సర్వమంగళయందు వెనకయయును
గొమరుసామియు నలరినకరణి ధరణి. 45

వ. ఆకామేశ్వరశాస్త్రిపుత్రులలో 46

మ. శివకామార్యుఁ డనార్యకార్యములకుం జేయూత గా కార్య లే
న్న వదాన్యుండును ధన్యుఁడై తనరి యంతఁ సుబ్బమాంబ న్వివా
హవిధిం గైకొని యాత్మసోదరసుతుం డౌ నాదినారాయణుఁ
సుమతిఁ దత్తునిఁగా గ్రహించి కొనియెఁ దుర్వ్యాశ్రమస్వీకృతిన్.

క. పట్టాభిరామయాఖ్యుఁడు, పట్టియ యగువయసునంద వారాణసికిఁ
బట్టుమెయి నేగి వేదము, పట్టంతయు నెఱిగివచ్చెఁ బ్రాజ్ఞులు మెచ్చన్.

సీ. పట్టాభిరామయ పట్టాభిరాముని
భాతి విఖ్యాతిమై భూతిఁ గాంచి
నారకూచికుమారి నారి సీతమఁ బెండ్లి
యాడి శ్రీశివరామయాఖ్యుఁ బుత్రు
నవల సీతారాము నాదినారాయణు
వేంకటరమణయ వెనుక రామ
కృష్ణయ సుబ్రాము నిచ్చుమై నార్వురఁ
బుత్రులం గని జగత్పూజ్యుఁ డయ్యెఁ

తే. జక్రవర్తులు, ఋతువులు, శాస్త్రములు వి
శాఖముఖములు, కాలముల్, చక్రము లన
నన్నదమ్ములు వా వార్వు రతిశయించి
వేరు గాంచిరి జగమందుఁ బేర్మి మెఱసి. 49

సీ. అందు సీతారామయాఖ్యుఁడు లక్ష్మీన
రసమఁ బెండిలియాడి రమణ నామె
యందు సుబ్రహ్మణ్య సాంబశివుఁ వేంక
టేశ్వరునిఁ బిత్రాణ మేగఁ గనియె
నాదినారాయణుం డన్నమ్మ బెండ్లియై
తాను దత్తుం డయ్యుఁ దమ్మునిసుతుఁ
డైన సదాశివయ్యను దత్తుగాఁ గొనె
నతఁడు ద్వ్యముష్యాయణాఖ్యఁబరఁగె

తే. వేంకటరమణయాఖ్యుఁడు వేడ్క మఱియె
యందుఁ బుత్రుల నాదినారాయణ శివ
రాము లనువారి నిర్వురఁ గాంచి లోక
విశ్రుతం బగుకీర్తిమై వెలసె జగతి. 50

తే. రామకృష్ణుఁ డుద్యోగియై ప్రబలి మొదటి
వనిత వేంకటసుబ్బాంబవలనఁ గనె స

దాశివునిఁ వెక్క రమణమాతన్వివలనఁ
బరమశివుఁ గాంచె దత్తుఁడా ప్రథమసుతుఁడు. 51

తే. సుబ్బరామఁయ విద్యల సొంపుమిగిలి
సతి మహాలక్ష్మిఁ బెండ్లాడి సుతులు లేమి
బ్రాతృపుత్రుని వేంకటేశ్వరుని దత్త
పుత్రునిగ స్వీకరించి పెంపున నెసంగె. 52

వ. అల్ల పట్టాభిరామాత్మజులలో నగ్రజుం డగు శివకామయాహ్వా
యుండు. 53

ఆ. మొదలివారు ద్విజుల మొదలివా రని వారి
పేర్మిపట్టి యైనవేంకటరమ
ణాంబ వేడ్కఁ బెండ్లియాడి గార్హస్థ్యము
వెలయఁజేసె నామె వలన నతఁడు. 54

ఉ. పిన్నతనంబునంద తమపెంచెడుతండ్రి పరంబు నొందఁ గా
నన్నయె తండ్రి యఁనుడి నిజానుజు లంచఱుఁ దన్నుఁజేరఁ గాఁ
గన్నకుమారులం బలె నొకానొకయింతయు లోటు లేనియ
ట్లన్నివిధంబులం గనుచు నైదుగురం దగఁ బెంచె నెంచఁగన్. 55

తే. నయము మీఱంగ నుపనయనము లొనర్చి
చదువు చెప్పించి పెండ్లించ్లు సరగఁజేసి
కూడుగుడ్డల కిడుములు పడఁగ నీక
సోదరులఁ బెంచె నాతఁ డత్యాదరమున. 56

మ. పదియాఁతేడులయీడునం దతఁడు విద్వత్పట్టముం గాంచి పెం
పొదవం బొల్చిగవర్న మెంటుపదమం దుద్యోగియై యుండి య
ప్పిదపం దా బెజవాడ నింజనియరాఫీస్‌లోన మేనేజరై
పెదజీతంబునఁ బెద్దపత్తసములం బ్రేమించె నుద్యోగమున్. 57

చ. అటువలె రాజకీయపదమం దయి సంస్కృతిపోషణార్థమై
యటమట మొందుచున్నతఱి నాయనభాగ్యము పండె నాఁగ వేం

కటరమణాంబ పెద్ద దయి కాపురముం బొనరింప వచ్చె ము
చ్చటపడియ త్తవారియుటజంబున కయ్యది యెట్టిలగ్న మో?. 58

మ. తరుణీరత్న ము కాలు వెట్టిన మొదల్ తండోపతండంబులై
పురము ల్వస్తులు వాహనంబులు ధనంబు ల్వస్త్రభూషాదులుఁ
వరధాన్యంబులు మాన్యముల్ గలిగి యాబ్రహ్మాన్వయో త్తంసునిల్
కర మాశ్చర్యకరంబుగా ధనదునిల్ గా మాతె నూ రెన్నఁగన్.59

తే. అవనిఁ బెంపొందెఁ దూములూర్యన్వవాయ
కలశవారాశిచంద్రుండు కాశ్యపీంద్ర
వినుతసద్గుణసాంద్రుండు పనితభూసు
రేంద్రుఁ డమలయశోజితా రేయేంద్రుఁ డపుడు. 60

తే. అవని మగఁ డెంతయుద్యోగి యైన నూర్లు
వేలు గణియించువాఁ డైన విజ్ఞుఁ డైన
నాఁడుదానిదియె యవృష్ట మనెడుమాట
సార్థకం బయ్యెనిప్పట్ల నరసి చూడ. 61

సీ. చాపలంబునఁ బెరజనుఁ జేర నొల్లని
మంగళదేవి యీమంగళాంగి
బలుతాఁగయై నోళ్లఁ బడి రచ్చ లెక్కఁని
మంజులవాణి యీమంజువాణి
మగనిసామేసు నోఁ దెగి గద్దరింపని
మృగరాజగమన యీమృగవరాక్షి
పాటి చెప్పినఁ గాని మాటాడఁ దలఁపని
విబుధేంద్రదేవి యీవిబుధదేవి

తే. అనుచు నెల్లరుఁ గొనియాడఁ బ్రాణనాథు
నెద వసించియు వాక్థాన మెలమిఁ గొనియుఁ
గలసికొని యనువర్తనముల నిలిచియుఁ
గొలుచు వేంకటరమణాంబ గుణకదంబ. 62

సీ. శివకామబుధుఁడు భాగ్యవతీవితంసమై
యలరు వేంకటరమణాంబవలనఁ

గనియె వేంకటసుబ్బమను,సీతమను,మహా
లక్ష్మినిం బుత్రికలను ముగురను
బదపడి శివరామ పండితేంద్రుని నొక్క-
పుత్రునిం బరమపవిత్రచరితు
మొదటి పుత్రిక నిచ్చె మొదలిశ్రీవేంక
శ్వ్వరునకు, సీతమ్మ ధరణికోట

తే. సుబ్బరాయని కిచ్చెఁ, బైసుతను నోరు
గంటి వేంకటసుబ్బయాఖ్యాకునకును
నిచ్చి పెండ్లిండ్లు గావించె నిచ్చకొలఁది
కట్నము లొసంగి తనకీర్తి కడలుమ్రోయ. 63

సీ. వేంకటసుబ్బమా వేంకటేశ్వరులకు
నాత్మజుల్ లక్ష్మినారాయణ,శివ
కామ,సీతారామనామములు మువ్వురు
కామేశ్వరియుఁ, గనకమ్మ, సుంద
రమ్మ యఁ పుత్రీత్రయమ్ము గల్గిరి; సీత
మాసుబ్బరాయనామకుల కైరి
సుతుఁడు సుబ్రహ్మణ్యసూరియు భ్రమరాంబ
సుత; మహాలక్ష్మియఁ సతికి నోరు

తే. గంటివేంకటసుబ్బయాఖ్యాకునకును
వెలసి రవని సుబ్రహ్మణ్యవేంకటాద్య
కృష్ణవేంకటేశ్వరరాము లెన్న సుతులు
కమల మైత్రేయి, యనసూయ యమరసుతలు. 64

క. శివకామాత్మజుఁ డగునా,శివరామయ తనదుతండ్రి చిన్నతనమునఁ
శివసాయుజ్యము నొందుట, సనిమర్మము గాఁగఁ దల్లి సాఁకం దనరెన్.

క. తల్లియుఁ దండ్రియు గురుఁడును
దల్లియ యై యెల్లవేళఁ దన్ను భరింపఁ
దెల్లముగ విద్య నేర్చియు
సల్లక్షణవంతుఁ డయ్యె జగతి నతఁ డొగిన్. 66

శా. శ్రీశుం డాశివరామయాహ్వాయుఁడు సర్వేష్టుండు నై యొప్పి కు
ప్పా శేషాచలపత్యభిఖ్యునకు విశ్వప్రస్తుతోద్యోగి క
ళ్యాశం గూర్చెడుకన్న బిడ్డ యగుచుఁ హారోవందుసర్వాంగస
ద్వేశ సుందరరామమాంబఁ దొలుతఁ బెండ్లాడె బాల్యంబునన్.

సీ. కలిగినవారింటికన్య గావున నట్టి
సుందరరామాంబ సొంపు మిగిలి
పుట్టాది నల్లారుముద్దుగాఁ బెరిఁగియుఁ
బెండ్లియాడినవెక్కఁ బెనిమిటికిని
నాఁడుబిడ్డల కత్త కధికభక్తిఁ సేవ
సేయుచు ననసూయ యీయమ యను
వేరు గాంచియు లోకవినుతికినై గేస్తు
రాలిధర్మంబుల నోలిఁ గ్రాలి

తే. అతిథిపూజలు సభ్యాగతార్చనలు ప్ర
తములు దానధర్మంబులు తవిలి సలిపి
మగనికిఁ మేనినీడ నాఁ బొగడిత గని
కాపుర మొనర్చె సిరులతో నేపు మీఱి. 68

సీ. తనవాఁడు పెరవారు తన కెంత తొందరల్
గలిగించినం గాని కలఁకఁ బొఱఁ
కనలంగఁ బోవ దోర్పున భూమిదేవికి
సరివచ్చు నీమె యఁగరిమఁ గాంచెఁ
దనహృదయం బేరికిని గాని తెలుపక
గాంభీర్యవతి యనుకడిమిఁ గొనియె
మది సంతసిలుపట్ల మందహాసమె కాని
పకపక నవ్వనిపగిది నేర్చె

తే. మగనితోఁ బుట్టువులనెల్లఁ దగినరీతి, నాదరించుచు భక్తిమై ననుసరించు
నాఁడుబిడ్డల బిడ్డల నరయుఁ బ్రేమ, నల్లసుందరరామమ్మ చల్లనమ్మ. 69

తే. మంచివారిక యింతలో మరణ మనెడు
మాటబడి నేమొ యిహ మెల్ల బూటక మని

యెంచియో యిర్వదేనవయేట నామె
భౌతికాంగము విడి స్వర్గపదము నొందె. 70

వ. అవ్వల మనకృతినాయకుం డగుశివరామయార్యుండు. 71

తే. అపుడు వరలక్ష్మమ వసంత యనెడుసుతల
నాగరిత కన్నవారల నాత్మభాగి
నేయులకు నిచ్చి వైభవానీ్వితముగను
బెండిలులు నేసె బందుగుల్ ప్రీతినొంద. 72

తే. ధరణికోట సుబ్రహ్మణ్యధరణివిబుధుఁ
డల్లవరలక్ష్మి, మొదలి వంశాబ్ధిచంద్రుఁ
డైనశివకామయాహ్వయుఁ డాపసంతఁ
జెట్టఁబట్టి తలిర్తురు చెన్ను మిగిలి. 73

చ. మనశివరాముఁ డాంగ్లము క్రమంబున భూ,నిధి,చంద్ర,ధాతృ,సం1919
ఖ్యను జనునప్పు తల్లినుడికారము సెల్లఁగఁ జేయనై జగ
ద్వినుతజగర్లపూడికుల వేంకటరామయ జానకమ్మయుం
గనినకొమార్త సీతమను గైకొని పెండిలియాడె వేడుకన్. 74

ఉ. సీతమతల్లి జానకమ చేసినపాటలు గద్య పద్యముల్
ఖ్యాతికి నెక్కె దేశములయం దిపు డాకవయిత్రిపుత్రియై
ప్రీతి నెసంగుసీతమ కవిత్వము నాఁ గవికావ్య మన్నఁ దాఁ
జేతమునందు సంతసముఁ జేయుచు నుండు నటంట కబ్రమే. 75

క. సీతమ సీతమ కెనయై
భూతలమునఁ బేరు గాంచి పురుషోత్తముఁ డగ
ఖ్యాతిం గొనుశివరాముని
ప్రీతికి నగుచుండు ననుట వింతయె తెలియన్. 76

సీ. అత్తకుఁ భర్తకు నడ్డాడ నెఱుఁగదు
నో రెత్తి మాటాడ నేర దెపుడు
పరపురుషుం డడ్డుపడిన మో మెత్తదు
పనివాండ్రపై నింత పదరఁ జనదు

తనబిడ్డ పెఱబిడ్డ యనుమతిం జేయదు
కలదాన నం చెప గర్వపడదు
పొరుగింటి కెన్నఁడు పోయి యెఱుంగదు
పరుషవాక్యంబులు పలుకఁ బోదు

తే. ధుమధుమలు మోమునం దెప్పు తొలఁకనీదు
శత్రుమిత్రవిభేదంబు సలుప దెడఁద
నన్నత మెఱుఁగదు సైనభక్తిని విడువదు
ఖ్యాతసద్గుణనికురుంబ సీతమాంబ. 77

క. శివరాముఁ డామెవలనన్
సవ తెఱుఁగనిగరిమఁ గనియె జయశంకరునిన్
శివకామసుందరాఖ్యని
శివకాముఁడ యైన కులంబు శ్రీ వెలయంగన్. 78

తే. అద్దెపవిరామచంద్రున కాత్మజాత
యయ్య శ్రీసూర్యనారాయణాఖ్యున కభి
మానసుత యగువరలక్ష్మిఁ బెండ్లి
యాడి జయశంకరుఁడు పొల్చు నవనియందు. 79

సీ. కలనైన నన్యతంబు పలుకఁ బూనుట లేదు
లేదు లే దనుమాట లేనె లేదు
తెగనాడుదాయనే దగుల నాడుట లేదు
లేదు లే దనుబుద్ధి లేనె లేదు
యెరులబాధలు చూచి యూరకుండుట లేదు
లేదు లే దనుచింత లేనె లేదు
నిజకులోచితకర్మనియతి మీఱుట లేదు
లేదు లే దనువిద్య లేనె లేదు

తే. సన్నుతాచారనిరతుఁడై శాంతుఁడై ద
యాళుఁడై శ్రుతిప్రియుఁడై సమస్తగుణ
సాంద్రుఁడై విప్రచంద్రుఁడై జగతి నిపుడె
సంగు తూములూర్యన్వయత్సోసురునకు. 80

ఉ. పండితతత్పరుండు కవివాక్యసమంచితచిత్తవృత్తి మా
ర్తండసమోజుఁ డైనశివరామయ రేపును మాపుఁ బంక్తి లో
నుండి భుజింపఁగా నతిథు లొప్పుగ షడ్రసభోజనం బిడున్
దండిగ నర్థ మిచ్చు నిరతంబు నుతింపఁగ రాదె వానినిన్! 81

సీ. ఎంతకాలంబు దిగ్దంతిసంతతితోడఁ
దిరమై వసుంధర పరఁగుచుండు
నెంతకాలమ్ము తారేశదినేశాది
ముఖ్యగ్రహంబులు పొనరుచుండు
నెంతకాలము ప్రజాసృష్టి చేయుచుఁ బర
మేష్ఠి నిశ్చలతమై మెలఁగుచుండు
నెంతకాలమ్ము దేవేంద్రాదిదేవతా
వారంబు నిచ్చమై వఱలుచుండు

తే. అంతదాఁకను దూములూర్యన్వవాయ
వార్ధిచంద్రుఁడు శివరామపండితేంద్రుఁ
డాయురారోగ్యపుత్రపౌత్రాభివృద్ధిఁ
దనరు చుండెడుఁ గాత భూతలమునందు 82

షష్ఠ్యంతములు.

క. ఏతాదృగ్విధవిభవ,ఖ్యాతమహీసురవరాన్వయాంబుధిరాకా
శీతఘృణికి రమణాంబా,పూతోదరశుక్తిసక్తముక్తామణికిన్. 83

క. పాత్రునకున్ శివకామయ,పుత్రునకున్ సర్వదేశబుధమిత్రునకున్
సూత్రజ్ఞానవినిర్జిత,శత్రునకున్ సూరివినుతచారిత్రునకున్. 84

క. శ్రీమహితోన్నతసుగుణ,స్తోమునకున్ లోకవినుతశుభనామునకున్
సోమేశ్వరార్చనాత్త,క్షేమునకున్ దూములూరిశివరామునకున్. 85

వ. అభ్యుదయపరంపరాభివృద్ధియగున ట్లాశీర్వదించి. 86

క. శ్రీమత్కాశీనగరీ,ధామునకున్ విధృతశుభ్రధామునకు మహో
ద్దామున కనంతసన్నుత,నామున కగజాతికామునకు సోమునకున్. 87

వ. సమర్పణంబుగానాయొనర్పంబూనిన నైషధీయచరితం బనుమహా
ప్రబంధంబునకుఁ గథాక్రమం బెట్టిదనిన. 88

## కథాప్రారంభము.

చ. వెలయఁగ వేయిశీర్షములు వేయిపదంబులు వేయికన్నులుం
గలిగి విరాట్స్వరూపము జగంబుల నించి సృజించి పెంచుచుఁ
విలయ మొనర్చుచు న్వెలుఁగువేల్పు నిరంజన నిర్వికల్ప ని
శ్చల నిరుపద్రవాఖ్యల నెసంగెడు దేవుఁడు మమ్ముఁ బ్రోచుతన్. 89

ఖ. దేవా! దివ్యచిత్తంబున నవధరింపుము. 90

ఉ. ఆతతపుణ్యగణ్యము మహర్షిశరణ్యము నైమిశాఖ్య వి
ఖ్యాత మరణ్య మందు ద్విజులందఱు పొందుగ దీర్ఘసత్రముఁ
బ్రీతి నొనర్చుచుండ విని వేడుకఁ జూడఁగ వచ్చి పోవుచుఁ
సూతుఁడు శౌనకాదిమునిసోముల కిట్లని చెప్పె నొప్పుగన్. 91

మ. ధృతరాష్ట్రాత్మజు లెంతయుఁ గుటిలవృత్తిఁ గైతవద్యూత మొం
డతిదౌష్ట్యంబునఁ బన్ని పాండవుల నుద్దాడించి యొ డ్డంది పో
కితివృత్తం బది వో వనుల్ సనఁగ వాఁ డీ వారు విప్రాళితో
సతితోఁ గామ్యకకాననంబుఁ జని వాసు బున్న కాలంబునన్. 92

సీ. పండఁ బాఱినమేన బసుమంబునిగనిగల్
మెఱసి కన్నులు మిఱుమిట్లు గొలుపఁ
బల్లవారుణజటాపటలంబు భరముగా
నేలపై జీరాడి వ్రేలుచుండ
మెడను జందెములతో మెలికలు గొనుభద్ర
రుద్రాక్షమాలలు రూఢిమెఱయఁ
గుశపవిత్రము గేలఁ గొమరొప్ప సాంగకృ
ష్ణాజిన మొకచక్కి నతిశయిల్లఁ

తే. గేల దండకమండలుల్ గ్రాలుచుండ
శిష్యులకు వేదశిఖలను జెప్పికొనుచు
మహిమ బృహదశ్వుఁడనియెడు మౌనివరుఁడు
లీలఁ జనుదెంచె ధర్మజుపాలి కపుడు. 93

క. వచ్చినమునిఁ గని ధర్మజుఁ, డిచ్చో విచ్చేయుఁ డనుచు నెన్నికపీఠం
బిచ్చి సపర్యలచేఁ బొర,పొచ్చెము లేకుండఁ గొలిచి పొనరినభక్తిన్.

క. మునివర! భవదాగమనం
బునఁజేసి సమస్తతాపము లడంగెను నే
ఘనతపమును మునుబొమున
నొనరుతునో మిమ్ముఁ జూడ నొప్పెను నాకున్. 95

క. నేను గృతార్థుఁడ నైతిని
నానోము ఫలించె నేఁడు నాకుల మెల్లన్
మానుగఁ బావన మయ్యెన్
మానీంద్ర! భవత్సమాగమంబు గలుగుటన్. 96

ఉ. నావుడు మౌనిజేఁడు యమనంబను గన్గొని యిట్లు పల్కె నో
దేవసమానవైభవ! యుధిష్ఠిర! తమ్ములు పుత్ర లాప్తులన్
సేవకవర్గమున్ సుఖముఁ జెందునె? ద్రౌపదికిన్ శుభంబె? నీ
భావము దేవతార్చనలఁ బట్టి చలింపక యుండునే కదా? 97

క. అవరజు లెప్పుడు నిన్నుం
దవిలి భజింతురు కదయ్య దాయలయావ
ల్లివి కాకుండునె? షడరుల
దవుదవులం ద్రోలితయ్య! ధర్మతనూజా. 98

క. అనవుడు ధర్మజుఁ డిట్లను
మునివర! సామ్రాజ్య మెడలఁ బులులే జతగా
వనుల మెలంగెడు నే నే
మని కుశలము దెల్పువాఁడ నార్యులకెలనన్. 99

క. శ్రీ విడిచి సకలసుఖములఁ
బోవిడిచి మృగాలిఁ గూడి మొగిఁ గారడవిన్
మావలెఁ గుతిలం గుడిచిన
భూవరు లెవ రైనఁ గలరె మును మునినాథా. 100

వ. అని మఱియు ననేకవిధంబులం బలుకుచున్న పాండవాగ్రజుం గాంచి
బృహదశ్వుం డిట్లనియె. 101

ఉ. దేవసవృత్తులై బహులతేజమునం దగు భ్రాతృవర్యులున్
భావనచిత్తమైన సతి బ్రహ్మసమానులు బ్రాహ్మణోత్తముల్
భూవర! నీకుఁ దోడుపడ భూరిరథంబులతోఁ భటాలితోఁ
నీ వరుదెంచి యుంటివి వనిఁ విభవం బది విస్తరిల్లఁగన్. 102

చ. అరయఁగఁ బెద్ద గా దిది నరాధిప, తొల్లి నలుండు నా మహీ
వరుఁడు దురోదరంబునను వైభవ మంతయు నోడి కాంతతో
గురుతర కాననంబులను గ్రుమ్మరె ముమ్మర మైనకస్తి కా
కరుఁ డయి యొక్కరుండ యయి కారుమెకంబుల తోడు నీడ యై. 103

ఆ. అనిన ధర్మతనయుఁ డమ్మునిఁ గని యిట్లు
పడిన నలమహీశు కడిఁదిచరిత
వినఁగ వలతుఁ దెలుపవే మునివర! యన
నాతఁ డతని కిట్టు లనియెఁ బ్రీతి. 104

## నిషధపురవర్ణనము.

మ. ధరణీమండలమండనంబు త్రిజగద్వర్ణ్యప్రభావంబు భా
స్వరతేజోవిభవాఢ్య మై నిషధదేశం బొప్పు నద్దేశమం
దను దారఁ నిషధాఖ్యపత్తనము దివ్యప్రాభవోపేత మై
పరఁగున్ భారతవర్షమధ్యమున భాస్వద్వంశరాట్థానమై. 105

ఉ. అప్పురికోటకొమ్మలకు నల్లినవజ్రపుటాలతాఁకునఁ
ముప్పిరి వోయి తే జఱి నభోమణి తాఁ బదిరెండు ప్రక్కలై
యప్పటినుండి త్రుళ్లడఁగి యట్టిటుగా నటఁ బోవుఁ గానిచో
నొప్పునె ద్వాదశాత్మతయు నుత్తరదక్షిణదిగ్గతం బిలన్. 106

తే. గోపురము నాపు నాపురగోపురములఁ
జెలఁగు సౌవర్ణసాలభంజికలు ప్రోలి
మేలు సింగారమును జూచి మేను మఱచి
మ్రానువడియున్న యచ్చరచాన లనఁగ. 107

చ. మగఁ డగునయ్యపాంపతిక్రమంబున గ్లో యుదయించు నెప్పుడుఁ
గగనతరంగిణీమణి ప్రకాశిలి తత్పురసౌధకుట్టిమ

స్థగితవిధూపలస్రవదదభ్రపయస్తతయై పతివ్రతా
త్వగరిమ నెల్ల వారలును వర్ణన మూనఁగ మూన కుండెడున్. 108

తే. అలరుఁ బురిసోమసూర్యవీథుల నటు నిటుఁ
దురగరథహస్తిపత్తులు దిరుగ నెపుడు
నిలిచి శ్రీపురుషోత్తముల్ నిజబలమున
లీల నాడెడుచతురంగపాళి యనఁగ. 109

సీ. మగఱాల నగుకుట్టిమంబులరాజులు
నెలఱాలు వెండిరాసు లవి యొకటఁ
నిగనిగలాడెడు నీలంపుమాడుగుల్
నీలాలప్రోవులచాలు లొకటఁ
బచ్చలఁ జెక్కుసుప్పరిగలపంక్తులు
గొనబుమేల్జాళువాగుట్ట లొకటఁ
గొలచులునార్కెడంబులు కప్రపనటులు
కెంపుడాల్చక్కరకేళు లొకట

తే. వెలయ నొగి సూత్రపట్టినవీథు లలరఁ
బ్రోలు గని తొల్లి పద్మనాభుండు పంట
నాతిఁ బెండ్లియాడెడుతఱి నాగవల్లి
ప్రో లని చెలంగుచుండ్రు జేజేలు చదల. 110

మ. పానర్త రాజనముల్ పయస్సులను నెప్డు బెంచునయ్యోళులం
దనిశక్రీడలు సల్పుస్త్రీలకు నొడళ్లం దాసుగంధంబు వీఁ
గి నదీతోయములందుఁ గల్వలకు నాగెం గాన సౌగంధికా
ఖ్యను బెంపొందెను గల్వ లట్లు లగు సత్సాంగత్య మెవ్వారికిన్.

చ. వదనములన్ సరస్వతి ప్రవర్తిలఁగాఁ జతురాస్యులై జగ
ద్విదితకలాకలాపవిశదీకృతగర్భులు నై మఖక్రియా
స్పదవిధుల న్విధాత లయి భాస్వరులై విబుధాగ్రగణ్య లై
పొదలెద రందు బ్రాహ్మణులు పోల్పఁగ మాఱుట బ్రహ్మలో యనన్.

ఉ. రాజులు, సర్వదా త్తకవిరాజులు, సర్వదిశోల్లసద్యశో
రాజులు, శౌర్యసారమృగరాజులు, కోమలకాంతియామినీ
రాజులు, సుందరాంగరతిరాజులు, విత్తజితో త్తరాహరి
ద్రాజులు, వైభవో క్తసురరాజులు, రాజిలుచుందు రప్పురిన్. 113

ఉ. శ్రీదునియత్నసంపునవశేవధులుం గణియించి చూచినన్
మాచగుసొమ్మునం గడకు మూసపువడ్డికిఁ జాల దంచు రా
మోదము వీటివైశ్యజనముఖ్యుల కొల్లలఁ జిందురత్నములో
పాదుకొనంగ మేదినికి వచ్చెను నామము రత్నగర్భనాన్. 114

చ. అతులితగోత్రతేజులు జనార్దనపాదజరాజు లప్పురి
న్నుత లమరావతిం దొరయ నూఱేచి పోసినథాన్యరాసులన్
సత మగులోకపుంగఱవు సల్ల సురాళియు వారి కెల్లసు
స్థితు లిడుఁ బ్రేమఁ బ్రత్యుపకృతిం గృతి సేయక మిన్న కుండునే.115

శా. బ్రహ్మణ్యుల్ బహుశూరు లక్షయధనుల్ ప్రాంచద్ధలశ్రీయుతుల్
బ్రహ్మక్ష భార్గవు నర్థనాథు బలినిఁ బొటింప కర్థిం బర
బ్రహ్మం బెంచి శరంబు లూని కృతులఁ వర్ధించి పై రెవ్వెట్టి యా
బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రజనముల్ భాసిల్లుచుం డ్రప్పురిన్. 116

సీ. చందురుఁ గరఁగించి కందు వేనలియందు
వేసి నెమ్మోముల వెలయఁ జేసి
చిందంబులను నల్చి యందలితెలె నవ్వ
లం దిడి గొంతు లింపొంద సలిపి
తమ్మిమొగ్గలు నేర్చి కమ్మతేనెలు వాకు
లం బూన్చి చన్నవ లింబుపఱిచి
మించుల జతకూర్చి చంచలత్వము చూపు
లందుంచి మేనుల నాచరించి

తే. బమ్మ యవ్వీఁటికొమ్మల నెమ్మిఁజేసి
పురుగుగొఱికినకట్టి నక్కర మొకండు
దేలు నటు లచ్చిచేత యాదృచ్ఛికంబ
యనెడు రట్టును బోఁగొట్టుకొనియె నపుడు. 117

సీ. గల్లుగల్లున నందెకాళుల నటియింపఁ
బరమహంసలమదుల్ పల్లటిల్లుఁ
దేనె లుట్టిపడంగ మానుగఁ బల్కిన
శుకముఖద్విజకోటి చుట్టువాఱు
మో ల్లిగురింపఁ బెంపుగఁ బాడఁ బవనాశ
నావళి ప్రకటభోగాప్తిఁ దనరుఁ
దులకించునునువ్వునెలమోముఁ జూప ను
త్తమచక్రములకుఁ దత్తరము వొడము

తే. జిలుగుఁబావడ ధరియించి చలువపైఁట
నీటువలెవాటుగాఁ గొని వీటినోటి
రాగసురభికి సరసాళి మూఁగి రాఁగ
వీట నడతురు సందెల నాటచెలులు. 118

తే. అచటి భట నటికా రథ హస్తి తురగ
ధేనువృషభాపగావనుల్ తేజరిల్లు
నశనిరంభాసుమేరునీలాద్రివాయు
నందినీనంద్యమృతనందనములఁ దెగడి. 119

వ. మఱియు నప్పుటభేదనంబు పుటభేదనభేదకశిరోభూషణ చిరత్నరత్న నిబద్ధశుద్ధకుట్టిమాంచితాష్టాపదపదవిశదసౌధతలఖేలనపరబాలామణీ గాననిర్యదిందూపల జలప్రవాహతుందిలకాసారనీరప్రవృద్ధ శాలి విశేషక్షేత్ర సహస్రపత్రవన సంచరత్కలహంస వలాహకాది నానా విహంగమ కోలాహల బిభ్యత్పాలికాబిబ్బోకవతీ స్వయంగ్రహణా శ్లేషణ సంలోషిత పాంథ జనసంస్తవరవబధిరీ భూతరాజమార్గోభయ పార్శ్వవర్ధిత రసాలసాలపుష్పమరంద తుందిలేందిందిర బృంద దర్శ నాభ్ర భ్రమనటత్కేకికేకారవాక్రాంతంబై కరంబు డంబుమీఱు.

క. అప్పుటభేదనరాజము
దప్పక సిరు లీన రాజధానిగఁ గొని తా
నొప్పగుచొప్పున నేలుచు
నెప్పుడు నలచక్రవర్తి నృపుఁడై తనరున్. 121

## నలరాజవర్ణనము.

సుగంధి. శూరుఁ డశ్వకోవిదుండు శోభనాంగుఁ డుత్తమా
చారసంయుతుండు సాధుసమ్మతుండు సత్యవా
క్సారభూషణుండు నిత్యకర్మఠుండు భూమిభృ
ద్వారవందితుండు భూరివాహినీశుఁ డారయన్. 122

కం. సత్సంతతుల నిల్పుజై వాతృకుఁడు సర్వ
చక్రంబులను నేలుసత్ప్రభుండు
దోషాకరుఁడు గానియోషధీశుం డెప్పు
సన్నగింపనికళాశస్తమూర్తి
యకలంకుఁ డైశమహావిధుం డెందు ని
ర్ఘాటత్వ మొందనియట్టిరాజు
గురుగద మొందనికువలయమిత్రుండు
విషరాశిఁ బొడమనివిశదకీర్తి

తే. యతఁ డనఁ బిత్ర్య మైతామహ మైనరాజ్య
మును దమము నోవఁ బాలించుచును ధరిత్రి
నఖిలధర్మపరాయణుం డగుచు నైష
ధావనీనాథచంద్రుండు తేవ మీఱె. 123

ఉ. పాడియుఁ బంటయుం గలిగి బల్సిరులం దులదూఁగుచుండునా
తేఁడు జగంబునం దగుతఱిం గురియ న్నెల మూడువాన లే
గోడును లేక భూప్రజకుఁ గోరుసుఖంబులు దొప్పదోఁగఁగా
బాడిగ రాజ్య మేలుచును భాసిలుచుండె మహీతలంబునన్. 124

చ. అతనిముఖాజ్ఞమం దెపుడు నాడుచునుండెడువాణిఁ జూడఁగా
నతనునితల్లి రాఁ జపల యంచును దద్గుణకోటిఁ గట్టి న
గ్గతి గని కీర్తి భీతిపడిగా వడి సంద్రము లెల్ల దాఁటి ద్వీ
పతతులఁ జేరి చేరి మఱి పాఱుట నేఁటికి మానకుండెడున్. 125

వ. అనిన విని శౌనకాదిమహర్ష లవ్వలివృత్తాంతంబు చెప్పు మని సూతు
నడుగుటయును. 126

## ఆశ్వాసాంతము.

మ. రమణాంబాశివకామయార్యులకు విప్రవ్రాతపాదార్చనా
క్రమసంపాదితపుణ్యలేశమునఁ బ్రఖ్యాతాత్మజుండై మహో
త్తమతేజంబును గాంచి మించి ఘనుఁడై తళ్ళొక్కత్తువిద్వజ్జన
ప్రమనుఁ శ్రీశివరామనామని దయఁ రక్షింపు మోరక్షకా. 127

క. పండితలోలుని శుభవా
జ్మండను సద్వినుతవిభవు మహితమతిజితా
ఖండలగురుఁ గరుణాళు న
ఖండయశుఁ హరితగోత్రుఁ గావుము దేవా. 128

గద్యము. ఇది శ్రీమహామహోపాధ్యాయ, కలాప్రపూర్ణ, కవిరాజ, కవి సార్వభౌమ, శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రిప్రణీతం బైన నైషధీయ చరితం బనుశృంగారతరంగిణియందుఁ బ్రథమతరంగము.

శ్రీశ్రీశ్రీశ్రీ

శ్రీ ర స్తు.

# నైషధీయచరితము

## శృంగారతరంగిణి

### ద్వితీయతరంగము.

తూములూరివంశ
శ్రీతోయధిశీతకరుఁడు శివకామసుతుం
డాతతమతి శివరామ
ఖ్యాతుఁడు వర్ధిల్లుఁ గాక యభవ్యనికరుణన్. 1

వ. అక్కథకుండు శ్రీనకాదిమహామునుల కిట్లనియె నట్లు నలుండు రాజ్యపాలనంబు చేయుచున్నపదంపడి నడచినవృత్తాంతంబు చెప్పుమని పాండవాగ్రజుం డడిగిన బృహదశ్వుం డి ట్లనియె. 2

చ. వినుము నరేంద్ర, నైషధుఁడు వేల్పులు మెచ్చుగ రాజ్యపాలనం
బొనరుచునట్టికాలమున నుర్వి విదర్భయనంగ దేశముఁ
బొనరెను సర్వసంపదలు పొంపిఱిపోవ మహాభివృద్ధిమై
ఘనుఁ డట భీముఁడఁ నృపశిఖామణి రాజ్యముఁ జేయుఁ బూజ్యుఁడై. 3

దమయంతి జన్మాదికము.

చ. అతఁ డనపత్యుఁడై దమనుఁ డఁ దమని దర్శన మీయ నాతనిఁ
సతియును దాను భక్తిమెయి సంతతముఁ భజియించి మ్రొక్కఁ న
య్యతియుఁ బ్రసన్నుఁడై వ్రతము లానతియిచ్చి వరం బొసంగె నా
వ్రతమహిమంబునఁ దమనవాక్పతిభాస్వదనుగ్రహంబునన్. 4

క. దమయంతి యనెడుకూఁతురు
దముఁడును దాంతుండు వెనుక దమనుం డనునా

మము లలరఁ బొదలుకొడుకులు
క్రమమున నుదయించి రెల్లప్రజలు నుతింపన్. 5

వ. వారిలోఁ గన్యారత్న మగుదమయంతి యుదయించిన కాలంబున. 6

ఉ. చల్లఁగ గాలి వీఁచెను బ్రసన్నము లయ్యె దిశాముఖంబు లు
త్ఫుల్లము లయ్యెఁ బద్మవనముల్ నభ మెల్ల మనోజ్ఞ మయ్యె రే
యెల్లను నిర్మలుం డగుచు నిందుఁడు దోఁచెను భూతలంబునం
దెల్లశుభంబులుం బ్రబలె నేలికకుఁ సుత గల్గున త్తఱిన్. 7

క. లోకం బంతయు నెంతయు
శోకం బొలుపొందుచుండె క్షోణీశ్వరుఁడున్
వాకొనఁగ రానిసంతస
మాకాలమునందుఁ బొం దె నతివయుఁ దానున్. 8

క. జననాథాగ్రణి యంతఁ
ధనములు ధాన్యములు భూషణంబులు మిగులఁ
ఘనులకు విప్రులకును గల
జనముల కిడె జాతకర్మసమయమునందున్. 9

మ. దొరయాజ్ఞఁ సతతంబు దాదు లట సందుం గిందునుం గొట్టకుం
డ రహిఁ బాయక కన్ను దీసికొని నానారీతులఁ జూచుచుఁ
బురిటిల్ గాచుచుఁ బోతుటీఁగయును లోఁ బో సక్కెముం గానియ
ట్లరుదారం బసిబిడ్డఁ బ్రోచుచు సదీహం ద్రోచి రానా ళ్లొగిన్. 10

క. తలిదండ్రులకుం బ్రజలకుఁ, గళమై నల్లారుముద్దుగానల రెడునా
యెలనాఁగ శుక్లపక్షపు, నెలనా నభివృద్ధి గాంచె నెఱి నానాఁటన్.

సీ. చిడిముడినడకల చిన్నె లన్నియు నేర్చెఁ
బ్రోదిరాయంచలపొందువలన
జిలిబిలిపలుకులతళుకు లన్నియు నేర్చెఁ
బెనుచురాచిలుకలపిండువలన
నడరెడుఫాటలహర్షున్న లన్నియు నేర్చెఁ
బొదల నల్లాడుతుమ్మెదలవలనఁ

జిటిచిటినటనలసిరు లన్నియును నేర్చెఁ
దడికాఁనెమ్ముల దడమువలన

తే. నిట్టులారాజపుత్రిక పుట్టి నేర్చె
నొక్కొ-- పుట్టక నేర్చె నొక్కొ-- యటంచు
జనులు నుతియించువడువున సకలధర్మ
ములను నేర్చెను దనుదాన పొలుపు మీఱ. 12

తే. కొడుకు లనుచును మఱి తమకూఁతు లనుచు
జాళువాబొమ్మలకుఁ బెండ్లి సలిపి తోడి
చెలులు వియ్యపురాం డ్రని చెలిమిఁ బిలుచు
కొనుచు నెప్పుడు గుజ్జెనగూళ్లు బెట్టి. 13

తే. గుడుగుడుంగుంచములు, చిళ్లి, కుందనగిరి
కాళ్లగజ్జెలు, చిపచిప్పగోళ్లు, వాన
లప్ప, చెమచెక్క--, వెన్నెలకుప్పలు మొద
లైనమేలాట లాడెడు నపుడు బాల. 14

ఉ ధ్వాఁగురుమూఁత లాడు మని దాదులు బోధలు చేసి బాలలఁ
దాఁగ నొనర్చి దాఁగు మని తన్ను బలాత్కృతి నేయ వారితో
నీగతి నేర్వఁగాఁ దగునె యిప్పుడు నేర్చిన దప్పు డబ్బెడుఁ
గాఁగల దిం దనీతి యని కన్నియ చూపెడు మోసరూపమున్. 15

క. నీతికి వెలి యని తోఁచిన
వై తగునడవళ్లి నాటలాడెడునపు డా
భూతలనాథునిబాలిక
చేతమునం దలఁప దయ్యెఁ జిత్రము గాఁగన్. 16

క. ఈరీతిని బాల్యంబునఁ, గోరికలిగురొ త్త మనుజకోటికి ముద్దౌ
కూరిమికూఁతుం గళల వి,శారదఁ జేయించె దండ్రి శాస్త్రజ్ఞులచేన్.

తే. ఘనుఁడు ప్రత్యగ్రు డగునధికారి యలఁతిఁ
బ్రతనుఁ బరివృఢు గెలిచి తద్వాసమైన

పదవి నాక్రమించె నన నప్పడఁతిదేహా
మునను బాల్యంబు జాఱి యౌవనము మీఱె. 18

దమయంతి సౌందర్యాభివర్ణనము.

క. నవయౌవనంబుచేతఁ
సువిభక్తం బగుమృగాక్షిసుందరదేహం
బు విభాకరకరవికసిత
మవువనరుహ మట్లు తనరె నతికోమలమై. 19

తే. జానుగుల శ్రీల్ పిఱుందుల దా నడుమున
ళానుదుటఁ గ్రార పొక్కిటిలోన బొట్టు
ఘ్రాణమున నొత్తు కేల దీర్ఘములు దోప
రమణి బుధు లెంతు రఱుర బ్రహ్మ మనుచు. 20

సీ. కచకుచోరునితంబకమ్ములు గురువులు
లఘువులు తుందావలగ్నములు గ
కాలునేతులు నాస వ్రేళ్ళులు లఘురేఖ
లలఘురేఖలు కన్బొమలు నుదురు గ
నగములు పాలింట్లు నలము వేనలి నఖ
రంబులు శ్రీభగణంబులు గను
కన్ను లుత్పలమాలికలు గతిజంఘలు
మత్తేభశాలినీవృత్తములు గ

తే. ఆరు వేణియుఁ బదము లొప్పారునాగ
ఖడ్గపద్మబంధములుగాఁ గలితచంప
కాదిమాలికాగర్భచిత్రాంగ మలర
సకియఁ గవు లెంత్రు లక్షణశాస్త్ర మనుచు. 21

తే. నడుము మాయ కేదారము నాభి కుచయు
గమ్ము శ్రీగిరి కూర్మము కాళ్లమీఁదు
మోవి మధురాంక మని కాంచి పువ్వుఁబోఁడిఁ
దైర్థికులు వలంచెదరు తీర్థచయ మనుచు. 22

వ. ఇట్లు ప్రత్యగ్రామూల్య యౌవనాలంకారాలంకృత యై మదన దేవతామోహనమంత్రశక్తి యనం బొల్చి చూపఱుమనంబు చూఱ లాడుచు. 23

మ. ఉరమున మోయుఁగ నేటవాలుగను వామోత్తుంగకాంసంబుపై
శిరమున నిల్పి యిత స్తతశ్చలనముం జేయించుచున్ హస్తముల్
సరిగాదిస్వరసంవిధానమున నాలాపంబు రాగంబులన్
బరఁగ న్మంగళగీతముల్ గరిత దా వాయించు జంత్రంబునన్. 24

మ. చతురత్వంబున రక్తి నుక్త మొద లాషడ్వింశతిచ్ఛందముల్
ప్రతివారంబును బ్రస్తరించి తెలియఁ భావించి వృత్తాకృతుల్
సతి సాహిత్యము మేలు మే లని కవుల్ వర్ణింప సర్వేశ్వరుం
బ్రతిపాదించుప్రబంధముల్ సలిపెడిఁ బద్యాస్య పద్యాస్య నాన్. 25

చ. గరితలు చుట్టువాఱుకొనఁగాఁ గొని కేలఁ బురాణ మొండు నీ
శ్వరుని గణేశునిం బలుకుచానను వేఁడి యనంతరంబ భూ
సురముఖవర్ణధర్మములు సూర్యముఖామరసర్గముఁ జగ
త్సరణియు సజ్జనాళిచరితంబుఁ బఠించి వచించు నెప్పుడున్. 26

వ. ఇ॥ట్లెల్లవారికి నెల్లవిధంబుల నల్లారుముద్దుగా నెసంగునాదమయంతి దయాసత్యశౌచనిరతయు గురుజనభక్తిభరితయు నై నిరువేదల నాదరించుచు దిక్కుమాలినవారి కొక్కలాగున దిక్కుం గల్పించి పోషించుచు జంగమస్థావరాత్మప్రపంచంబునకుఁ బరమేశ్వరుం డొక్కరుండ నైవంబును రక్షకుండు నని తలంచుచుఁ గలనైనం గలుషం బులం బొరయక సకలజనసంస్తవనీయచరిత్రయై వర్తించుచు గుణ వయోరూపలక్షణంబులం దన కనుగుణుం డగు జీవితేశ్వరుం డెవ్వ లనం బడయఁ గలుగునో యని వితర్కించుచుండె నంత. 27

దమయంతి నలుని వరించుట.

ఉ. కూరిమి నమ్మహీపతియుఁ గూఁతుఁ గనుంగొని పెంపుఁజెందుసిం
గారము యోగ్యవర్తనము కాఁగలబుద్ధియు యౌవనంబు చే
కూరినరాజపుత్త్రు ననుకూలుని వల్లభు నీమె కెందు నే
నారసి కూర్తు నంచు జగ మంతయుఁ గన్గొనఁ జారదృష్టిచేన్. 28

చ. దినదిన మాసతీమణి ధృతిక్ స్తుతిపాఠకవేళలందుఁ దం
డ్రినిఁ గొలువంగ నేగి యట నేర్పున వేల్పుల నేలదాల్పులక్
గొనకొని వందు లెన్నవిని కోరిక లీరిక లెత్త సత్యసం
ధుని నలు డెందమందుఁ బరితోషమునొందుచు నిల్వఁ బొల్పుగన్.

శా. అన్యోన్యంబు కథానుషంగములయం దాసక్తిమై నెచ్చెలుల్
ధన్యుండే నిషధవ్రతుండె యనుచుం దా మేరినో చెప్పుకో
నన్యం బెమియు నొల్లకుండి యదియే యాలించి పోలింప న
క్కన్యారత్నము దోరవెట్టుఁ జెలులం గౌతూహలం బేర్పడన్. 30

మ. చెలి దేశాగతవందిమాగధముఖశ్లేష్మోత్తులక్ వ్యాజముం
గలుగం జేసియె నైషధీయగుణముల్ గారంబుగాఁ గోరి వా
రలు చెప్ప న్వినె యెప్డు వానిన మనోరాజీవమం దుంచి ని
క్కలగాఁ దక్కథలం గలట్టిగుణముల్ గాటంబు వర్ణించెడున్. 31

మ. పుడమిక్ శూరుఁడు శూరసేనసుతుఁ డై పొల్పొందునారాజపు
త్రుఁడె ప్రాణేశ్వరుఁ డైన నావిభవ మెందుం జెప్పఁగా శక్యమే
నడుమ న్నా కతికష్ట మైన సుఖ మైన న్వానితో లోక మా
నడవుల్ వీడులు నొక్కరూప కద నా కాతండు నే నుండినన్. 32

మ. అతనిం గాక మఱెవ్వనిం గనఁగ నే నాశింపఁ దత్కార్యమం
దితరుల్ విఘ్నము సేయఁ బూనినను లో నింతేని శంకింప నే
నతఁడుం గూడిన నెవ్వరిక్ సరకుసేయం బ్రాణముల్ దీయ నా
గతమై యుండినకాలసర్ప మెదురంగా నోడ నొక్కింతయున్. 33

క. నాకాయ మతని కప్పన
గా కొరులకుఁ గాదు నాకుఁ గలసౌఖ్యంబుల్
వాకొనియెద నతఁడే యని
లోకమునం దైవ మతఁడె లోఁ దలపోయన్. 34

క. ఈరీతిఁ దనమనమ్మున
నారాజకుమారు నునిచి యతిమోదమునన్

నారీమణి యుండియు నది
యేరికి నెఱిఁగింప దయ్యె నెంతయు లజ్జన్. 35

వ. ఇట్లు కాంక్షామందాక్షబద్ధాంతరంగ యగునాదమయంతి సర్వకాలంబుల సర్వావస్థల సర్వభావంబుల సర్వనరేశ్వరేశ్వరుం డగునైషధేశ్వరుండె ప్రాణేశ్వరుం డని భావించి లో నేవించుచుఁ దదేకధ్యానంబుగాఁ బ్రవర్తించుచుండె నక్కాలంబున. 36

[1]చ. నలుగడఁ గమ్మవాసనలు నల్వికొనెన్ సన లొప్పెఁ దీవకూ
నలు నలువొందె నంగనలు నానలు వీడి గతాభిమానలున్
లలనలు నై మనోహరులలాలనలున్ నయగారము ల్గొనన్
గలిగి తదీయయాచనలు గైకొని యైకొనుఁడుండ్రు పయ్యెదన్. 37

క. అని చెలులు వసంతము నన
ననబోఁడి సమాదరంబున న్వని డెందం
బునఁ బ్రత్యయంబు గలిగిన
దనప్రియునియభిఖ్య యనుచుఁ దద్దయు నలరన్. 38

[2]క. ఇలపై న నలుఁడు దీప్తిన్
వెలుఁగుచుఁ దమయంతిపురికి వేడిమి గూర్పం
గలఁ డనెడుచెలులఁ గిరుకన్
దిలకించుచునుండు నామె దిగు లొందు మదిన్. 39

వ. ఇట్లు భీమరాజనందన తనమనోరాజీవంబున నైషధావనీనాథుం దిలకించుచుఁ గాలంబు గడపుచుండె. 40

---

1 ఇట్లు చెలులు వసంతము నభివర్ణించుచుండఁగా నిందు నలుగడాదులలో నుండు "నలు" అనునక్షరద్వయము ప్రియునినామం బని దమయంతి సంతసించె నని;

2 ఇలపై న నలుఁ డనుచో ననలుఁడనియు, నలుఁ డనియు నర్థద్వయము వచ్చును. చెలఁగుచుఁ దమయంతిపురికి యనుచో ద్రుతముపై తకారమునకు దకారముగాఁగా "నలుఁడు దమయంతిపురికి" అని భావించి వేడిమి గూర్చు ననుటచే దిగులొందె నని భావము.

## వసంతర్తువర్ణనము.

లయగ్రాహి. అంతట వసంతము నిరంతరశకుంతరుత
తాంత మతికాంతమని తాంతకృతపాంథ
శ్రాంతము కృతాంతదిగుపాంతమలయాంతరని
శాంతభవ సంతతముశాంతతరవాతా
క్రాంత మతిశాంతహిమవంతము వనాంతతరు
కాంత మలకంతునకు సంతసము సింధు
క్లాంతము పొలంతులకుఁ గాంతిద మనంతగుణ
వంత మొగిరంతు గొనె నెంతయు ననంతన్. 41

మ. చిరకాలాప్తవనాంగనావిరహాముం జిత్తంబునఁ నైషధే
కురుసంతాపమును న్వెలార్చుటకు నై యొండొక్కచో నుండి స
త్వ్వరుఁడై సర్వవరూధినీసహితుఁడై ప్రద్యుమ్నుఁడుం దోడు రా
సరగ మాధవుఁ డేగుదెంచి కలిసెఁ క్రొమ్మండలం బంతటన్. 42

సీ. మావివూఁదేనెల మత్తిల్లి యలిగాయ
కాళి సుస్వరముల నోలిఁ బాడె
శుకశారికాదిసచ్ఛకునసంతానవై
తాళికాళి ఘనశబ్దములఁ బలికెఁ
జివు రాని జివ గల్గి చిరరవంబున వన
ప్రియకోటి కాహళ ప్రీతిఁ బట్టె
తెక్క లల్లార్చుచు నొక్కొటఁ గొలకుల
హంసకాంతాళి నాట్యంబులాడె

తే. నట్టియామని సంతస మావహిల్ల
మన్మథోత్సాహజనకుండు మాధవుండు
సొగసులకు నెల్లఁ దానక మగుచు నెపుడు
వెలయుచున్నట్టివనలక్ష్మిఁ బెండ్లియాడె. 43

ఉ. కమ్మనిమావివూవులను గాలువ గట్టెడుతేనె లాని జుం
జుమ్మని తేండ్లు పాడెఁ గడుసొం పలరార నిగుళ్లు మేసి కో

కొమ్మని గండుఁగోయిలలు గూసెను జిల్కలు గోరువంకలుఁ
ముమ్మర మైనపండ్లు దిని మొత్తముగా వగఁ బల్కఁ నత్తఱిన్. 44

చ. గమగమలాడుతావిఁ గడుఁ గ్రమ్మెడుపున్నుజవాది పచ్చక
ర్పూరము నునుపచ్చనాఁకుఁబొడి పచ్చికచూరము మల్లెయత్త ర
ట్టడమరుపసిండిగిండి నిడి యంపిగఁ జేసినమంచిచల్వగం
దము మెయినిండ నొండొరులు దాలిచి పొల్చెద రాల్మగ ల్లొగిన్.

మ. చలువ ల్గ్రిమ్మెడుతీవపందిరులపజ్జఁ జాజిపూఁదోటలో
మలెపూఁబొన్పునఁ బండి యాలు మగఁడుఁ మైహాయిమైఁదేల్చుచుఁ
లలి నేతెంచెడిలేతపయ్యరను రే ల్పాటించుచుఁ నిచ్చలుఁ
వలరావానిదురంబునఁ వలఁతు లై నల్వొంది రయ్యామనిన్. 46

చ. మెలిగొని యొండొకొం డొరయ మిక్కిలిచిక్కఁగ నున్నమావితోఁ
పుల నలపోక మొత్తముగఁ బుల్గులు గూయఁగఁ బూవుఁదేనియల్
జలజల రాలి నేలపయిఁ జాల్కొన నెమ్ములు చూచి కారుమ
బ్బులుఱుముచుం గడుం గురియుఁ బో! యిపు డఁబమ నాడు నత్తఱిన్.

చ. పొలుపుగ నొక్కటఁ విరియఁ బూచినమల్లెపొదం గడంగి తేఁ
టిలు గలయంగ వ్రాలి యెపుడుఁ విడకుండఁగ నొప్పె నప్డు పెం
పలరఁగఁ బెండ్లియాడి యట నామనివెన్నుఁడు తోటలచ్చియుఁ
దొలిఁ గఱితాలు ముత్తెములునుం దలఁబ్రాలుగఁ గొన్నభ్రో వనన్.

క. ఆమనిఁ బొదలెడుసోయగ, మే మని చెప్పంగ వచ్చు నెంతటివారిఁ
వే మరునిబారి కగ్గల, మై మెలఁగుచుఁ గుతిలఁ గుడువ నల్లు విరాళిన్.

వ. అట్టిసోయగంబుల కెల్లఁ దానకం బగు నావసంతసమయంబున
నొక్కనాఁ డానిషధేశ్వరుం డగు నలుండు మంత్రిసామంతహిత
పురోహితభృత్యపరివారపరివృతుండై కొలువు దీరి యున్నసమయం
బున వై దేశికుం డగునొక్కకవీశ్వరుండు వచ్చి రాజు నాశీర్వదించి
విశ్రమించి యున్నయప్పు డప్పురుషమూ ర్తి దిక్కు మొగంబై ధర
ణీతలేంద్రుండు కవీంద్రా! నీ వెందుండి యెందుఁ బోవుచు నిందు
విచ్చేసితివి? నీ వేయే దేశంబుల నేమేమివిచిత్రంబు లరసితి వానతి
మ్మనిన నతం డతని కి ట్లనియె. 50

వైదేశికుండు నలునికడ దమయంతి నభివర్ణించుట.

శా. నే నాంధ్రుండఁ గవిత్వమందు మిగుల న్విఖ్యాతినిం గంటి వి
ద్యానైపుణ్యము పెంపునన్ బహుకృతుల్ తత్త్వజ్ఞు లగ్గింప సం
ధానంబుం బొనరించి నట్టికవినై తళ్కొత్తుదున్ దేశముల్
గాన న్మెట్టుచుఁ బెట్టుబెట్టు వని నిన్ గాఱించుచు న్వచ్చితిన్. 51

మ అవిముక్తంబు గయా ప్రయాగము లమోఘాఖ్యశ్రీహరిద్వారముల్
భువనేశంబును నీలశైలమును గాంభోజంబు గాశ్మీరమున్
ద్రవిడంబున్ మలయాలమున్ మధురయున్ ద్వారావతిన్ రామసే
తువు రామేశ్వర మాదిదేశముల నెంతో రక్తి సేవించితిన్. 52

సీ. దక్షిణకాశికాస్థలము నాఁబడి గౌత
మీనదియొడ్డున మెఱపడిఁ గొని
తనరుమార్కండేయమునితల్లజక్షేత్ర
మచట నమ్మునిపేర నమరియుండె
సజ్జలింగ మనంగశాసనుం డతఁడ య
య్యతిప్రాణములు గాచె యముని రాచి
యటఁ బుష్పగిరిక్రింద నమృతకుండ మగునా
జల మానువారికిఁ జావు లేదు

తే. మున్ను మును లందుఁ దపియించుచున్నయపుడు
హరుఁడు చనుదెంచి తాండవ మాడె దాన
నమృతకుండము ప్రభవించె నాప్రదేశ
మాంధ్రమాతకుఁ బుట్టిని ల్లయ్యె నధిప. 53

శా. రెండున్ మూఁడును గ్రోశములో గలిగి కీర్తింపంగ నౌ క్షేత్ర మం
దుండున్ గాశికయందుఁ బోలె మహిమం బోభూతలాధీశ, మా
ర్కండేయేశ్వరుఁ డెల్ల కాలమును భక్తవ్రాతమున్ గావఁ గ
దండన్ నిల్పుకొనెన్ బ్రభావవిలసన్నామాలు గోపాలునిన్. 54

క. ఊరికిఁ దూరుపుదిక్కునఁ
గోరిక లిడి భక్తకోటిఁ గొనియేలఁగ నై
భూరిమహత్త్వముగలదై
పేరొందున్ శ్యామలాంబ భీతిం దొలఁచుచున్. 55

శా. ఏ నాక్షేత్రమునందు గౌతమిజలం బేవేళ సేవించుచుఁ
మానీంద్రాంచితశంభులింగమును సంప్రార్థించి పూజించుచుఁ
జ్ఞానం బీఁ దగుసత్కవిత్వమునఁ బ్రజ్ఞం గాంచియుం గావ్యకృత్
స్థానంబుం గొని కొన్ని రేల్ గడపితిఁ బ్రహ్మాండలాఖండలా. 56

వ. మఱియు నంగవంగాది లెన్ని యో దేశంబులం దిరిగి చూచితి
నెందునుం దెలియఁ జెప్పంగలవిశేషం బేదియును లేదు గాని నే
నీనడుమ విదర్భాపురంబునకుం బోయియుంటి నప్పురాధీశ్వరుండు.

ఉ. భీమపరాక్రమక్రముఁడు భీముఁడు నాఁబడువాఁడు వానికిం
గోమలగాత్రి పుత్రి జనకోటికి ముద్దుగ నుద్భవించి ని
ద్దామణిరేఖయో యనుప్రథం గలదై దమయంతి నాఁగ న
న్నామముతోడ నొప్పెసఁగు నాకమృగీనయనాగ్రగణ్యయై. 58

ఉ. క్షోణితలాధినాథుఁ డలకోమలి పుట్టినకోలె నిత్యక
ళ్యాణము పచ్చతోరణమునై గృహ మెప్పఁగ నొప్పుచుండె నా
క్షోణి ధనంబు ధాన్యమును గోపులు వావురముల్ గజంబు ల
క్షీణములై ప్రజావళియుఁ గ్రిక్కిఱియం గన నొప్పు నెప్పుడున్. 59

క. పురిలోని కడుగు వెట్టిన, తరుణంబున స్వర్గపురము తత్పురమునకుఁ
సరిరా దటంచు నాకుఁ, గర మాశ్చర్యంబుతోడికౌతుక మొదవెన్.

మ. నెలతాలుఁ మగఁతాలునుం గలవడ న్నిర్మింప నింపై మహో
జ్జ్వలమై చుక్కల రాయుసౌధములపై పై భూముల న్నెట్టుకాం
తలు నాకంటికి స్వఃపురి న్నెలఁగుకాంతల్ వోలెఁ గానంగ నై
తెలుపం జాలనియంతసంతసమునం దేలించి రోభూవరా. 61

శా. ప్రాసాదోపరిభాగమందుఁ బ్రమదల్ రాగానులాపక్రియా
వ్యాసంగంబున నుండి తత్తదుచితవ్యాపారతాళధ్వనుల్
భాసిల్లంగ మృదంగవాద్య మెసఁగింపం గర్జితభ్రాంతి యై
నాసందేహము తీఱ దయ్యె నెమిళుల్ నాట్యంబు గావించుటన్. 62

తే. ఘటియ నప్పురి నెందఱో గురులు కవులు
బుధులు జిష్ణులు ధనదులు పుణ్యజనులు

లోకబాంధవు లీశులు లోచనముల
కెంతయును బర్వ మొనరించి రిందునందు. 63

ఆ. నాఁడు రాజగృహమునఁ శుభ మని పోవు
విప్రవరులఁ గూడి వేడ్కఁపడుచు
నేనుఁ బోయి నగరులోన నారాకన్నెఁ
గంటిఁ గన్నులదోయి గలఫల మని. 64

చ. మెఱుఁ గని కొంతలోపున భ్రమించితి బంగరు వంచు నంతలో
నెఱిఁగితిఁ గొంతకొంత చలియించుటఁజేసియుఁ జిల్కపల్కులఁ
నెఱపుటఁజేసి చేడె యని నేఁ దెలియం గలఁ ప్రోడ నై కడుఁ
నెఱి గలబ్రహ్మసృష్టి నిది నేర్పుల కాది యటంచు నెంచితిన్. 65

మ. పొడుగుం బొట్టియు లావు సన్నమును గాఁ బో నట్టినిద్దంపుపు
త్తడిమే నే దెటు లున్న మిన్న యని శాస్త్రం బొప్పు నాచొప్పునఁ
గడుమోహం బిడునంగకంబులును గల్గం గన్నె సొన్నారి నే
ర్పడరం బొన్ను మెఱుంగునుం గరఁగి పోయం బొల్చుబొ మ్మట్లగున్.

చ. *కరములఁ బెందొడల్, మొన 'మ' గా నునుబిక్కలు, 'ధు' ద్వితీయ మై
నెఱులు, వికంఠ్యమై పెదవి, నీగి 'ధు' 'వంద' 'ర' వైఁ గ వాక్కు, బొ
ట్టిరవుగ 'మా'కు మాఱు సుతలెన్నఁ బిఱుందును, నాది వోవఁ గం
ధరము, మరల్పునఁ నగవు, నల్వగ నల్వ సృజించె నెచ్చెలిన్. 67

---

* కరములు = వీస్తుతొండములు, వీనితో నూరువులు; మొన = మొదట "మ" యనునక్షరము, కాఁ = కాఁగా, మకరము లగును, మకరములు = మొసళ్లు వానితో జంఘలు; "ధు" ద్వితీయమై, పైపదమునకు ధు వర్ణము రెండవది కాఁగా మధుకరములు= తుమ్మెదలు వానితో నెఱులు; వికంఠ్యము = మధుకరములలో కకారము కంఠ్యము, అది విగతము కాఁగా, మధుర మగును. దానితో నధరము; నీగి "ధు" మధురములలో ధు వర్ణముపోఁగా "మర" మగును. "అంద" యనుపదము రవైఁగ=రవర్ణము మీఁదఁ గాఁగా మరంద మగును. మకరందము, దానితో వాక్కు; బొట్టు=సున్న, మాకు=మ వర్ణ మున కై, మాఱు సుతలు=చివరివర్ణములు, ర,ద లు మాఱఁగా, మందర మగు. పర్వతము, దానితో పిఱుందులు; ఆది వోవ = అందు మొదటియక్షరము పోఁగా, దర మగు. శంఖము దానితోఁ గంఠము; మరల్పునఁ=మరలించుటచేత దరము "రద" మగు. గజ దంతము. దానితో నవ్వులను; చేసె నని యీపద్యార్థము.

చ. *తలఁకక మమ్ము రే ల్చెఱుచుదాయను గెల్చియ వానిచుట్టలఁ
మెలపితి మంటి కొల్చి మన, మీదను దొల్లిటిబామునందు మా
తలఁబడి నా' రటం చడుగుఁదమ్ము లనం గని మ్రొక్క వచ్చునో
వెలయఁగఁ డేం ట్లనం దగియె విప్పినయాసకిపోఁగ వెన్నె అుల్. 68

†శా. శ్రీకూర్మంబు భజించి మాయఁ జని కాంచిం గాంచి కేదార మా
లోకింపం గలఁ డయ్యు శ్రీనగము నాలో నేత్రపర్వంబు గాఁ
గైకొంచుఁ మధురాంకదేశమును వేడ్కం జేయువిజ్ఞుండు బ్ర
హ్మైకానందము నొందఁ జాలియుఁ దదైక్యం బందుఁ బొం దేర్పడన్.

‡ఉ. శ్రీ నిరసించుదంట లిరుశ్రేవలఁ బాయక చేరి యున్న వా
రే నట కేఁగ వాని యగు నేమొ యటన్న భయంబుతోడ స్వ
ర్భానుఁడు శీతభానునికురంగటఁ బోవక వెన్కఁ జేరెనో
నా నలువొందుఁ గర్ణవదనంబుల వెన్కొని కీలుగం టొగిన్. 70

---

* ఇందు వక్తలు పాదపద్మములు, శ్లోకలు తుమ్మెదలు, పద్మములు చెప్పుచున్నవి. మేమ్ము బలాధ్యులము. లేలు మమ్ముఁ జెఱుచుమాదాయ చంద్రుఁడు. వాని గెల్చి వాని చుట్టాల (నక్షత్రముల) మమ్ముఁ గొలిచి సేవించునట్లు చేసితిమి. నఖరూపముగా నీజన్మ మున మమ్ముంటి సేవించుచున్నవి. మే మింతవారము. తుమ్మెదలార! మీరు మున్ను మాకె త్తివైఁ బడి త్రొక్కి తప్పుచేసి యున్నారు. మిమ్మును శిక్షింతు మని చెప్పఁగా భయపడి తుమ్మెదలు పాదపద్మములకు నమస్కరింపవచ్చునో యన నొప్పె. అనఁగా నామె శిరోజములు పాదములవైఁ బడుచున్న వని తాత్పర్యము.

† శ్రీకూర్మము, మాయ, కాంచి, కేదారము, శ్రీనగము, మధుర యివి పుణ్యక్షేత్రములు, సేవించినవారి కానందము, సాయుజ్యముం గలుగు నని పురాణములు చెప్పు. ఇట విషయనిగరణము, శ్రీకూర్మము=ప్రపదములు, మాయ = నడుము; కాంచి = మొలనూలు; కేదారము=బొడ్డు; శ్రీనగము = పాలిండ్లు; మధురాంకదేశము = అధరము; సేవించినవారికి నానందము, వానితో నైక్యము నగు నని భావము.

‡ శ్రీ=విషము, శ్రీకారము; దానిని నిరసించుదంటలు=చెవులు. విషవైద్యులని రెండవయర్థము. విషవైద్యుని జూచినప్పుడు పామునకు భయము సహజము. స్వర్భానుఁడు=రాహువు; శీతభానుఁడు=చంద్రుఁడు;

చ. తనరెడుకొప్పు మబ్బు, మెయితళ్కు చలించెడుమించుదీగలుం
గనుబొమ లింద్రకార్ముకయుగంబును, సద్రస వృష్టి, గుబ్బ లఁ
ఘనకరకంబులుం గలిగి కల్కి మెయిం దరుణంపువర్ష దాఁ
గనఁబడ మోహసస్యము ప్రకాశము నొందక యున్నె యెయ్యెడన్.

తే. కోడెకాండ్రమదులు పట్టఁ గోరి మరుఁడు
పన్నియుంచినవల సుమీ కన్నెకురులు
కాన బెళుకుబెడిస లన నైనకన్ను
లేగుఁ గాఁబోలు జానుగులాఁగ లంట. 72

క. పున్నమచందురుఁ డగు నా,కన్నియనెమ్మోము,బొట్టు కందగు,నగవఁ
వెన్నెలలు గాయు నెల్లర,కన్నుంగలువలును విచ్చి కడుసిరి నలరున్.

క. పువ్విలుతుఁ డీఁదఁ గదలెడు
జవ్వన మనునేరెడేటఁ జనుతరగలు నా
నెవ్వలనఁ జూడ నొప్పెను
జవ్వనినునుకడుపుమీఁద సవ్వరై ముడుతల్. 74

తే. మేటితమ్ములతోడనో లేటచివురు
గములతోడనొ కడుఁ బోరఁ గలిగినట్టి
యీసుతోఁ బుట్టె నాఁగ నయ్యింతియడుగు
లరయఁగా నొప్పుఁ దొగరుచాయలను గనుచు. 75

మ. శ్రుతులఁ వీణియ మేళవించి పరమోత్సుక్యంబునఁ భీమరా
ట్సుత గాంధారము దేవతాప్రియముగాఁ జొప్పించి రాగానులా
పతతిం జూపుచుఁ బాడుచుండఁ గరఁగెం బాషాణము ల్కొయ్య లం
చితరీతిం జివురించె నిట్లు కని నేఁ జిత్తంబు రాఁ జెప్పితిన్. 76

ఉ. ఆనవలాయెయూరములు నాసొగ సాబలునీటు లాబెడం
గానెఱిచూపు లావగలు నాపస లాతగునేర్పు లాసొరం
బానగుమోను నాతళుకు లాపెసువన్నెలు చిన్నె లెన్నఁగా
నానవలాక చెల్లు నది యామరు నేలెడుమేటి గాఁ దగున్. 77

వ. మఱియుం బరమారుణకోకనదవాదమ్ము లగుపాదమ్ములును, రంభా
కుంభినీరుహాకారంబు లగునూరుద్వయీప్రకారంబులును, ఉష్ణరుగ్

థాంగరమాతిథునం బగుజథునంబును, వేదీమధ్యదగ్ననాసాథ్యం బగుమధ్యంబును, వర్తులావర్తశోభి యగునాభియును, ఉత్తుంగ రంగత్తరంగమంగళానుయోగంబు లగు త్రివళీవిభాగంబులును, సుమనోమాలికానుగం బగుభుజయుగంబును, కుందకోరకవరదంబు లగురదంబులును, ఖంజరీటపాలనాతిపాత్రంబు లగునేత్రంబులును, సుప్రభాపరిపూర్ణపూర్ణిమాచంద్రబింబానూనం బగుమందహాసభాసు రాననంబును, భాసురవిద్యుల్లతాసాకం బగుకోమలశరీరంబును, గలిగి చిలుకపలుకులఁ బలుకులం దులకించి కోకిలస్వరంబు కంఠస్వరం బున ననూనయించి, గజగమనంబు నిజగమనంబున నధిగమించి, మించునమ్మించుఁబోఁడి బాథాక్షమంబున క్షమకును, పాతివ్రత్యం బున నహల్యాసీతాదులకునుం బురుడై పతిదైవతంబుం గూర్చి ప్రార్థించుచు, సకలసుగుణగణసదనంబై విశేషవిలాసలక్షణంబుల సాహిత్యలక్ష్మి యన నొప్పి లోకాతీతవైభవంబునం దేజరిల్లుచుండె ననివెండియు. 78

క. అందమునకుఁ జందమునకు
నెందులకుం దగినమీర లిద్దఱుఁ గూడం
గుందనము మణియుఁ గూడిన
చందం బగుఁ గాదె రాజచంద్రా! తలఁపన్. 79

క. కన్నియ పెండిలియీడున, నున్నది లో నెవని వలచియున్నదొ కానీ
వన్నెగలరాకుమారుల, నెన్నిన విన నొల్ల దనుచు నే వింటి నృపా.

*చ. అతనునివేరు చెప్పుకొన నట్టిటు మోము గదల్చు, యామినీ
పతి యన మోము వాంచు, వనవాసి వసంతుఁడు నాఁగ నుస్సనుఁ,
శితిగళమిత్రసూతి యన సీ యసు, గోత్రభిదాత్మజుండు నా
నతికుపితాత్మయై కసరు నచ్చెలి యం చని వింటి, వింటివే. 81

క. ఇంద్రుండె కాని మఱియు ను,వేంద్రుండే కాని నవనిధీంద్రుఁడె కానీ
సాంద్రాణిమాదిసంపద,ధీంద్రుండే కాని మెచ్చు దెవ్వరి నధిపా. 82

*ఇందు-అతనుఁడు, యామినీపతి, వనవాసి, శితిగళమిత్రుఁడు, గోత్రభిత్తు, వీరు వైపదములచే గర్హింపఁ దగినవాఁ కావున దమయంతి నిరాకరించె నని సమన్వయము.

మ. అనలుం బేర్కొని తోడిచేడెలు ప్రసంగానుప్రసంగంబుగా
నినుకో నందు నలాఖ్యరద్వయము శ్రోత్రానందముం గూర్పఁగా
మనమందుం గలసంతసంబు ముఖసీమం దోపఁగాఁ జేయుటఁ
వనజాతాక్షి నలు న్వరించె నని చెప్పం జొప్పడుఁ భూవరా. 83

ఆ. ఆమె కీవు తగుదు వామె నీకుం దగు
నీడు జోడు నొక్కఁజాడ నెసఁగు
మీర లిరువు రొకట మెలఁగినచో రతి
మదను లనెడువేర్మిఁ బొదలుదు రిల. 84

వ. అని యనేకవిధంబుల నక్కన్యారత్నంబు నభివర్ణింప నాకర్ణించి పర
మానందకందళితహృదయారవిందుండై రాజేంద్రుండు కవిరాజుం
బహూకరించి యంపిపుచ్చి వేరొలగంబు సాలింప ననుజ్ఞ యిచ్చి
నిజప్రాసాదాభ్యంతరంబునకుం జని దమయంతీగతస్వాంతుండై. 85

మ. కవిరా జాడినయట్టు లాకలికి వేడ్కం గూర్చుచుం గంటికిం
దవులఁ వచ్చిన నైషధుండు మదిలోనం జేరఁగాఁ దీసి వా
సి వెసఁ గూర్చుచు ముద్దు వెట్టుకొని చేనేతం దగం బట్టి బె
ట్టువగ న్మోమున మోముఁ జేర్చుకొని యుండుఁ రెండు నొండేయ్యనన్

చ. హృదయమునందుఁ జేర్చుకొను, నేదియొ పల్కును, నవ్వుమోముతోఁ
బదములు ముట్టి నాపయిఁ గృపం బొదలింపు మటంచు వేఁడు, స
మ్మదమున మోవిపానకముఁ బొందఁగ మో మటు త్రిప్పు, నెప్పుడుఁ
బదలను నిన్ను నే ననుచుఁ బట్టును నెట్టన రెండుచేతులన్. 87

వ. ఇ ట్లనేకవిధంబులం బలవించుచుఁ దదేకధ్యానపరాయణుండై
యొక్కచోటం గుదిరి యుండ నోపక యాహారవిహారాదులం బరా
ఙ్ముఖుండై యొం డేమియుం జూడక వేడుకలం గూడక వీడనివిరహ
తాపంబున నేపు దక్కి మిక్కిలి పొక్కుచు. 88

చ. నలుఁ డెపుడు న్విదర్భపురనాథసుతం గనకున్న విన్న య
ల్లెలమిఁ దదీయవిగ్రహమునే హృదయంబున నిల్పి లోనిచా
పుల మునిరాజు బ్రహ్మమును బోలెఁ గనుంగొను చొండు గాన కు
జ్జ్వలమదనానలంబునకు సైపఁగ లేక విరాళిఁ దూలుచున్. 89

వ. ఏమియుం దోఁపక పురంబున నుండ నోపక పురసమీపంబునందలి ప్రమదావనంబున కొక్కనాఁ డొక్కరుండ చనియె నదియును. 90

## ప్రమదావనవర్ణనము.

సీ. కోకిలరుతములఁ గొమరొప్పులేమావి
గున్నలు గనుఁగొన్నఁ గన్ను లలరు
నలినాదముల నధికాహ్లోద మొనరించు
మల్లికల్ గన మది పల్లవించు
మొగిఁ గప్రపుదుమారమును గప్పుననటిబో
దెలసొంపు దిలకింప నలరు మేను
బంగారుమేడల రంగారుసంపంగి
యీరములు మది కిచ్చ లూరఁ జేయుఁ

తే. గేసరంబులఁ దగునాగకేసరములు
మంజులచ్ఛవి నొప్పెడుపంజులములు
పొగడఁ దగుతావి నెగడెడుపొగడగములు
నరయ నరయ మే న్పరవళ మాఁ దలంప. 91

చ. విరహుల వేఁట లాడుటకు వేడుకఁ జేసి త్రిలోకయాత్రకుఁ
జరిగెడుశంబరారికి నొసంగ వసంతుఁడు మేలుబంతు లౌ
శరములు చేసి ప్రోవు లిడె శ్లాతలమం దనునట్లు లామ్రము
ల్వరియఁగఁ బూచె నల్దడల లేఁజిగురేఁ గనరాక యుండఁగన్. 92

గీ. మల్లెపూవులపొదలపై మధుపపంక్తి
వ్రాలి జుమ్మని మొరయుచోఁ బంచశరుఁడు
నారి సవరించి శరములఁ గూరిచె ననిని
మొలచె భయ మెంతయే వియోగుల కెడంద. 93

మ. పసపుంబయ్యెద లొప్పుపుప్పొడిగముల్, పాలింప్లు పూగుత్తు, లు
ల్లసదంగంబులు ప్రాకుదీవలు, కురుల్ పైనాడుతేఁ, టల్లంఘ్రిలుఁ
గిసలంబుల్, నగవుల్ సుమంబు లగుచుం గీర్తింపనై యొప్పుచుఁ
బసమీఱుఁ వనలక్ష్ములుఁ వనితలుఁ వర్తింతు రేకాకృతిన్. 94

సీ. తమగాత్రములఁ గావఁ దగుపత్రముల డుల్చె
నని కారుపై నీసు నానె ననఁగఁ
దమమనోహరునితోఁ దమిఁ గూడుకొనఁ గల్గె
నని కెంపుచీరలు గొనియె ననఁగఁ
దమకు నొండొరుల కుత్సవసమయం బని
కొని కుంకుమము జల్లుకొనె ననంగఁ
దమకు నాథునితోడ సమయకేళి లభించు
నని సీధురసము ద్రావిన వనంగ

తే. అఖలధరణీతలంబున నావరించి
లేఁజిగురుజొంపములతోడఁ జేజరిల్లి
కన్నులఁబండువు గావించుచున్న వెన్న
వివిధతరుగుల్మలతలతోఁ దవిలి వనులు. 95

వ. అట్టియుద్యానవనంబు మధ్యంబున. 96

## జలాశయాదివర్ణనము.

తే. చదుకము విశాలతయుఁ గల్గి చంద్రకాంత
శిలలకట్టునఁ గ్రిందిత ట్టలరుమెట్లు
నలుగడల నొప్ప నిర్మలజలము నిండఁ
దనరు నొక్కతటాక మవ్వనమునందు. 97

మ. నెలతాకట్టున నొప్పుకట్టలపయి న్నెక్కొన్న పొన్నంపుబొ
మ్మలు నీటం బ్రతిబింబితంబు లగుచు న్మన్నింప నయ్యె న్మధిన్
నలసౌందర్యము నాలకించి కనుఁగో నాగాంగన ల్వచ్చి య
క్కొలఁకుం దేటజలంబు లాడుకొనుచుం గోర్కిం బ్రవర్తిం త్రనన్.

మ. అడుగుంబ్రక్కలు చల్వతాతిపసులఁ హారొందు "చప్టా" పయిఁ
వడియం బోసినయట్టు లచ్చ మగుచు న్వర్తించునీలోదకం
బడర న్నిండినయాసరోవరము పద్మాస్థానమై కాన వ
చ్చెడుఁ దెల్లంబడి పాలవెల్లి యిది నాఁ జిత్తభ్రమం జేయుచున్. 99

సీ. ఆప్రమదావనమందుఁ జలువఱాలఁ
గట్టినబాటలు గలవు వెక్కు-
వానికి నిరుగడం బంక్తులు దీరిచి
వివిధవర్ణంబుల వృక్షము లగు
వానిప్రక్క-ల నీళ్లు వడివడిం బ్రవహించు
కుల్యలు వెక్కు-లు కొమరుమిగులు
వానిలో మత్స్య ములో వరుసలు దీరిచి
మిలమిలలాడుచు మెలఁగుచుండు

తే. వానికై యే మొ కొంగలు బాతువులును
బెగ్గురులుఁ జేరుఁ బైనుండి డిగ్గ నుటకి
వానికలకలారావముల్ జానుగులకుఁ
బర్వ మొనఁగూర్చు నామని పర్వినపుడు. 100

మ. వనవృక్షాదులు సూచుచుం దినము వాప స్వచ్చు నఁ వాంఛ వ
చ్చినరాయం డరవింద ముత్పలము గాసిం బెట్టు నిచ్చోటఁ గా
దని మార్తో మయి మల్లికం దెగడి చూతాశోకముల్ మర్మభి
ద్ధనశల్యంబులు నాఁ గనంబడ నటం గా లూన లే కార్తుఁడై. 101

చ. చిలుకలు గూయఁ, గోయిలలు చిల్లులు వోవఁ జెవుల్ నినాదముఁ
జలుపఁగఁ, దుమ్మెదల్ రవ మెసంగఁగఁ జేయ, నవాద్రిశాగతా
నిల మది మెల్లఁగాఁ దగుల నిల్వఁగ లేక నలుండు మన్మథో
జ్వలశరపాతఘాతముల సాల్వఁడిపోయెఁ బరిభ్రమించుచున్. 102

క. ప్రమదావనమధ్యమునం, బ్రమృష్టచంద్రోపలప్రభాభాసురమై
యమరుఁ జతుశ్శాలం బొక, డమరులకును దర్శనీయ మైనఁ జెఱుఁగునన్.

ఆ. శాలచెంతఁ జల్వఱాలఁ గట్టినవేది
నీటియంత్ర మొకఁడు నిలిచి చిచ్చు
బుడ్డి వోలెఁ జదలు ముట్టికో వెదఁజల్లు
చుండు నచ్చుజలము లుడుగ కుండ. 104

క. నలుగడ సోపానంబుల
నలు వగునాశాలనడుమ నలుఁ డొక్కఁడుఁ గ

న్నులు మూసి మొగముఁ జేతం
గలుగక ధరఁ గూరుచుండె గళ మది వంగన్. 105

వ. ఆసమయంబున. 106

రాజహంసలు ప్రమదావనంబునకు వచ్చుట.

క. మానసమునుండి పుష్కర, యానంబున రాజహంస లవి కొన్ని శుభ
స్థాన మగునచటి నేలకు, నానందం బెసక మెసఁగ నరుదెంచె వెసన్.

ఉ. ఉప్పరమంద మొక్కలు సముత్సుకత న్తుడుగంగఁ జేసి మో
మప్పుడ వంచి క్రిందుగ నభోంచితవాయువు తాఁకుదెంచుటం
జప్పుడు లుప్పతిల్ల వడి సాఁగ దిగంబడి చెంతఁ జేరుచో
విప్పినపక్షయుగ్మములు వ్రేలఁగ నంచలు డిగ్గె నేలకున్. 108

చ. కొలఁకుల నీట బోటులను గూడుచు వేడుక నాట లాడుచుఁ
గొలకొల మంచుఁ గూయుచును గోపులు సూపుచుఁ దమ్మిగద్దెలఁ
నిలుచుచు నావులించుచును నిక్కుచు నీల్గుచుఁ ద్రెంచి తూండ్లు ము
క్కుల నెగిరించుచుండి కనుఁగోఁ దగె నంచలు గన్నుపండువై. 109

చ. చరణము లెత్తి యెత్తి యొకచక్కిన చక్కఁగ మోపి హంసముల్
ధరపయి మెట్టుచు న్వినఁ ముదం బగుదెంచెడునట్లు కూయుచుఁ
సిరిఁ జనునచ్చరల్ దెలుపుఁ జీరలుఁ దాలిచి తొక్క లార్చుచుం
బొరిపొరి నాడుచు న్నటనముం బొనరించెడు నాఁగఁ దోచెడిన్. 110

చ. పసిఁడికి నెత్తు వచ్చి చెలువం బగుముక్కులునుం బదంబులుం
బొసఁగఁగ నంచకూటువలు మోముల నెత్తి మెలంగుచున్నచోఁ
బస గలతోఁటలచ్చి తనవైడిజరీసరిగంచు తెల్ల డాల్
వసనము నారవై చె విపులాతలమం దని యెంచ నయ్యెడిన్. 111

చ. ఒకచరణంబునుం దలయు నొప్పగ నప్పుడు తొక్కసందునఁ
సుకముగఁ జొన్పి వేఱొకటి తోణితలంబున నిల్పి హంసనా
యకుఁడు గతశ్రమంబున గతాన్యభయుం డయి నిద్ర వోవ భూ
మికి నిడుపెంపుకామతెలిమేల్గొడుగో యన నయ్యె నయ్యెడన్. 112

వ. అయ్యవసరంబున నలుండును. 113

ఉ. చంచలనేత్రపొందు విడఁ జాలక డెందమునందుఁ గట్టి ద
క్కించుకొనం దలంచుచు నకించనుఁడుం బలె దానిసౌష్ఠవం
బెంచుచు సంతసించుచు నొకించుక కన్నవ విచ్చినంత రా
యంచలపిండు కట్టెదుట నై కనిపించె సతీలసద్గతిన్. 114

ద్విపదము. కని యేఁగు దమయంతి గదె యంచు వాని
వెనువెంటఁ బడి పట్టు విడనట్టి తీరు
ననుఁ బాఱి పరవంజి నడయాడునందుఁ
గనుపండు వగుమేటికలహంసఁ బట్టె. 115

మ. కలహంసల్ నిజయూథనాథు నటు లాకాసారతీరంబునఁ
లలి నిద్రించెడుదాని నైషధుఁడు వెల్పుం జేతులం బట్టుఱుఁ
గలఁగం బాఱఁ గొలంకు వట్టె దివికిం గంపించుచుఁ లేచి చిం
తిలి దుఃఖంబునఁ గూయఁ జొచ్చె నృపతిఁ ద్వేషించి దూషించునాన్.

చ. తమప్రభు వట్లు చిక్కుకొని ధాత్రి విపత్తున నత్తమిల్లు నం
చమితభయంబునం జదల నార్తరవం బొనరించు చంచపిం
డమరి రథాంగమ ట్లతిరయంబునఁ జేసి పరిభ్రమించె న
ద్దమయ డొకం డలాతము ప్రియంబునఁ ద్రిప్పునొ నాఁ గనం దగెన్.

వ. అట్లు కలహంస లాకసంబున నాక్రందనంబు సేయుచున్నంతలోన.118

ఉ. పట్టినఁ గీచు కీచు మని పల్మరుఁ గూయుచు తెక్కదోయి న
ట్టిట్టు విదుర్చుచుఁ నృపతిహస్తయుగంబును గోళ్లఁ గిచ్చుచుఁ
గట్టిగ ముక్కులం గఱచి కండలు దీయుచు రాజహంస లో
దిట్ట చెడంగ ని ట్టనియె దేవుఁడు పుట్టెడునట్టివాకులన్. 119

చ. నృపవర! నీ కొకప్పటికి నెగ్గు దలంచి యెఱుంగఁ జిత్తమం
దెపుడును సాధువృత్తి వసియించెద బిడ్డలు నెత్రుగుడ్డు లా
లపగతచిత్త తల్లి బడు గందఱ కొక్కఁడఁ బోషకుండ నే
నుపకృతి నీ కొనర్తు విడు మూరక యిట్లు వధింప నేటికిన్. 120

*చ. అమలినమానసంబున విహారము సేయుచు నప్రమేయుఁడై
యమరియు బ్రహ్మభృత్పరమహంసలఁ జేరినసద్ద్విజుండ నై
క్షమఁ జరియించుచుంటి నిటు సాధువునై ననుఁ జంపఁ బోకు మో
నృమణి, భవన్మనోరథము నే నెఱవేర్చెద మేలు గూర్చెదన్. 121

క. నెఱులసువర్ణము మోహము, నెఱపెడినె సువర్ణ మైన నీ కొక బ్రాఁతే
నెఱకాఁడ వింకఁ బోలసా, నెఱి నిడునే పిట్టపొలసు నృపతివతంసా.

క. పిల్లలు పసికందువు లని, యిల్లా ల్మతిమాలిన దని యింత వగవ నా
తల్లికి వగచెద నేఁ బో, నెల్లాగున బ్రదుకుఁ జీకు వృద్ధని మదిలోన్.

క. ఆయమ మదిలో నిడికొని,నాయెడఁగరుణించి విడుము నరవర,నిను నే
నేయెడ మఱవను నీకుం, జేయుదు నుపకృతిని మేలు చేకుఱు డానన్.

వ. మఱియు నాకర్ణింపు మయ్యా నిన్ను నే నెఱింగి యున్న వాఁడ
నీదర్శనంబు చేసి నీతోఁ గొంతప్రసంగింప వచ్చితి నది దైవసంకల్పితం
బిట్లు కా దందు వేని నీ వింతనంతల మెలంగుచుండు ఱెఱింగియు
నిర్భయంబున నీచెంత నిద్రింతునే? నామాట విశ్వసింపుము నన్ను
విడువుము నాపలుకు లాలకింప నవహితుండ వగు మని పలుకుట్లయ్యె.

క. నావుడు నివ్వెఱ వడి నల, భూవరుఁ డారాజహంస ముద్దిడ్డుకొని తాఁ
బో విడిచె నదియు వెండియు, జీవించినయట్లు తలఁచెఁ జిత్తమునందున్.

వ. అట్లు విముక్తిం గాంచినరాయంచ యించుక యెడ గలుగ నిలిచి
మనుష్యకరసమ్మర్దంబున నైన యలసటలు దీఱఁ జంచుపుటంబున
మే నెల్ల నిమురుకొని నేదఁదేఱి మఱియు మనుజేంద్రునికడ కరు
దెంచి మించినవేడ్క ని ట్లనియె. 127

రాజహంస దమయంతి నభివర్ణించుట.

క. నలరాజ! వినుము చెప్పెదఁ
గలఁడు విదర్భాపురంబు కాపురముగ భూ

---

* అమలినమానసము = నిర్మలమనస్సు. మానససరస్సు; అప్రమేయుఁడు=నీళ్లుత్రాగని వాఁడు, త్రాగువాఁడు, బ్రహ్మభృత్పరమహంసలు=పరబ్రహ్మానుపహించిన మహర్షులు, బ్రహ్మదేవుని మోయుహంసలు; ద్విజుఁడు=బ్రాహ్మణుఁడు, పక్షి, క్షమ=శాంతి; భూమి.

తలపతి యొక్కఁ డతనికిఁ
గలిగెం దమయంతి యనెడుకన్నియ వింటే. 128

చ. అరయఁగ సర్వసామ్యసుపదార్థసముచ్చ్రయశోభ యొక్కచోఁ
దిర మయి యుండఁ జూచుమతి తేజరిల న్నిధి యచ్చుగ్రుద్దురీ
తి రచనలఁ రచించియె సతీమణి నేర్చితి నేఁటి కంచు సం
బరమున నెంచు ముఁ గుఱే సమానత యాకెకు లేక పోవుటే. 129

సీ. ఇందుబింబమునందుఁ గందు చేసినరట్టు
మించుటద్దముల మాయించుతప్పు
బంగరునకుఁ దా వొసంగనికొఱతయుఁ
గెంపున మధురిమఁ గెడపువెలితి
జక్కవకవ విప్ప నెక్కొనునేరంబు
కలువల నీళ్లలోఁ గలుపుఅవ్వ
పూవుదండల వాడిపోఁ జేయులోకంబు
చివురుల ముదిరించు చిన్నతనము

తే. కడఁగి పోఁగొట్టుకొనఁ బోలుఁ గంజభవుఁడు
కన్నె మోమును జెక్కిళ్లు కమ్మమేను
మోవి చనుదోయి కనుదోయి పొనరుకరము
లును బదంబులు రచియించి వనధి కాంచి. 130

చ. మగువగళంబు నెన్నఁ దరమా? దర మా దర మాదరంబునఁ
దగియెడునాసఁ జేసి తను దాతను దాతను దాత! తత్సమం
బగువరదాన మీవె యన నాయన నాయన నాట సల్పు నీ
జగతిఁ బ్రదక్షిణంబులను జాలను జాలను జాలి పుట్టఁగన్. 131

క. గుబ్బలులా గుబ్బలు నడు, మబ్బరమా మబ్బ కొ ప్పయా రే కన్నుల్
గబ్బికలువలా నెమ్మొగ, ముబ్బెడు రే తోడ వళ మె యూహింపంగన్.

క. గిల్లినఁ బాల్గారెడుమేఁ, పల్లవములతీఁగఁ గేరుపదములు గలయా
హల్లకపాణిఁ బొగడఁ వా,గ్వల్లభునకు నైనఁ దరము గామి నిజంబే.

ఉ. ఆయమ కీడుజో డయినయట్టివిభుం డెట నుండు నంచు నే
నీమహి యంతయు న్నెమకి యెందును గానక యిందుఁ గాంచి నిఁ

గోమలదేహా! నీకు నలకోమలికిఁ విధి దంపతిత్వముఁ
దీసస మొప్పఁ గూర్చె నని తేరి మనంబున నిశ్చయించితిన్. 134

మ. ఇది నీడోద్భవనిశ్చయం బనుచు నీ వెం తేమొ కా దట్లు నా
హృదయార్థం బొకనాఁడు బ్రహ్మకడ నెంతే నిచ్చ వాక్రుచ్చుడుఁ
సదయుం డాతఁడు భైమికిం బతి నలక్ష్మోమండాఖండలుం
డుదయప్రాంచితవైభవుం డనుచు నెంతో ప్రీతిఁ బల్కెం బ్రభూ.

వ. అమ్మత్తకాశిని యిత్తఱి నీచిత్తం బాకర్షించి యున్న దని నే నెఱుం
గుదుం గావున. 136

చ. నను బ్రదికించినట్టికరుణాళుఁడ వోనలరాజ! నీకుఁ బ్రీ
తిని గలిగించుప్రత్యుపకృతిం బొనరింపఁగ లేన యైన నీ
మనమున నెప్పుడుఁ విడనిమచ్చున ముచ్చటఁ గూర్చుచున్న మా
నిని దమయంతికిం దెలిపి నిన్ను వరించెడునట్లు చేసెదన్. 137

క. నీసుగుణకీర్తనంబునఁ,జేసి సతీతిలక మామె చిత్తమునం దో
భాసురమూర్తి! నినుఁ గా, కేసరసుని: జొనుప నట్టు లేఁ బొనరింతున్.

ఆ. పరమహంస యిట్లు పలుకుచుండఁగ నొండు
పలుకఁజాలనట్టివాఁడ యగుచు
వేడ్కలూర నలుఁడు వెట్టి నాఁ జూచుడుఁ
బోయివత్తు నంపిపుచ్చుమయ్య. 139

తరువోజ.—

అని పల్కి నరనాథునంతరంగంబు
హర్షామృతంబున నలరంగఁ జేసి
కనుఁగవ ననుమతిం గాంచి రాయంచ
కడుముదంబున హంస గణముతో లేచి
జనపతి వీడ్కొని జవనంబు మీఱఁ
జనె నాకసము వట్టి జను లెల్లఁ దమ్ముఁ
గని నిద్ర మగునట్టికబరీభరమునఁ
గట్టుకుందము లని కడు నిచ్చ మెచ్చ. 140

చ. సమములు గాఁగఁ బంక్తు లయి సాగుచునుండఁగ నంచతోఁడు త
త్సమయమున స్తుఖం బగుచుఁ జక్రనిమార్గము వట్టి రాజహం
సములఁ జనంగఁ జేయుచు విశాలపథంబున నేగుచో వియ
ద్భ్రమ రమణీయహారమును దాలిచె నాఁ గన నయ్యె నయ్యెడన్. 141

చ. వెనుకకుఁ గొన్ని ముందఱకు వేఱొకకొన్నియు వీఁగి మూఁగి క
న్గొనియెడునంతలో మఱియుఁ గ్రొత్తగతిఁ దివి రాజహంసముల్
చనియెడునత్తఱిఁ మడుఁగులఁ ధరియించినయోఘు లాహవం
బునఁ దగఁ బన్ని మోహరము పోరెడునట్లు గనంగఁ దోఁచెడిన్.

చ. గగనపథంబునందు నొడికంబుగఁ బాఱెడురాజహంసముల్
దిగువ నెసంగువారలకుఁ దేఱి కనుంగొన నయ్యె నయ్యెడన్
నిగనిగలాడుచు న్నిగుల నీటగునల్లనిపట్టుకట్టునన్
దగ నగుకెంపుతాలకడ దాపినమేల్మగతాల పేరునాన్. 143

వ. అనిన నైమిశారణ్యవాసు లవ్వలివృత్తాంతంబు సెప్పు మని సూతు
నడుగుటయును. 144

ఆశ్వాసాంతము.

సుగంధి.—

వేడికోలు రాకమున్నె వేలవేలు సొమ్ములఁ
గూడునర్థికోటి కిచ్చి కోర్కిఁ దీర్చుదాత మే
లాడువాఁడు కామయార్యనాత్మజుండు వానికిఁ
వీడనట్టిసౌఖ్య మిచ్చి వేడ్కఁ బ్రోవు మీశ్వరా. 145

గద్యము. ఇది శ్రీమహామహోపాధ్యాయ, కలాప్రపూర్ణ కవిరాజ
కవిసార్వభౌమ శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి ప్రణీతంబయిన నైషధీయ
చరితం బనుశృంగారతరంగిణియందు ద్వితీయతరంగము.

శ్రీ. శ్రీ. శ్రీ.

శ్రీ ర స్తు.

# నై ష ధీ య చ రి త ము

## శృం గా ర త రం గి ణి

### తృ తీ య త రం గ ము.

మద్విక్రమసింహా
క్ష్మామండలనాథసతతసంరక్షితపూ
ర్ణాముఁడు రంగవిభుఁడు సు
క్షేమం బొనగూర్చి ప్రోచు శివరామబుధున్. 1

నలుఁడు రాజహంసం దలంచుకొనుట.

వ. అక్కథకుండు శౌనకాదిమహామునుల కి ట్లనియె నట్లు రాజ హంసంబు చనినంత నలుం డంతరిక్షంబునం దత్పక్షిచారంబు లోచన గోచరం బగునంతవఱకు నచ్ఛాయఁ గన్ను విచ్చి చూచి చూచి చూచునంత నిర్మలాకాశంబు నిరీక్షించి తదుద్యమంబు చాలించి జాలిం బడుచిత్తంబునఁ దత్తరంపడుచు నెప్పటియట్ల చని చతుశ్శాలా శిలాసోపానంబునం జదికిలంబడి కూరుచుండి తదేకధ్యానపరాయ ణుండై తనమనంబున. 2

చ. ఫలుఁ గది చేతఁ బట్టువడి పూరుషుఁ డీతఁడు చంపు నంచు లో దలఁకుచు నట్లు మోఁకుము నెదం దలపోయుచుఁ బల్కె నేమొ? ప ల్కుల నిజ మున్న చంద మది గోచర మయ్యెడుఁ బక్షి యేడ! మేల్ పలుకు లవేడ! చూడ నిది బ్రహ్మవరాంచితదేవయోనియే. 3

ఉ. నావెతఁ బాప వచ్చినది నాకము ముట్టినదాని కెట్టులే
దైవిక మైనవిఘ్నములు దాపురమై గమనప్రసక్తికిన్

దావు లభింపకుండుటలు దద్దయు నయ్యెడునో యథోక్తిగాఁ
బోవునొ మార్దమధ్యమున ముచ్చట లెచ్చుఁగఁ దామసించునో. 4

ఏ. తామసింపదువో విదర్భాపురముదారి
తప్పునో? తప్పదు తత్పరిచయ
ముండెఁ. నుండినఁ జన నుత్సహించునొ? యుత్స
హించి దిగుఁ దిగ నెవ్వ రేని
ఘాతుకుల్ హింసింపఁ జూతురో? చూడరు
చూడ కంతిపురంబు చొరఁ గలుగునొ?
చొరఁ గలిగినమాత్ర నరవరేశ్వరకన్య
హంసమహత్త్వము నరయఁ గలదో?

తే. అరయఁ గలిగిన నెచ్చెలు లరయకుండఁ
బలుకు నేయంగఁ గలుగునో? కలుగ నాకె
నాకుయాలించునో? లేక కాఁకఁ బూని
వీఁకఁ జూపునొ? నావిధి యేకరణిదొ?. 5

ఉ. కామిని నాపయి న్నిగులఁ గౌతుకముం గొనియున్న దంచు నే
సోమహిదేవతాప్రవరుఁ డాడఁగ వింటి నలేల నాపయిం
దామఱుము న్వహించి ద్విజతల్లజు నాతని వీఁకఁ జూచెడిన్
శ్రేముడి చూపి పల్కెడిని బిమ్మట నన్ను ననుగ్రహించెడిన్. 6

నలుండు దమయంతీగతచిత్తుండై తత్తఱించుట.

మ. ఇఁక నే నాసతిఁ జూచు నెన్నఁడొ మనోభీష్టంబు సిద్ధింపఁగా
సుకముం గాంచుట యెన్నఁడో సుదతితో శోభించుచుఁ సంసృతిం
బ్రకటింపం గలభాగ్య మెన్నఁడొ జగద్వర్ణ్యంబుగాఁ గాలముఁ
సకలశ్రేయము లందుచుం గడపు నెన్నండొ కదా చేకుఱున్. 7

ఉ. చూడక యున్నఁ జూచినటు సుందరిరూపము నామనంబునఁ
గూడినయట్లు చొచ్చి నను స్రుక్కఁగఁ జేయుచు నుండె నక్కటా!
చేడియ యెద్దియే మహిమ చెఱొని యుండెనొ యేమొ కానిచో
వ్రీడనితాపమిట్లు పచరించి చలింపఁగఁ జేయఁ జాలునే?. 8

ఉ. పూవిలుకానివిం డ్లగును బోలిచి చూడఁగఁ జేడెకన్బొమల్
గావున దృష్టిబాణములు గాటముగా మెయిఁ జొచ్చి నాదహృ
ద్భావము భిన్నభిన్నములుగా నొనరింప వికార మొంది నే
నీవగఁ జేష్టలం దొరఁగి యిట్లయిపోతి నిఁ కేమి సేయుదున్. 9

వ. అని యనేకవిధంబులం బరితపించుచుఁ జతుర్థ్యాలసోపానంబ శరణం
బుగాఁ బ్రొద్దు పుచ్చుచుండె నంత నక్కడ నితాంతచింతాసాగర
నిమగ్నస్వాంతయై శాంతి దక్కి దమయంతి యొక్కరితయు నుప
వనంబునకుం జని యొక్కలతాకుడుంగంబుచెంతం గూరుచుండి మదన
వేదనాదోదూయమానమానసయై పరిపరివిధంబులం బరితపించుచుండె
నయ్యవసరంబున. 10

క. అంతఃపురమందుఁ దమయంతిం బొడఁగాన కతిభయావృతమతులై
సంతస మఱి చెలికత్తియ, లంతంతఁ వెదకి వెదకి యచ్చటి కిచ్చున్. 11

ఆ. వచ్చి మచ్చెకంటిఁ గ్రుచ్చి కౌఁగిటఁ జేర్చి
యేమె తల్లి! యిట్టు లేల వచ్చి
తొంటి రాఁగఁ దగునె తొంటివలె నీ్నదు
చెల్లియుండ దేమి చెప్పవమ్మ. 12

క. మాకడ దాఁపఱికంబా, నీ కెవ్వనిమీఁద బాళి నెలకొనినదియో
వాకొనుము చక్రవర్తియ, కా కాతని నీదుకాళ్లకడ నిడ మొక్కో?

ఆ. ఏమనోహరాంగుఁడే మానసంబునఁ
దగులుకొనినయట్టితగవు మాకుఁ
గానిపించుచుండె నీనడవడి లెఱుం
గరయ నరయ నిట్టియదన తరుణి. 14

వ. అని యనేకవిధంబుల ననునయించుచు నాళీజనంబు పలుకుచున్నం
గన్ను దెఱచి చూడ కక్కన్యారత్నంబు. 15

దమయంతీవిరహావర్ణనము.

క. మనసిజతాపజ్వరమున, మన సెఱియఁగ నెదిరిఁ దన్ను మఱచినగతి గాఁ
దనచెలులు పలుకరించిన, విని విననటు లై పొనరె వెడఁగుం జెయ్యెల్.

చ. ప్రియమునఁ జెంతఁ జేరి కడుబిగ్గరఁ దన్నుఁ గవుంగిలించె నా
ప్రియుఁ డని మే నెఱుంగ కొగి వెంగలి చేతులు సాఁచి వట్టిపెం
బయలు కవుంగిలించి తమి వాతెఱకై తనమో మటొగ్గి యే
మియుఁ గనరామికిఁ దెలిసి మిక్కిలిగా వగచె న్వివాళిమై. 17

చ. సరగున లేచి యాకసము సందిటఁ జేర్చెడు మోవిపానకం
బరయఁగ మోముఁ ద్రిప్పెడుఁ బ్రియంబున నేమియొ పల్కరించెడుఁ
జురచురఁ జూచెడుఁ గినిసి సోలెడు వ్రాలెడు నవ్వెడుఁ గడుఁ
విరహము నొందెడుఁ దెలివి వీఁగి నెలంత దురంతచింతమై. 18

వ. అట్లు మిగుల వగలం బొగలుచు శరీరపరవశత్వంబున నగపడినవాని
నెల్ల నెదియొ యడిగినట్లు నుడిగికొనుచు నత్తఱి ధైర్యం బొత్తిగిల్ల
బిత్తరి చిత్తవిభ్రమం బొందినచందంబు నెఱింగి సందని పచ్చవిల్లుగల
పచ్చిబోయ క్రచ్చుకొని వచ్చి విచ్చలవిడిఁ బెచ్చుపెఱిగి పోచ్చ
రికం దెచ్చుకొని నిడుదగేదంగిపిడి నడరు వెడఁదచిగురాఁకుటడి
దమ్మును, జుమ్మనితలది మ్మిడునాలిభూతమ్ము లగుతుమ్మెదలం గమ్మిన
వారినాఱితీఱి జంట యగుతుంటవిల్లును, తళుకు లొలుకుచికిలిచౌ
వంచ ములుకులును, మేలుగేదంగివాలుం బలుకయుం గొని సుందరం
బగు బొందళంబు దొడిగి తొడిఁబడుమీను మొసలిసిడంబుల నడరు
గులుకుచిలుకతేజీయరదం బెక్కికొని, చిక్క నగుతనదళంబులతో
దొరపట్టిఁ జుట్టుముట్టి కట్టిడితనంబున కొడిగట్టి యిట్టట్టునరానికట్టులుకఁ
గలువ కడకుం దీసి నాల్గుచెట్టంపసెలకట్టియలు నిట్టఁబొడిచి గట్టిగాఁ
గొట్టి చిక్కులం బెట్టిన దిట్ట చెడి దోదూయమానమానసమై మాన
వతి మహానలసమానమైన విరిశయ్యవ్రాలి పొరలుచు దరిలేనివిరహ
సాగరంబు వెల్లివిరిసె నో యన నేత్రకోణంబులఁ గజ్జలాంచితబాష్ప
ధారాపూరంబు తోరంబై బోరునం దిగజారి కాలువ గట్టి చను
కట్టులం బడి బిక్కెగసి మిట్టిపడి పుడమిం బడి పాఱుచుండఁ గోకిల
కాకుకాకలీస్వనంబున నేడ్చుచుఁ జెక్కుటద్దములం జెయిఁ జేర్చి
చిక్కులు పడినతారహారంబులు భరణంబులగుట నూడ్చివైచియొప్పుల
కుప్ప యగుగొప్పకొప్పు విప్పి విరియం బోసికొని కన్నులు మూసి

కొని నిషధభూవల్లభుం డగునిజవల్లభునిరూపలేఖావిలాసంబులు
హృదయఫలకంబునం దిడుకొని తలంచుచున్నతఱి నతండు పొడ
కట్టిన ట్టయిన దిగ్గన లేచి యగ్గజగామిని కన్ను డెబ్బి నలుగడం
గలయ వెదకి కానక స్రుక్కి పలుమాఱు విధిం దూరుచు మున్నీ
రైనకన్నీరు కరతలంబున నొత్తుకొనుచుఁ జిత్తజవికారంబుల స్తంభ
ప్రళయరోమాంచావిసాత్త్వికాష్టచేష్టలకుం బాలుపడి సర్వపరస
పానంబు చేసినపసరంబుపగిదిఁ బెల్లారాటంబున నిలిచినచోట నిలువక
కూరుచుండినచోటం గూరుచుండక యన్నపానీయంబులు వర్జించి
యితరవ్యవహారంబులు చాలించి తదేకధ్యానధారణామననాదుల
భ్రమఁ గొని తిరుగుచుఁ గుసుమగంధి బంధురమదనాంధకారంబు
నిర్భరంబుగాఁ గప్పినం దెరు వెఱుంగక యడవిలోఁ బ్రొద్దు
గ్రుంకిన ట్లుండి ముద్దురాచిలుకలు తనయొద్దకుం జేరినఁ జవివింపక
యుద్దవిడిం గద్దరించుచుఁ బాలితకేళీమరాళీపాళికి మందగతులు
నేర్పక శిఖండితండంబులకు నఖండకరతాళంబుల మండలభ్రమణాది
తాండవంబులు నిండువేడుకం గఱపక పాఱఁ ద్రోలుచు సఖీజనంబు
చేరం జని పిలిచిన మాటాడక విసివికొనుచు, నిలిచినఁ గసరికొన్నుచు
ననేకవిధంబులం బొగులుచు నితాంతచింతాసాగరంబు గడవ నీద
నేరమి నెంతయే విభ్రాంతి వహించి యుండఁ జెలికత్తియలు శైత్యో
పచారంబులు సేయుచుండి రంతట. 19

సూర్యాస్తమయచంద్రోదయాదివర్ణనము.

తే. వనజముఖు యైనయయ్యినతనయ విరహ
తాపమునఁజేసి యెంతయుఁ దనువు నెడఁ ద
పించుటలు సూడ లేనట్టికించు వోలె
నినుఁడు చరమాద్రిపై వ్రాలె నింపు దక్కి. 20

చ. అధికవసుప్రభాకరుఁ డహస్కరుఁ డప్పటికాలకర్మదు
ర్విధిఁ జెడి తేజనుం దొఱఁగి వేడిన మిత్రుఁడు నాక వీకతో
నధమగతిం బడఁ గణిక యట్టిద యై దివి గెంటఁ దా మహో
దధిఁ బడ జారునో యనువిధంబునఁ జూడఁగ నయ్యె నయ్యెడన్. 21

క. పడమట దిక్కాంతామణి, పొడిచెడురే వెల్లు తన్ను మోహించుటకై
యొడలెల్లఁ బసుపు పూసిన,వడువునఁ గడసంజ కెంపు వర్ణింప నగున్.

చ. వననిధిఁ గ్రుంకుచోఁ దరణి పైపయి నట్టిటు లెత్తఁ గట్టిన
ట్లనువుగఁ బ్రాకుపగ్గములయట్టిమయూఖము లభ్రమండలం
బునఁ గన నయ్యెఁ జెంగలువపొల్తుకకు న్నెలకు న్వివాహముం
బొనరుచు కాలవిజ్ఞుఁ డిడఁ బొల్చెడు బంగరుచిచ్చుబుడ్డినాన్. 23

తే. తనకు నాగ్నేయధర్మంబు దారసించు
దిష్ట మదిగాన నల్లదె తిగ్మరశ్మి
యూర్ధ్వగతి నొందె ననఁ గగణోచ్ఛ్రియంబు
మీఁదుగాఁ బ్రాకె నెంతయు మిన్నుముట్టి. 24

తే. గర్భవతి గానఁ బ్రాగ్దిగంగన మొగంబు
తొలుత వెలవెలఁబాఱఁ బై నెలలు నిండ
ఘూకరుతముల మూల్గుచుఁ గొడుకుఁ గాంచె
నా సితద్యుతితో నెల నలువుమాఱె. 25

తే. ధృజతభూధరాదులను నిరాకరించి
నీరజాండభవాండంబు నించి దెసల
ముంచి ధరణీతలం బాక్రమించి మించెఁ
బండువెన్నెల కన్నులపండు వగుచు. 26

వ. ఇట్లు లోకం బెల్లఁ దనవశంబు చేసికొని వియోగుల మారుబారిం
బడవైచి రేయెల్లఁ బట్టపవలు గావించునో యనఁ బిండియాఱి విప్పి
నట్లు పండువెన్నెల కన్నుపండువై కాయుచుండె నప్పుడు. 27

ఉ. మిక్కిలి పొక్కుజక్కవల మేనుడికింపఁగ నగ్గిమంటయై
చక్కనిపద్మినీలతలసౌరడఁగింప హలాహలంబునై
నిక్కి నిశాచరుండు మెయి నిండఁగ సూదులు దూర్చె నాగ నా
చక్కెరబోఁడిఁ బూవుఁబొదసందుల వెన్నెల వచ్చి తాఁకినన్. 28

క. కనకనలాడెడు నిప్పుల
గనిఁ బడున ట్లగురుశయ్యకై వ్రాలి కడున్

వనటం బొంతలుచు రాసుత
వనజారిం గాంచి దూఱు బహువిధగతులన్. 29

చంద్రాద్యుపాలంభము.

చ. విను విషరాశిఁ బుట్టి యలవేడివెలుంగును జొచ్చి మాసముల్
ఘనలయకర్తమాళిఁ బడి గాటపుఁ జెల్మిని జేసి యగ్గితోఁ
గనఁబడునీవు వెన్నిషము గ్రక్కక వేఁడిమిఁ జూప కీజగ
జ్జనులను గాల్చిపుచ్చు కెటు సన్నక సన్నగఁ బోదు వోశశీ. 30

వ. అంత మన్మథు నుద్దేశించి. 31

ఆ. జగము లెల్లఁ బ్రోచుచల్లనితలిదండ్రు
లనఘుమూర్తు లతిదయార్ద్రచిత్తు
లైనసిరికి హరికి నాత్మజుండవు నీవు
కఠినచిత్తుఁ డగుట ఘనత యగునె. 32

మ. *అహహా! సత్కులజుండ వీవు కరుణాస్వాంతుండవే కాని యా
గహనాగంబుల మెట్టుదుష్టుఁడు మహాకష్టుండు భ్రష్టుండు న
స్వహము న్నిన్నుఁ గలంచువా రగుట మారా! మంచి నీ కెట్లగున్
సహవాసంబున దోస మబ్బు ననుబాసల్ రిత్త వో నేర్వనే. 33

వ. అంత మలయమారుతంబుపైఁ గినుకఁ జేసి. 34

ఆ. ప్రాణికోట్లకెల్లఁ బ్రాణంబ వీ వని
సకలశాస్త్రములును జాటుచుండు
నట్టిఘనుఁడ వీవు హాహా మదీయంబు
ప్రాణ మేల నీకు భరము చెపుమ. 35

తే. అంతకునిదిక్కునం బుట్టి యహివిషాగ్ని
తోగ్రధూత్కారములఁ జాల నుర్వీ చెచ్చు
వెఱఁగి యాశ్రయాశనిసఖ్య మెఱఁగి జగము
లెరియఁ జేసెడు నీ వొప్పు చెల్లు పవన. 36

*గహనాగంబుల మెట్టు దుష్టుఁడు=వసంతుఁడు; మహాకష్టుఁడు=చంద్రుఁడు; భ్రష్టుఁడు=వాయువు; ఈశబ్దములు నిందం చెలుపును.

మ. అలరుంబూవులతావి దెచ్చి యధికాహ్లాదంబు లోకంబులన్
గలయం జల్లెడుచల్లనయ్య వయినం గాలాహులుం దొట్టిపా
ములనోళ్లం బడి తద్విషాకలితదుర్మూర్తిం బ్రవర్తించునో
మలయప్రోద్భవ! నీవు దావమునకు న్మా అంచు నే నెంచెదన్. 37

వ. ఇట్లు విరహవేదనాభరంబున నొడ లెఱుంగక వెచ్చ నూర్చు నచ్చకో
రాక్షి నోదార్చుచు సఖీజనంబు లత్యంతదుఃఖాక్రాంతచిత్తలై తత్తఱం
పడుచు ననేకవిధశైత్యోపచారంబులు పొనరించి సేదదేర్చుచుండి
రయ్యవసరంబున. 38

ఆ. నిషధరాజుచేత నెఱి విడువంబడి
యంచపిండుతోడ హంసరాజు
మొయిలుదారిఁ బట్టి రయ మేరుపడ విద
ర్భాపురంబుఁ జేర వచ్చి యపుడు. 39

ఉ. నింగిన నిల్వరించి తననెయ్యుర నెల్లర "మిత్రులార! మీ
కుం గనవచ్చుచున్నదియె కుండినపత్తన మింతలోనఁ జే
రంగలవార మౌదు మదె రాజగృహంబులయందుఁ దూర్యముల్
గింగురువుట్ట మ్రోఁగెడిని గీతము తాళము నృత్య మేర్పడన్. 40

మ. ప్రమదల్ సంజవడన్ మనోహరులతో బాళి న్వినోదించుని
చ్చమెయిం జల్లనినీట నాడి తమి హెచ్చం గేశసంస్కారధూ
పముల న్వేసికొనంగ ధూమ మిదె సంభావింప నై ఘ్రాణప
ర్వము గావించు సుగంధబంధురమునై వర్ణింపనై కంటిరే. 41

మ. అదె కన్గొంటిరె రాజవేశ్మములపై నల్లారుముద్దై సుఖ
ప్రదమై తెల్లనికాంతు లెల్లెడలఁ బర్వం గాయు రేయెండలో
సుదతుల్ వెన్నెలవత్తు లాడుకొనుచున్ సువ్వాలలం బాడుచున్
మదనాస్త్రంబులు నా మెలంగెదరు సంభావింపనై యింతలోన్. 42

తే. వెన్నెలబయళ్ల విటు లదే వేశవాటి
గువ్వకరిగొని గుసగుస నవ్వుకొనుచుఁ
దిరుగుచుండిరి యిలునిల్లు దేబె లగుచు
మేటివెలయాండ్ర మోహించుమాటఁ జేసి. 43

క. ప్రమదావనమున నదిగో
ప్రమదలు విహరించుచున్న వారం దుండున్
దమయంతి యనుచు నాదుమ
ది మరాళములార! మనము దిగుద మచటికిన్."  44

వ. అని మరాళేశ్వరుం డానతిచ్చుటయు నవియును.  45

క. ఆళీజనంబుతో భూ,పాలాత్మజ మెలఁగుచుండఁ బ్రమదావనమం
దాలోన నవతరించెం, బోలింపఁగ నచటివారిపుణ్యం బనఁగన్.  46

క. ఒకొక్కకటి గాఁగ నక్కడఁ
జుక్కలు దివినుండి పడెడుచొప్పున నంచల్
మిక్కిలిరయ మేరుపడన్
తెక్కలచప్పుళ్లు మ్రోయ ఆవ్వున వ్రాలెన్.  47

ఉ. అమ్మహిళామతల్లులు ప్రియంబున నంచలపిండుఁ జూచి చి
త్తమ్మున నమ్మచెల్ల యని తద్దరిమంబున కిచ్చు మెచ్చి హా
ర్షమ్మున నొండొరుం గడచి సత్వర మేర్పడ వాని నల్లడన్
గ్రుమ్మరి పట్టి రొక్కొకరు కోరిక లీరిక లెత్త నత్తఱిన్.  48

ఆ. నలుఁడు పట్టి విడిచినకలహంస విదర్భ
రాజపుత్రిచెంతఁ దేజరిల్ల
దాని నామె పట్టెఁ దడవు సేయక వూని
మనమునందుఁ గోర్కి కొనలుసాఁగ.  49

వ. అంత నారాజహంస సఖీజనం బెడగలుగం జేసికొని యున్న యది
గావున మనుష్యవాక్యంబుల దమయంతి కిట్లనియె.  50

హంస దమయంతికడ నలునిసోయగం బభివర్ణించుట.

చ. నలుఁ డనుభూతలేశ్వరుఁ డనంగుఁడు రూపమునన్, దివాకరుం
డలఘుతరప్రతాపమున, నాకపురీశుఁడు వైభవంబునన్,
జ్వలనుఁడు తేజునన్, ఘనుఁడు చాగమునన్, సురసన్నిభుండు నా
డెలయఁగ వచ్చెడి న్నిషధదేశమునందు లతాంగి వింటివే.  51

చ. గమగమలాడుకుందనముకన్నను మిన్న యనంగ నొప్పురా
కొమరునిమేనిసోయగము కొన్ని దినంబులు వెల్లు యామినీ

రమణుని, మేను లేనిరతిరాజును, జెట్టుల మెట్టుమాధవున్
గ్రమమునఁ గెల్చి పొల్చుఁ ద్రిజగజ్జనసంస్తవనీయమై కడున్. 52

క. ఘన మని చెప్పఁగ నగు నా
తనిపెనునునుసోఁగనెఱులు ధరఁ గా దన స్త్రీ
జనములమదు లనునెమ్ములు
కనినంతన కుతుక మందఁ గాఁ గత మేమిా. 53

చ. మొగ మలచందురుం గరఁగి పోసి విధాత రచించె నంచు ముఁ
దగిలి కవీశ్వరుల్ నుడువ దబ్బఱ యం చనుకొందు రమ్మ! కాఁ
దగు నెల; వానిమోముఁ గనినంత నెలంతలకన్నుఁగల్వ లిం
పుగ వికసించెడిఁ నిజము బొం కరయం గద తేట తెల్ల మా. 54

తే. నలునిసోయగముఁ విని యిలకు వచ్చి
వేల్పువూఁబోం డ్లెపుడు ఱెప్ప వేయ కతనిఁ
జూతు రయ్యెబ్బెసమె వారిచూపులందు
నపుడు నిలుచుట నిమేష లైరి వారు. 55

క. నలుని వరించినరంభా,జలజేక్షణ తనదుకోర్కి సఫలము గామిఁ
నలకూబరుని వరించెఁ, నలవర్ణము లతనివేర నలువగుకతనన్. 56

సి. పురుడించు వరతేజమునను దివాకరు,
శూరత వాసవు సొంపుఁ గాంచుఁ
దలఁపించు గురుబుద్ధి దైవతాచార్యునిఁ
దాలిమి భూదేవి లీలఁ గెలుచుఁ
బొలుపొందుఁ దనుకాంతి కలువలతేఁడు నా
రూపున మారుని కేపు సూపు
సరిపోలు ధైర్యంబుసరణి హిమాద్రికి
గాంభీర్యమున దుగ్ధకంధిఁ బోలు

తే. దమము శమమును శాంతియు దాంతి కరుణ
తపము దానంబు బ్రాహ్మణతత్పరతయు
శౌచము మహాప్రభావము సాధువృత్తి
యతనియంద కా కన్యలయందు లేవు. 57

ఆ. అతని కీవు భార్య వగు దేని నీరూపు
నీదుపుట్టుగడయు నెలతమిన్న
సార్థకమ్ము లగును సాధ్వీమతల్లి వీ
వతని కీడు వత్తు వన్నిగతుల. 58

ఉ. చూచితి నెల్ల వేల్పులను జూచితి మానవలోకజస్తులన్
జూచితి భోగివర్యులను జూచితి నెల్లజగంబు లెందునుం
జూచి యెఱుంగ నట్టినృపసోముని, నైషధనాముఁ డాతఁడే
రాచకొలంపుమానికము రాజముఖ! తగు నీకు నన్నిటన్. 59

క. ఆనలభూపతి నాకుం
బ్రాణప్రతిమానుఁ డగుచుఁ బడఁతీ! కూర్చున్
నానుడు లతనికి వేదము
లై నచ్చిన వగుచు మిగుల నానంద మిడున్. 60

వ. అని రాజహంస ప్రశంసించినంత నంతరంగంబున సంతసించుచు దమ
యంతి యేకాంతంబున మరాళకాంతుం జూచి యి ట్లనియె. 61

తనకు నలునిం గూర్పుమని దమయంతి ప్రార్థించుట.

చ. ద్విజవర! నేఁడు నాహృదయవీథి దహించెడుతాప మెట్టిదో
ప్రజలకు నేరికిం దెలుపరానిద యయ్యెఁ ద్రపాభరంబునన్
నిజముగ నీవు నాదయిననెంజిలి వాపఁగ నైనవేల్ప వం
డజతను వంది వచ్చి తని నామన మెంతయు విశ్వసించెడిన్. 62

క. నలునిగుణంబులు వందులు
తెలియం జేయంగ విన్నదిన మాదిగ నా
పలుకులు హృదయము దేహము
నలార్పణము చేసి కట్టె నా నుంటిఁ గదే. 63

ఆ. నలుని నాకు నెఱుఁగఁ దెలిపినతెఱఁగున
నలున కీవు నన్నుఁ దెలియఁ జెప్పి
మరులు కొనఁగఁ జేయ మఱిమఱిఁ బ్రార్థింతు
నండజేంద్ర! నిన్ను నర్థిఁజేసి. 64

ఆ. అనుడు రాజహంస యను నీవు కన్నెవు
తండ్రివంక నున్న దాన వెన్న
నవలఁ గర్జ మెట్టు లగునొ నాకుం దల
వంపు లగునొ యనుడు వనిత మఱియు. 65

సీ. నలునిఁ గా దని యన్య వలచితినే రాత్రి
చందురు నొల్లనిచక్కి- నగుదు
నినునితోఁ బద్మినికిని బోలె నాప్రకా
శము నైషధునితోడ నమరుఁ జుమ్మి
యనలసంబంధమే యైనచో నా కప్పు
డనలసంబంధమే యగుఁ దలంప
నాపాలిపెన్నిధానము నలుం డాతనిఁ
గోరి చింతామణిఁ గోరఁబోవఁ

తే. బతగపుంగవ! యష్టదిక్పాలు లైనఁ
గంతుఁ డైన జయంతవసంతు లైన
సకలభువనేంద్రుఁ డైనను జంద్రుఁ డైన
నింద్రుఁ డైనను వాంఛింప నిది నిజంబ. 66

వ. ఇట్లు నానిశ్చయం బింక నీవు శంక దక్కి- నిషధదేశంబునకుం జని
సమయ మ్మెఱిఁగి మహారాజుం గాంచి వానికిన న్నెఱింగించి కార్యాను
సంధానంబు గావింపు మని మఱియును. 67

క. నైషధునిమర్మి రోషం, బీషత్తే గల్గి యున్నయెడ నామాటల్
భాషింప వలదు పైత్యవి, శేషము గలనాల్కకు సిత చేఁదగుఁ గాదే.

క. విం దారగించి తమలము, నొందుచు విశ్రాంతి గలిగి యుండినవేళ
సం దనుచు నెఱిఁగి నాదగు,సందేశము విన్న విపఁ జనుము ఖగేంద్రా.

ఆ. మనసు విఱుగకుండ మాటలాడుచు వాని
భావగతులు మాటబడి నెఱింగి
మఱియు నాదుమాట మది నాటునట్లుగాఁ
బొసఁగఁ జేసి వలుకఁ బూను మయ్య. 70

తే. నన్నుఁ గాదాడి కినిసెనే నయముఁ జూపి
మది విఱుగకుండునట్లుగా మాటలాడి

నిన్నుఁ గా కన్యు నొల్లదు నీవు గా ద
టన్న రాకన్నె లేనిద యనుము వగచి. 71

వ. అని యనేకవిధంబులం జెప్పి చెప్పి. 72

ఆ. వెతలు వాపి నన్ను బ్రదికింప నరిగెడు
నీదుమార్గమందు నెఱి నెసంగ
శుభము గలుగుఁ గాక చుట్టాలకు న్నీకుఁ
బోయిరమ్ము ద్విజకులాయతాక్ష్య. 73

క. అనవుడు హంసం బట్లగు
నని వీడ్కొని నిషధపురికి నరిగి సమస్తం
బును నలునిఁ దెలియఁ బలుకుచుఁ
జనియెద వీడ్కొలుపు మనుఁడు జనపతి మఱియున్. 74

వ. రాజహంసఁ గరంబులం గ్రుచ్చి కౌఁగిటం జేర్చి ముద్దు పెట్టుకొనుచు
నభిముఖంబు గావించుకొని యి ట్లనియె. 75

ఉ. అంతిపురంబునం గలుగునాం డ్రెవరేని యెఱుంగకుండ నా
యింతిని జూడఁ గల్గితివె? యెట్టిప్రసంగము తో ల్త నయ్యె? నీ
యంతన నీ వనం దెలియునట్లు వచించితొ? నన్ను గాంత యే
సంతసము న్వెలార్చుచుఁ బ్రశంస యొనర్చెనొ? చెప్పవే దయన్. 76

ఉ. నాదుప్రసంగ మాకెచెవి నాటినయప్పుడు తన్ముఖంబునం
దేదియునే వికార ముదయించినయట్టులు తోఁప వచ్చెనే
నీదగువాక్య మిష్టగతి నెచ్చెలి కిచ్చ జనింపఁ జేసెనే
కాదన లేదు గా నిను నొకానొకమాటకునే నసమ్మతిన్. 77

చ. నలుఁ డొకఁ డున్నవాఁ డనుచు నాతుక నీ వనఁగా నెఱిం గెనో
తొలుత నెఱే నెఱిం గినదొ తోఁపఁగ వచ్చెనె తద్విధంబు, నీ
పలుకున న న్వరించు నని భావము గల్గుట నీ వెఱుంగఁగాఁ
గలిగితె పల్కు లెగ్గతిఁ బ్రకాశము లయ్యెనొ చెప్పు మేర్పడన్. 78

ఆ. దూత వగుచు నాకు దూరమార్గము మెట్టి
పోయినట్టినిన్నుఁ బొలఁతిమిన్న

కనికరమునఁ జూచి గారవించినమాట
వినఁగ నభిలషింతు ద్విజవరేణ్య. 79

వ. అని పరిపరివిధంబులం బలికినదియె పలుకుచున్న రాజుం గాంచి మరాళ రాజంబు మందహాసభాసురంబుగా మఱియు ని ట్లనియె. 80

సీ. పోయి వచ్చిన దెల్లఁ బూస గ్రుచ్చినయట్లు
వినిచితి నోరాజ! వినియు వినియు
వినని తెఱంగున వినిపింపు మందు వ
ర్ణ్యాదరం బీరీతి నగును గాదె
చెప్పెద వినుము నీచే విడువంబడి
నే విదర్భకు నేఁగి నెలఁత నొంటిఁ
గని నే నలునిదూత ననినంత న న్నతి
గౌరవంబునఁ గాంచి కలికిమిన్న

తే నలుని వరియించి యుంటిని నాకు వానిఁ
గూర్పు మని నన్నుఁ బ్రార్థించెఁ గొంచె మేని
కినుక మోమున నెప్పుడుఁ గనఁగఁ బడదు
నిన్నుఁ గా కన్య నొల్ల దాయన్నువిన్న. 81

క. నలరాజ! నేను మసలితి
నలువం గొలువంగ నేగ నా కను నసుచుఁ
జెలువు గొని రాజహంసము
చెలికాఁయును దాను నెగసి చెచ్చెఱ జనియెన్. 82

వ. అట్లు కలహంస నలునకుఁ దమయంతికి ననోన్యానురాగంబు పుట్టించి చనినంత. 83

నలదమయంతులవిరహము.

క. నలుఁడును దమయంతియు నా,కలహంసము పలికినట్టి కారణమున మి
క్కిలి యైనమనసిజా ర్తిం, బలుగతులం బరితపించి బడలి రిరువురున్.

చ. మనసిజతాపసంక్షుభితమానసులై దమయంతియు న్నలుం
డును విరహంబు సైఁపక కడుంగడు వందుచు నందనంబులఁ

ఘనఘనసారపాంసుశశికాంతవితర్దులఁ బుష్పశయ్యలఁ
వనజవనంబుల న్నిలిచి నాళ్లులు వుచ్చిరి వెచ్చ నూర్చుచున్. 85

వ. అంత నట దమయంతియు. 86

సీ. రాయంచ వచియించి పోయినయది గోలె
నస్వస్థచిత్తయై యనుదినంబుఁ
జింతాజ్వరంబునఁ జెన్ను విడి వివర్ణ
వదనయై నిట్టూర్పు వదలి వదలి
దిక్కు లరయుచు నూర్ధ్వదృష్టియై ధ్యానించి
కన్నుల నశ్రువుల్ గాఱ నేడ్చి
తినక త్రావక కంటఁ గనక రేలుఁ బవళ్లుఁ
గునుకక పలుకక వనటఁ గుంది

తే. శయ్యఁ బొరలుచు బెదరుచు సారె సారె
కుహ్వా యనుచును బిలిచిన ట్లో యటంచుఁ
బలవరించుచు నున్మత్తవలె మెలఁగుచుఁ
గరము విరహజ్వరార్తయై పరితపించె 87

వ. ఇట్లు విరహతాపంబునం బరితపించు నమ్మించుఁబోఁడి శుకపికాదులం
దిలకించి వానిపై నలుకం జేసి. 88

*సీ. కీరమా! చటులవాక్పూరమా! త్రుళ్లకు
బావురుగాఁడు నాపజ్ఞఁ గలఁడు
కోకిలంబా! కలుషాకులంబా! యింక
నో రెత్తకుము వానకారు వచ్చు
భృంగమా! గీతప్రసంగమా! చాలు నీ
యెగిరిపా టిందు సంపగెలు గలవు
కోకమా! వంచితలోకమా! యింతలోఁ
బొగ రేల నీపాలఁ బ్రొద్దు గ్రుంకు

---

* బావురుగాఁడు=పిల్లియనియు, వైదూర్యమనియు నర్థము; గీతములోని రాజవిశేషణము లన్నియుఁ గీరాదులకు విరోధవస్తువులే. ఘనుఁడు=మేఘుఁడు, రాజు=చంద్రుఁడని;

తే. నెల్లరును నేమి చేసెద రింక నన్ను
భూరివై దూర్వ్యభూషణభూషితుండు
ఘనుఁడు చంపకమాలికాకలితగళుఁడు
నిషధరాజు నావై చయ నెఱపుఁ గాన. 89

వ. అ ట్లున్న దమయంతిం దిలకించి తత్తఱంపడి చెలిక త్తె లావృత్తాంతం బంతయు భీమభూపాలున కెఱిఁగించిన నతండు సంప్రాప్తయౌవన యగు తనకూఁతుం దలంచి కార్యం బెట్లు సమకూరునో యని చింతించి. 90

దమయంతీస్వయంవరోద్యమము.

చ. కొమరితకుఁ స్వయంవరము కోరిక లీరిక లెత్తఁ జేయ డెం
దమునఁ దలంచి భూతలమునం గలరాజుల నెల్లఁ బిల్వ వా
రమితచమూసమేతు లయి హస్తిరథాశ్వరవంబు మ్రోసి ది
క్కములయ మెల్ల నిండుకొనఁగాఁ జనుదెంచి రొగి న్విదర్భకున్. 91

క. వచ్చినవారల నెల్లం, బొచ్చెము లేకుండ భీమభూపాలుఁడు దా
నిచ్చుమెయి నాదరించుచు, నిచ్చె న్వారలకు విడుదు లెసకం బెసఁగన్.

తరువోజ.—

అక్కాలమున యందు నమరముఁనీంద్ర
లై నపర్వతనారదాఖ్యులు వార
లిక్కాశ్యపీతల మెల్లఁ గ్రుమ్మఱి మ
హేంద్రలోకమునకు నేగిన నింద్రుఁ
డక్కఱఁ బూజించి యడఁకువం గుశల
మడిగిన నారదుం డనియె నో దేవ!
మక్కువఁ గని యెల్లమాగాణములు గ్ర
మమున వచ్చితి మనామయులమై యిటకు

తే. ననిన విని పాకశాసనుం డనఘు ధర్మ
మున మహీపాలనము నేయుపురుషవరులు
యోధులై శస్త్రనిధనంబు నొంది యిటకు
నతిథులై రా రిదేమి నా కానతిమ్ము. 94

చ. అనవుడు నారదుం డనియె నయ్య బుధేశ్వర! భూతలంబునఁ
దనరు విదర్భరాజసుత దానిస్వయంవర మొప్పు నిప్పు డం
దున ధరణీంద్రు లెల్లరును దోరపురాసిరితోడ నప్పురం
బునకు గమించుచుండి రెదఁ బో రసుమాట దలంప కింతయున్. 95

ఆ ఉర్వీఁ గలుగుసర్వదోషిజ్జనమునందు
రత్నభూత యగుచు నూత్నయూవ
నమున నొప్పుచున్న నలినాక్షి దమయంతి
వాంఛ నేయనట్టివాఁ డెవండు. 96

*శా. కాకోలంబును వెన్నుఁ దన్ని విషధిక్ గష్టాత్మలై నిల్వుగ్రు
డ్లేకాలంబును గ్రాలఁ బుట్టి యెవరే నీక్షింపఁ జా ల్వారితోఁ
గైకో కెగ్గు చరించునప్సరస లాగంజూడ్కికాల్లోటితో
నేకొంచెంబును బోలఁ జాల రని వా కీఁ జాలి నే వచ్చితిన్. 97

†చ. నెఱి గలభీమరాజసుత నెమ్మొగమం దెలనవ్వు దోఁపఁగా
నెఱికలఁ గీలుగంటు నిడి నిద్దపువైకను దాల్చి తెప్పపా
ట్లొఱపును జూపఁ జూచుచు సముత్సకతం బొలుపొందుచుండ నే
తెఱవయు సాటిరా దనుచుఁ దెల్పుచునుంటిఁ ద్రిలోకవల్లభా. 98

క. అని పలుకుచున్న సమయం,బున నటకుఁ లోకపాలముఖ్యులు వేడ్కఁం
జనుదెంచి నారదోక్తి, న్వినివారుం దనరి రిచ్ఛ వెలఁదుకఁ జూడఁగా.

ఆ. దేవమౌని మఱియు దేవలోకములందు
నురగలోకమందు నరులలోక
మందు నామెఁ బోలుసుందరాంగి యొకర్తు
లేనిమాట నిజము లేఖులార. 100

ఇంద్రాదులు స్వయంవరమునకు వచ్చుట.

వ. అని వారి నామంత్రించి పర్వతనారదు లరిగినంత నంతకాగ్నివరుణు
లింద్రుం బురస్కరించుకొని విమానంబు లెక్కి దమయంతీస్వయం
వరదర్శనలాలసులై భూలోకంబునకుం బయనంబై రప్పుడు రంభో

* ఇందు-కాకోలము, విషధి, కష్టాత్మలు, నిలువుగ్రుడ్లు, అప్సరసలు, ఇవి నిందార్థ బోధకములు. † ఇందలివిశేషము లచ్చరలకు లే వనియు నవి మనోహరము లయినవనియు నభిప్రాయము.

ర్వశీ మేనకా తిలో త్తమా ఘృతాచీ ప్రముఖాప్సరోజనంబు తమ్ముఁ
గా దని దేవతావల్లభుండు భూలోకప్రయాణంబు సేయుట కోర్వఁ
జాలనియుల్లంబుల నొల్లంబోయి మొగంబుల విన్నదనంబు దోఁప
నోపికలు లేక తమలోనం దారు. 101

మ. మనసౌందర్యము గా దటంచు నొకసామాన్యావనీనాథక
న్యను గోరంతలు గొండయంత లని సన్మానించి త్రైలోక్యముం
గొని యేల్వీరునియంతవాఁ డడిగి కైకోఁ గోరి స్వర్గారవం
బును బోకార్చి గమించునట్టి ధర కీపోఁగాలముం గంటిరే. 102

మ. మనకంఱె రతికంఱెఁ దక్కినమహా మర్త్యాంగనాకోటికం
ఱెను సౌందర్యమునందు మేటి దమయంతీకన్య యంచుఁ విరిం
చనపుత్రుం డుచితత్వ మెంచఁడు ప్రశంసం జేసె మర్మింప కీ
ఘనవాహుండు ప్రయాణ మయ్యె నఁటె! యీకష్టంబు సామాన్యమే.

*ఉ.ఇక్కడివారిగౌరవము నేటను గల్పి బుభుక్షుఁ డేఁగి తా
నక్కడ మూట గట్టుకొనునట్టిది యెట్టిదొ మీఁద విందు రీ
రక్కట! దైవతంత్ర మొకయట్లుగ నై నకి దొంగకోడి చేఁ
జిక్కక త్రోసిరా జనినఁ జెప్పెడిదే మిఁక వీరిభాగ్యమున్. 104

క. కలహాప్రియుండు కన్యా,తిలకంబును దెలిపె నేని తెలుపఁగ వచ్చున్
జలజాక్షీకాలిగోటికిఁ, దులగా రచ్చర లటంచు దూఱెఁ మనలన్.

క. నిలువుంగుడ్డులవా రని
హాలాహలముతో వనంబునం దై రనియున్
ఖలచిత్త లనియు మనలన్
బలుఁదెఱఁగుల నాడె నతఁడు పరమర్షి యఁటే. 106

వ. అని మఱియు ననేకప్రకారంబులం దమలోఁ దారు ప్రసంగించు
కొనుచుండునమయంబున నింద్రాదులు విమానంబు లెక్కి భూతలం
బునకుం బ్రయాణంబు గావించి రప్పుడు. 107

చ. ఇరుగడ సొన్నపుందళుకు లీనెడుచిక్కనితొక్కదోయియున్
గురుతరపుచ్చముఁ మెడయుఁ గోలమొగంబును గ్రింద గిట్టి లఁ

* దొంగకోడి=అహల్యకై కోడియైనయింద్రుఁడు.

జరణయుగంబునుం గలిగి సంతతశబ్దముతో దివంబునఁ
గరుడులు వోలె వేలుపులఁ గైకొని యేఁగె విమానముల్ పడిన్.

చ. కని కనునంతలో మఱియుఁ గన్గొన నోపనియంతవేగముం
గొని దివి దేవయానములు కోటులు మేటులు యోజనంబు లొ
క్కనిమిషమంద దాఁటుచు నొకానొకయింతటిలో నిలాతలం
బునకు దిగెఁ విదర్భపురిపొంతన నాలుగు నాల్గుదిక్కులన్. 109

వ. అక్కలంబున. 110

చ. నలుఁడును రాజులెల్లరు ఘనం బగు పేర్మి విదర్భ కేఁగుటల్
తెలిసి మనంబునం దలరి తీరనికోరికఁ దానును న్మహో
జ్జ్వలవిభవంబునం దరలి వచ్చె మహం బరయ న్నరాకృతిఁ
వెలసినమన్మథుం డనఁగ వేడుకఁ గూర్చుచు నెల్లవారికిన్. 111

*సీ. నడగొండ లో యన నడబెడం గడరంగ
నడయాడు నేనికగడలు దనర
సుడిగొట్టునకు దీటువడునట్లు నట్టాడు
నడగండ్లమొత్తములు నడుమఁ బొదలఁ
బిడుగుపిల్ల లనంగ వడి గల్గి కడిమిమై
నడరెడునడజోదుదడము లొప్ప
గుడిగోపురంబుల బెడఁగు నడలఁ జేసి
గడిదేరుతేరులబడు లెసంగ

తే. బలసి చతురంగసైన్యముల్ కలయఁ బర్వ
వందిమాగధు లందందు వరుసఁ బాడఁ
గవులు గాయకులును మంత్రిగణము గొలువ
భద్రదంతావళము నెక్కి వచ్చె నలుఁడు. 112

వ. లోకపాలు రట్లు సపరివారుండై మార్తండుని తెఱంగున వెలుంగుచుం
బోవుచున్న నైషధుం గాంచి తద్రూపలావణ్యసంపదకు విస్మితులును
విగతసంకల్పులు నై విమానంబులు నింగి నిలువం బెట్టి ధరణీతలం

* వీనికగడలు=వీనుగుసమూహములు, సుడిగొట్టు=గాలి, నడగండ్లు=గుట్టములు, నడబోదులు=కాలిబంటు.

బున కవతరించి నలునిసన్నిధానంబు గల్పించుకొని పలుకరించి ప్రశంసించుచు నిట్లనిరి. 113

ఇంద్రాదులు నలుని దూతగా వరించుట.

ఉ. ఎవ్వరివాఁడ? వెవ్వలని కేఁగుచునుంటివి? నీదుకాపురం
బివ్వసుధాతలంబ కద? యెయ్యది నామము? రాచతేవ మై
నివ్వటిలుం దనంత గమనింపఁగ వచ్చెడు నైషధుండు నా
నవ్వల వీరసేనమనుజాధిపుపోలిక నీకుఁ గల్గుటన్. 114

ఉ. రాజకులప్రభూతుఁడ వరాతిన్నృపాలకమౌళిరత్ననీ
రాజితపాదపీఠుఁడవు రాజకళాకలితాచ్ఛకీర్తివి
భ్రాజితమూర్తి వార్తజనరక్షణతత్పరచిత్తవృత్తి వో
రాజ! నినుఁ నుతింతురు నిరంతరదానవిభూషణంబుగన్. 115

తే. నిన్ను నర్థింతు మే మన నృపుఁడు నేను
నైషధుఁడ వీరసేనునినందనుండ
నరుగుచుంటిని గార్యార్థి నగుచు నొండు
కడకు మీసమర్థన మేమొ నుడువవలయు. 116

వ. అనినం బరమానందకందళితాంతరంగుఁలై వా రతనిం గాంచి. 117

క. ఓసత్యవ్రత! నిషధే,శా! సాయము మాకుఁ జేయుమా దూతుఁడవై
నా సార్ద్రహృదయుఁడై నేఁ,జేసెద నని ప్రతిన చేసి చెచ్చెర నలుఁడున్.

తే. అంజలి ఘటించి యొయయ్యలార! మీర
లెవ్వ రే మీకు దూతనై యేమి కార్య
మాచరింపఁగ వలయు యథార్థగతుల
నానతిం డన దేవేంద్రు డనియె నిట్లు. 119

శా.ఏ నింద్రుండ నితండు వహ్ని వరుణుం డీతం డితం డంతకుం
డో నిర్దుష్టచరిత్ర! మే మవనిపై నొప్పారువైదర్భిఁ గై
కో నే తెంచితి మీవు దానికడ మాకోర్కి న్ని వేదించి మా
లో నేయొక్కరినే వరించునటు లీలోఁ జెప్పి యొప్పింపవే. 120

మ. అనినం బ్రాంజలియై నలుం డను మహాత్మా! నన్ను నేకార్థయు
క్తునిఁ బంపం దగునయ్య యత్నకుఁడ నేఁ గోర్కిం బ్రవర్తింతు నా

వనితం బొందఁగ దానిచెంత నెటు చెప్పఁ నేతు నన్యార్థ మ
త్యనుకంపాంచితచిత్తులై సయిచి న న్నాలింపుఁడీ మ్రొక్కెదన్. 121

వ. అనిన నింద్రాదిదేవత లాతనిం జూచి. 122

తే. తొలుతఁ జేయుదు నని నీవు పలికి యిట్లు
చేయఁ జాల నటం చని చెన్ను దఱుఁగ
నిపుడు పలుకంగఁ దగు నయ్య నృపలలామ!
పలికి బొంకుటకన్నఁ బాపంబు గలదె. 123

ఆ. అర్థియాచితార్థ మది కూర్పలేనట్టి, వానిజీవితంబు వ్యర్థ మిలకు
వాఁడు బరువువానివలెఁజెట్లు కొండలు,సాగరములుగావు క్ష్మాతలమున.

తే. *మనసునఁ వాక్కునం గాయమున నకార
మెన్నఁడును జేర నీయనిసన్నుతమతి
వగుచు దానిని ఖండించి నట్టిఁడ వయి
నలవరాహ్వయ మంది తోనరవరేణ్య. 125

ఉ. ఈతఁడు లేనివాఁ డగు మహీతలమం దని యర్థిమోముపై
థాత లిఖించినట్టిలిపి ధైర్యమునఁ మృష సేయఁ బోక నీ
వేతఱి లేమి లేనియతఁడే యని యర్థము సెప్పి యర్థి వి
ఖ్యాతధనాఢ్యుఁ జేసినమహాప్రతిపాదకమూర్తి వెన్నఁగన్. 126

మ. శివతాతీ! త్రిదివస్థకల్పమహిరు ట్సింతామణీ కామధే
నువు లుద్భిజ్జశిలా పశుత్వముల నై నూలొక్కల్ప నర్థింప నొ
ప్పవు నీచత్వగతిప్రసంగమున భూపాలాగ్రగణ్యుండవై
తవు నీ వెంతకుఁ జాల వర్థులమనోర్థం బెంచ నీకే తగున్. 127

వ. అంత దేవేంద్రుం డతనిఁదనచెంతకుంబిలిచి చేయిపట్టుకొని యేది
యె ట్లయినం గాని త్రిలోకేశ్వరుండ నగు నేను నిన్నర్థించుచుంటిం
గావున దేవకార్యంబు దీనిం దీర్పక తప్ప దిప్పుడ పా మ్మని పారిజాత
కుసుమదామం బఱుతం దగిలించిన నమ్మనుజేశ్వరుం డొండాడఁ
గూడమి సమ్మతించియు సురక్షితమ్ము లై నరాజవేశ్మ ము లే నెట్లు ప్రవే

* న=నకారమును, ల=లునుఁ ఛేదనే, లునాతి, ఖండించినవాఁడు గావున నలుఁ డయ్యె నని యర్థము.

శింపఁగల ననుటయు దేవేంద్రుం డౌ లె మ్మని యమ్మనుజేంద్రునకుఁ దిర స్కరిణీవిద్య నుపదేశించి నీవు మానుడికారంబున నొరులకంటం బడకుండ నందుఁ బ్రవేశింప నోపుదు పోయిరమ్ము నీవచ్చునంతకు మే మిందయందు మనుడు నతం డౌఁ గాత మని రథంబెక్కి కదలి చని విదర్భపురంబుకడ రథావరోహణంబు చేసి కాలినడం బురఁ బ్రవే శంబు గావించి తిరస్కరిణిం జేసి యొరులకంటం బడకుండ రాజ మార్గంబు వట్టి రాజభవనంబునం జొచ్చి కతిపయాంతరంబు లెల్ల నల్లనం గడచి పోవుచు నెదురు వడినవారిం దొలఁగి తప్పించు కొనుచు నెప్పు డెప్పుడు తప్పనిపని యైనఁ జూచి చూచి యొప్పవడిన వా రిది యేమి యబ్బురం బని డబ్బాట నివ్వెఱంపడి నిలిచి చూచు చుండ లోలో నవ్వుకొనుచు రాజభవనం బతిక్రమించి కాంతాజన సంతతసంచారంబునం జేసి దమయంతీశుద్ధాంతం బిది యని సిద్ధాంతీక రించుకొని ప్రవేశించునంతలో నత్యంతికంబున. 128

నలుఁడు దూతయై దమయంతికడకుఁ బోవుట.

సీ. తగుపచ్చఁజాకట్టు మగఁజాలగోడలు
నీలాలపని నెలఁజాలమెట్లు
నపరంజి నెడఁగూర్చునద్దాలకిటికీలు
పటికంపునునుద్వారబంధములును
దమ్మికెంపులఁ జెక్కుతలుపులు వైదూర్య
ములఁ జిల్లుపని గలవలభితలులు
పసి గలపవడంపునట్రుపకంబముల్
మేలిమిజాళువాదూలములును

తే. మఱియుఁ జిత్రవిచిత్రముల్ మలయుపనులు
గలిగి కన్నులపండువై కనుఁగొనంగ
నొగి హారం గలరాజెడునొక్కదివ్య
భవనమును గాంచె నారాజవల్లభుండు. 129

వ. కాంచి తదనుభావంబున కద్భుతంబు నొందుచు మించినవేడ్క మెయి నించుకించుక విలాససంచారంబు సేయుచుం బ్రవేశించునంతలోన.

చ. నలుఁ డదె వచ్చుచుండె లలనామణి! నీదువిశాలి యంతయున్
ఫలిత మగుం దొలంగెడిని బంచశరార్తియు నూఱడిల్లు మో
చెలి! యని నెచ్చెలుల్ వలుకఁ జిల్కలు కుల్కుచు నవ్వి వల్క భూ
తలపతి నాతిరస్కరిణి తప్పినదో యని సంశయించెడిన్. 131

చ. తనకడఁ బారిజాతసుమదామసుగంధము నల్కలంకుల
ఘనముగ ముట్ట నిట్టి దొకనాఁటికినేని యెఱుంగ మద్ధరా
మనుజులు చూడ రిద్ధి సురమాన్య మి చెక్కడినుండి వచ్చెనో
యని చెలులాడుకో విని ప్రియంపడు నానిషధేశ్వరుం డెడన్. 132

ఆ. సతతవాసనావశమునఁనో యన నలు
మైసువాసనల్ సుమాళి మిడుచు
నతివ! కలయఁ బర్వె నని దమయంతితో
ననఁగ విని నలుండు నలరె మదిని. 133

మ. నరనాథాగ్రణి భావుకీర్తిమణులక్ లగ్నంబుగా లాగికో
వరచేలాంచల మల్ల జారి పడుటన్ వక్షోజముల్ గప్పకే
తరుణీరత్న మొకర్తు వోవఁ గనుటల్ తప్పించుఁ దప్పించి మో
మరితిక్ వేఱొకవైపు గాఁ గలిగెఁ గాంతాంగాతిసంస్పర్శమున్. 134

మ. ఒకచో నింతులు బంతు లాడుకొనఁగా నుత్సాహముం జేసి మీఁ
దికి బంతి న్విసరంగఁ బోయి నలధాత్రీనాథుచేఁ జిక్కఁ ము
ద్రికచే నొక్కి యతండు దాని మరల వ్రేయంగ వా ర్విస్మయో
త్సుకలై చూపిరి దానిపై నలలిపుల్ చూపట్టుటల్ భైమికిన్. 135

మ. సుకుమారుం డట నైషధుండు "ముకమల్ సోఫా" పయి న్నేను నే
ర్చి కడం గందుకఁ జేళిఁ దేలుసఖుల వ్రీతి న్విలోకించుచో
సకి యొక్కర్తుక వచ్చి సంభ్రమముతో స్త్రీనాథుపై వ్రాలి లో
సుక మైన న్వెఱఁ గౌట నెచ్చెలుల కాచో వెల్లఁ జెప్పెం దగన్

తే. నిషధరా జొక్కచవికెలో నిలువ నటకుఁ
దటుకున న్వచ్చి యొకచేడె తనయురోజ
ముల నతని నొత్తి నలుగడం గలయఁ జూచి
పడియె నబ్రము తనసుఖస్పర్శమునకు. 137

క. ఆనాఁ డష్టమిఘటికలు
గాన సుఖస్పర్శ మగుటఁ గళ గరఁగి కడుఁ
మానసమున నానందము
మానిని దా ననుభవించె మఱీయుఁ మఱీయున్. 138

సీ. నలవిరహార్తిమై నవసినదమయంతి
కెలమి ఘటింపఁగా నెంచి చెలులు
నలునిభూమిక యొక్కనాతియు దమయంతి
భూమిక యొకతెయుఁ బొసఁగఁ దాల్చి
నాంది ప్రస్తావన నడపి రాయంచసం
దేశ మభినయించి తేజు వెంచి
పిదప స్వయంవరవిధి నైషధునికంఠ
మున భైమి పుష్పమాలను దగుల్ప
తే. నలుఁడు మోమున సిగ్గును నగవు దోఁప
హస్తమున సతీహస్తగ్రహణ మొనర్చెఁ
గాంచి సభ నున్న దమయంతి వాంచి మోము
సంతసమ్మున మందహాస మ్మొనర్చె. 139

మ. పదవిన్యాసము మందహాసమును నిశ్వాసక్షుతంబుల్ నుడుల్
పదచిహ్నంబులునుం బ్రతిధ్వనులు ద్వంద్వస్పర్శము ల్వాసనల్ [టన్
పొదలం జొచ్చుట మాయలాఁ డెవఁడొ రాఁబో ల్చూడుఁ డం చంత
వెదుకం జొచ్చిరి మచ్చెకంటులు భయాన్వీతాబలస్వాంతలై. 140

తే. గ్రహము సోఁకినయప్పు డీక్రమమ కాని
కలవు భయబాధ లప్పు డీగ్రహము సోఁక
నచట నానందసౌఖ్యము లంత కంత
కతిశయించుచు నొకపర్వ మయ్యె నపుడు. 141

వ. అట్లు తిరస్కరిణీప్రభావంబున నైషధేశ్వరుం డావిదర్భేశ్వర
కన్యాంతఃపురంబున నలుగడం గలయఁ గ్రుమ్మరి యొక్కచో నొక్క
రమణీయభద్రోదవసితాభ్యంతరంబున. 142

నలుఁడు దమయంతిం గాంచి ప్రశంసించుట.

మ. కనియెన్ భీమసుతన్, సతీజనసమాక్రాంతన్, నితాంతాంగసం
జనితాభాజ్వలితావరోధను, ఘనాంచత్కేశపాశన్, లస
త్తనుమధ్యన్, విభవాభిశోభితముఖన్, దన్వంగి, లోకైకశో
భననేత్రన్, వరవర్ణినిన్, దరుణి, విభ్రాజద్దుకూలావృతన్. 143

*చ. తరుణవయస్కుఁ డైనన్నృపతల్లజుదృష్టి విదర్భరాట్సుతా
వరపదమందుఁ బొందుపడి పై ననఁటుల్ స్పృశియించి పోయి యం
బరమున బావిలోఁ బడి క్రమంబున బంగరుమెట్ల నెక్కి భూ
ధరములసందునన్ బడి పథం బరయం జలియింపఁగ లేక దద్దిఱెన్.

క. కామశరం బననగు న
క్కోమలిఁ గనినంతమాత్రఁ గువలయపతికిన్
గామార్తి పొడమి పొడుగై
సామాన్యము గాక కూర్చె సంతాపంబున్. 145

మ. ఇది బంగారపుబొమ్మ యంద మన నేదీ తావి? మేల్జాజిపూ
లొదుగం గూర్చినబంతి యంద మన నేదో నైగనిగ్యంబు? పైం
పెదుగం గూడినమెర్మ లంద మన నున్నే నిల్కడల్? బమ్మ యీ
సుదతిం బోలిక లేనియట్లె సలిపెన్ క్షోణీస్థలి న్నేర్పునన్. 146

వ. అని ప్రశంసించుచు. 147

చ. చెలి కనురాగ మెప్పగిదిఁ జెన్నలరారుచునుండెనో కనన్
నలుఁ డిటు నట్టు మెట్టు చొకనట్టున మన్మథవిగ్రహంబు క
న్గలువల కగ్గ మైనఁ బరకాంతునిఁగాఁ దలపోసి యీసు లో
మొలవగఁ జెంత కేఁగి కనె మోహనమూర్తినిఁ బ్రక్కఁ బద్యమున్.

శా. ఆఁకేనిం దిన కాహరు న్వరునిగా నాశించునగ్గౌరికిన్
శోకంబుం దిగఁద్రావఁ జేసినమహాశూరుండ వోకామినీ

---

* ఇందు-విషయినిగరణము చెప్పంబడినది. పదము = పాదము; అనఁటుల్ = తొడలు; అంబరము = నడుము; బావి = బొడు; బంగరుమెట్లు = వళులు; భూధరములు = పాలిండ్లు; అని తెలియం దగు.

లోకాధార! రమాకుమార! కరుణ లోఁ బూని మాశైమి కా
వైకుంఠం బురుణించునైషధునిఁ గూర్పం గొల్తు మెప్పు న్నినున్.149

మ. అనుపద్యంబు పఠించి చెంతఁ బెడమోమై చూచుచుఁ దక్షిణుం
డనఁగా నున్న స్వవిగ్రహంబుకడ దీనాస్యంబు దోఁపం గరం
బు నెఱిం బూని కరంబు లెత్తి వినయంబుం జూపుచు న్వేఁడుక్రొ
న్ననఁబోఁడిఁ దమయంతిఁ జూచి నలుఁ డానందించె డెందంబునన్.

చ. నలుఁడు వరించుసోయగము నా కగునో యని దర్పణంబు కై
నిలిపి విదర్భరాజసుత నెమ్మొగముం గనుచుండ వెన్క నై
నలుఁడు నిజాకృతిం గనుఁగొనం బొనరించిన నామె విస్మయం
బొలయఁగ మోమున్ ద్రిప్పి యెదియుం గనఁ జాలక వంత వందురెన్.

తే. తనకు రాయంచ వ్రాసి యిచ్చినవిచిత్ర
ఫలకమును జూచుచుఁ బైమి పలుఁదెఱఁగుల
మనముఁ ద్రిప్పుచునుండ నమ్మనుజవిభుఁడు
వెనుకకుఁ లాగి వైచె నివ్వెఱ జనింప. 152

సీ. భూవిలుకాఁ డెంతపో యనం జాలురా
ఖామరులం జెప్పినఁ గోపగించు
బంగారుకొండపై రంగార నిన్నుఁ గూ
ర్చుండఁ బెట్టెద మన్న నొండు వలుకు
నంచ చెప్పినమాట లాసించి నలుఁ డటు
వానినే పెండ్లాడ వాంఛ సేయు
గేదంగిబొమ్మనే కా దన కరయుచు
నిరతంబు మెసవదు నిదురపోదు

తే. పలుకరించిన మనతోడఁ బలుకఁ బోవ
దంబరానట్టిపండ్లకు నాస సేయు
నకట దమయంతి యని చెలు లచట నచటఁ
బలుకుచుండఁగ విని తోఁడు వలపు వెంచె. 153

చ. అట నట నైషధప్రతిమ లాచవికెం గనిపింపఁగా నలుం
డటుఁ జని వానిమధ్యమునయందు నిలంబడి స్వస్వరూపసం

ఘటితవికాస మేర్పడఁగఁ గానఁగ వచ్చిన నోర్తు చోయి య
చ్చటి కది విగ్రహం బనుచు స్పర్శసుఖంబును బొందె నెమ్మదిన్. 154

వ. అయ్యవసరంబున దేవేంద్రప్రేరిత లగుదేవదూతికలు కొందఱు కొన్నిదివ్యోపాయనంబులు కొని కన్యాంతఃపురంబున కరుదెంచి దమయంతిం గాంచి తమ్మెఱింగించుకొని దేవసందేశంబు నివేదించిన వారిం దిలకించి గౌరవించి కూరుచుండ నియోగించి యమ్మించుఁబోఁడి పోడిమిం జూపుచు నిట్లనియె. 155

శా. ఏ నింద్రాదులకు న్నమస్కృతు లి వెన్నేఁ జేసి సేవించెదం
గానీ వారికిఁ బత్నినై త్రిదివసౌఖ్యం బందఁ గాంక్షింప నా
మే నానైషధచక్రవర్తి కెపుడో మేకొంచు నర్పించితిం
గానఁ మీ రిఁక నొండువల్కఁక చనంగా మిమ్ముఁ బ్రార్థించెదన్.

తే. అట్లు దూతికలం బల్కఁ యలరుఁబోఁడి
యుచితసత్కారముల వారి నుపచరించి
యంపిపుచ్చె నలుం డది యచట నుండి
కాంచి యెంతయు సంతోషకలితుఁ డయ్యె. 157

నలుఁడు దమయంతికి దర్శన మిచ్చుట.

వ. ఇట్లు కొంతసే పాశుద్ధాంతంబున విహరించుచుఁ బంచశరసంతప్త గాత్రుం డగునమ్మహీకళత్రుండు నిజరూపప్రదర్శనంబునకుం దగిన తరుణం బిది యని గ్రహించి దమయంతిసమక్షంబునకుం జని దేవదత్తశాంబరిం దిగఁద్రావి జలధరతిరోధానంబు వాసి ప్రకాశించు సంపూర్ణపూర్ణిమాచంద్రునిచందంబునం బ్రకాశించుచు. 158

శా. దేహచ్ఛాయఁ దదంతరాళమున నెందే సందు లేకుండ నా
గేహం బంతయు నిండఁ గన్గవరుచుల్ క్రీడింప నందందు సం
దేహస్ఫోరక మైననవ్వుమొగ మార్తిం గీర్తి సూపింపఁగా
నూహింపం దగనట్టివైఖరి నలుం డొప్పెన్ సభాగేహళిన్. 159

వ. అప్పు డప్పుడమితేనిం గనుంగొని సఖీజనంబు నయ వినయ భయ సంభ్రమ త్రపానురాగంబు లినుమడింప సముత్థానంబునఁ బ్రత్యుత్థానంబు గావించి మనంబులం బూజించి. 160

మ. అవురా రూప మయారె కాంతి బళిరే హావంబు మే ల్మేలు వై
భవ మయ్యారె విలాస మమ్మకచెలా భాగ్యం బితం డెవ్వాడో
దివిషద్వర్యుడొ యక్షవల్లభుడొకో దేదీప్యమానప్రభా
గవియా వచ్చెడు నంచు సిగ్గునను బల్కం జాల కున్నంతటన్. 161

మ. నలుమేనం గలగంధసారమున లీనంబైన సౌగంధ్యముం
గలయం జిమ్ముచు నైజవక్షమున వేడ్కంగూర్చుచుం దోప బం
తులవేళా శయనించుచోఁ బరునిమే ద్రోపాడినట్లాటలో
నెలమిం గాంచిన మించుబోడి యపు డెంతేసిగ్గు దోపం జనెన్. 162

మ. తనవక్షోజకురంగనాభ మపు డాధాత్రీతలాధీశుపై
పున ప్రేమగై యిరుపాయలై కనఁబడ్డ బోలించి క్రాల్గంటి యీ
ననఁ బోలోక్కమలదేహముం జదికెలోన న్నించిలిక్ చూఁకి నే
నని యెంతే ననుతాపముం దెలుపునాస్యం బొప్పఁ జెప్పంబగెన్. 163

వ. అట్టి యవసరంబున. 164

ఉ నవ్వు మొగంబునం జెలఁగునైషధునిం గని విస్మితాత్మయై
నవ్వు మొగంబు దోప నృపనందన పల్కె మనోహరాంగ! నీ
వెవ్వరివాఁడ వీక్కడకు నేటికి వచ్చితి వుగ్రశాసనుం
డివ్వసుధేశ్వరుండు పుర మెట్టులు సొచ్చితి చెప్పు మంతయున్. 165

వ. అని యంతలోన. 166

ఉ అంచ వచించినట్లు హృదయంబున నిల్పినవిగ్రహంబు క్రొ
మ్మించనఁ గన్ను దోయి మిఱుమి ట్లొదవించెడువిగ్రహంబు న
ట్లైంచఁగ నొక్కచక్కి నయి యిం పొనరింపఁగఁ గన్ను మూసి లోఁ
గాంచియుఁ గన్ను విచ్చి యెడఁ గాంచియుఁ బెంచెను విస్మయం బెడన్.

మ. కలహంసం బది కేతకీదళమునం గాల్గోటితో విగ్రహం
బెలవిన్ వ్రాసి వచించె నీతఁడు నలుం డీపాటిసౌందర్య మీ
యిలలోఁ గాదు మఱెట్టిలోకములయందే లేదు నిక్కంబువో
జలజాక్షీ! యని చెప్పఁ జెప్పినటు లీచార్వంగుఁ డొప్పుం గదా.

వ. అని తనపయ్యంటం బెట్టుకొనియున్న నలవిగ్రహించితకేతకీదళం బట్టె
తీసి చూచి లక్ష్యలక్షణసమన్వయంబు గావించుకొని. 169

తరళము.—

వినినచానికిఁ బోల నీతనివిగ్రహం బగు నీతఁ డా
జననుతుం డగునైషధుం డని చర్చ నేయఁగ వచ్చుఁ గా
ని నెఱీ వీడి యతండు తా నిటు నెచ్చెలు ల్గలచోటికిం
బని గలాఁ డయి దొంగదారుల వచ్చునే మునిమచ్చునాన్.

తే. ఇట్లు వచ్చుటకుం గత మెద్ది యేని
యుండ నోపెడు లేకున్న నుండ దిట్టు
లంతయును నవ్వల న్విచారింతుఁ గాక
యని తలంచి నెలంతుక మనమునందు. 171

వ. చెలిమిక త్తియలం దిలకించి కన్నుసన్నం జేసి కనకాసనంబు వెట్టించి యర్ఘ్యం బిప్పించుటయు నిషధరా జందు విశ్రమించి సంతసించుచు దమయంతిం గాంచి. 172

మ. ననుఁ గన్గొంచు మనంబునంచు మిగులఁ సందేహముఁ సాధ్వసం
బును బొందం బని లేదు వింత యయినం బో వచ్చు నొక్కింతలో
మనుజాతీతసమర్థలామహిమముల్ మానొందుటఁ రాజశా
సనభీతిఁ మది లెక్కసేయ కిటు లోచార్వంగి! నే వచ్చితిన్. 173

ఉ. ఇంటికి వచ్చె మ్రుచ్చువలె నీపురుషుం డెవఁ డొక్కొ యంచు నఁ
గెంటస మాడఁ బోవకుము నేను బరుండను గాను వేలుపుం
దంటలదూత నై నిను ముదంబునఁ గన్గొని పోవ వచ్చితిఁ
గుంఱెనకాఁడనం చనుటకుం దగ నోమహిళామతల్లివా. 174

నలుఁడు దేవసందేశంబు తెలియఁ జెప్పుట.

క. ఇం ద్రాగ్ని కృతాంత సము
ద్రేంద్రులు నిను వలచి నీకు నెఱిఁగించుటకుఁ
సాంద్రేచ్ఛ నన్నుఁ బుచ్చిరి
చంద్రముఖీ! యందు నొకనిఁ జను వరియింపన్. 175

ఉ. ముప్పదిమూఁడుకోట్ల సురపుంగవులం బని గొంచు మించి యె
ల్లప్పుడుఁ గోర్కి లిఁ గలుగునావు నగంబును మానికంబు తో
నొప్పుగఁ బారిజాతమహిజోన్నతనందనకేళికావనిం
జెప్పినరీతి నచ్చరలు సేవ యొనర్పఁగ నింద్రుఁ డొప్పెడున్. 176

మ తెగువం జేయుమఖంబులన్ ముఖమయి దేవళ్లకున్ హవ్య మీ
యగ మర్త్యాళికి నన్న మీయఁ గడుముఖ్యం బైనభూతంబ యై
తగి లోకంబుల నుద్ధరించుటకు నై తళ్కొత్తువై శ్వానరుం
డగు నోతన్వి! సమస్తలోకములయం దారాధ్యుఁడై తథ్యుఁడై 177

తే. మూడుమూర్తుల కిక్క యూప్రోడ గన్న
కొమరుఁడై ధర్మమూర్తియై శమనుఁ డగుచుఁ
బ్రాణికోటుల శాసించు ప్రభువు విభవ
వంతుఁ డగుఁ జూమ్మి సమవర్తి వారిజాక్షి. 178

ఆ. ఎల్లజగము బెదర వల్లెత్రాడుం దాల్చి
యేటిబోటిమగల కేలిక యయి
యఖలభువనములకు నధినాథుఁడై పశ్చి
మంబు నేలువరుణుఁ డంబుజాక్షి. 179

వ. వీరిలో నీయిచ్చనచ్చినవారిన్ వరించి నాదౌత్యంబు సఫలంబు గావింపు మేను వారిప్రభావంబునంజేసి యెొులకంటం బడకుండ నిరాటంకంబుగా నిట రాఁ గలిగితి నీవు వారిం బెండ్లి యాడితివేని దేవత్వంబు నొంది సర్వసౌఖ్యంబు లనుభవింతు వనిన నయ్యింతియు. 180

చ. హృదయము జల్లనంగ నిలువెల్ల వడంకఁగఁ జేష్ట దక్కి పె [చుఁ
ల్లాదవఁగ దుఃఖబాష్పము లదోో! యని పొక్కుచు వెక్కి క్రుంగు
మది నెదిరోో తలంపున సుమాళముతోఁ బచరించుచుండె ని
ట్లుదవద లైనచెయ్వు లుదయం బగుదెంచుట సంచలించుచున్. 181

వ. అని విచారించుచు నిజాక్షిభ్రూవిక్షేపాదుల వేలుపులయెడ ననాదరంబు సూపుచు నాపురుషునిదిక్కు మొగంబై. 182

ఉ భావజమూర్తి! నీ వెవరివాఁడవో చెప్పు మటన్న ని ట్లు నే
దైవతదూత నంటి వది తత్ప్రీతివాక్యము గాదు తండ్రిఁ బే
రోక్క వలయఁ స్వనామమును గూడ వచించుట పోలు నట్లు గా
కీవగ పోలునే తెలుపు మిప్పుడ యైనను నీదునామమున్. 183

వ. అనిన నతం డిట్లనియె. 184

తే. ప్రేష్యభావము నొంది నేఁ బేరు సెప్పు
టుచితముగఁ దోడుమిం జేసి యూరకుంటి
నీవు నే నసునవి చాలు నెదుటి పనికి
నడిగితివి గాన వినుము నే నవనివిభుఁడ. 185

తే. దారి యాదృచ్ఛికంబుగా దైవతములు
కలసి ననుఁ దూతగా నీదుకడకుఁ బుచ్చి
రతివ! నీపుణ్య మే మందు నమరులంత
వారు నిను వరించిరి వలవంతఁ బడుచు. 186

ఉ. వారలలోన నీ వొకని వారిజలోచన! పెండ్లియాడినన్
ధారణి నెంత లెంతలును దావకపాదనఖాగ్రకోటికిన్
దీరిచి పోల్పఁ జాలరని తెల్పుచునుంటిని నీదుపేర్మియున్
బేరును మ్రోయు లోకములఁ బెన్నిధు లన్నియు నిన్నుఁ జెందెడిన్.

ఆ. నీవు వారిలోన నేవానినే వరిం
చితివ యేని నేను జేసినట్టి
సుకృత మనుచుఁ దలఁతు సుదతి! నాదౌత్యము
సఫల మయ్యె ననుచు సంతసింతు. 188

వ. అనిన నిట్టూర్పు నిగిడించుచు దీనవదనయై దమయంతి. 189

దమయంతి దేవసందేశము నిరాకరించుట.

చ. పురుషవరేణ్య! వేల్పులకు మ్రొక్కు లొనర్చి భజించి వేఁడెదన్
నిరతము నూర్వశీప్రముఖనిర్జరవారవధూమణీసమూ
దరమున నొప్పువేల్పు లిటు ధాత్రి నొకానొకమర్త్యభామినిం
బరిణయ మాడఁ గోరుటలు బంగరువు న్విడి పెళ్లఁ గోరుటే. 190

చ. ఇది తగ దార్య! నేను నిషధేశ్వరుని న్నలు నొందఁ గోరి నా
హృదయము వాక్కు దేహమును నీభువియున్ దివి సాక్షులై కనన్
విదితము గాఁగ నల్లపృథివీపతి కల్పన చేసితిం దయా
స్పదుఁ డతఁ డొల్లకున్న విషవహ్నిజలాదుల కప్పగించెదన్. 191

ఆ. నలునిదాన నేను నాకేశ్వరాదుల
దాన నెట్లు లగుదు ధర్మశాస్త్ర
మెఱుఁగరోటు వార లెఱిఁగి యెఱిఁగి నా
వలను జూడ నెట్లు వలతు రకట! 192

చ. మఱిదొకమాట-నీ వెదియొ మానసమం దిడికొంచు వేల్పులక్
మఱి మఱి చెప్పుచుంటి విది మామకహృత్పథ మెక్క- దాసురల్
నెఱి గలయప్సరోంగనలనే స్తము గా దని గ్రుడ్డిగవ్వకే
గొఱవడునన్ను మానవిని గోరిరి నా నిది యొప్పి యుండునే. 193

క. వా రెక్క-డ నే నెక్క-డ
వా రమరులు నేను మర్త్యవనిత న్నాకున్
వారికిఁ బొం దది దోమకు
హారణమున కట్టులుండు వల దానుడుగుల్. 194

వ. అనిన నలుండు వెండియు. 195

చ. పెడతలఁ బట్టి నీదుమతి వెట్టివి వేలుపులంత వారు ని
న్నడుగుచునుండఁ గా దనుచు నల్పతృణంబును బోని యన్నలున్
జడమతి భూభుజాధముని సారవిహీనుని భేదమానవున్
విడను వరింతు నంటి వవివేకిని వే మన వచ్చు ని న్నిఁకన్. 196

వ. అనిన దమయంతి కంట నీరు గ్రుక్కు-కొనుచు నుడుకుమనంబున
నించు కాగ్రహంబు వహించి యి ట్లనియె. 197

### దమయంతి దేవతల నిరాకరించుట.

ఆ. వల దటన్న బూతు వలె వేలుపులగొప్ప
తనము పొగడఁ జొచ్చి తనుసరించి
వారిగొప్ప వారిసొరు వారిప్రవర్త
నము నెఱుంగకుండు నరుఁ డెవండు. 198

సీ. కను తెప్పవేయక కనెడునిలువు గ్రుడ్లు
పీనుఁగు గ్రుడ్లు నా బీతు గొలుపు
నాథుల నడఁగించి హాయి కూర్చెడికూర్కు-
సుగము వారలకన్నుదుగకు లేదు

కఱవునఁ దినఁ ద్రావఁగా లేక సతము వా
రవనిదేవులయిండ్ల నాశ్రయింతు
వరుసవావులు లేవు వారిప్రవర్తన
మచ్చరలఁ దలంప నరయ వచ్చు

ఆ. నొకఁడు దొంగకోడి యొకఁడు ధూమ్రాననుం
డొకఁడు ప్రాణికోటి నుక్కఁడంచు
నొకఁడు నీళ్లుగారునొడలితో నుండు నీ
పాటివారిఁ జెప్ప నేటి కధిప. 199

చ. పుడమికి భూషణం బగుచుఁ బుట్టిననైషధభూత లేంద్రునిఁ
జడమతియు న్న రాధముఁడు సారవిహీనుఁడు కూటివేద యం
చుడుగక యాడవచ్చితి వయో నిను నే మనఁ దోఁప దీవు నా
యెడ నరయంగ వచ్చినమహీతలనేత వటంచు నెంచెదన్. 200

ఆ. ఎట్టివాఁడు గాని యే నలునిం గాక
దేవదేవుఁ డరుగుదెంచి నన్వా
రించె నేని వాని నించుకైనం గంటఁ
గాంచుదానఁ గాను గాను నిజము. 201

తే. అనిన నలుఁ డను భీమరాట్తనయఁ గాంచి
పటి చెప్పినమాటలు పట్టి నీవు
వూరికిం గానినైషధుఁ గోరి యుంటి
వాతఁ డొల్లఁడు వేల్పులభీతివలన. 202

ఆ. అనుడు మాట లేక హరిణాక్షి హృదయంబు
జల్లు మనఁగ శోకసాగరంబు
పొంగె ననఁగ నశ్రుపూరంబు కన్దోయి
వెల్లివిరియ నేడ్చె వెక్కి వెక్కి. 203

ఉ. కుండలఁ గ్రుమ్మఱించుగతిఁ గొల్కులఁ గాఱెడు బాష్పపూరముల్
గండములందు జాఱి చిబుకంబున నైక్యము నొంది దండిచ
న్దొండలఁ జిందువం దగుచు గొబ్బున నేలకుఁ జేరి కాల్వలై
కొండొకయింత పాఱెఁ గనుఁగోఁ బెరచేనియ జాలి పుట్టఁగన్. 204

ఆ. కలికివేడివేడి కాటుకకన్నీరు, కాల్వ లగుచు నిలకుఁ గాఱుచుండ
గంధకోష్ణ మైనగనినుండి కాళింది,పఱచుచున్న దనఁగ నరయ నయ్యె.

వ. ఇట్లు గాద్దదికనిరుద్ధకంఠనాళయై కన్యకామణి కన్నీళ్లు లే ళ్లయి పాఱ నేడ్చుచుండుటయు. 206

ఉ. ఏడ్చెడుదానిఁ జూచి యొకయించుక సైఁపఁగ లేక కన్దుగ్ఁ
విడ్చుచు నశ్రుపూరములు వెల్లువయై ప్రవహింప దుఃఖముం
గుడ్చుచు వెక్కిఁమ్రింగుచును గుత్తుక గాద్దదికంబు హత్తఁగా
నడ్చుచు నిట్లు నట్లును మనంబున నింతయుఁ దోఁప నట్టిఁదై. 207

నలుఁడు దమయంతికిఁ ద న్నెఱిఁగించుట.

ఆ. భైమిచెంత కేఁగి పరికించి నైషధుం
డెదిరిఁ ద న్నొకింత యెఱుఁగ లేక
వివశుఁ డగుచు నేనె వీరసేనసుతుండ
నలుఁడ వగఫు మాని నన్నుఁ గనుము. 208

వ. అనిసంత దమయంతి యట్టె కన్నుఁ దెఱచి తనమనోవల్లభు నల్లనం గని పోయిన ప్రాణంబులు మరలం గూటంబడినట్లు స్థిమితపడి లజ్జా భయసంభ్రమంబు లభినయించుచు లేచి దేవతలకు నమోవాకంబు చేసి తనమనోరథం బెల్ల వెల్లడించుచు నలునకు నమస్కారంబు గావించి యి ట్లనియె. 209

మ. నలసాదృశ్యము నీయెడం గలుగుట న్నాచిత్త మస్యుండు వో
తిలకింపం దగ దంచుఁ జెప్పమి నిఁక న్నీదివ్యనామాక్షరం
బులు బంతిం గన నోట నద్దమున నీపూజ్యాకృతుల్ దోఁచుటఁ
దెలియ న్వచ్చెను నీవు చెప్పనపుడే నీవే నలుండం చెదన్. 210

మ. కలహంసం బది ప్రస్తుతించుట మొదల్ గా నిన్నె చిత్తంబునం
దలఁతుఁ నాదగువాక్కుఁ కాయమును మీథాశక్తులుఁ యుక్తులుఁ
గలసర్వస్వము నీపయిఁ నిలిపి నిఁ గాంక్షించి యుంటి న్మహీ
తలనాథాగ్రణి! బాస చేసెద యథార్థం బంచు నీయంతయున్. 211

క. దేవళ్లకు జోహా రిడి, యోవల్లభ! నిను వరింతు నొండొక్కని నే
నేవరుసవాని నైనఁ, భావించి వరింప. నిజము పలికితి నిచటన్. 218

వ. అని విన్నవించి. 219

ఆ. మగువ కేలుదోయి మొగిచి మేను చలింప
నిలిచియున్నఁ జూచి నలుఁడు దూత
నగుచు నేఁ బరార్థ మరుదెంచి స్వార్థము
సలుపుకొనుట ధర్మసరణి యగునె. 220

వ. అనిన నొక్కింత చింతించి దమయంతి బాష్పావిలనయనయుగళయై
వెండియు. 221

ఉ. కంటి నుపాయ మొక్కఁడు జగన్నుత! చెప్పెద విన్ము నీవునుం
బంటవలంతిసాములు సుపర్వవరేణ్యులు వచ్చి యుండ నా
యింట స్వయంవరంబునకు నెల్లరసన్నిధి నిట్ట వరింతు నే
నంటదు దాన దోష మిసుమంతయు నీకు నెఱుంగఁ బోలెడిన్. 222

వ. అని నిరపాయం బగునుపాయంబు సెప్పిన నప్పురుషోత్తముఁ డమ్మత్త
కాశిని వీడుకొని పో నెంచి యెఱింగించి కన్నుల ననుజ్ఞం గాంచి
యించుక సంచరించి తిరస్కరిణి నవధరించె నంతలోన 223

నలుఁడు దమయంతి వీడ్కొని పోవుట.

చ. చనియెద నన్నమాట విని చాన గుభుల్లని గుండె తల్లడం
బునఁ బడ మాటలాడుటకుఁ బోలనిదై యటు మోము నిల్పి చె
ల్వునిపయిఁ గన్ను వైచి త్రుటిలోన నదృశ్యత తోఁచినంతఁ బె
ల్చున కనుఁదోయిఁ ద్రిప్పుకొనఁ జాలనిదై వలవంత వందెఁగెన్. 224

ఉ. కంటికిఁ జాటు కంబ మటఁ గాంతునివల్వము గానవచ్చు నా
వెంటన పోవుచుండె నదె వెక్కసు వచ్చెడు నేమొ చెప్పిపో
నంటులసందునఁ నడచున ట్లగపడ్డటు లయ్యె నంచు వా
ల్గంటి మనోవికారమునఁ గాననిదై యట నుండెఁ గాంచుచున్. 225

వ. ఇంతలో నలుండు లోకపాలురపాలికిం బోయి పొడసూపిన వారు
నీ వెట్లు పోయి వచ్చితి వేమి వృత్తాంతం బని యడుగుటయు
నతండు వారి కభివందనంబు చేసి యింద్రుం గాంచి యి ట్లనియె. 226

మ. భవదాజ్ఞం గొని పోయి యంతిపురి నాభైమి న్వీలోకించి నేఁ
దవురీతి న్మిముఁ దెల్పితిం బొగడుచుం దన్వంగి న న్గాక యు
త్సవమం దెవ్వరిని న్వరింప ననుచుఁ సత్యంబు వాక్రుచ్చె నో
దివిషన్నాయకులార! వేరమి రవంతే లేదు నావాకులన్. 227

వ. అని చెప్పి వారియనుజ్ఞం గొని నలుండు యథేచ్ఛం జనియె నని చెప్పటయు నైమిశారణ్యవాసు లవ్వలివృత్తాంతంబు చెప్పు మని సూతు నడుగుటయును. 228

ఆశ్వాసాంతము.

మ. వెలనాఁటి ద్విజశేఖరుండు సుగుణాన్వీతుండు పూతాన్వయో
జ్జ్వలకీర్తిప్రథితుండు మండలసభాసభ్యత్వసంపాదితా
స్థలసత్కీర్తసమాశ్రయుండు సుకవివ్రాతస్తుతుం డాంగ్లభూ
తలభాషానిపుణుండు పెంపలరు సీతాప్రాణనాథుం డిలన్. 229

గద్యము. ఇది శ్రీమహామహోపాధ్యాయ, కలాప్రపూర్ణ, కవిరాజ, కవిసార్వభౌమ శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి ప్రణీతంబయిన నైషధీయ చరితం బనుశృంగారతరంగిణియందుఁ దృతీయతరంగము.

శ్రీ. శ్రీ. శ్రీ.

నన్నిదిక్కుల యంత్రదీపాళిఁ బెట్టి
పురముఁ గైసేసి రెల్లెడ ముదము గదుర. 3

మ. ప్రతివీథిం బ్రతిచత్వరంబునఁ బ్రతిద్వారంబున న్నేర్పునం
బ్రతిపాదించినకీలుబొమ్మ లటకుఁ రా నెవ్వారే లేచి స
త్కృతి గావించెడునాఁగ నింత చని తోఁ తే నై సుఖాసంబు వై
చి తగఁ వీవన వీచి యాఁకుమడుపుల్ చేసేత నందిచ్చెడున్. 4

మ. పురవీథిం జనునట్టిజానపదు లెప్డుఁ గిట్టునం దిర్గుచుఁ
మరుదాఘ్రి న్వెదచల్లుచక్రములు, నంభస్సారము న్నీఁదికిఁ
విరియం జేసెడుగొట్టముల్, దివియల న్వెల్లించుకాచంబులుఁ
బరిశీలించిరి నేత భూతముల నాఘక్కిం బ్రబంధించె నాన్. 5

ఉ. మాటల నాడుతీవలును, మానుగ సంజ్ఞలఁ జేయుతీవలుఁ
మాటికి మాటి కార్చుచును మార్గములం దిరుగాడు నుక్కుబం
డ్లోటమి లేక సంతత మహో యనఁ గాలముఁ దెల్పుకంబముల్
వీట సమస్తదేశముల విజ్ఞులు నిల్పిరి రాజునాజ్ఞమై. 6

చ. గరుడులు వోల్విమానము లఖండగతిం దివమందు జీవ్వుర్వఁ
గురురవ ముప్పతిల్ల నొకకొంతటిలోఁ బుర మెల్లఁ జుట్టి రా
జపుచు మీఁదిమీఁదికిని సాఁగ నొనర్చుచుఁ జేర్చి పేరెముల్
దిరుగఁగఁ జేయుచుం బురిఁ బదింబదిగా నడపింత్రు నేర్పరుల్. 7

తే. పల్లకీ లందలమ్ములు భద్రకరులు
తేరు లశ్వంబు లుష్ట్రముల్ వీరభటులు
దారులఁ సంబడింపఁగఁ దేరి పురము
పట్టఁ బగ్గము లేకుండఁ బరఁగె నపుడు. 8

రాజులెల్లరు స్వయంవరాంగణం బలంకరించుట.

తే. తనదుశుభ లేఖ లంది భూజనులు రాజ
వరులు బంధువులు న్విప్రవరులు రాఁగ
వారలకు నొప్పువిడియలు వలయుసత్కృ
తుల నొనర్చెను భీమభూతలవిభుండు. 9

శా. నానాయంత్రసమావృతంబును సువర్ణప్రాంచితంబున్ విచి
త్రానూనప్రతిమాంగకస్థగితరత్నాపూర్వశోభాలస
త్థానానందము సుందరాంగనృపమంచప్రావృతంబున్ విశా
లానంతాస్థవినిర్మితాంతరతలం బై యోలగం బొప్పెడున్. 15

వ. అప్పు డాస్వయంవరమహోత్సవదర్శనమనోరథంబునం జేసి నానా భూమిభాగంబులనుండి రాజన్యనందనులె కాక భూలోకంబునం గల బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రసమూహంబులును, దేవలోకంబునుండి దేవతాకదంబంబులును, వివిధస్థలంబులనుండి దేవర్షిబ్రహ్మర్షిసందోహంబులును, వారాంగనాజనవ్యూహంబులును, పండితప్రకాండులును, కవులుం గాయకులును, లోనగువారు వేనవేలు వచ్చి సభాస్థలం బలంకరించి రయ్యెడ భీమభూపాలుండు నిజపుత్రికయుం దానును శిబికల నధిరోహించి చనుదెంచి సభాముఖంబునం దిగి యభ్యంతరం బున కరుగుదెంచి రంత దమయంతి సఖీజనపరివృతయై మదనదేవతా మోహనమంత్రశక్తి యనం బొలిచి మెల్లమెల్ల నడుగు లిడుచు. 16

దమయంతి స్వయంవరరంగంబునకు వచ్చుట.

సీ. సంపఁగెఁ దల రాసి చక్కనౌ నెఱుకలు
కర మరుదందఁ గీల్గంటు వైచి
పున్నమచందురుపోల్కి నున్నట్టి నె
మ్మోమునఁ గస్తూరిబొట్టు వెట్టి
కన్నాకురతనంపుఁ బొన్నసొమ్ములు దాల్చి
రాణించుపైఁ రాణిరవికఁ దొడిగి
బంగారునీరారుపసఁ గేరు జలతారు
చెఱఁగుల నొప్పారుచీరఁ గట్టి

తే. అందె లంతంత గల్లుగ ల్లనుచు మ్రోయఁ
జెలఁగి కుచ్చెళ్లు మీఁగాళ్లఁ జిందులాడఁ
గౌను నసియాడఁ జెలులచేయూని రచ్చ
కరుగుదెంచెను రాచూలి మెఱుఁగు వోలె. 17

వ. అయ్యవసరంబున. 18

ఉ. కన్నులకర్వు దీఱ నలకోమలిఁ జూతు మటంచు నెంచి యం
దున్న జనుల్ ప్రయత్నమున నున్న తగాత్రు లుదాత్తకంఠులై
క్రన్నన నెల్ల రొక్కపరిఁ గన్గవ విచ్చినయంతఁ గాంతమై
గ్రొన్నెలనాఁ మెఱుంగువలెఁ గొల్వుఁ గడుఁ మిఱుమిట్లు దృష్టకున్.

తే. అంత దమయంతి నిజదేహకాంతి నృపులఁ
జూపులం గొట్టి మనములు చూఱలాడ
మెట్టుచు న్వచ్చె నచ్చటి కట్టియెడల
మెఱుపుఁదీవ తెఱంగున మెఱసి మెఱసి. 20

క. బంగారుబొమ్మవోలెఁ, రంగారెడుదానిమేన రాజులదృష్టుల్
సంగతము నొంది కదలని,భంగిఁ దీపించె నపుడు బహుచిత్రముగన్.

వ. ఆసమయంబున విదర్భాపురీశ్వరుండు కొలువు గలయం బరికించి యుదాత్తచరిత్రు లగువీరి నెల్ల నభివర్ణించి దమయంతికిం దెలియఁ జెప్పి యొప్పింపఁ బ్రైలోక్యజనని యగుశారదాదేవి తక్కఁ దక్కినవా రెవ్వరుం జాల రని విచారించి యమ్మహాదేవి నంతరంగంబునం దిడుకొని లేచి చేతులు జోడించుకొని కన్యాసహితుండై యి ట్లని ప్రార్థించె. 22

భీమరాజు సరస్వతిం బ్రార్థించి ప్రత్యక్షంబు చేసికొనుట.

దండకము. జయ జనని! జగత్త్రయారాధ్య పద్మాలయాభర్తృనాభీసరో
జోద్భవాస్యాంతరంగాతిశృంగారరంగానురంగత్త్రయీ శీర్షికాసోమ
లాంగీ సహావాసబద్ధప్రసిద్ధాతిసఖ్యే! జగద్బద్ధశుద్ధానఘాఖ్యే! మహా
హీరహారామలాంగప్రభాజాల దూరీకృతాత్మీయభక్తాంతరంగాను
షంగన్మహాజ్ఞానగాఢాంధకారే! నిరస్తాధికాంతర్వికారే! పరే!
హరిహరపురుహూతముఖ్యామరవ్రాతకోటీర విన్యస్త రత్నప్రభా
సారనీరాజితాంఘ్రిద్వయీమంజుమంజీర శింజన్మణీపుంజ రంజద్రవా
క్రాంతవిద్వత్కవిశ్రేష్ఠజిహ్వాగ్రభాగే! సుభాగే! లసద్వల్లకీదండ
విభ్రాజమానాంగుళీ పల్లవాత్యంతసంభూత సంగీతరాగానులాపద్రవీ
భూత శీతాంశురేఖాశిరోభూషణార్ధీకృతామోదమోదావహై
ణాంగపంకాంకితాస్యే! మునీనా ముపాస్యే! మధుస్యందివాగ్వై

ఖరీబోధితం పాణిపద్మోపరిప్రస్థితం పంచవర్ణాంచితం కీరరాజం సదా
లాలయంతి! ద్విషం వాలయంతి! ద్విజాఁ పాలయంతి! స్థిరాఁ
భూషయంతి! స్థిరే! చిదతిపిహితగహ్వారిపుష్కరాశావకాశే!
సతాం సుప్రకాశే! మరాళేశ్వరాశ్వోచ్చసంచారలోలశ్రవోభూష
ణాబ్జోచ్చలద్భృంగనాదశ్రుతీష్టప్రహర్షేషుణే! శిష్టసంరక్షణే బద్ధ
దీక్షే! త్రిలోకైకదక్షే! భవద్దాసదాసానుదాసం ప్రతీ ర్ష్యాదక్ష
మాం రక్ష రక్షాబ్జహస్తే! సురానీకశస్తే! కళాసుప్రశస్తే! నమస్తే
నమస్తే నమః. 23

వ. అని ప్రార్థించుచున్న సమయంబున. 24

సీ. సిరముపూఁ బూపచందురునివెన్నెలలోఁ ని
గారంపుఁదెలిమేనికళలు నెఱయఁ
బాణి నాడెడుచిల్కపల్కులు మీఁటువ
ల్లకి కనుగుణతాళలయలు గాఁగ
నుపనిషత్తులు నిత్యముడిగంపుఁజెలియలై
యిరుచక్కి వీచోపు లిడుచునుండ
నొండొంటఁ బయ్యంట నొరయుసంగీతసా
హిత్యద్వయంబున నెసఁగ సరులు

తే. అంచవాహమం దూర్మి నధివసించి
పంచమశ్రుతి వీణ వాయించుకొనుచు
వివిధవిద్యావిధాత్రి సావిత్రి రాజ
చంద్రునిసమక్షమందు సాక్షాత్కరించె. 25

తే. అట్లు సాక్షాత్కరించినయజునిరాణి
నీక్షణము చేసి భక్తి భీమక్షితీశుఁ
డంఘ్రిపద్మములందు సాష్టాంగ మెఱఁగి
వినయవినమితగాత్రుఁడై వినుతి చేసె. 26

తే. నృపునిసంప్రార్థనంబున నపుడు కెలన
వెలసియున్నట్టివాఁడేవి విశదముగను

గక్కెదుటఁ గాంచి కొలువెల్ల నక్కె లేచి
చేతు లెత్తి నమస్కృతుల్ చేసె నపుడు. 27

వ. విదర్భేశ్వరుండును వాగీశ్వరికి నాదిగ వర్భేశ్వరి యగునిజనందనచే నమస్కారంబు చేయించి తల్లీ! దీనిస్వయంవరోత్సవంబు ప్రవర్తిల్లం జేయువాఁడ నై రాజుల నెల్ల రాఁ బిలిచితి వీరిపారుష్యాది గుణంబు లభివర్ణించి చెప్పుటకు నోడ్ల నెవ్వరిం బొడఁగానక మదు పాస్యదైవతంబ వయిన ని న్నిట్లు ప్రార్థించి ప్రత్యక్షంబు గావించు కొంటి నీ వీబాలికమనోరథంబు దీర్ప ననుగ్రహింపు మని వేఁడుచు నాత్మజాత నప్పనంబు గావించుటయు నామె యాముగుద నాశీర్వ దించి కరంబు గరంబునం గ్రహించి యించుక పదవిన్యాసంబు నేయం జొచ్చె నప్పుడు. 28

చ. జనకునిచెంత నున్నపుడు జాడ లెఱింగియు భైమి భ్రాతతోఁ
జనియెడునప్డు పోల్చుకొనఁ జాలక కొల్వున నున్న వారు వా
క్కును దమయంతియే యనుచుఁ గోరిక లీరిక లెత్తఁ బ్రేముడిం
గనుఁగొను చౌను గా దనుచు గాటపు సందియ మంది రందఱున్.

సీ. రూపలావణ్యాదిరూఢసంపద లెన్న నున్న వా రిర్వురు నొక్కరీతి
స్థూలసూక్ష్మాదివయోలక్షణము లెన్న నున్న వా రిర్వురు నొక్కరీతి
వేషభాషాదిసద్విజ్ఞానముల నెన్న నున్న వా రిర్వురు నొక్కరీతి
హాసవిలాసగతాదిగుణము లెన్న నున్న వా రిర్వురు నొక్కరీతి

తే. తాఁయుమా అయి యిటు నట్టు మాఁయుచుండు
రిరువు రిం దేది దమయంతి యేది నలువ
యింతి యని యప్డు సంశయహృదయు లగుచుఁ
గొట్టుమిట్టాడుచుండి రక్కొలువువారు. 30

సరస్వతి దమయంతికి రాజుల నభివర్ణించి చెప్పుట.

వ. అ ట్లున్నయవసరంబునఁ జతురాననాంగన ప్రియాంగనాజనపరివృత యగురాచూలి వేలుపు లున్నదిక్కునకుం ద్రిప్పి యి ట్లనియె. 31

సీ. నిరతంబు మందాకినీవిమలాంబువూ
రముల నాడుచునుండ్రు రమణి! వీరు

ఏనాఁడు ముదిమియు మృతియుఁ జేరఁగ నీని
యమృత మానినవార లతివ! వీరు
కోరినకోరికల్ దీరుచు మందార
వనమున విహరింత్రు వనిత! వీరు
పుణుకుదొడ్కుం దమపొలములలో నెప్పుడు
గట్టుకొనినవారు కలికి! వీరు

తే. సుమనసులు వీరు విరజోంశుకములు చాల్చి
నిదుర యేనాఁటికిని లేక త్రిదశు లగుచు
దేవయానము లెక్కి యేదినము దివము
నంపు విహరించుచుందు రోయతివ! వీరు. 32

ఉ. వీరలు వేల్పు లోవెలఁది! వీరికి నాఁకలి, డప్పి, నొప్పియుం
గూరుకు, చావునుఁ, ముదిమి కొండొకనాఁటికి లేవు స్వఃపురిం
గోరిక మీఱి నచ్చరలకుం బ్రియులై విహరించుచునుందు రిందు నీ
కే రయిన న్మది దగిలి రేని వరింపుము నింపు మర్మిలిన్. 33

క. ఇం దొకని నొందితే నా,నందంబున నందనంబునం గలవిలస
న్మందారపుష్పసౌరభ, మొందుచు సౌఖ్యంబు నందుచుందువు తరుణీ.

వ. అని కుటిలభ్రూకుటివిన్యాసపాదుల నామెమనోభావం బెఱింగి భాషా
దేవి యోషామణితో ద్వీపాంతరవాసులపం క్తికిం జని యొక్కనిం
జూపి. 35

ఉ. ఓపరమాణుమధ్య! కను మున్నతతేజముతోడఁ బుష్కర
ద్వీపము నేలురా జితఁడు వీనికి నోడుదు రెల్లరాజు లిం
ద్రోపముఁ డిమ్మహామహుని నొందితివేనియు నిష్టసిద్ధు లా
భూపదమందు నున్నవటభూరుహ మిచ్చెడు నీకు నిచ్చలున్. 36

వ. అని యా మెమోమ్రిష్టుల నొప్పమి నెఱింగి సరస్వతి మఱియొక
దిక్కున కక్కోమలిం గొనిపోయి. 37

మ. జలజాక్షీ! కనుఁగొంటివే యితని నీ శాకాంతరీవేశ్వరుం
డలఘూదారపరాక్రమం డితనిపాం దాశించితే దుగ్ధవా

ర్థిలసత్కీడలు శేషశాయిభజనారీతుల్ పురోభాగగో
త్రలలత్కన్నరకామినీప్రణయముల్ ప్రాపించు నెల్లప్పుడున్. 38

వ. అని వరవర్ణినీపరథ్యానాభినయంబున మఱియొకనిచెంతకుం జని. 39

శా. క్రౌంచద్వీపవిభుం డితండు గిరిజాప్రాణేశ్వరుం గొల్చి భూ
త్యంచత్ప్రాభవ మొంది సర్వదిశలం బ్రాపింప సత్కీర్తి మే
ల్గాంచు నీవినిని జెట్టఁబట్టితివయేఁ గంజాతపత్రేక్షణా!
క్రౌంచాద్రిం గలరత్నసానువుల నెక్కాలంబు క్రీడిం తహో. 40

వ. అని యనిచ్చాసూచకంబు లగునామెహావభావంబు లరసి యటువాసి
మఱొక్కదిక్కునకుం దిరిగి. 41

చ. ఇతఁడు కుశాంతరీపవసుధేశ్వరుఁ డీశ్వరపాదభక్తుఁ డై
వితతవిభూతులం బడసి విత్తపతిఁ విభవాదికంబునఁ
సతముఁ దిరస్కరించెడిని జంచలనేత్ర! త్వదీయమానసం
బితనిపయిం దగులొక్కనిన నెంతయు సంతస మెల్లవారికిన్. 42

వ. అని యసమ్మతి నభినయించుటంజేసి మఱొండుకడ కరిగి. 43

మ. కలుమున్నీటను ద్రోణపర్వతముప్రక్కఁ శాల్మలిద్వీప మిం
పలరుఁ దాని కధీశ్వరుం డితఁడు లోకాధీశసస్తప్రభా
విలసత్కీర్తిసమావృతాఖిలజగద్విస్తారుఁ డీ వీతనిం
గలియంబోయిన నెల్లవైభవములుం గైకొందు వోసుందరీ. 44

వ. అని దానియభివిశేషంబున నంతరార్థం బెఱింగి యింకొక్కదిక్కు
మొగం బై. 45

శా. ఇక్షూదన్వదభిప్రవేష్టితము, దేవేంద్రాదిదేవేడ్య, మా
ప్లక్షద్వీపము సర్వలోకవినుతప్రాకామ్యరమ్యంబు నై
లక్షింపం దగుఁ దద్విభుం డతఁడు నీలక్ష్యం బిట న్నిల్చునే
సాక్షాల్లక్ష్మివి నా నెసంగెదవు చంచచ్చారుపద్మేక్షణా. 46

వ. అని మాఱుమోము వెట్టుటంజేసి దానిమానసం బెఱింగి సరస్వతి
మఱియొకతట్టునకు మొగంబు వెట్టి వీ రెల్లజంబూద్వీపనివాసులు
వీరిం జెప్పెద నాకర్ణింపుము. 47

సీ. అంగదేశాధీశుఁ డగు నిమ్మహీపతి
యితఁడు వంగేశ్వరుఁ డిందువదన
యితఁడు కాశ్మీరమహీమండలేశ్వరుం
డితఁడు కాశీపురాధీశ్వరుండు
కాంభోజవిభుఁ డీజగద్వంద్యచరితుండు
సౌరాష్ట్రపతి యీవిశాలయశుఁడు
మగధాధినాథుఁ డీమాన్యమహాగుణుం
డితఁడు నేపాళభూమీశ్వరుండు

తే. ఇంతయును శౌర్యనిధులు నహీనభాగ్య
విజితగుహ్యకేశ్వరు లెన్న వీరిలోన
నొక్కరునిఁ బెండ్లియాడి లోకోత్తరప్ర
శస్తిఁ గైకొని సుఖముండు చంద్రవదన. 48

వ. అని తద్విముఖత్వదర్శనంబున నచటు వాసి మఱియు నం దందుఁ గల మఱికొందఱు దేశాధీశులం బేర్కొని వారిలో నెవ్వరిని వరింప నొల్లనిపల్లవాధరిం దెల్లచాన యల్లనల్లన నిషధరాజపంచకం బున్న మంచంబులచెంతకుం జేరొనిపోయి యందఁ బ్రథమం జూపి యిట్లనియె. 49

పంచనలాభివర్ణనము.

1మ తరుణీ! చూడు మితండు శిక్షితకుభృద్వర్గుండు, లోకేశ్వరేశ్వరుఁ, డుద్దామబలార్యభిఖ్యుఁడు, గురుత్వప్రాంచితుండుఁ, బుధే

---

1 ఇది నలేంద్రులకు ద్వ్యర్థికాఁ జెప్పఁబడినది; శిక్షితకుభృద్వర్గుండు=శిక్షింపఁబడినభూపతులసమూహము గలవాఁడు, శిక్షింపఁబడినపర్వతసమూహము గలవాఁడు; లోకేశ్వరేశ్వరుఁడు = రాజులకు రాజు; లోకపాలురకు నీశ్వరుఁడు; ఉద్దామబలార్యభిఖ్యుఁడు = ఉద్దామబలు లైనశత్రువులకు శత్రువను ఖ్యాతి గలవాఁడు; స్వతంత్రుఁడు, బలారి యనుపేరు గలవాఁడు; గురుత్వప్రాంచితుఁడు = గౌరవముచే నొప్పువాఁడు, గురువగుబృహస్పతియుపదేశాదికముచేఁ బూజింపఁ బడువాఁడు; బుధేశ్వరవిఖ్యాతుఁడు = విద్వచ్ఛ్రేష్ఠులచేఁ గొనియాడఁ బడువాఁడు, దేవాధిపతి యనుఖ్యాతి గలవాఁడు; జిష్ణుఁడు = జయశీలుఁడు, జిష్ణుఁ డనుపేరుగలవాఁడు; ఆప్తసుమనోవంద్యుండు = ఇష్టులును, మంచిమనస్సు గలవారికి వంద్యుఁడు, దేవతలకు వంద్యుఁడు; దేవేంద్రుఁడు =

శ్వరవిఖ్యాతుఁడు, జిష్ణుఁ, డాప్తసుమనోవంద్యుండు, దేవేంద్రుఁ, డా
త్మరణానందితవీరసేనుఁ డెసఁగుం బద్మాక్షి ! వీక్షింపుమా. 50

వ. ద్వితీయుం జూపి. 51

తే. [1]శుచి మహాధనంజయుఁడు విశుద్ధహేతి
జాతవేదుఁ డతిప్రతాపాతిశయుఁడు
భాస్వదభిరూపరూపుఁడు పరసమిత్ప్ర
దీప్తుఁ డీతం డ నలుఁడు చూతే మృగాక్షి. 52

వ. తృతీయుం జూపి. 53

తే. [2]దండధరుఁ డరిభయదగదాప్రహరణుఁ
డనిశసమవర్తి మిత్రనందనుఁడు పరకృ

---

రాజుల కధిపతి, దేవతల కధిపతి; ఆత్మరణానందితవీరసేనుఁడు = అత్మ = ఆత్మ మను, రణ = పుత్రునిచేత (అనఁగాఁ గొడు కగుటచేత) ఆనందిత = సంతోషపెట్టఁబడిన, వీర సేనుఁడు = వీరసేనుఁ డనుతండ్రి గలవాఁడు, ఆత్మ = తనయొక్క రణ = యుద్ధముల చేత, ఆనందిత = సంతోషపెట్టఁబడిన, వీరసేనుఁడు = వీరము లైనసేనలు గలవాఁడు;

1 ఇందు నలాగ్నులకు ద్వర్థి కలదు. శుచి = పరిశుద్ధుఁడు, శుచి యనునామము గలవాఁడు, మహాధనంజయుఁడు = గొప్పధనమును జయించినవాఁడు, గొప్ప దైనధనం జయనామము గలవాఁడు; విశుద్ధహేతి=శ్రేష్ఠములగు ఆయుధములు గలవాఁడు, గొప్ప మంటలు గలవాఁడు, జాతవేదుఁడు = పుట్టినవేదములు గలవాఁడు (అనఁగా వేదములు చదివినవాఁడు) జాతవేదుఁ డనుపేరు గలవాఁడు; అతిప్రతాపాతిశయుఁడు = విస్తార మైనశౌర్యాతిశయము గలవాఁడు, తపింపఁజేయు శక్త్యతిశయము గలవాఁడు; భాస్వ దభిరూపరూపుఁడు, భాస్వత్ = సూర్యుఁడువలె, అభిరూప = ఒప్పిన, రూపుఁడు = రూపము గలవాఁడు, భాస్వత్ = సూర్యునివలన, అభిరూప = ఒప్పిదమైన, రూపుఁడు= రూపము నొందినవాఁడు; పరసమిత్ప్రదీప్తుఁడు = శత్రువులయుద్ధములయందుఁ బ్రకా శించువాఁడు, లేక శ్రేష్ఠమైనయుద్ధములచే నొప్పినవాఁడు, మంచిసమిధల (కట్టెలు)చే వెలుంగువాఁడు; ఈతండ నలుఁడు = ఇతఁడే నలుడు, ఈతండు అనలుఁడు. అని సమన్వ యము.

2 ఇందు నలయములకు ద్వ్యర్థి. దండధరుఁడు = రాజశిక్షం బూనినవాఁడు, (అనఁగాఁ దప్పుచేసినవారిని దండించువాఁడు)కాలదండము ధరించినవాఁడు; గదాప్రహర

తాంతుఁడుఁ ధర్మముఖ్యుఁడు ధర్మరాజు
పడఁతి! కంటె దక్షిణనాయకుఁ డె యితండు. 54

వ. చతుర్థం జూపి. 55

తే. [1]భూరిరత్నాకరవిభుండు భువనసేత
యధికసత్త్వాఢ్యుఁడు నదీనుఁ డమృతనిధిపుఁ
డఖిలజీవనాధారమహాప్రచేత
సుఁడు నిషధయోగ్యుఁ డీతఁడు పడఁతి! వింటె. 56

వ. పంచమునింజూపి. 57

మ. [2]బుధులం బ్రోచెడువాఁడు, వాసవుఁడు, సంపూర్ణప్రతాపప్రభా
కథితుం, డధ్వరమార్గజిష్ణుఁ, డతులాఖ్యావాహినీసేవితుం

---

ణుఁడు = రోగముల నంతటను లేకుండఁ జేయువాఁడు, గదాయుధము గలవాఁడు; అనిశ సమవర్తి = ఎల్లపుడు సమముగాఁ బ్రవర్తించువాఁడు, సమవర్తి యనుపేరు గలవాఁడు; మిత్రనందనుఁడు = మిత్రులకు సంతోష మిడువాఁడు, సూర్యపుత్త్రుఁడు; పరకృతాంతుఁడు = పరులకు శత్రువులకు యముఁడు, కృతాంతుఁ డనుపేరుగలవాఁడు; ధర్మముఖ్యుఁడు=ధర్మము ప్రధానముగాఁగలవాఁడు, ఉభయత్రతుల్యము; ధర్మరాజు=ధర్మాత్ముఁడైనప్రభువు, ధర్మరా జనుపేరు గలవాఁడు; దక్షిణనాయకుఁడు = బహుభార్యలుగల వాఁడు; దక్షిణదిక్పతి;

1 ఇందు నలవరుణులకు ద్వ్యర్థి కలదు. భూరిరత్నాకరవిభుండు = గొప్పరత్నపు గనులకు ప్రభువు, సముద్రములకుఁ బ్రభువు; భువనసేత = జగత్పతి; జలాధిపతి; అధికసత్త్వాఢ్యుఁడు = గొప్పబలముచే సంపన్నుఁడు, గొప్పజలజంతువుల కధిపతి; (యాదఃపతి) అదీనుఁడు = చైన్యము లేనివాఁడు, సంధిచే నకారము రాఁగా నదీనుఁడు = నదులకుఁ బ్రభువు; అమృతనిధిపుఁడు = నాశనములేనినిధులను బాలించువాఁడు, అమృతనిధి = సముద్రము, దానికిఁ బ్రభువు; అఖిలజీవనాధారప్రచేతసుఁడు = సమస్తమైనవారియొక్క బ్రతుకున కాధారమైనవిజ్ఞానము గలవాఁడు, (ఎల్లరకు జీవనాధారము కల్పించువాఁడు,) ఊదకముల కాధారమైనవాఁడు, ప్రచేతుఁ డనుపేరు గలవాఁడు; నిషధయోగ్యుఁడు = నిషధదేశమునకు యోగ్యుఁ డైనప్రభువు; నిషధ = కఠినుఁడు, యోగ్యుఁడు (గొప్పయోగ్యత గలవాఁడు.)

2 ఇంద్రాగ్నియమవరుణులకు సరిపడునట్లు చెప్పఁబడినది. బుధులం బ్రోచెడువాఁడు=విద్వాంసులను సాకువాఁడు నలుఁడు, దేవతలను సాకువాఁడు

డధికైశ్వర్యసమంచితుండు సమవర్త్యాఖ్యాంచిత ప్రఖ్యుఁ డై
ప్రథితుండై ప్రసరిల్లు నీషునుఁడు సుత్రాముండు చూతేఁ సతీ. 58

దమయంతి నలపంచకంబు గాంచి నివ్వెరపడుట.

వ. అని యిట్లు విధాతృకళత్రంబు ప్రబోధించిన విదర్భరాజపుత్రి పంచ నలమహీకళత్రుల నీక్షించి యీక్షించి యిదమిత్థ మని నిశ్చయింపం

---

ఇంద్రుఁడు లోనగువారు; వాసవుఁడు = వసూని సంతీతి వాసవః స్వర్ణరత్నాదిధనముకల వాఁడు నలుఁడు;' దేవభేదే ఒనలే రశ్మౌ వసూ రత్నే ధనే వసు' అమరము. వస నివాసే, ఆచ్ఛాదనే, వసు=కిరణములు కలవాఁడు వసునామము గలవాఁ డగ్ని. రత్నములుగలవాఁడు వరుణుఁడు, వస్తీతి వసుః, ఆచ్ఛాదించువాఁడు యముఁడు, వాసవనామము గలవాఁ డింద్రుఁడు; ఇట్లు వాసవశబ్దము వైనేగురకు సమన్వయించును; సంపూర్ణప్రతాప ప్రభా కథితుండు, ప్రతాపము = కోశబలమువలనఁ గలిగినతేజము, శక్తి కలవాఁడు నలుఁడు, వేఁడిమి, తేజము, శక్తి, లోనగునవి కలవా రింద్రాదులు; ప్రతప న్త్యనేన శత్రూనితి ప్రతాపః, 'తప సంతాపే' ప్రభవం త్యనేన శాసితుం జగతి ప్రభావః, జగత్తునేలు టకు సమర్థులు ఈయర్థము లేవురకుం జెప్పవచ్చును; అధ్వరమార్గజిష్ణుఁడు=యజ్ఞమార్గము చేత నింద్రుఁడు, అనఁగా ఇంద్రుఁడువోలె వైదికమార్గమును నడపువాఁడు, జిష్ణుఁడు= జయశీలుఁడు నలుఁడు; అధ్వరములు చేసినవాఁడు, జిష్ణునామము గలవాఁడు ఇంద్రుఁడు; 'అధ్వానం రాతీ త్యధ్వరః, మార్గములను గ్రహించినవారు, 'మృగయం త్యనే నేతి మార్గః, మృగ అన్వేషణే; దీనిచే బ్రహ్మపదార్థము నన్వేషించినవారు, జిష్ణులు = జయ శీలు రని యింద్రాదులకునుం జెప్పవచ్చును. అతులాఖ్యావాహినీ సేవితుండు = పోలిక లేని పేరు గలసేనలచే సేవింపఁబడువాఁడు నలుఁడు; వాహిని = నది, నదులచే సేవింపఁబడు వాఁడు వరుణుఁడు, వహతి, వాహయతీతి చ వాహిని, వహ ప్రాపణే=ప్రవహించునది, ప్రయత్నము సేయునది. వహధాతువుంబట్టి నానార్థము లింద్రాదులకుం జెప్పవచ్చును; అధికైశ్వర్యసమంచితుండు = గొప్పసంపదచే నొప్పువాఁడు నలుఁడు, అణిమాద్యష్ట భూతులచే నొప్పువారును, "ఈశ్వరస్య భావ ఐశ్వర్యం" లోక ప్రభుత్వముచే నొప్పు వారును ఇంద్రాదులు, ఇది నలునకుం జెల్లును. సమవర్త్యాఖ్యాంచిత ప్రఖ్యుఁడు = సర్వ సమత్వము గలవాఁ డను పేరుతోఁ దుల్యుఁడు (అనఁగా సమవర్తితోఁ దుల్యుఁడు, అని నలార్థము) సమవర్తి యను పేరుగలవాఁడు యముఁడు; న్యాయముగాఁ బాలించువా రింద్రాదులు; సుత్రాముండు = సుష్ఠు త్రాయత ఇతి సుత్రామః, బాగుగాఁ బాలించువాఁడు నలుఁడు, ఇంద్రాదులును, సుత్రాముఁడు అని యింద్రునకు నన్వర్థనామము గలదు.

జాలక డోలాందోళితం బగుహృదయంబున విస్మయంబును విచా
రంబు నొందుచు. 59

చ. ఇతఁ డితఁ డీతఁ డీతఁ డితఁ డేకవయస్కులు నేకరూపు లిం
దెతఁ డెవఁడో యెఱుంగుట కొకింతయుఁ జాలన యైతి నందఱున్
జతపడి పంచనైషధులచందమునం బొలు పొందుచున్న వా
రితవ్వుఁడు నాదునైషధు నిఁ కెట్టు లెఱింగెడిదాన నక్కటా. 60

మ. పలుకుంబోటియు నేవ్వరం బలికెఁ దాఁ బ్రజ్ఞాప్రభావంబునన్
బలుకుల్ సర్వము సంశయాత్మకములై భాసిల్లు నొక్కొక్కరిం
దెలియం జెప్పిన నెల్లవారికిఁ బ్రవర్తిల్లుం ద్రిలోకేశ్వరిం
బలుకం జెల్ల ది వేటిమాట లని నాభాగ్యం బిఁ కెట్లుండునో? 61

మ. ఎవ రే నున్న ది యున్నయ ట్లిచట వా కీఁ జాల రఁబుద్ధి నీ
యవఁ బ్రార్థించె వచింప నాజనకుఁ డీయర్థంబునన్ దేవియే
యవమానించినఁ జెప్ప నేమి కల దాహా రక్షకై వేసికో
నవు నాకంచెయె చేను మేసె ననుసామ్యం బొప్పు నిప్పట్టునన్. 62

వ. అని యిట్లు కొంతవడి వగచి వితర్కించుచు. 63

క. ఎవనిం గనినను నలుఁ డని
భవళాతి మనంబులోనఁ దలపోయుచుఁ గా
దవు నని తర్కించుచుఁ గడు
నెవ్వ లం దెను నేర్పరింప నేరని దగుచున్. 64

మ. జలభాండంబులఁ బ్రస్ఫురించెడి వియచ్చంద్రుండు నా నైషధుం
డలయంబో యిటు లొక్కఁ డయ్యు నిటఁ బంచాదర్శకుఁ డ్యాంతరం
బుల బింబించిన దేహ మేసుగతులై; పోలింప రాకుండె వే
ల్పులు మాయం బచరించిరో తెలియ నాపుణ్యం బ దెట్లున్నదో? 65

ఉ. కా దన రాదు మాయ యిది కల్పన చేసిరి వేల్పు లక్కటా!
నాదుమనోహరుం డయిననైషధుఁ గన్గొను టెట్లు గల్గునో
వేదకు దీనికిఁ, దోలుతఁ బెద్దలు చెప్పినదేహచిహ్న మిం
దేదియు లేదు భూమిపయి నిండఱు నిల్చి రిఁ కేమి సేయుదున్. 66

వ. అని మిగుల వగలం బొగులుచు దమయంతి నితాంతచింతాసమా
క్రాంతాంతరంగ యై తన కత్తఱి నమరోత్తములె శరణం బని ప్రాం
జలి యై నమస్కరించి యి ట్లనియె. 67

దమయంతి దేవతలంబ్రార్థించుట.

ఉ. అంచ వచించిపోయినది యాదిగ నెవ్వని నే హృదీశుఁ గా
నెంచుచునుంటినో ఋతియు నెవ్వనిఁ గొల్వఁగ నీస్వయంవరం
బంచిత మయ్యెనో వ్రతము లన్నియు నెవ్వనికై ఫొనర్తునో
సంచితపుణ్య నాతనిఁ బ్రసన్నుల నై సురలార! చూపరే. 68

క. అని కరుణ వొడమఁ బరిదే
వన మొసరించెడుశశాంకవదనం గని నె
మ్మనమున ననురాగమ్మును
గొని వేల్పులు ప్రోచి రంతఁ గొంతటి లోనన్. 69

ఉ. ఏవురిలోన నల్వురు మహీతల మంటక తెప్ప వ్రాల్పఁగాఁ
బోవక చెమ్మటం బడక ఫొల్చి రొకండు మహీతలస్థుఁడై
పూవులు వాడఁ జెమ్మటలు వుట్ట నిమేషమేతుఁ డయ్యె నా
లో వనజాక్షి నైషధులలో గుఱుతించె యథార్థనైషధున్. 70

వ. అట్లు నిజమనోవల్లభు నేర్పరించి చూచుచుం జూచినచూపు లా
భారతిపయిం బ్రసరింపం జేసి చేదోయి మొగిడించిన నింగితజ్ఞురా
లగునమ్మహాదేవి దేవతలదిక్కు మొగంబై. 71

చ. త్రికరణశుద్ధిగా నిషధదేశపతి న్వరియించి వానికై
సుకమతి యెట్టివేడుకలు సూడక వీడక తద్వ్రతంబు సు
త్సుకమతి నుండె మీరిటులు చూచుట ధర్మపు గాదు లోకపా
లకులు! కృపాంతరంగకములం జెలి దీని ననుగ్రహింపుఁడీ. 72

తే. అనుడు వారు సరస్వతీ ప్రార్థనమున
నలునిరూపము విడనాడి కొలువులోన
వాసవాగ్నిపరేతరాడ్వరుణరూప
ములను దాలిచి పొలిచి రద్భుతము దోప. 73

26071
25-3-43.

దమయంతి నలుని వరించుట.

వ. అనంతరంబ. 74

తే. వాణి దమయంతి కిట్లను వారిజాక్షి!
వీరె వేల్పులు వాఁడె నీకోరుకొనెడు
నలుఁడు సంశయ మింతయుఁ గలుగకుండఁ
గని వరింపుము మది గోర్కి కొనలుసాఁగ. 75

ఆ. నలునిఁ జెలిసినంత నలినాయతాక్షి చే
లాంచలంబు వట్టి కొంచ కపుడు
ధర్మవిధివిధంబు దనరంగ వరియించి
యతనియుతత వైచె నలరుదండ. 76

తే. అంతఁ దూర్యారవంబు దివ్యర్షిసాధు
వారవమును విప్రులవేదరవము
నృపరహాహారవంబు బంధుప్రలసమ్ము
దారవంబును గలసి మి న్నంది మ్రోసె. 77

ఉ. నైషధుఁ డంతరంగమున నాతుకచేతకుఁ బ్రీతి కెంతొ సం
తోషము నొంది గారవముతో నుపలాలన మాచరించి వా
గ్భూషణుఁ డై యను న్నను ముభుప్రభు లెంచ వరించుదాన ని
ర్దోషమతి న్వరించితిని దోయరుహాసన! నిన్నుఁ బత్నిగన్. 78

క. ఎందనుక నాదుగాత్రము
నందుం బ్రాణంబు లుండు నందనుక మహా
నందమునం బొందుచు ని
న్నెందుం బ్రేమించి యుందు నిందునిభాస్యా. 79

వ. అని శపథంబు వఱ్ఱె నట్టియెడఁ గృతాంజలియై వైదర్భియు వీరసేనా
ర్భకుండు పలికినట్లు సందబ్ధశుద్ధిగం బలికె నట్లు పరస్పరప్రేమాను
బంధబంధురులై తమ్ము శరణంబు వేడుకొనుచున్నవధూవరులం దిల
కించి సంతసించుచు నింద్రాదిబృందారకులు వారియెడం బ్రసన్నులై
రప్పు డింద్రుం డాశాచేంద్రునియజ్ఞంబులఁ బ్రత్యక్షదర్శనం బిచ్చి

హవిర్భాగంబు లందుకొనుచు నుత్తమగతిం బ్రసాదించుటకును, నగ్నిభట్టారకుండు వానివాంఛించినకడం బొడకట్టి నిజతేజం బొసంగు చుండుటకును, ధర్ముండు వాని కన్నరసం బనుగ్రహించి ధర్మంబు నంద నిలుపుటకును, నపాంపతి వానికోరినపట్ల జలంబులు నిష్టగంధార్ఘ్యంబు లగుమాల్యంబులు నిచ్చుటకు నొడంబడి వరప్రదానంబు చేసి దమయంతికిం బాతివ్రత్యంబు రక్షించుకొనుమహాశక్తిం బ్రసాదించి సరస్వతీసహితులై స్వర్గంబునకు నిర్గమించి రప్పు డతివాదు లగు కొందఱు పార్థివులు దమయంతి తమ్ము వరింపక నలుని వరించుటకు గర్హించి వారి నెదిరింపనెంచియు నోటమిభయంబునఁ దమపోటరితనం బోటువడి కొలువుకూటంబు విడిచి పోయి రంత నుత్తము లగు పార్థివసత్తములు వారిచాంపత్యంబున కత్యంతానందంబు నొంది యిచ్చమెయి మెచ్చుకొనుచు విదర్భేశ్వరునిచే ననుపం బడి యథాగతకృతగమను లై రాలోనం బుష్కరుం డనునొక్కరాజన్యుండు కొంతమ్రుక్కడిమూఁకం గూర్చుకొని భీమరాజున కభిముఖుండై గర్హించుచు ని ట్లనియె. 80

పుష్కరుఁడు నలు నెదిరించి డొడిపోవుట.

చ. నలుఁ డన నొక్కకన్నపులు నాఁబడు నాతనిఁ బెద్దఁ జేసి భూ
తలపతు లెందఱో యిట ముదంపడి కన్నియఁ గోరుచుండ వా
రల నొకచీరికిం గొన కరాతిభయంకరుఁ డైననన్ను నా
బలఁగము నేని చూడ కిటువంటి నికార మెసర్చి తక్కటా. 81

ఆ. మంత్రపూత మైనమహితపురోడాశ
మగ్నిహోత్రమందు నాహుతులకుఁ
గాక కుక్క కైనకరణి నీకన్నియ
నలున కయ్యెఁ దెగడ వలదె నిన్ను. 82

మ. ఇతఁ డీతం డితఁ డంచు నుర్విపుల నీవే చెప్పుచు న్వీరిలో
నితఁ డత్యుత్తమమూర్తి పుష్కరుఁడు తల్లీ! వీనిఁ గామింపు మం
చతిదీప్తి న్వచియింప కెవ్వతెనో మాయామానవిం దెచ్చి యి
గ్గతి నూ రేరును లేనివాని కిడుటల్ గావించి తే మందుఁ భో. 83

శా. కాని మ్మే నిపు డస్మదీయబలముం గాన్పించి నీనైషధుం
గానీ నిన్నును గాని లెక్కఁగొన కీకన్యామణిం గొంచుఁ బో
గా నున్నాఁడ సమర్థు లెవ్వ రయినం గన్పట్టిరే రండు కా
దేనిం గన్నె నొసంగి పొం డని మహోద్రేకంబునం బల్కుచున్. 84

వ. నిజపరివారంబుతో దమయంతిమార్గంబున కడ్డువడుటయు నలుం
డనలుండు నా మండుచు వాని నెదిర్చి యి ట్లనియె. 85

శా. ఓరీ పుష్కర! నీవు జ్ఞాతి వని నే నూహించి నైరించితిఁ
బారావారము దాఁటుచున్నయవి నీ ప్రజ్ఞావిశేషంబు లౌ
రౌరా! యెంతటివాఁడ వెంతబలవిన్యాసంబు నీ కుండెనో
రా రం డంటి సమర్థులం బడవి సంగ్రామంబు గావింతువో? 86

మహాస్ర. అనుచుఁ సన్నద్ధుఁడై శౌర్యమున నిషధరా జల్పె కోదండ
మూర్వి, ఘనటంకారంబు గర్జాక్రమమున మొఱయం గాకులం
ద్రోలున ట్లా,జనులం బోఁ ద్రోలుచుం బుష్కరుపయిఁ బడ మేల్
సాయకం బొండు వ్రేయం, జని వానిం జంప కాశస్త్రము తలగొఱుగం
జాలి కూల్చెఁ ధరిత్రిన్. 87

వ. అట్లు నేలం గూడి ముండియై పుష్కరుండు చచ్చియుం బ్రదికి లేచి
ప్రాణభయంబున నొడలు దులుపుకొనుచు సిగ్గువిడిచి దిగ్గనం దల
వంచుకొని చనియె నంత నలుండు కన్యాసమేతంబుగా భీమభూపా
లుని నగరునకుం బుచ్చి తాను దనవిడిదలకుం జనియె ననంతరంబ.88

ఉ. ప్రీతమనస్కుఁడై యపుడు భీమనృపాలుఁడు పుణ్యలగ్నమం
దాతతవైభవం బెసఁగ నాత్మజకు న్నిషధాధినేతకుం
గౌతుక కార్యముఁ సలుపఁ గా మది నెంచి ముహూర్తకాలముం
జేతము రంజిల న్వెలయఁ జేసె సుహృజ్జనసమ్మతమ్ముగన్. 89

క. హితులు పురోహితులును భట
తతులును మంత్రులును దాసదాసీజనులుఁ
గుతుక మెసంగఁ బరిణయో
చితవస్తువు లెల్లఁ గూరిచిరి నృపునాజ్ఞన్. 90

## నలదమయంతుల వివాహమహోత్సవము.

వ. అనంతరం బానిషధాధినాథునిం గైసేసి యొక్కభద్రదంతావళంబు నెక్కించి భీమభూపాలుండు హితపురోహితబంధుబృందంబును నానావిధసేనాసమూహంబునుం బరివేష్టించి నడువ నేగుదెంచి గావించుచు రాజమార్గంబునం జనునప్పు డప్పురాంగనామణులు నిషధరాజదర్శనలాలసలై రాజసదనోపరిజాలకంబు లావరించి రట్టి సమయంబున. 91

చ. ఇనుఁ డగునైషధీశ్వరు సమీక్ష యొనర్చుతలంపుపెంపునఁ దనరిసవీటిచేడియలు దారు సుధామయసౌధవీథులఁ ఘనతరజాలకంబులను గమ్రముఖంబులు నేర్చి యున్నెడఁ గనఁ దగె స్వర్ధునిం గనకకుంజము లెల్లెడ నుల్లసిల్లునాన్. 92

చ. అతివ యొకర్తు దిద్దుకొన నాయిత మయ్యెడునంతలో ధరా పతి చనుదెంచె నంచు విని వైభవ మారయుతత్తఱంబు లో నతికినఁ దాఱుమాఱుపడ నాభరణంబులు మేనఁ దాల్చి యు న్నతనిజసౌధ మెక్కెఁ గని నాతులు చేతులు దట్ట బెట్టుగన్. 93

చ. వడిగ గవాక్ష కేగునొకవారిజలోచన కొప్పు వీడి మే నడరఁగఁ గప్పినఁ ముడువ నైనఁ దలంపక పోవఁ బెన్నెఱుల్ జడదము మేనితళ్కు చపల ల్వీడి రాలెడుపూలు చిక్కు లం చడుగునఁ జూచువారలకు నాసమయంబునఁ దోఁచె నెంతయున్. 94

చ. చనియెడునైషధుం డనుచుఁ జూన యొకర్తు పిఱుందుదోయియుం జనుఁగవ కొప్పునున్ నగలు చాల భరం బగుటఁ జడత్వ మొం దిననడ సౌధ మెక్కుటకు నేరనిచో మది యూఁత నేసి తో డ్కొని చని చూపి తాను వడి డొల్లిపడెం బయినుండి రాజుపైన్.

ఉ. కొందఱు సుందరాంగు లొకకొన్నిసుమంబులతో స్వనామముల్ డెందమునందుఁ బొందుపడ డెప్పర మైనమనోరథంబు ము స్తుందుగ వ్రాసి తేకులను బొమ్మలు చేసి నలావనీశుపై నందుకొనంగఁ జల్లిరి సుమాయుధుఁ డల్లన ప్రేరకుండుగన్. 96

సీ. నామెయి వాసన లీమెయి నుండెడు
నని తెల్పఁ గస్తూరి పనిచె నొకఁ డే
నాదువా తెఱతీఁపి కీదాక సరివచ్చుఁ
బోలించి కొ మ్మని పుచ్చె నొకఁ తె
నాచెక్కుటద్దము లీచక్కి నున్నవి
కను మని తెలనాఁకు లనిచె నొకఁ తె
నాపలుకులఁ బోలునీపులకండములో
పరికింపు మని చెప్పి పంపె నొకఁ తె

తే. అట్లు లాఁరాజమార్గము నందు నేగు
బెండ్లి గావించునలరాజు గొండ్లి యెసఁగఁ
గాంచి మోహించి కొందఱు కామిను లిటు
కొట్టుమిట్టాడి రెంతయుఁ గోర్కిమీఱ. 97

క. అందుఁ బురంధ్రీరత్నము
లందఱు మలెపూలు లాజ లక్షతలు మహా
నందమున దృష్టిదోషము
డింపఁగ నైషధునిపై వడిం జల్లి రటన్. 98

వ. ఇట్లు పురాంగనలెల్లం బరిపరివిధంబులం బడుచుండ నలుండు హజా
రంబుకడ గజారోహణంబు గావించి, మందగమనం బంగీకరించి, వందిసందోహసంకీర్తనంబును, మాగధమధురగానంబును, పాఠక గీతాపఠనంబును, జెలంగఁ బుంఖానుపుంఖశంఖభేరీమృదంగవేణు వీణాదినిక్వాణంబులు రోదసీకుహరంబు నిండి రాణ లెసఁగ మంత్రి సామంతాదులిరుగడఁ బరాబరులునేయఁ బురంధ్రీరత్నంబులు నీరా జనంబు లిడి నేసలు చల్ల నల్లనల్లన నడచుచు గృహప్రవేశంబు చేసి యెడనెడం గొన్నికక్ష్యాంతరంబులు దాటి తోరణస్తంభాయమాన శాతకుంభరంభాకుంభినీరుహసంభృతంబును, నిఖిలమణిగణఖచితకనక కలశాది పరిణయోచితవస్తుపరికరప్రభాభాసమానంబును, పాణిపీడన క్రియారంభసంభారసంభ్రమత్పురోహిత హితముఖ నిఖిలజనకలకల రవాలంకృతంబును, నగునొక్కరమణీయభద్రాదవసితాభ్యంతరం బున మాణిక్యకలితమంటపంబున నధివసించె నంత విదర్భేశ్వరుం

డమందానందంబున నందనకు మంగళస్నానగౌరీపూజాదులు నిర్వర్తించి కౌతుకవేదిపయిం దెచ్చి కూరుచుండం బెట్టి భేరీమృదంగవేణువీణాదినిక్వాణంబులును, సకలజనకోలాహలరవంబులును, వారాంగనానృత్యవిశేషంబులును, నానావిధగాయనగానంబులును, జెలంగుచుండ నవగ్రహంబు లేకాదశస్థానఫలంబు లొసంగ నెసంగుశుభముహూర్తంబున ఝళంఝళత్కనకకంకణరవంబులు బోరుకలుగనంగనలు దలయంట మంగళస్నాతుండై సాలంకృతుండై మణిగణఖచితపీఠికాతలంబున నాసీనుం డగువరుని శ్రీమహావిష్ణుస్వరూపునిఁ గాఁదలంచుచు యథావిభవవిస్తరంబుగా నర్పించి మధుపర్కం బొసంగి పితృదేవతాప్రీతికరంబుగా ధారవోసి సాలంకృతకన్యాదానంబు నేసినంత నైషధుండు దమయంతీపాణిగ్రహణం బొనరించె నంత. 99

తే. వరుఁడు పాణిగ్రహణవిధి నెరపునపుడు
మరుఁడు ము న్నేయ లో దూరి వఱలుచున్న
ములుకు లెల్లను వెలికి రాఁ దలలు సూపె
ననఁగఁ బులకాంకురంబులు తనరెఁ జెలికి. 100

క. తెరచీఱ లెత్త నైదువ
లిరువురు మోములను జూచి రింపుగఁ దలఁబ్రాల్
శిరముల నిడికొని రంతట
వరుఁ డామెకుఁ దా లె బొట్టు వలపునఁ గట్టెన్. 101

ఉ. చూపులు సేయువేళ నొకచోద్యము గానఁగ నయ్యె నప్పు డ్రిం
జూపులదొంగ లొండొరులశోభలు చూఱగొనంగ నేఁగుచోఁ
బ్రాపయి వచ్చి నెమ్మదులు పట్టువడెఁ ధరఁ బుణ్య మంచుఁ బో
బోప మెదుర్కొనె న్నరు నవశ్యము నానుడి నిక్కమై కదా. 102

క. సతిపతు లప్పుడు తగ నా
హుతులఁ ద్రేల్చి రరుణార్చిహుతభుఙ్ముఖమం
దతులితపలాశశాఖా
తతులఁ దధిలాజలఁ ఘృతంబున నంతన్. 103

క. వరుఁడు నవోఢాపాదము
కరమునఁ గీలించి సన్నెకలు ద్రొక్కించెఁ
విరహార్తి నాకతంబున
నరయఁగ నౌఁ దప్పు సైఁపు మని తెలుపఁగ నాన్. 104

క. జాయాహితులకు బంధువు
లాయాదేశాధినాథు లమలాంబరభూ
షాయోషాదికవస్తువు
లాయాపేళ్లఁ జదివించి రటఁ గట్నములన్. 105

ఆ. మంగళంపుదివ్వె లంగన లిడునంత
మంగళార్థ మనుచు మగువ మగఁడు
నదె కనుం డటంచు నార్యులు సూపఁ జూ
చిరి యరుంధతిని రుచిరగతముల. 106

భీముఁడు దమయంతి నత్తవారియింటి కనుచుట.

వ. ఇట్లు విధిదృష్టవిధానంబున వివాహంబు నిర్వర్తిల్లినయనంతరంబ తదుత్సవాగతు లగుబంధుమిత్రాదుల నెల్ల సత్కరించి భీమభూవల్ల భుండు వారివారియిండ్లకుఁ గంపిపుచ్చి కృతకృత్యుం డై యత్తవారి యింటికిం బోవనున్న తనూజాతం జేరఁ బిలిచి తనతొడవైఁ గూరు చుండఁ బెట్టుకొని శిరంబు పుడికి యాఘ్రాణించి మించినవేడ్క నుప లాలించుచు. 107

సీ. పాదములు గడిగి నీపయ్యంటఁ దడి యొత్తి
విభుని వీవనలతో వీవవమ్మ
భోజనాంతమునందు భుజియింపు తత్పాత్ర
నిదురఁ బొందిన వెన్క నిదురఁ బొమ్ము
లేవకున్నప్పుడ లెమ్ము పిల్చినయేని
చేఁ బని విడిచి చెచ్చెఱ గమింపు
పని యున్న సుఖసుప్తుడును సుఖాసీనుడు
నై యున్నచో లేప కమ్మ యెపుడు

తే. జీవితేశ్వరు నెదలోన నేవగించి
సారెసారెకుఁ బోరెడుసారసాక్షి

తులలేనివేడుకతోఁ దొప్పఁదొగి
తురగలించెడుతనదుముదారు బలసి
కొలువ మామయనుజ్ఞ గొని స్వపురమున
కుం జని శచితోడఁ గూడి జేవేంద్రుఁ
డలసునట్లులు దమయంతితోఁ గూడి
యతివైభవంబున నలరారె నపుడు. 115

వ. అట్లు దమయంతీస్వయంవరోత్సవము ప్రవర్తిల్లినపదంపడి ప్రయా
ణంబై విమానంబు లెక్కి మీఁదిమీఁదికిం బోవుచు. 116

మ. బలభిద్వహ్ని పరేతరా డ్వరుణు లాభై మీవిలాసంబు నా
నలసౌందర్యము చెప్పుకొంచును వియన్మార్గంబునం బోవుచోఁ
గలియుఁ ద్వాపరుఁ డడ్డమై సురల వేడ్కఁ గాంచి యెం దుండి మీ
రలు విచ్చేయుచునుంటి రుర్వరకుఁ జేరం బోయి యీరాక యో. 117

తే. అనుటయుఁ ద్రిలోకవల్లభుం డనియె నిట్లు
మహిఁ బ్రతీక్షింపఁ జని మేము మాపురముల
కరుగుచుంటిమి మీ రతిత్వరితగతులు
గలిగికొని యుంటి రెందుఁ బోఁ దలఁతు రనుఁడు. 118

తరలము —

కలి సుపర్వులఁ గాంచి యి ట్లను గాశ్యపిఁ దమయంతి యఁ
గలికిమిన్న స్వయంవరం బగుఁ గాఁ దె నఁ వరియించు న
ప్పాలతి యంచుఁ గుతూహలమ్మునఁ బోవుచుంటి ననఁ సుప
ర్వులు హసించుచు నింత మున్నది వోయె! నోయి! నివృత్తమై. 119

వ. ఆవైదర్భి యెఱుల నెవ్వరి వరింపక మాసన్నిధానంబునన నైషధుం
డనువాని స్వరించె ననఁ గోపఘూర్ణమానమానసుండై కలి యి
ట్లనియె. 120

తే. వేలుపులచెంతఁ గాదన కాలతాంగి
మానవుని భర్తగాఁ గొనెఁ గాన దాని
కొప్పుఁ జుఁడి శిక్ష విధియింప నిప్పు డనిన
లోకపాలకు లి ట్లని రాకలిఁ గని. 121

బురములఁ బల్లెల వరవైద్యశాలలు
నన్నసత్రంబులు నమర నిలిపెఁ
తే. జెఱువులం ద్రవ్వి నూతులు వఱులఁ జేసె
వర్ణసంకర మది లేనివరుస నడపె
నాల్గుజాతులవారి నానలుఁడు ధర్మ
మూర్తియై ముజ్జగంబులఁ గీర్తి పర్వ. 129

క. జారులుఁ జోరులును దురా
చారులుఁ గ్రూరులును నిత్యసత్యవిదూరుల్
లే రెపుడుం బంటలతో
ధారుణి పాలుపొందు నలుఁడు తత్పతి గాఁగన్. 130

వ. ఇట్లు ధర్మైకతత్పరుండై ప్రజలం బాలించుచున్నసమయంబునం
దొక్కనాఁడు. 131

నలుఁడు కలిచే వంచితుం డగుట.

ఉ. కాల్మడి చేసి కాళ్లు గడుగ న్మఱపుం గొని వార్చి సంధ్యకై
శీల్మాగిచె న్నలుం డపుడు క్రేవల నున్నకలీశ్వరుండు పో
కా ల్మని రేఁగి నైషధునికాయమునం జొరఁ బాఱి బోరనఁ
జాల్మఁడు పుష్కరాహ్వయునిచక్కటికిం జని వేడ్క నిట్లనున్. 132

ఆ. కలిని నేను రాజ! నలుని వంచింపఁ ద
లంచినాఁడ నీవు మించి వాని
తోడ జూద మాడి తులలేని తద్రాజ్య
మొడిసి కొనుము తోడుపడుదు నేను. 133

సీ. అని కలి ప్రేరేచి యపుడ వృషం బయి
యనుసరించెను వానియాలఁ జేరి
యతఁ డాతనిం గూడి యరిగి నలుం గని
పిలిచె దురోదర మెలమి సలుప
నలుఁడు జూదం బాడఁ బిలువంగఁ బడి పోవ
కుంట కా దని దాని కొప్పుకొనియె
నికృతిఁ బుష్కరుఁ డొడ్డి నిలిచి పాచికలను
దొరలించె ఫలకమం దురురయమున

తే. గలిసమావిష్టుఁ డగుట నన్నలుఁడు మొనసి
తనకుఁ గలసర్వధనము లుత్తమము లొడ్డి
యోడె నాప్తులు వారింప నుడుగ కాడి
చలముఁ గొని యాడుచున్న పుష్కరునితోడ. 134

నలుఁడు పుష్కరునితో జూదమాడి యోడిపోవుట.

వ. ఇ ట్లనేకమాసంబులు విడువక చలంబున జూదం బాడునలు నుడుపం జాలక ప్రకృతిప్రధానవర్గం బది యంతయు సూతముఖంబున దమ యంతి కెఱిఁగించిన నామె దుఃఖించుచు వచ్చి దుర్వ్యసనాసక్త చిత్తుం డగుప్రాణేశ్వరునిం గాంచి నాథా! నిన్నుఁ జూచువారై పౌరులెల్లరు వచ్చి ద్వారదేశంబుకడ వేచియున్నవారు. నీ వీదురో దరం బుడిగి వారి నాదరింపు మని గద్గదస్వరంబునం బలికినఁ గలి సమావిష్టుం డగు నతండు ప్రత్యుత్తరం బిడ కాడుచుండె నది యెఱింగి చేయునది లేక శోకించుచుఁ బ్రకృతివర్గంబు నిర్గమించిన నామె యున్మత్తుని తెఱంగున నొడ లెఱుంగక యోడినకొలంది వేడుక వీడక మత్సరంబు పెచ్చుపెఱుఁగ మఱియు మఱియు నొడ్డి యాడు చున్న జీవితేశ్వరుం జూచి పాచికలు పరాఙ్ముఖంబు లగుటఁ బరికించి తమ కపజయకాలం బని తలంచి పరిదేవనంబు నేయుచు నంతిపురం బునకుం జని బృహచ్ఛయన యనుపరిచారికం బుచ్చి మంత్రులకుం జెప్పి వార్షేయుం డనుసారథిం బిలువఁ బంచి వాని కిట్లనియె. 135

ఉ. సూత! యెఱుంగుదే కద విశుద్ధచరిత్రుఁడు నైషధావనీ
నేత నిజప్రభావ మది నీ యయిపోవ నెటున్న వాఁడొ నా
కీతఱి సందియంబ యగు నే మనుదాన నె దెట్లు మాఱునో
ద్యూతము మానకుండె నయ యో! సుహృదుల్ తగ దంచుఁ జెప్పినన్.

వ. ఇది యంతయుం గాలమాహాత్మ్యంబ కానిమ్ము రాజదయితమ్ము లగు నశ్వరాజమ్ములం బూన్చినరథంబుపై మాదారకుల నిడుకొని కుండిన నగరంబునం గలబంధుజనులకడ విడిచి నీవు నంద యుండు మట్లు కాదేని నీయిచ్ఛవచ్చినచోటికిం బోయి యుండు మనిన నతండును.

తే. మంత్రులకు దాని నెఱిఁగించి మఱియు వారి
యనుమతిం గొని దొరబిడ్డలను రథమ్ము
మీఁద నిడికొని చని భీమభూపతిసుత
కప్పనము చేసె నంతయు నడుగఁ జెప్పి. 138

తే. పిదప నాతఁడు దుఃఖంబు పెచ్చుపెరుగ
నట వసింపక తిరుగుచు నందు నిందుఁ
జని యయోధ్యలో ఋతుపర్ణసారథి యయి
బ్రతికి యుండినదానన భృతికి నిలిచె. 139

వ. ఇటఁ బుష్కరుండును. 140

ఉ. మోసము చేసి జూదమున మోదము పోచ్చ నలావనీశునిఁ
ద్రోసి సమస్తసంపదలతో మహిరాజ్యము నాహరించి పెఁ
హాస మెసంగ నిట్లనియె నయ్య! పణం బిడ నుండె నేని నీ
వీసమయంబునం దిడి వహింపుము హస్తమునందుఁ బౌచికల్. 141

తే. గెలిచికొంటి కదయ్య! నీకలధనంబు
లెల్ల దమయంతి యొక్కతి యే విశిష్ట
యగుచుఁ గానంగఁ బడు దాని నలర నొడ్డి
యాడు మిష్టంబ యేని నా నవనివిభుఁడు. 142

వ. హృదయవిదారకంబు లగువానివచనంబులకు మనంబునం గనలియుఁ
జేయునది లేమిం జేసి మారు పలుకక తనమేనిపైఁ గలసర్వవిభూష
ణంబులుం దీసి పైచి యేకవస్త్రధరుండై శోకించుచుం దొలంగి పోయె
దమయంతియు నిరస్తభూషయు నేకవస్త్రయునై పతి ననుసరించె నన
నైమిశారణ్యవాసు లవ్వలివృత్తాంతంబు నెప్పుమని సూతు నడుగుట
యును. 143

## ఆశ్వాసాంతము.

శా. నాకీవీయుపకారమున్ సలుపు మన్నం జేత నైనంతలోఁ
బోకాదం చనఁ బోక చేయుటకు నై పూనున్ దయాస్వాంతుఁడై

శ్రీకాంతుం డలతూములూరికులవర్ధిష్ణుండు వానిఁ శుభ
శ్లోకుఁ శ్రీశివరామనామని మహేశుం డేలు నెల్లప్పుడున్. 144

గద్యము. ఇది శ్రీమహామహోపాధ్యాయ, కలాప్రపూర్ణ కవిరాజ కవిసార్వభౌమ శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి ప్రణీతంబయిన నైషధీయ చరితం బనుశృంగారతరంగిణియందుఁ జతుర్థతరంగము.

శ్రీ. శ్రీ. శ్రీ.

శ్రీరస్తు.

# నైషధీయచరితము

## శృంగారతరంగిణి

### పంచమతరంగము.

వేంకటరమణాంబా
పావనతరగర్భశుక్తి వరమాక్తిక మ
ట్లై వెలసి సకలబుధజన
సేవితుఁ డగుతూములూరిశివ నేలు శివా.

వ. అక్కథకుండు శౌనకాదుల కిట్లనియె నట్లు దురోదరంబున నోటం
బడి తొలంగి పోయి.

నలుఁడు దమయంతితో వనుల కరుగుట.

తే. నలుఁడు దమయంతితోఁ బేదవలెఁ బురంబు
వెలిఁ ద్రిరాత్రము లుండె నవ్వేళఁ బుష్క-
రుండు చాటించె నలుపాలి కొం డెవండు
చనిన శిక్షింతు నని యుగ్రశాసనంబు.

శా. దానంజేసి యెవండు నాతనికి సత్కారంబు గావింపఁ బో
డానా ళ్లట్లు పురోపకంతమున నీ ళ్లాహారమై యొప్ప థా
త్రీనాథుండు ఋథార్థుడై నవసి యెండేఁ గందమూలాదు లే
నోనో యంచుఁ జరించె నల్లడ నరణ్యంబందు దైన్యంబునన్.

చ. తిరుగుచు నైషధేశుఁ డొకదిక్కున బంగరువన్నె యొక్కలఁ
బరఁగినపక్షిసంఘమును బాఱఁ గనుంగొని మెచ్చి నా కిటఁ

దొరకెను భక్ష్య మందునను దోరఫుటాఁకలి దీఱు నంచు స
త్వరముగఁ బట్టుకోఁ దలఁచి వైచెను గట్టినచీర దానిపై. 5

మ. అవి యప్పట్టముతోడఁ బై కెగసి దుఃఖాక్రాంతుఁడై దీనుఁడై
భువి నున్నట్టిదిగంబరు న్నలుని సంబోధించుచు న్నేము నీ
దవుసర్వస్వముఁ గొన్న పాచికల మి ట్లాచ్ఛాదనంబుఁ హారిం
చువగ న్వచ్చితి మంచుఁ బల్కఁ చనుడుఁ శ్రోణీతలాధీశుఁడున్. 6

వ. దీనవదనుండై దుఃఖించుచు దమయంతిదిక్కుఁ మొగం బై. 7

చ. గరితరొ! దయ్యపుంజెయిది గంటివె పాచిక లంట పట్టు లి
వ్వీరుస నధోంశుకంబుఁ గొని పాఱె నయో యిఁక నేమి సేయుదుఁ
సిరి చెడి యున్న నే నెటులు జీవనయాత్ర పొనర్తు నార్తుఁడఁ
గురుతరదుఃఖపంకమునఁ గూలితి సోలితి నాలితో నిటన్. 8

వ. అని మఱియు. 9

తే. సుదతి! విను నాహితోక్తు లియ్యది విదర్భ
కిది యవంతికిఁ గోసల కిద్ది దక్షి
ణాపథంబున కిద్ది వింధ్యమున కిద్ది
తెరువు లివి యన్నియును వీనిఁ దెలిసికొనుము. 10

వ. అని మాటి కార్తుండై పలికిన నులికిపడి దమయంతి డగ్గుత్తిక వెట్టి
పతి కి ట్లనియె 11

చ. అకటకటా! మదీయహృదయం బిది చీల్చినయట్ల యయ్యె నీ
వికృతవచఃప్రసంగముల వేగితిఁ గూటిక కాక యిట్లు గు
డ్డకుఁ జెడి కాననంబున బడల్పడుని న్నిటు వాసి పోవ మా
మకమన మిచ్చగించునె శ్రమం బని యెంచునె జీవితేశ్వరా. 12

తే. వనములం దుండి శ్రాంతుఁడై వనటఁ గుందు
పతినిఁ బాయక యుండినసతి తదీయ
విక్లమం బెల్లఁ బోకార్చి విరతిఁ గూర్చు
బలఁప సతికన్నఁ జుట్టంబు గలదె పతికి 13

సీ. ప్రాణనాథునకుఁ గైవల్యసంప్రాప్తికి
సదన మైనది ప్రాణసతియ సూవె
మగనికి నీచేడుజగములందును నిద్ద
మగుయశం బిడునది మగువ సూవె
పతి కనంగదశాప్రతతి దాఁకకుండ ని
రతసౌఖ్య మిడునది రమణి సూవె
యింటియాతనికి ననేకాపదలు వాపి
యలరించునట్టి దిల్లాలు సూవె

తే. పనుల దాసి కరణములఁ బరమమంత్రి
భోజ్యములఁ దల్లి రతి రంభ భూమి క్షమను
రూపునను లక్ష్మి యనఁగఁ బేరొక్కసుచు నిల గృ
హస్థు నేలెడునది గేస్తురాలు సూవె. 14

చ. బ్రదికినయప్డు నీడవలెఁ బ్రాణవిభు న్విడ కుండునట్టి వై
సదమలచిత్తముం గలిగి సంతతసేవ యొనర్చుగేస్తురా
లెదియును వెంటరాదు తను వీఁగి గమించెడునప్పు డొక్కయ
య్యదియ చితాగ్ని మే న్విడిచినట్టిద యై పతిదారిఁ బట్టుడున్. 15

క. విను మఖిలదుఃఖరోగా
ర్తునకుం బరమౌషధంబు స్తుతమతి యగుచుఁ
జనుభార్య యని వచించిరి
మునితుల్యులు వైద్య లెల్ల మును జననాథా. 16

వ. అని పలికిన నలుం డి ట్లనియె. 17

తే. తన్వి! నీమాట తథ్యంబు ధరణిలోన
నార్తుఁ డైయున్న వానికి నాలిఁ బోలు'
మిత్ర మౌషధమును లేవు మేను విడిన
విడుతునే కాని విడుతునే వెలఁది! నిన్ను. 18

ఉ. నా దమయంతి యి ట్లనియె నాథ! నను న్విడనాడునిచ్చ లో
లే దనుఁడేని మార్గముల లెక్క వచింపఁగ నేటి కిట్లు కా

దేదియొ కల్గెఁ గావునన యిట్లు గణించితి వంచు లోన నెం
తో దయివాఱుచున్నయది దుఃఖ మకారణజాయమానమై. 19

క. అది గాక నాదుబంధుల
సదనంబున కరుగు మనెడి సద్భావమయేఁ
సదమలమతి! యిరువుర మరు
గుద మట మాతండ్రి యరసికొను మనల దయన్. 20

తరువోజ.—

అనిన నలుం డను నతివ! నారాజ్య
మలవిదర్భునిరాజ్య మరయ నొక్కటియ
యనఁ దగుఁ గాని మున్నచటికి నేమ
హావిభవంబుగ నరిగియు నిప్డు
ధనవిహీనుండ నై దైన్యంబుతో ము
దంపడి పోయి తద్బంధుజనాళిఁ
గనుఁగొన నోప నోకమలాయతాక్షి!
కరముఁ జింతిలకు మిక్కరణిఁ జిత్తమున.

## ఘోరారణ్యపర్ణనము.

వ. అని నలుండు వైదర్భి నాశ్వాసించి పలుకుచు దానికట్టినపుట్టంబున
సగంబు దానునుం గట్టుకొనియె నట్లు వా రేకవస్త్రసంవీతులును
క్షుత్పిపాసాపరిశ్రాంతులు నై యిట్టు నట్టు మెట్టుచు మహారణ్యం
బునం బ్రవేశించి రదియును. 22

సీ. ఒండొంటితో నుండుదండికొండలు మెండు
కొని యాకసంబును గనుచునుండ
గట్లతోఁ బోట్లాడున ట్లుబ్బి చీఁకట్ల
నిడుచెట్లు పొలమెల్ల నిఱికి యుండఁ
జిక్కనై యొక్కొక్కఁ డక్కజంబుగ నిక్కి
బలురక్కసులు దిక్కు లలముకొనఁగ
నల్లిబిల్లిక నల్లి మొల్లమై ముళ్లతోఁ
బె ల్లేచి పెనుడొంక లల్లుకొనఁగఁ

తే. బులులు సింగము లెల్లు లేన్గులును గారు
దున్నలుం దొట్టిదుష్టజంతువులు ప్రబలఁ
బాములుం దేళ్లు జెట్లులు ప్రాఁకులాడ
గహనమై చూడ నయ్యె నక్కాననంబు.

మ. పులి గానీ గిలి గాని యొక్కపరి పెంపుం గల్గి వెల్లార్చినం
బొలమెల్లం గలయంగఁ బర్వి గుహలం బూరించి హుంకారవం
బులుపం బంటకుఁ గాక వీఁక మెయి బ్రహ్మాండంబు ప్రీలించున
ట్టులయ్యె నెం పది లేక జాములఱ కుండుం గొండల న్నిండుచుఁ

మ. అటవీగర్భముఁ జూచునిచ్చమెయి సప్తాశ్వుండు దీప్తాంశువుల్
పటుశక్తిం జొరఁ జేయ నెంచియును జాలఁ లేక వీఁక న్జవో
త్కటదేహుఁ మృగవాహుఁ బుచ్చుటయు నాతం డెంతయే నఁ
చ్చుటకుం జూచెను గాని సాధ్యపడ దాచొ ప్పింతయు న్వింతగ

మ. శరణం బయ్యెడు జారచోరుల కజస్రం బంధకారంబు శా
బరికిం దానక మట్టిదోషిని నశింపం జేయ నౌ నంచు భా
స్కరుఁ డన్న న్వని బీతునం బఱచి రక్షం గోరి తత్కాననాం
తరమం దెల్లెడ నిండి యుండె నన నాథ్వాంతం బటం జొప్పడఁ

వ. అట్టి మహారణ్యమధ్యంబునం బడి జాయాపతు లిరువురుం బో
పోయి యొక్కచో నధ్వగులు విశ్రమింపం గట్టినయొకచట్టెం
యందుఁ బరాగపటలపరివృతాంగులై కడుంగడు విలపించుచు
ణీతలంబునం బడి నిద్రవోయి రంతఁ గొంతవడికి దుఃఖో
చిత్తుం డగుటంజేసి రాజసత్తముండు కన్నుఁ దెఱచి గాఢనిద్రా
బున నొడ లెఱుంగక పండియున్నప్రాణేశ్వరిం దిలకించి రా
హరణసుహృత్త్యాగవనవాసాదులం దలంచుకొని పలవించుచుఁ
మనంబున.

చ. మలయజవాయు వైన నొకమాడ్కిన కాక కడంకఁ దాఁకె నే
నలసెడునీలతాంతమృదులాంగి యొకించుక యెండక న్నెటఁ
దెలియనియీనృపాలసుత నేఁ డిటు ఘోరవనాంతరంబుల
న్నెలఁగుచు నిట్టిఆకటికినేల శయింపఁగ నయ్యె నయ్యె యో.

ఆ. కాఱుచెండలోనఁ గాల్నడ వచ్చుట
నలసి సొలసి యీలతాంగి యిచట
నొడలు తెలియకుండఁ బడి నేల నిద్రించు
చుండె దీనిఁ గనిన నుల్ల మెరియు. 29

ఉ. అక్కట! నాకుఁ గూర్చుపరమామలగాత్రి నరేంద్రపుత్రి తా
నిక్కరణి న్వగం బొగులు నెంతయుఁ జింతల దీనిఁ గూడి నే
నిక్కడ నుండ నోప మఱి యొక్కడి కేనియుఁ బోవ నోప నే
చక్కి మెలంగువాఁడ సతిజాడఁ గనుంగొన దుఃఖ మయ్యెడిన్. 30

నలుఁడు దమయంతిం బెడఁబాసి పోవుట.

క. స్వజనత్యాగము మేలో, నిజమరణము మేలొ యెట్లు నేఁ జేసినచో
వృజినంబుగాక యుండునొ,నిజ మారయ లేకయుంటి నెమ్మనమందున్.

చ. నను విడనాడె నేని యెలనాఁగ నిజాప్తులఁ జేరు నెట్లులే
నను విడనాడకుండిన వనంబులఁ బెన్వగ లందు నిక్కువం
బని బహురీతుల న్మనమునందు విచారము చేసి చేసి దీ
నిని విడు టొప్పు నం చతఁడు నిశ్చయముం బొనరించెఁ బిమ్మటన్. 32

తే. కలిసమావిష్టుఁ డగునతం డలరుఁబోడి
విడిచి పోవఁగ సమకట్టి వెలఁదిమిన్న
కట్టుపుట్టమ తనకును గట్టుపుట్ట
మగుట నడిమికి ఖండింప నాత్మ నెంచి. 33

వ. దమయంతి మేలుకొనకుండ నే నె ట్లీవస్త్రావకర్తనంబు నేయుదునో
యని సభాభవనంబు నలుగడం గలయఁ బరికించి యొక్కచో నొక్క
యొఱ లేనిఖడ్గంబు పడియుండం గని దాని నందుకొని తద్ధారాగ్రం
బున వస్త్రార్ధం బుత్తరించి నివృత్తహృదయుండై వెడలి కొండొకదవ్వు
చని మరలి వచ్చి నిద్రించునామెం జూచి శోకించుచు. 34

తే. ఎండకన్నును వానక న్నెఱుఁగకుండ
నంతిపురముల నుండునీయన్నమిన్న
యిట్లనాథవలెఁ సిరు లెడల నేల
నొడ లెఱుంగక నిద్రించుచుండె నకట! 35

చ. మలయజవాతపోత మొకమాఱ్కి శరీరము సోక వచ్చినఁ
జెలి యిది కందిపోవు ననిచేడెలు వేడుక వీడి నెమ్మనం
బుల భయ మందుచుండెదరు పోడిమిమై మెలమెల్ల నాడుచో
నలనెడునీనెలంత కిటు లయ్యెనె దయ్యముచెర్చు నక్కటా. 36

తే. హంసతూలికాతల్పమునందుఁ బండు
కొనియు మే నొత్తె నని వెతం గొనెడుపువ్వుఁ
బోఁడి నేఁ డిట్లు నేలపై బూదిలోనఁ
గంట్లు లొత్తఁగ నిద్రింపఁ గలిగె నకట. 37

వ. నే నీనారీశిరోమణిం బెడఁబాసి పోయినంతలో మేలుకాంచి. 38

చ. చినిఁగినచీర మేల్కొనినచేడియకంటఁ బడంగ బెంగమైఁ
దనమది నెంతచింతిలునొ తామరనేఱ్పు నన్నుఁ గాన కి
వ్వనమున నెట్టు లుండునొకొ వాచవి కాదొ మృగాళి కియ్యెడం
గనుఁగొనునాకు నశ్రువులు కాలువ గట్టఁగ సాగె నయ్య యో. 39

వ. అని మఱియు నిట్లు ఘోరారణ్యంబునం బడి యున్న దీని నాదిత్యులు, నశ్వులు, విశ్వేదేవులు, మరుద్గణంబులు నేప్రొద్దు రక్షించుచుందురు గాక యని దీవించి దేవురించుచుఁ గలిసమాహృతజ్ఞానుండై నైషధుండు. 40

చ. విడి వడిఁ గొంతదవ్వు చని వెండియు వచ్చి సభాస్థలంబునఁ
మడఁతినిఁ జూచి దుఃఖమున మా నఱియుండి యొకింతసేపు పై
వెడలియు వెండి వచ్చియును వీఁగుమనం బది రెండుపాయలై
నడవ నరేంద్రుఁ డయ్యెల యనం దలపోయఁగ నయ్యె నయ్యెడన్.

దమయంతి పతిం గానక దుఃఖించుట.

వ. ఎట్టకేలకుం గల్యవకృష్టం డగుటం జేసి తెంపు చేసికొని నలుండు వైన్యంబు దోఁపం జేయుచున్న దమయంతి నాశూన్యవనంబునం దిగ విడిచి చనియె నంతఁ గొంతవడి కక్కాంత మేలుకొని కన్ను విచ్చి నలు గడం గలయఁ బరికించి నలుం గానక శోకవ్యాకులితచిత్తయై తత్తఱం పడి మిగులవగలం బొగులుచు నిజవస్త్రావకర్తనం బట్టె కంటం బడ నో యని యుచ్చస్వరంబున. 42

సీ. హానాథ! హానాథ! హాజీవితేశ్వర!
ననుఁ బాసి పోవుట న్యాయ మటవె?
నాబహిఃప్రాణమా! నను విడనాడి పో
నెట్లు కా ల్గాడెనో యెఱుఁగఁ జెపుమ?
నినుఁ బాసి యే నొక్కనిమిషమాత్రం బైన
నెమ్మేనఁ బ్రాణముల్ నిలుపఁ జాల
విడువ నోడకు మని నుడివి సత్యం బది
పోకార్తువే యిట్లు పూజ్యచరిత!

ఆ. నిదురపోవు నన్ను నెఱి వీడి ఘోరాట
విని మృగాళిఁ బడఁగ విడిచి పోతి
వకట! నష్ట నైతి నతిభీతి నైతిఁ జ
చ్చితి నయొ! యిఁక నేమి సేయుదాన. 43

క. బలవన్మరణము తగ దని
పలికిరి మునివరులు చానఁ బ్రాణములు విడఁ
దలఁచియుఁ దలఁకితి లేకు
న్న లలి న్విడకుండుదాననా? కాయంబున్. 44

మ. పరిహాసంబునఁ జేసి మాటికిని న న్బాటించి వీక్షించుచుఁ
సరసఁ గుల్మములందు డాఁగి వగల న్వర్తింతువో కాని నా
కరయఁ రామి భయంబు దుఃఖమును హె చ్చయ్యెఁ భరింపంగ లే
నరవిందేక్షణ! దర్శనం బొసఁగి న న్నాలించి పాలింపవే. 45

మ. ఒకనాఁ డీవును నేను గూడి పురబాహ్యోద్యానమాకందవృ
క్షకదంబంబులనీడలందుఁ గడువేడ్కఁ మెట్టి క్రీడించుచో
నొకయీరంబున డాఁగి కూ యనుచు న న్నోడించి త ట్టిడ్డు మా
మకచిత్తంబు గలంగ డాఁగితివొ రమ్మా తాళలే నిం కిటన్. 46

తే. లోకపాలురకడ నీవు నాకుఁ గూర్చి
వాఁకొనినవాకు లెల్ల లోకైకనాథ!
సత్యములు గాఁగఁ జేయ నీస్వాంతమందు
దలఁపు మిపు డెంతయేనియు దయ గలిగ్గి. 47

తే. ఇట్లు పడునన్ను నోదార్ప వేమి వచ్చి
నాకు శోకింప నింతయు నీ కయి కడు
నొగిలి శోకింతు నాకటఁ దగిలి నన్నుఁ
గూడ కెటు పలవింతు వొక్కొ యటంచు. 48

వ. అని శోకార్తయై విలపించుచు లేచి నిలువ నోప కిలం బడి లేచి యిట్లట్లు మెట్టుచు నిట్టూర్పు వుచ్చుచు నార్చుచు నేడ్చుచు నల యుచు సొలయుచు దిక్కులు చూచుచు నదరుచు బెదరుచు సంచ లించుచుఁ దమ కట్టియిక్కట్టు తెచ్చిపెట్టినకట్టిడములం దిట్టుచు బిట్టు ప్రలపించుచు శార్దూలాదిదుష్టసత్వసేవితం బగు నమ్మహారణ్యంబున నందు నిందుఁ బతి నన్వేషించుచు నున్మత్తవలె సంచరించుచుండె నాసమయంబున. 49

దమయంతిం గొండచిలువ పట్టుకొనుట.

తే. ఒడ లెఱుంగక తొట్రుపా టుడర వచ్చి
తనదుచెంగట మెఱ్ఱెడుతన్వి నరసి
సరభసంబునఁ బట్టె ఱుద్భరము మెండు
కొన మహాకాయ మగునొక్కకొండచిలువ. 50

చ. పెదపెదనల్లమచ్చ లతిభీష్ముములై యొడలెల్ల మొల్లమై
బెద రిడుచుండఁ గొండవలె విగ్రహ మాగ్రహ మే యనంగ నై
పొదల మహోగుహం దెగడుపోలిక నాలిక లార్చునోటితో
నదటున వచ్చి పట్టుకొనె నట్టిటు మెఱ్ఱెడునత్తలోదరిన్. 51

చ. పదములు పామునోటఁ బడఁ బట్టు విడం బొనరింపఁ జేతులక్
విదులుచుచుం దదాస్యమున వ్రేయుచు రాయుచు సంచలించుచో
నది తనతోఁకతో నదిమి హస్తయుగంబును మేనుఁ జుట్టినం
గదలఁగ లేక కూలఁ బడి కాంత నితాంతము సంతపించుచున్. 52

వ. అట్లు తన్నుఁ బట్టినం బట్టు తప్పించుకొనం జాలక జాలింబడి కరం బార్తిం బ్రోశించుచు నుచ్చస్వరంబున. 53

ఉ. దిక్కసుమంత లేక యిట దేవరుగొ ట్టన మెట్టుచున్నన
న్నిక్కడ మొక్కలీఁ డగుచు నీవెనుఁబామ గ్రసించె నక్కటా!

యెక్కడి కేగినాఁడవో హృదీశ్వర! న న్విడి నేగి యయ్యె నీ
వక్కటికంబునం గదియ నై హృదయేశ్వరి నన్నుఁ గావవే. 54

తరువోజ.—

అని వగచుచునున్న యవసరమందు
నటకు మృగవ్యాధుఁ డరుదెంచి యొకఁడు
ఘనభుజంగమముఖగహ్వరమందుఁ
గ్రాలెడుదమయంతిఁ గని వేగిరించి
తనచేసురియ నోటిదరినుండి వ్రయ్యఁ
దఱిగి చాసరిపాముఁ దడయక చంపి
వనజాక్షి వెడలించి వనముల సర్ప
వదనస్థితం బైనవర్ష్మంబు గడిగి. 55

వ. వన్యంబు లాహారంబుగా నిడి దమయంతి నూఱడించి యి ట్లనియె.

ఉ. ఎవ్వఁ డె వీవు భూర మగునివ్వన మెవ్వఁగఁ జేరఁ గల్గి తీ
నివ్వెఱ కేమికారణము నీరజలోచన! చెప్పు మన్న నా
యవ్వ నిజప్రవృత్త మది యంతయుఁ దా మృదులస్వరంబుతో
నవ్వనచారికిం దెలియ నానతి యిచ్చె యథాక్రమంబుగన్. 57

తే. అయ్య! ననుఁ గొండచిల్వ కాహార మగుచుఁ
బోవ నగుదాని నీరీతిఁ గావ నైతి
నీవు, నీఋణ మెట్టులు నేను దీర్చు
కొందు నోతండ్రి! నీ కిదే వందనంబు. 58

తే. అట్లు పల్కిన విని మృగవ్యాధుఁ డర్ధ
వస్త్రసంవీతఁ బీనసంవర్తుల స్త
నాఢ్య సుశ్రోణిఁ జంద్రనిభాస్య సుంద
రాంగిఁ గని కామశరవిద్ధుఁ డై తపించి. 59

ఉ. చక్కనిచుక్క యిక్కలికి జాబిలి యీబిడమోము చందోవల్
జక్కవలక్ హసించెడిని జానుఁగు లెన్నఁగఁ జక్కలంబు లీ
ముక్కును జెక్కవేసినటు ముచ్చటఁ గూర్చెడుఁ జిల్కపల్కు ల
మ్మక్క! యెయారి దీని బిగియారఁ గవుంగిటఁ జేరఁ దీసెదన్. 60

ఉ. బంగరుబొమ్మ కొమ్మ యిది బాపురె! యీపుపుఁబోఁడితోఁడ నే
సంగతినేని కూటమి పొసంగఁగఁ జేసికొనంగఁ గల్గెనే
నంగజతాప మార్చుకొనునట్టిద కాదు మదీయజన్మముల్
వంగసముం దరించెడిని వాకొన నేటికి నేనె పో దొరన్. 61

క. ఇది నా కాలై నాగుడి
నెదెసం గా ల్వొట్టె నేని చెప్పఁగఁ బని యుం
డదు నేన కుబేరుఁడ న
య్యెద వెన్నుఁడు నా కడంగియే యుండు నీకన్. 62

వ. అని పలుదెఱుంగులం బడి పలవించుచు మోహాపరవశంబున నొడ
లెఱుంగక క్రిందు మీఁదు లరయఁ జాలనిచిత్తంబున నత్తమిల్లుచు
మెత్తనివచనంబుల నత్తన్వి ననునయించి తనమనోరథం బెఱిఁగించి
చెనకం జూచుటయు నంతలో నగ్నిశిఖయుం బోలె నంట శక్యంబు
గాక వెలుంగునమ్మహాపతివ్రత. 63

మృగవ్యాధుఁడు దమయంతి మీఁదఁ బోయి మృతుం డగుట.

చ. తగ దిటు లోరి! దారి నను దాసరిపాము మొగంబులోఁ బడం
దెగియెడుదానిఁ గాచితివి దేవుఁడ వైనను దండ్రి వైన నీ
వగుదువు నేఁ ద్రిలోకవిభునంతటివానికి ధర్మపత్ని నై
తగియుఁ బతివ్రతాత్వమును దాలిచి యుంటిని నీ వెఱుంగవో? 64

ఆ. అగ్నిశిఖయుఁ బోలె నంట శక్యము గాదు
నన్నుఁ బోటిగరితఁ గన్నుఁ గాన
కిట్టిపనికిఁ బూన నట్టె చా వగుదెంచు
నొడలిమీఁదియాస విడకు మన్న! 65

వ. అని బతిమాలుచుం బలుకుచున్నను గన్నుఁ గాన కమ్మృగవధాజీవ
నుండు సద్భావంబు లేనిమూర్ఖుండును మోహాపరవశుండునుం
గావున వెనుకముందు లెఱుంగక ముట్ట వచ్చుటయు నామె కన్నెఱ్ఱ
చేసి నేను బతివ్రతన యేని పరమేశ్వరుండు న న్నుగ్రహించుఁ
గావుత మని పలికి వానిదెస నలుకం జేసి యొక్కింతలో నింత కన్నుఁ
దెఱచె. 66

క. కనుఁ గెఱుచునంతమాత్రం
బున దావానలవిదగ్ధభూరుహమువలెఁ
దనువునఁ బొగ లెగయఁగ న
వ్వనచరుఁడు గతాసు వగుచు వసుధం బడియెన్ 67

వ. అంత నాదమయంతి వసుధం బడినవానిం జూచి వగచుచు. 68

ఉ. దాసరిపామునోటి కగుదాని ననుం బ్రదికించి తండ్రి వై
దోసమువంకఁ బోవుటలు దొడ్డతనం బనరాదు నాఁగ నా
చాస గ్రహింపఁ బోక ననుఁ బట్టఁగ వచ్చినదాన నిట్టు లై
పానితె నీదుచుట్టములఁ బాప! మయో! విధి చెయ్యి తప్పునే. 69

క. నను బ్రదికించినకతనన్, ఘనతరపుణ్యం బొనర్పఁ గలిగెం దానన్
వనచరుఁడు వీని కయ్యెడు, ననువగులోకముల సుఖసమంచితరీతుల్.

వ. అని పలికి దమయంతి సింహశార్దూలాదిదుష్టసత్త్వసమేతంబును, నానా
విధపక్షిగణాకీర్ణంబును, మ్లేచ్ఛతస్కరసేవితంబును, సాలవేణుధరా
శ్వత్థతిందుకార్జునాదివివిధవృక్షసంచన్నంబును, ధాతుశతనద్ధభూధ
రాంచితంబును, మహోన్నతనికుంజపుంజరంజితంబును, నదీనదసర స్త
టాకవాపీకూపశతసహస్రశోభితంబును, బిశాచోరగరాక్షససమూ
హసమావృతంబును, నగునమ్మహారణ్యంబు భర్తృవ్యసనపీడితయై
ప్రవేశించె నంత. 71

ఉ. ఘోరవనంబునం దిటులు కొంతనరాని మహర్తి నొందు నీ
సారసపత్రనేత్రఁ గనఁ జాల నటంచుఁ దలంచి మిత్రుఁ డీ
ధారుణి వీడి పోవు ననఁ దారకమార్గము వట్టి పశ్చిమ
ద్వారమునుండి పోయి చరమాద్రిని దాఁకె రయంబు పెంపునన్.

క. కెంజాయ లడరి యుడిగెఁ
సంజయు సరిపడియె నపుడు సాంద్రంబై నిం
గిం జతపడియెఁ బ్రబ్బులుఁ
బెంజీకటు లలముకొనియెఁ బృథివితలమునన్. 73

## అంధకారవర్ణనము.

సీ. కాలకంఠుని కంఠగహ్వరంబుననుండి
వెలికి వచ్చినహాలాహాల మనంగఁ
ద్రిక్కుదహార్యంబు తెగి భిన్నభిన్నమై
విశ్వంభరం బడి విరిసె ననఁగ
బ్రధ్నుండు తనకు లోఁ బడినచందురు కళం
కముఁ దీసి యటు పాఱఁ గ్రాసె ననఁగ
యమరాట్టు తనదువాహనముతో మెట్టుచు
నిజకాంతి జగమెల్ల నించె ననఁగ

తే. జారచోరాపకీర్తి యాచక్కఁ బిక్క
టిల్లి యీరైదుదిక్కుల నల్లె ననఁగఁ
గన్ను మిన్నును గనరాక కడఁగి మిట్టు
పల్ల మొకటిగ ధ్వాంతంబు పర్వె నపుడు. 74

క. భూమి యిది యాకసం బిది
కడ లివ్వి యనంగరానిగతిఁ జిక్కఁగ నై
కడుంకొని సూదులఁ బొడువఁగ
నెడ మింతయు లేక ధ్వాంత మెంతయు విరిసెన్. 75

వ. ఇట్లంధకారంబు బంధురంబై కన్ను మిన్నుఁ గానరాకుండునట్టిసమ
యంబున నవ్విదర్భరాజనందన జెందంబున భయం బిసుమంతయుం
దోరల నీయక నిజాధినాథు నన్వేషించుచు శరీరపారవశ్యంబున నగ
పడినవాని నెల్ల నడిగికొనుచుం బోయి పోయి యొక్కచో నొక్క
శిలాతలం బాశ్రయించి మగని నుద్దేశించి దుఃఖించుచు. 76

ఉ. ఎక్కడ నుంటి వోయి హృదయేశ్వర! నన్ విడనాడి యివ్వనిన్
మిక్కిలిజన్నముల్ సలిపి మిథ్య వహించుట నీకుఁ బాడి గా
దక్కట! నాసమక్షమున నాసురవర్యులు వించునుండ నీ
వక్కటికంబునన్ నుడివినట్టినుడుల్ స్మరియింప నొప్పదే. 77

క. ధర సాంగోపాంగసవి
స్తర వేదచతుష్టయంబు చదువుటకంటెన్

వర మొక్క-సత్య వాక్యము
పరిపాలించుట యటంచుఁ బలికిరి మానుల్. 78

చ. పిలిచినఁ బల్క- వే మయయొ భీషణమై వివృతాస్యమై మహా
జ్జ్వలగతి మృత్యువో యనఁగ వచ్చి భుజించెడు న- మృగేంద్ర మాఁ
కలిఁ గొనియుండె నీదయకుఁ గాఁ గలదానన యేని నీవు నా
వెలలెడు ప్రాణము న్నిలుపవే పఱతెంచి నరేంద్రచంద్రమా. 79

సీ. నినుఁ గాక వేఱొక్క-నెలఁతఁ బ్రేమింప న-
పలుకు సత్యము సేయఁ దలఁపు మీశ!
చిక్కి వివర్ణనై పొక్కు-చుం బిలిచినఁ
బలుక వేటికి మాఱు సలలితాత్మ!
యూథనాథుని విడియున్న కరిణివోలె
వగచున న్నేలవో వసుమతీశ!
యీఘోరవనములో నెందును వెదకియుఁ
జూడలేనైతి నిఁ- సుందరాంగ!

తే. వనులఁ బడిపోయె నైషధావనివిభుండు
వానిఁ గనుఁగొంటిరే? యని వేని నడుగ
వేఱు గనుఁగొంటి నని నాకు వేడ్క- మీఱ
మా ర్వలుక నుండునో యిట మానవేంద్ర! 80

వ. అని ప్రలపించుచుం గదలిపోవునామె కమ్మార్గమధ్యంబున. 81

చ. పెటపెట శబ్దముల్ చెవులు బీటలు వాఱఁగఁ జేయఁ గాఱుచీఁ
కటులు వడంగఁ బెంబొగలు కన్నులఁ గొట్టుచు బెట్టు పుట్టఁ బ్ర
స్ఫుటముగ నాల్క- లార్చుచును బోరున నాకము ముట్టి దావ మ
చ్చటఁ గన నయ్యె నైషధునిచానకు మానక నాల్గుదిక్కు-లన్. 82

చ. మృగములు పక్షులు- బెదరి మేదురనాదము నల్క-లంకులఁ-
దగులఁగ నార్చుచు- వడిగ దాహభయంబునఁ బాఱుచుండ న
మ్మగువ దవానలం బెదుట మండుచు వచ్చుటఁ జూచి దుఃఖశో
తిగఁ బర మేశ్వరుండు ననుఁ దేర్చెడు నంచని సంతసించుచున్. 83

ఆ. ప్రలయమందుఁ బోలె బగ్గున మండెడు
నగ్గిమంటలోని కరిగె నంతఁ
జల్లఁబడియె స్వప్న సదృశమై కార్చిచ్చు
మగువతలఁపు వ్యర్థ మగుచుఁ బోవ.

పంచ. స్వయంవరంబునందు నింద్రసమ్ముఖంబునఁ ధనం
జయుండు తానును స్వారం బొసంగి యుండెఁ గావునఁ
బ్రియంబునఁ సతీమతల్లిబీతునఁ స్వదాహాశ
క్తి యెల్లఁ జెల్లఁ జల్లనయ్యెఁ దేఱి చూచినంతనే.

వ. ఇట్లు కార్చిచ్చు చల్లారినంత దమయంతి యెప్పటిదారింబట్టి పో
చుండె నప్పుడు.

సింహశార్దూలాదులు దమయంతి కెదురుపడుట.

సీ. కాండ్రు కాం డ్రనుచును దీండ్రించుకోల్పులుల్
దాపుదాపున నుండి దాఁటిపోయె
ఖణిలుఖణి ల్లని కాన దద్దిర్ల అం
కెలు వేయుసింగముల్ కెలన మెలఁగ
బొబ్బాబొబో యని బొబ్బరించునెలుంగు
గొడ్డు లడ్డంబుగా నడ్డి పాఱె
గింగుగింగు రనంగ ఘీంకరించుచు రేఁగి
కారుచీనుంగులు కడల నడచెఁ

తే. జిట్టలును గారుదున్నలు సివ్వగులును
దుమ్ముగొండ్లును దోఁడేళ్లు చుప్పు లార్పు
లుప్పరం బంట నడయాడెఁ జెప్ప నేల
పాములును దేళ్లు నల్లడఁ బఱువఁ జొచ్చె.

ఉ. నింగిఁ బగుల్చునో యన ఖణిల్లని అంకె లెసంగఁ జేయుచున్
సింగ మొకండు నైషధునిచేడియచెంతకు రాఁగ నామెనన్
మ్రింగి మృగేంద్ర! ప్రోవు మని మీఁదికి మీఁదికి వచ్చుచుండ న
సింగము ధైన్యముం దెలుపు చిన్నరవం బొనరించి చెంగటన్.

వ. మునికాళ్లు నేల మోయఁ బీతంబు వెట్టుకొని కూరుచుండి కన్నీరు విడుచుచున్నం గని దమయంతి దానిచెంతకుం జని. 89

మ. మృగనాథుండను నే వనాంతరముల న్నే లందుచున్నాఁడ నీ
మృగమధ్యం గని దీనికష్టములు వో మే ల్గూర్చ లేకుంటి నా
దగునాథత్వము కాల్పనే యనుచు దుఃఖావేశముం దెల్పుచుఁ
వగ నెమ్మోమునఁ జూపుచుంటివి కదే పంచాస్య! ని న్నెంచెదన్. 90

మ. వనసత్వంబులలోన నీకుఁగలసత్వంబుం గృపావేశముఁ
ఘనశౌర్యంబును వీర్యముఁ బలము లోకఖ్యాతసామర్థ్యముఁ
గన లోకంబున వేరిక్కేని కలవే కంఠీరవేంద్రా! ననుం
గని చిత్తంబున నుత్తలంపడెదు నిఁ గై మోడ్చి సేవించెదన్. 91

వ. అని దానిం దరియ వచ్చినంత నది చేతు లెత్తి దీవించునదియుం బోలె
మునికా ళ్లెత్తి శిరం బాఘ్రాణించి తొలంగి చనియె నంత. 92

సీ. కారుకాటుకకూడాలు కాదు కా దనఁ జాలు
నెఱుకలు మేనెల్ల నిండికొనఁగ
వజ్రసారంబులై వంకలు దేరిన
ఖరనఖరంబు లుగ్రతను జూప
నొక్కింతలో నుక్కుఁ జెక్కుఁ జాలెడునాఁకు
ఱాయి నా నాలుక ఱాపుఁ జూప
మృత్యుదంష్ట్రలు వోలె మెఱుఁగెక్కుదంష్ట్రలు
ఘనతరవిస్ఫులింగముల నీన

తే. గుట్టల న్నెట్టల న్నెట్టుపొట్టికాళ్లు
చెట్టుచేమల నెక్కుంగఁ జేతులు గను
బ్రాణికోటికి మృత్యురూపమ్మొ నాఁగ
వచ్చె భల్లూక మొక్కఁ డావనితకడకు. 93

వ. వచ్చినం గని దమయంతి. 94

శా. భల్లూకం బిది క్రూరజంతు వగు నాప్రాణంబులం దీసి నా
కుల్లాసంబు ఘటింపఁ జాలు ననిలో నూహించి రా ర మ్మయో
భల్లూకేశ్వర! నన్నుఁ జంపి తిని నాస్వాంతంబునం గల్గుగో
డెల్లం బాయఁగఁ జేసి పుణ్యమునఁ బో మ్మే నిన్నుఁ బ్రార్థించెద న్.

వ. అంతలో నయ్యెల్లుగొడ్డు కొన్నియాఁ రెపం డ్లాపడఁతికడం బడవైచి వడివడిం బఱచె నంతఁగొంతటిలోనఁ జతుర్దంష్ట్రంబును, మహోగ్రంబు నగునొక్కవ్యాఘ్రం బెదురుపడి లోచనగోచరం బగుటయు వగవ కామె నిశ్శంకంబుగా దానిచెంతకుం జని సంబోధించుచు ని ట్లనియె.

ఉ. నీవు మృగాధినాథుఁడవు నీకు నరణ్యమునం బ్రభుత్వ మాఁ
గావున వేఁడుచుంటి నినుఁ గావుము నేను విదర్భరాట్సుతఁ
దేవనిభుండు నైషధుఁ డనింద్యచరిత్రుఁడు నామనఃప్రియుం
డీవనిఁ దప్పి పోయె నెట నేఁ బొడఁగంటి వయ్యో వనేశ్వరా! 97

క. నలుజాడ తెలిసితేనియుఁ, దెలిపి ననుం బ్రోవు మట్లు తెలియనిచో నో
పులిరాజ! నీదునోటఁ, నిలువం జేకొనుము నన్ను నెగు లిది తీఱన్.

క. అని యంతఁ బోవ కట నొక
ధునిఁ గని దమయంతి చింతతో నోస్రోత
స్విని! నన్నుఁ దేర్పు వేనియు
నినుఁ జేరెద నింతలోన నేఁ దెగువమెయిన్. 99

వ. అని యట నానాథాతుసమాకీర్ణంబును బహుశృంగసమంచితంబును వివిధవిహంగమసంకులంబును దరుగుల్మలతావితానవిరాజితంబును నగునొక్కశిలోచ్చయంబుఁ గని దాని సుద్దేశించి యి ట్లనియె. 100

దమయంతి పర్వతవృక్షాదులం బ్రార్థించుట.

సీ. భూధరేశ్వర! నే నమోవాక మొనరించి
నేవింతు నను దయఁ జిత్తగింపు
మే రాజపుత్రిక, భూరమణుం డైన
నానాథుఁ డెంతయే నలువు మాఱి
తేజుమైఁ గావించె రాజసూయాశ్వమే
ధాధ్వరములు సుర లచ్చెరుపడ
నిషధేశ్వరుం డయి నెఱి గన్నవీరసే
నుం డెన్న నాశ్వశురుండు సువ్వె

తే. దైవబల మింత తప్పుట ధరణి వీడి
వనులఁ బడి భర్తఁ గానక వనటఁ గుందు

చుంటి నలచక్రవర్తిని గంటి వేని
తెలియ నానతి యిచ్చి నన్ దేర్పు మిపుడు. 101

వ. అని యభ్యర్థించుచుం బలికి వైదర్భి మఱియును. 102

సీ. దారులారా! పాఱుటేఱులారా! మీరు
భువనైకమోహనుఁ బోల్చినారె?
పశువులారా! కీరశిశువులారా! మీరు
క్షితిజనేశ్వరుని వీక్షించినారె?
గట్టులారా! పుట్టచెట్టులారా! మీరు
ఘనభూభృదగ్రణిం గాంచినారె?
పాములారా! పెనుగాములారా! మీరు
వరనాగబలవేద్యు నరసినారె?

తే. మబ్బులారా! విసరుగాలియుబ్బులార!
చుక్కలారా! పువుఁబొదలయిక్కలార!
వేల్పులారా! పవలురేయుఁ దాల్పులార!
నామనోహరుఁ దిలకించినారె మీరు? 103

వ. అని పరిదేవనంబు సేయుచు నొక్కచోట. 104

సీ. బలినెత్తిపైఁ బాదములు వెట్టుటకుఁ బోలెఁ
బాతాళ మంటినపాఁతు గలిగి
బొడ్డుబిడ్డనిసృష్టి పొలుపు చూచుటకు నాఁ
జుక్కలపైఁ దలల్ సూపఁ గలిగి
దశదిశల్ నిండినతను వొప్పు నని చెప్పఁ
గడుదవ్వు సాఁగుశాఖలను గలిగి
మేరుమందరములతో రవరవలాడ
మొనసెడు నా మేటిమొదలు గలిగి

తే. చుట్టునుం గ్రింద నెంతయో మట్టు వేఁడి
వేల్పుకిరణాళికిం జోటు గొల్ప నట్లు
చల్లదన మిచ్చుచుం జంతుసమితి నేల
వెలసి సాలద్రుమం బొప్పు విష్ణు వనఁగ. 105

వ. దమయంతి దానిం దిలకించి చేతులు జోడించుకొని ప్రదక్షిణించి యిట్లని ప్రార్థించె. 106

మ. కరుణాళూ! ననుఁ బ్రోవ నీవనమునం గన్పట్టినట్టిండ వా
పరమాత్ముం డగువిష్ణుమూర్తి వని నే భావింతు నీ కెల్లచో
ట్లరయ న్వచ్చెడు నామనోహరుఁడు నా ప్రాణేశ్వరుం డానలుం
డరయ్ రాఁ డెట నుండెనో తెలిపి నాయాఁరాటమున్ దీర్పవే. 107

వ. అని పరిపరివిధంబులం బ్రార్థించియుఁ బ్రయోజనంబు గానక. 108

చ. ఎడనె విభుండు దవ్వగుచు నేఁగి కనుంగొనుదాన నంచుఁ బె
న్వడిఁ జని ది క్కెఱుంగ కొకవైపునకు న్మఱియొక్కవైపు గా
నడచుచు నందు నందును గనంబడుగట్లను జెట్లఁ వేడుచుఁ
గుడుగుడుగుంచముల్ దిరిగెఁ గోమలి రే పగుదెంచునంతకున్. 109

వ. అట్లు తిరిగి తిరిగి దారియుం దెన్నుం గానక నదీపర్వతమధ్యంబునం బడి యడలు గుడుచుచు నొడ లెఱుంగ కొక్కచోటం బడి మూర్ఛం బొంది యుండె నయ్యవసరంబున. 110

చ. వనగజ మొక్కఁ డక్కడకు వచ్చి వనంట మునింగి యున్నయ
వ్వనితను గాంచి దుఃఖమున వందురు నాఁ జిఱుగేక వెట్టుచుఁ
గొనకొని చేత నెత్తుకొని గొబ్బున నబ్బలునేటి నీఁదుచుఁ
జని యవలఁ బ్రతీరమున సాధ్విని నిల్పెను దారిఁ దెల్పుచున్. 111

వ. దమయంతియు నంత మేలుకాంచి వనగజంబునకు వందనంబు గావించి నితాంతచింతాసాగరనిమగ్నమానమానసయై యుత్తరంబు ముట్టి మూఁడహోరాత్రంబులు నడచి ముందట నొక్కతాపసారణ్యంబున.

మహామునులు దమయంతికి దర్శన మిచ్చుట.

ఉ. ఆఁకు లలంబులుఁ జలము నాశుగముం దమ కెల్లవేళలం
దాఁకలి దీర్చుకోఁ దగినయట్టివ యై చనఁ గృత్తివాసు లై
వీఁడఁ దపం బొనర్చుచును వెల్గుమునీంద్రులపావనాశ్రమం
బాకమలాయతాక్షి గనె నచ్చట నచ్చెరుపాటు దోఁపగన్. 113

వ. అందు వసిష్ఠవామదేవాత్రిసదృశు లగుమహామునికులాధ్యక్షులు తపించుచుండుటం గాంచి సమీపించి నమస్కరించి వినయవినమి

తో త్తమాంగయై నిలిచి యున్నం గని మునివర్యులు స్వాగతంబు
వలుకుచుం గూచుండం జేసి యథోచితోపచితుల నామెం బూజించి
యి ట్లనిరి. 114

చ. ఎవతెవు తల్లి ! నీ విటకు నేటికి వచ్చితి నీతనుద్యుతుల్
డివి భువి నిండి మాదృశులదృష్టులకు న్మిఅుమిట్లు గొల్పుఁ జె
ప్పవె వనదేవివో తెలియఁ బర్వతదేవివొ లేక వారిదే
వివొ తలపోయ మాహృదయవీథుల విస్మయ మావహిల్లెడున్.

ఉ. నా నలపత్ని మౌనుల ఘనం బగుభ క్తి భజించి యి ట్లనుఁ
నే నిపు డీరు పల్కినటు నిక్కము దేవతఁ గాను మానవిం
గాని, వినుండు చెప్పెద నఖండపరాక్రమశాలి యై జగ
న్మానితుఁ డైననైషధుఁడు మామకజీవితనాథుఁ డారయన్. 116

ఆ. అతఁడు దేవనమున నఖలరాజ్యము గోలు
పోయి నన్నుఁ గూడి పొలములందు
మెలఁగ వచ్చి యిపుడు తొలఁగి పోయెను వాని
వలను వెదకుచుంటి వగచి వగచి. 117

మానిని.

ఓమునినాయకులార ! భవద్వన ముత్తముఁ డానృపస త్తముఁ డెం
తేముద మావహిలం గనునిచ్చు మెయిం జనుదెంచెనొకో కరుణా
భూములరై వచియింపుఁడు మ్రొక్కెదఁ బుణ్యచరిత్రు నలుం గన కే
నీమెయిఁ గొన్నిదినంబులలో విడి యింపొనఁ గూకుతు నాత్మ కొగిన్.

వ. అని విలపించుదమయంతిం జూచి దాపసో త్తము లి ట్లనిరి. 119

ఉ. రాఁ గలకాల మెంతయు వరం బయి యొప్పెడు మీకు మాతపో
యోగమునన్ గ్రహించితి మయోగ్యనిషాదనుఁ డానలుండు ప్ర
జ్ఞాగరిమన్ రిపుం దఱిమి సౌఖ్యగతి న్నిజరాజ్య మందు నీ
లోఁ గననయ్యెడిన్ సకలలోకనుతంబుగఁ దొంటివైఖరిన్. 120

తే. అనుచు దమయంతినిం బల్కి మునివరేణ్య
లరయుచుండ నంతర్హితు లైరి వారు

సాగ్నిహోత్రవరాశ్రమము లగుచు నమ్మ
హామహత్త్వముఁ గని విస్మితాత్మ యగుచు. 121

క. దమయంతి తనమనంబున
నమితాశ్చర్యంబు నొంది హాహా! యిదిని
క్కముగాఁ గల యగుఁ గాదే
నమఁగాశ్రమ మేది పూజ్య లగుమును లేరీ? 122

వ. అని చింతాకులస్వాంతయై దమయంతి కొండొకచోటికిం జని యట
నొకపుష్పితాశోకంబుఁ గని శోకించుచు. 123

చ. వనముల మెట్టులక్ మిగుల వాడినవాఁ డొకచీరలో సగం
బునె మొలఁ జుట్టఁబెట్టుకొని పోయెడివాఁడు మహామనోవ్యథం
గనుఁగవ నశ్రుబిందువులు గ్రమ్మఁ జరించెడివాఁడు జేఁడు నిక్
గనుఁగొన రాఁడుగా తెలిపి నావెత దీర్పవె వృక్షరాజమా. 124

వ. అని మఱియు నొండువలనికిం జని. 125

ఉ. కమ్మనికుందనంబుపసఁ గా దనిపించెడిమేనివాని నె
త్తమ్మికి నీడుజో డనుచుఁ దల్పఁగ వచ్చెడుమోమువానిఁ బో
పొ మ్మని బెళ్కు బెడిసలఁ బోవఁగఁ ద్రోల్కనుదోయివాని నా
పొ మ్మగువాని నెం దయినఁ జూడరుగా వనులార! చెప్పరే. 126

వ. అని పలుకుచుఁ బర్వతంబులు వృక్షంబులును వ్యక్తులే యని తలంచి
వానిం బలుకరించి పలుకరించి వలగొని వలగొని పోవుచుం బోవుచు.

ఉ. చీమ చిటుక్కు మన్నఁ దనచెల్వుఁడు వచ్చెడు నంచు నల్దిసల్
పో మది నేయ నాఁకు లొకపోడిమి నల్లలనాడ నద్దెస
భూమిభుజుండు మెట్టు నని పోఁ దలఁపోయు శుకం బొకింతలోఁ
గోమలశబ్దముక్ సలుపఁ గో యని పోవఁ దలంచు నాయెడన్. 128

దమయంతి కొకసార్థంబు కనిపించుట.

వ. ఇట్లనేకపర్వతంబులు ననేకవనంబులు ననేకసరిద్వరంబులుం దాఁటి
దాఁటి పోయి పోయి ముందట హస్త్యశ్వరథసంకులం బగునొక్క
సార్థంబు గని సవిూపించుటయు నందలిజనంబు ధూళిధూసరిత
శిరోరుహయు, నేకవస్త్రార్ధసంవృతయుఁ, గృశీభూతశరీరయు, వివ
ర్ణయు నై పిచ్చిదానిమచ్చున వచ్చునచ్చిగురుఁబోడిం గని. 129

ఉ. కొందఱు పాఱి రార్తు లయి కొందఱు చింతిలి రెంతయేనియుం
గొందఱు భీతులై పడిరి కొందఱు పొందిరి ద్వేషభావమున్
గొందఱు నింద చేసి రెదఁ గొందఱు చేతులు తట్టి రార్చుచుం
గొందఱు కేరుచు న్నగిరి కొందఱు పిల్చిరి గారవంబునన్. 130

తే. ఏమి రోయుచునుంటివో యింతి! నీ వె
వర్తు వేటికి వచ్చి తీవాసిదాన
వరయ మానిసివా? విపినాధిదేవ
తవ? నిజము చెప్పు మనిరి కొందఱు భజించి. 131

మ. మఱియుం గొందఱు భక్తితత్పరత నామాన్యాకృతిం జూచి య
క్కఱ దీఱఁ వినుతించి నీ వమరివో? గంధర్వివో? యక్షివో?
నెఱి మీఱఁ వెలుఁగొందుచుంటివి నినున్ సేవింతు మే మెప్పుడుం
జెఱుపుం జేయకయుండి మాచనుప రక్షింపం గదే తల్లిరో! 132

వ. అని యందఱు నన్ని చందంబులం బడి ప్రవర్తించుచుండ భర్తృవ్యసన
పీడిత యగునాబేల బాలవృద్ధాదిసమృద్ధం బగుసార్థంబునం గలసార్థ
వాహులం గని మెల్లన ని ట్లనియె. 133

ఉ. మానవి నే నలుండనెడు మానవనాథునిపత్ని భీమభూ
జానికి నాత్మజ వినుఁడు సార్థజనేశ్వరులార! నావిభుం
డైనయతండు రాజ్యవిభవాదికము న్విడి వచ్చి నన్ని టం
గానలపాలు చేసి చనెఁ గాంచితిరే నెఱిఁగింపుఁడీ దయన్. 134

తే. అనుడు శుచి యనుసార్థవాహాధినాథుఁ
డామె కి ట్లను నలుని స్వానాంతరమునఁ
గాన నెప్పుడుఁ గాంతు సింగములఁ బులుల
నెలుఁగులం గారుదున్నల నేనికలను. 135

క. నినుఁ గాక యొక్కమానిసిఁ
గనుఁగొన నిక్కాననలోనఁ గటికిపిశాచం
బని జడియుమమ్ము దీనుల
మనుచుఁ య క్షేశ్వరుండు మణిభద్రుఁ డిటన్. 136

తే. అనుడు నాబిడ మీబిడా రరుగు నెచటి
కని సుబాహునిచేదిరాజ్యమున కనుచుఁ
దెలిసి భర్తృలాలస యయి తలఁపు దెలిపి
యనుమతిం గొని వారితో నరిగెఁ దాను. 137

చ. చనుపయుఁ గొన్ని నా ళ్లడవిచక్కిఁ బ్రయాణముచేసి యొక్కచో
వనజసుగంధబంధురము స్వాదుసుశీతలవారిపూర మై
ఘనతర మైనచె ర్వొకఁడు గాంచి బడల్పడి యుంట దానికిఁ
దెనుకటిదిక్కున న్నిడిసె వేడ్కమెయిఁ శుచినాము నానతిన్. 138

అడవియేనుఁగులు సార్థవాహులం జంపుట.

ఉ. అంతట నర్ధరాత్రసమయంబున సార్థము నిద్రవోయి వి
శ్రాంతి వహించి యుండ నట సాంద్రతమంబున కెత్తువచ్చి దు
ర్దాంతదురంతవేగమున దంతిసమూహము దప్పిఁ జెంది త
త్సాంతమునుండి వచ్చె మదధార లవారిగఁ గాఱుచుండఁగన్. 139

తే. ఇట్లు పఱు తెంచి వన్యమదేభయూథ
మట మెలంగెడు గ్రామ్యగజాళిఁ జూచి
ఘీంకరించుచుఁ బై బడి క్రేళ్లుదాఁటి
వడివడిగఁ దాఁకి కడుఁ జిందువందు చేసె 140

క. కరిఘటలు కరుల నరులం
బరిజనులం బశుల శిశుల బహుళో ష్ట్రములం
బరిపరివిధములఁ గూల్చినఁ
బరపై పె ల్లెగసె నడరి భయదారవముల్. 141

వ. అప్పుడు. 142

మ. పదసమ్మర్దితులై కరాభిహతులై బాధోగ్రదంతస్ఫుట
త్పదహస్తోరుకపాలఫాలశిరులై పంచత్వముం గాంచి ర
ప్పదమందుం గలవారు కొందఱు విపత్పాథోధిమగ్నాత్ము లై
మదధారాపరిషిక్తభూతలమహామాతంగజాతోద్ధతిన్. 143

తే. సాధ్వసంబున నగు రభసమునఁ జేసి
పఱచి చెల్లెక్క కాలూఁదఁ బడమిఁ బుడమి

కొఱగి చచ్చిరి కొంద ఱొండొరులఁ దాఁకి
కొనుట నఱచుచుఁ ద్రెళ్లిరి కొంద ఱపుడు. 144

మ. నరు లేస్గుల్ తురగంబు లశ్వము లటఁ వన్యాళిచేఁ ద్రుంగిపోఁ
గరముల్ గాళ్లును వ్రేళ్లునుం దలలు డొక్కల్ లిక్కలుం బ్రక్కలుఁ
నరముల్ ప్రేవులు గుండెలు న్వసలు నాంత్రంబు ల్వాప ల్తాంసముల్
ధరణిం బాతెను గుప్పతిప్ప లగుచుం దద్రక్తకాలంకషన్. 145

వ. ఇ ట్లాబిడా రంతయు నంత మైనం గని దమయంతి చింతాకులస్వాం
తయై తనదురదృష్టంబునకుఁ బరిపరివిధంబులఁ బరిదేవనంబు సేయు
చున్నంత హతశేషు లయినకొందఱు. 146

సీ. బంధుజనంబును బశుధనంబును నేల
పాలయ్యె నయ్యయో బంధులార!
వననాథు మణిభద్రు మనము పూజింపక
వనముఁ జొచ్చుట నిట్లు వనట వచ్చెఁ
దొలిదొల్త విఘ్నకర్తలను మ్రొక్కనితప్పు
గురుతరమై యిట్లు పరిణమించెఁ
గదలునప్పుడు మనగ్రహాచారమునకుఁ దో
డపశకునములు మెం డయ్యె నేమొ

ఆ. రాచదాన ననిపిశాచి యియ్యది వచ్చె
వచ్చినపుడె బీతు పెచ్చుపెఱిగె
నింతపాపమునకు నిదియె దీనిని మొత్తి
మిత్తి కిత్త మిపుడ మిడుక మిడుక. 147

తే. ఇట్లు కొందఱు పలుకంగ నింతలోన
మఱియుఁ గొందఱు నిది యేటిమాట మనపు
రాకృతం బిట్టు లుండ నీరాజవదన
సలిపినది యేమి? మీ రిట్లు పలుకఁ జనునె? 148

వ. అని వారిఁ దౌర్జన్యంబునుండి మరలించి రంత దమయంతియు. 149

ఉ. దైవము క్రూరకర్మ మయి దాపుర మయ్యె నయో తలంపఁగాఁ
జావఁ దలంచినట్టిననుఁ జంపక బంధులతో సుఖంబునం

బోవఁగ నున్న సార్థజనపుంగవులఁ గొని చంపె నింక నే
నేవిధి నెత్తివైఁ బడిననీవిపదంబుధి నీఁదుదాననో? 150

మ. ఎద నే నెవ్వరికిం దలంప నశుభం బీజన్మమం దెప్పుడే
నిది జన్మాంతరసంచితాఘఫల మింతే కానిచో నిట్టు లా
పదపై నాపద వచ్చునే కరులు చన్వం గూల్చెఁ గా కింత నా
కు దయం జూపిన నాత్మహత్యకును నేఁ గూడం గదా! దైవమా!

చ. మదగజ మొక్క-సార్థజను మర్దితుఁ జేయుచునుండ నేను ద
త్పదమును బట్టి త్రోయుటకుఁ దారసిల న్నను నెట్టెఁ గాని నా
హృదయము స్త్రీల మెట్టి మడియించుట కించుక యెంచ దయ్యె న
య్యది మును నేఁ బొనర్చినమహాఘఫలం బగుఁ గాదె చూడఁగన్.

తే. భర్తృరాజ్యాపహారణంబు బంధుజనప
రాజయము పతిపుత్రవిరహము గహన
వాస మురగగ్రహణము నీవరస వచ్చె
నాధు లేమందు హతవిధి కక్కటకట! 153

ఉ. పిన్నటినాఁటనుండియును బేరున కే నిసుమంతపాప మే
నెన్నఁడు జేసియుండ నిది యింతయు సత్య మటంచు బాస నే
నెన్ని బొనర్తుఁ గాని త్రిదశేంద్రుల రోసి స్వయంవరంబునం
దు న్నలుని న్వరించినది దోసమ యై యిటు లయ్యెనో కటా! 154

చ. నలుని వరించుపట్టునను నాకు ననుగ్రహదృష్టి చూపి వే
ల్పులు వర మిచ్చి రట్టిబుధపుంగవు లిట్లు బొనర్వఁ జూతురే!
తెలియఁదె వారి కే నొరులఁ దేఱి కనుంగొనుచిత్తవృత్తితో
మెలఁగనిదాన నంచు నిటు మేరయె వారల శంక నేయఁగన్. 155

క. నాదోష మిం దొకింతయు
లే దానలుదోష మనఁగ లే ముత్తముఁ డా
భూదయితుదూతకృత్యం
బాదివిజుల మెచ్చునట్టిదై పే ర్పడదే. 156

క. ఇది దైవపరీక్షయె యా
నెద నెట్లు తలంచుకొన్న నిసుమంతయుఁ దో

పదు కతము దీన నొనగు
నది యెల్ల భరించుచుండు టది తప్ప దికన్. 157

దమయంతి చేదిపురంబుఁ జేరుట.

వ. అని విలపించునమ్మించుఁబోఁడి మఱునాఁ డరుణోదయంబున హతశేషు
లగుసార్థజనులతోఁడం గూడి కతిపయప్రయాణంబులఁ జేదిపురంబు
నకుం జని రాజవీథిం జనుచున్నసమయంబున. 158

సీ. ఇది యొంటిఁ జనుదెంచు నెలనాఁగ వెన్క నే
రైన నుండిరొ చూత మనుచుఁ గొంద
ఱిది సుందరాంగి లే రేరు దీనిం బట్టి
కొని పోవ నొప్పెడు ననుచుఁ గొంద
ఱిది రాచతేవమై నెసఁగెడు నీగతి
యరుదెంచు నేమొకో యనుచుఁ గొంద
ఱిది పతివ్రత యెవ్వారే గీడు దలఁచిన
యంతనే చచ్చెద రనుచుఁ గొంద

తే. ఱట్లు పలువురు పలురీతు లెసఁగఁ బలుకు
కొనుచుఁ జూచిరి చెయి వీచి రనుసరించి
దైన్యమును జూపి రతిభ క్తి దరిసి మ్రొక్కి
రప్పురంబున దమయంతి యరుగుచుండ. 159

ఉ. గ్రాసము లేక గాసిపడి కానఁ గృశించి విముక్తకేశి యై
మాసినచీరఁ గట్టుకొని మానఱే వెంబరవిత్తు వోలె నై
వేసర కాకతాయ లగువేగురు కుట్టలు వెంబడింపఁ గా
నాసకి రాచకొంకి దరియం జనుదెంచెఁ జలాచలాంగియై. 160

వ. ఇట్లు వచ్చువైదర్భిం జూచి ప్రాసాదతలగత యగురాజమాత ధాత్రిం
బిలిచి యంగుళి నిర్దేశంబు సేయుచు ని ట్లనియె. 161

మ. పురవీథిం బ్రజ లాఁగ వేగుచు నదే పూఁబోఁడి దుఃఖించుచుఁ
శరణు న్వేఁడుచు వచ్చుచున్నయది యున్మత్తాకృతిం గ్రాలునిం
దిరదొ నాఁ జను నీమెకల్మి నగళుల్ దీపించు నీ వేగి య
ప్పరివేష్టించెదుమూఁక దోలి యిట కాపద్ధాటిఁ దె మ్మర్థిలిన్. 162

మ. ఇది విష్ణు న్వీడి వచ్చినట్టిసిరియో యీశుం బెడంబాసి భూ
పదముం జేరినగౌరియో నలువపై వైరంబునం జేసి స
మ్ముద మెచ్చం జను దెంచునట్టిచదువుంబూఁబోఁడియో కాని నా
మది నింతింతనరానివేడ్క మొలపింపం జాలి చూడం దగెన్. 163

ఉ. అచ్చెరు వయ్యెఁ గార్మొయిల నల్లికబిల్లిక నాటలాడుమిం
చచ్చట నేలమీఁదఁ బొరలాడెడునో యన మూఁక మూఁగికో
వచ్చెడు నాసరోజముఖవంకఁ గనుంగొనుదే ప్రియంబుమై
నెచ్చటనుండి యెచ్చటికి నేఁగుచు నిచ్చటి కేఁగుదెంచెనో? 164

వ. అని చెప్పి యప్పద్మాక్షిం దనప్రాసాదరాజంబునకుం దెప్పించి యి
ట్లనియె. 165

చ. సుగ మనుమాట లే కిటులు సోలియు జాలి మెలంగునీ వహో
మొగిలమఱుంగున న్మెఱుగుపోల్కిఁ గనంబడు దేరిదానవో
మగువ! మనుష్యకాంతలకు మానగు నిట్టిసురూప ముండునే
తగు దొకదేవకాంత వన దాఁపక చెప్పుము నీదువృత్తమున్. 166

మ. ఇద మిత్థ మ్మని చెప్పఁ జాలను గుమారీ! దైవతంత్రం బదె
ట్టిదో కానీ నినుఁ జూచినంతటన నాడెందంబునం దుత్సవం
బొదవింపం గలహార్ద మా నొడలియొప్పో చెప్పెడిఁ గొప్పసం
పద నిక్కంబు వచించి నాకడ వసింపం జిత్తముం జేయుమా. 167

తే. అనుడు వైదర్భి యి ట్లను నమ్మ! నేను
మానవిఁ గట్టువాఁడ్జాతి మనెడునట్టి
దాన మగనాల గుణనిధి యైననాదు
మగనికి న్నీడ వలె నేను దగిలి యుందు. 168

వ. దైవోపహతుం డైననామగండు ద్యూతనిర్జితుండై వనంబులం బడిన
నేను వాని నాశ్వాసించుచు ననుసరించి యుండ ఱుత్పిపాసాపరి
శ్రాంతుం డగుటంజేసి విమనస్కుండై యతండు మై మఱచి నిద్రించు
నన్ను విడిచి నడచి పోయె నే నాయేకవస్త్రార్ధధరు నా ప్రాణప్రియు
నన్వేషించుచుఁ గందమూలంబు లాహారించుచుఁ బ్రొద్దు పోయినకడ
నిద్ర వోవుచు సింహశార్దూలాదిదుష్టసత్వసమూహంబు సహాయం

బుగా వనంబులం బడి వనటం బడితి నని కన్నీరు మున్నీ రై పాఱ
నా ర్తస్వరంబున నేడ్చుదమయంతి నూఱార్చి రాజమాత యి
ట్లనియె. 169

తే. నీపయిం బ్రేమ నా కయ్యె నెలఁతమిన్న !
నీవు నాకడ నుండుము నీమగండు
నిందు నందును దిరిగి తా నిందు వచ్చుఁ
బురుషులం బుత్తు రాకున్న నరసి తేర. 170

తరువోజ.—

అనిన వైదర్భి యి ట్లనియె నాసమయ
మరయు మెంగిళ్ళు లంట నంఘ్రిథావనము
పానరింప నెపు డన్యపురుషులతోడ
ముచ్చటింపను దుష్టబుద్ధి నేఁ జైనఁ
గని కోర వానినిఁ గనలి దండింపఁ
గాఁ దగు నీకు నాకాంతుని రోయు
ననఘునిం గాంతు ని ట్లయిన నే నిచట
నడఁగి యుండెదఁ గానియ ట్లైనఁ బోదు.

వ. అనుటయు రాజమాత నీవు నీవ్రతంబు లెల్లం జెల్లించుకొనుచు నాకడ
నుండు మేను నీయిష్టప్రకారంబునం బ్రవర్తించెద నని తనకూఁతు
సునంద యనుదానిం బిలిచి యి ట్లనియె. 172

తే. దేవరూపిణి సైరంధ్రి దీనిఁ జూడు
మీడు జోడైనదగుటచే నిదియు నీవు
సఖులరై మోద మొందుఁడు సతత మనుడు
నా మెతోడ సునంద దా ననఁగి యుండె. 173

వ. అంత నట నలుండును. 174

నలుఁడు దావానలంబునం బడినకర్కోటకు నుద్ధరించుట.

మ. తరుణీరత్నముఁ బాసి కాఱడవిఁ జిత్తభ్రాంతిచే మెట్టుచుఁ
దరుగుల్మవ్రతతీవితానములు నుద్యజ్జ్వాలలం గాల్చుచుఁ

సురమార్గంబున విస్ఫులింగములతో జొబ్బిల్లి త్రైలోక్యభీ
కరమై మండుదవానలంబుఁ గనియెం గట్టావడిన్ స్తుందఱున్. 175

క. కని యిచ్చపాటు దోఁపఁగ
జననాథుఁడు నిలిచి యున్నసమయమునంచ
విన వచ్చె నతని కోనల!
ననుఁ గనర మ్మనెడునార్తనాదం బరుదై. 176

చ. నల యని పిల్పు వచ్చెడిని నన్ను నెఱింగినవాఁ డెవం డిటం
గలిగెడి? మంటలోఁ బడినకష్టునిశబ్దము వోలె దోఁచెడిన్
నలుగడ దావ మేర్చెడిని నా కెదియుం గనిపింప కుండె నే
కెలనికిఁ బోవ నార్తు బ్రదికించినపుణ్యము నొందఁ బోదునో? 177

వ. అని నలుగడం బరికించుచున్న నలుండు విన మఱియును. 178

చ. అనలము చుట్టు ముట్టుకొనె నయ్యయె! యియ్యెడ దిక్కు లేక నే
నను వఱి చావ నైతి దహనార్చులు వేర్చి మదీయదేహముం
గొనకొని తాఁక వచ్చెడిని గొంతటిలోఁ గడతేరి పోదు నో
ఘనభుజ! నీకృపారసముఁ గాలెడునాపయిఁ జల్లఁ జూడవే. 179

క. నే వింతవాఁడ నైనన్, జీవింపఁగ మన మొకింత చేయుం బ్రీతిం
గావున వేఁడెద నిన్నున్, "జీవ భద్రాణి పశ్యసి" యనఁ వినుటన్.

ఉ. సారెకు నార్తనాద మది జానుఁగులం బడ నైషధుండు శం
కారహితాత్ముఁడై యనలగర్భమునం జొరఁ బాఱి బోరునం
గారునఁ జుట్టఁ బెట్టుకొని కాయ మపాయమునం జలించి పో
నేరనినాగరాజుఁ గని నేఁగల నోడకు మంచుఁ బల్కుచున్. 181

వ. పరుగుపరుగునం దరియ వచ్చెడునాగరాజుం గని నాగరా జిట్లనియె.

ఆ. గహ్వరీశ! నేను గర్కోటకుం డను
వాఁడ దేవమానివర్యుఁ డైన
నారదునకు నెగ్గు నడపినకతన నా
తఁడు శపించె నన్ను నెడఁదఁ గనలి. 183

వ. దానంజేసి నే నిట్లచలంబు వోలె జలియింప నేరకున్న వాఁడ నేఁ డీ
యుపద్రవంబు గడవ నన్ను మఱొండుచోటికిం గొనిపొమ్ము నేను

నీకు సఖుండనై శ్రేయంబు నేయనోపుదు నిట్టిననున్ను మోయనోప
నందువేని కను మని యంగుష్ఠమాత్ర గాత్రుండగుటయు నలుండు
వెఱవ కనలంబునం బొరంబడి. 184

సీ. కనికరంబున దానిఁ గరములఁ గైకొని
భయవర్జితం బైనబయలునందు
విడువ నెంచుటయు నానిడుపఁ డెఱిఁగి పల్కు-
నడుగు లెన్నికొనుచు నడవు మయ్య
నీకడ శ్రేయంబు చేకూఱఁ జేసెద
నన నలుం డ ట్లెన్నికొనుచు నడచె
నపుడు సర్పము దశమపదంబునఁ వాని
కాయంబుపై వడిఁ గాటు వైచెఁ

తే. గాటు వైచినమాత్ర నమ్మేటిమగఁడు
వికృతరూపము ప్రాపింప విస్మితుఁ డయి
కొదికి కనుచుండునంతఁ గరోటకుండు
నాత్మరూపముఁ గైకొని యనియె నిట్లు. 185

క. ఉపకారికి నపకారము
విపరీతము గాఁగ ఘోరవిషధర మిది నా
కిపుడు పొనర్చె నటంచున్
నృపవర! సంకోచ మొందుదే విను మెల్లన్. 186

ఆ. నీవు కఱవు మనిన నేను గఱచితి నే
కాదులను గణించునప్పుడు దశ
యంటి వనినఁ గఱవు మని యర్థ మగుఁ గాదె
యిందు నాదుదోష మింత గలదె? 187

వ. అని యించుక విలాసంబుగం బలికి మఱియు ని ట్లనియె. 188

క. నిను నొరు లెఱిఁగిన నెగ్గగు, నని నీరూపంబు వికృతి నందఁగ నే ని
ట్లొనరించినాఁడ వగవకు, జననాయక! దీన లగ్గు సమకుఱు నీకున్.

సీ. వినుమెంతదనుక నీతనువున నావిషం
బమరంగ నుండెడు నంతదనుకఁ
గలుగదు విషజంతుకలితభయంబును
యక్షరాక్షసపిశాచాదిభయము
విగ్రహంబుల శత్రువిజయంబు గలిగెడు
జగమెల్ల నీకు వశంబ యగును
బ్రహ్మబంధులు నిన్నుఁ బరిభవింపఁగ లేరు
దుఃఖభారం బెల్లఁ దొలఁగి పోవు

తే. బాహుకుం డనుపేరను బరఁగి నీ వి
చటన కల దయోధ్యాపుర మటఁ జని ఋతు
పర్ణుఁ డనుతేని నిక్ష్వాకువంశభవుని
నాశ్రయింపుము నీ కిష్టుఁ డగు నతండు. 190

క. నీ కష్టహృదయ మిచ్చెడు
నాకువలయనాథుఁ డీవు నశ్వహృదయముఁ
జేకొన నాతని కిచ్చెద
వోకుంభినిపతి ! శుభంబు లొందెడు నిన్నున్. 191

వ. ఆవల నీకుఁ బుత్రమిత్రకళత్రసంగమంబును రాజ్యప్రాప్తియు నగు నీవు నీరూపంబు నొందం దలంచునాఁ డీవస్త్రంబుల ధరించి నన్ను స్మరింపు మపుడ నీరూపంబు నీకు వచ్చు నని పలుకుచుం దనకడ నున్న దివ్యవాసోయుగం బతని కిచ్చి నాకు నీకతంబున శాపవిమోక్షం బయ్యెఁ బోయి వత్తు నని కరోకటకుం డంతర్ధానంబు నొందె ననంతరంబ. 192

నలుఁడు బాహుకుండై ఋతుపర్ణు నాశ్రయించుట.

సీ. మిట్టపల్లంబుల మిసిమి దప్పినతల
పొట్టిచేతులు, కాళ్లు, మిట్టగుడ్లు
గుడుసుజుంజురు వెండ్రుకలు వ్రేలుపెదవులు
దొప్పలు దేరినగొప్పచెవులు

కొక్కిరిబిక్కిరిముక్కును, జిక్కిలో
నిగ్గినచెక్కులు, గొగ్గిపల్లు
క్రుంగినమెడయును, గూనునడుము, మక్క
లించినపొట్టయుం బెంచునడుము

ఆ బండికం దెనజిగి బైసిమాలినమేను
వేసడంపుసొరము బూసినడలు
గలిగి కనుఁగొనంగఁ గడునేవ కొల్పెడు
వికృతరూపమునను వెలసె నలుఁడు. 193

వ. ఇట్లు వికృతరూపంబు నొందిననలుండు పదిదినంబుల కయోధ్యాపురం బునకుం జని ఋతుపర్ణుని దర్శనము చేసి. 194

ఉ. బాహుకనామధేయుఁడను బార్థివతల్లజ! వింటె నన్ను నే
వాహనశిక్షయందుఁ గడువాసి మెలంగుదు సూదకృత్యమం
దేహతవాదియుఁ సవ తొకించుకయుం గొనరాఁడు నాకు సం
దేహము లేదు శిల్పములఁ దేరినవాఁడ ననుఁ భరింపుమా. 195

తే. అనుడు ఋతుపర్ణుఁ డను నోయి హయచయంబు
దిద్ద నేర్తువ యేని నాయొద్ద నుండు
మేను సూర్వరహాల నీ కిత్తు జీత
మశ్వయూథాధినాథుఁడ వగుము నీవు. 196

వ. ఈవార్షేయజీవలులు నీకు సహకారు లగుచుందు రని వారిం జూపిన నలుండు వల్లె యని వాజిశాలకుం జని వాజులం బరీక్షించి ఋతుపర్ణ ననుమతంబున నయ్యయోధ్యాపురంబునం దొక్కచో నుండి కాలక్షేపంబు సేయుచుఁ గరంబు చింతాజ్వరసంతప్తచిత్తుండై దమయంతిం దలంచుకొని. 197

ఉ. అక్కట! ఋత్విపాసలకు నై కడు డస్సి యరణ్యమందు నీ
వెక్కడి కేగితో? మది యొకింతయు లేనిమగండు మందుఁడై
దిక్కును మొక్కు లేనికడఁ ద్రెళ్లఁగ నేయుటఁ జేసి యెంతగాఁ
బొక్కుచు నుంటివో? తెలియఁ బోలదు నామదికిం దపస్వినీ! 198

చ. సుమనసు లంతవారు నినుఁ జూచి కడుంగడు సొక్కి మక్కువ
గొమిరెగ ని స్వరించి తమకోరిక వారక దూతమోముతో
నమరఁగఁ జెప్పినఁ విన కనార్యుని న న్నధమాధము న్వివా
హమునఁ బరిగ్రహించి యకటా! యిటు బాములఁ గైతివే సతీ! 199

చ. నిను విడనాడ నెప్పటికి నే నని పల్కియు నీమగండు కా
ననమున నిద్రవోవునెలనాఁగను ని న్విడనాడి యొంటిమైఁ
జనియెఁ గృపావిహీనుఁ డయి చానరొ! నీ వపు డెంత యేడ్చితో!
కనుఁగవ నెంత నీ రెవ్వడలి కాలువ గట్టెనొ? యెట్లు లయ్యెనో? 200

ఉ. ఘోరవనాంతరంబునను గుయ్యిడుచుం జనుచున్న నీకు నే
దారియుఁ దోఁపకున్న పుడు దగ్గఱఁ దీసినచుట్టలై పులుల్
గోరికఁ బొట్టఁ బెట్టుకొని గో డుడుగింపక యుండునే ఖలుం
డారమణుండు క్రూరనరకాధుల నొందక యుండునే కటా! 201

సీ. చిరిఁగిన-చీర నీచేఁ దగిలినయప్డు
మగనికై నీ వెంత పొగిలితివొకొ?
హానాథ! హానాథ! యని పిల్చు చటఁ దిరు
గాడుచో నీ వెంతయడలితివొకొ?
వెనుబాము నిను మ్రింగికొని యున్న యప్పుడు
దిక్కులే కీ వెంతపొక్కితివొకొ?
వాలుమెకంబు నీవంక వచ్చిననాఁడు
సాహస మీ వెంత సలిపితివొకొ?

తే. కారుచిచ్చులు నిను బట్టి కాల మెట్ట
నున్న యప్పుడు నీ వెంత యొడిసితివొకొ?
కటకటా! యిన్ని పాట్లు నీకట్టుకొన్న
మగనికతమున నయ్యెఁగా మగువమిన్న! 202

వ. అని ప్రతిసాయంసమయంబునందును నీపదర్శంబులు పఠించుచున్న
బాహుకుం జూచి యొక్కనాఁడు జీవలుండు నీ వెవ్వతెకై వగచు
చుంటి వనిన నతం డతని కిట్లనియె. 203

శా. మందప్రజ్ఞుఁ డొకండు ముఁ విడి సతిఁ మా నేదఁ గార్కొనలో
నిం దందుం జరియించుచుఁ హతవిధిఁ హెచ్చిల్లు మోహంబునఁ
గుందెం డెందము డింద నిట్టు లది నాకుఁ జ్ఞప్తికి న్వచ్చుటఁ
సందేహింపక యిప్పు డత్తెఱఁగు లోఁ జర్చింతు నోజీవలా! 204

వ. అని ప్రతారించి చెప్పి నలుం డాదమయంతినై పరితపించుచు నట
నజ్ఞాతవాసం బుండె నని చెప్పిన నైమిశారణ్యవాసు లవ్వలివృత్తాం
తంబు నెప్పు మని సూతు నడుగుటయును. 205

ఆశ్వాసాంతము.

మ. శివుఁడుఁ రాముఁడు నొక్కఁడే యని నుడిం జెప్పంగ నిప్పట్లఁ దా
శివరామాఖ్య యభిఖ్య గాఁగఁ గొని సుశ్రీవైభవోపేతుఁడై
శివునిఁ రాముని గొల్చుచుఁ సతతముం జెల్వొందుసీతాపతిఁ
శివుఁడుఁ రాముఁడు సోముఁడుఁ రవియు రక్షిం త్రైల్లకాలంబునున్.

గద్యము. ఇది శ్రీమహామహోపాధ్యాయ, కలాప్రపూర్ణ, కవిరాజ,
కవిసార్వభౌమ శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి ప్రణీతంబయిన నైషధీయ
చరితం బనుశృంగారతరంగిణియందుఁ బంచమతరంగము.

శ్రీ. శ్రీ. శ్రీ.

శ్రీరస్తు.

# నైషధీయచరితము

## శృంగారతరంగిణి

### షష్ఠతరంగము.

శ్రీమద్విక్రమపత్తన
భూమిసురశ్రేష్ఠుఁ డగుచు భూభుజు లెన్నన్
శ్రీమించిన వేంకటశివ
రామయ వర్ధిల్లుఁ గాక రామునికరుణన్. 1

వ. అక్కథకుండు శౌనకాదిమహామునుల కిట్లనియె నట్లు దమయంతియు నలుండును వనంబులం బడియు నెట్టకేల కిట్లు పురంబులు చేరుకొని యున్నయప్పు డక్కడ విదర్భేశ్వరుం డగుభీమభూవల్లభుండు. 2

భీమరాజు నలదమయంతుల నన్వేషింప విప్రులం బుచ్చుట.

తే. కూఁతు రల్లుండు రాజ్యముఁ గోలుపోయి
వనులఁ బడి రని విని కుంది వారి రోయ
ద్విజవరులఁ బుచ్చె ధరఁ గల్గుదేశములకుఁ
బుష్కలంబుగ విత్తంబు మొత్త మిచ్చి. 3

వ. మఱియు వారి జాడ చెప్పినవారికి వేయిగోవులును, గని వచ్చిన వారికిఁ బదివేలగోవులును, దోడితెచ్చినవారికి నగరసమ్మితమ్ము లగు కొన్ని గ్రామంబులు నిచ్చెద నని యనిపిపుచ్చి తనమనంబున. 4

శా. నాజామాతృఁడు లోకవందితుఁడు సౌందర్యప్రభావంబునన్
దేజస్సారమునం బ్రతాపమున దాతృత్వంబునం దత్త్వవి
ద్యాజిజ్ఞాసను గందు నిందు రవి దేవానోకహంబున్ శుకున్
వ్యాజం బింతయు లేక గెల్వఁ దగువాఁ డాతండు సామాన్యుఁడే. 5

చ పలికియు బొంకఁ బోఁ డెపుడు పల్కినపల్కులు వేదతుల్యముల్
పిలిచినఁగాని పోఁ డెటకు బీ తెఱుఁగండు హసస్తుఖుండు ని
ర్మలమతి వాగ్విశారదుఁడు రాజకులైకవిభూషణుండు మా
నలుఁ డొకరాజమాత్రుఁడ యనం దగ దెన్న నతండు రత్న మే. 6

క. శ్రీశ్రీశభక్తుఁ డాగ,ర్భశ్రీమంతుండు శాంతభావుం డనఘుం
డాశ్రితవత్సలుఁ డఁటె రా,జ్యశ్రీ విడి పోవు నెన్న నచ్చెరు వకటా!

శా. గారాబంబునఁ గాంచి పెంచితిని నాకన్యావతంసంబు వి
ద్యారామామణి కెత్తువచ్చెడు నసూర్యంపశ్య యైశ్వర్యవ
త్పారంభాంచిత కాంచనాంగసుషమా ప్రఖ్యాత నాతల్లి తా
నేరీతిఁ గహనప్రచారమున నా ళ్లేఁగింపఁగా నుండెనో? 8

క. పలికింప నలసిపోవం
గల దని యల్లారుముద్దుగాఁ బెంచిననా
కులదీపము దమయంతికి
బలుపాటులు వనములందుఁ బడ నయ్యె నయో! 9

క. మొకమల్తివాసులం దొ
క్కొకయడుగుగ వేసి యలసి యూర్చెడునది మా
సుకుమారగాత్రి వనులం
దకటా! యెటు కఱకుటాల నడు గిడెనొ కదా! 10

వ. అట్లు వగచుచుండె ననంతరంబ. 11

మ. ధరణీదేవకులావతంసములు మోదం బొప్ప విశ్వంభరం
బురముల్ రాష్ట్రములుఁ మహావనములుఁ భూధ్రంబులుఁ భూరిని
ర్ఝరిణుల్ దొట్టిసమస్తభూములును సంరంభంబున న్నెట్టి రా
వరకీర్తిఁ నిషధాధినాథుని నలుఁ వైదర్భినిఁ రోయుచున్. 12

తే. అంతట సుదేవుఁ డనుద్విజుం డందు నిందు
నరయుచుం జేదిపురమున కరుగుదెంచి
రాచనగరునఁ బుణ్యాహవాచనంబు
చేయఁ బడుచుంట విని తాను జేరి యచట. 13

వ. అంతిపురంబున సునందాసహితయై యప్రతిమానరూపసంపన్న యయ్యు ధూమజాలనిబద్ధం బైనబృహద్భానుప్రభయుం బోలి మలినయై కృశాంగియై యున్నదమయంతిం జూచి. 14

సీ. పారద మది సోకఁ బస చెడు బంగార
మన వెలవెలఁ బోవ్రతనువు గలిగి
చము రెఱుంగక మట్టిఁ జమురుట నడగట్టి
నెఱసిన ట్లగపడు నెఱులు గలిగి
బొట్టుగా కొకనల్లపూసయుం దాల్పమి
జా నేదువికృతవేషంబు గలిగి
నెఱమాసి తోలునా నెఱఁ బాసి తుండెమై
సరిపోనియేకవస్త్రంబు గలిగి

తే. కోల యగుమోము లోతైనవాలుఁగనులు
వాడివత్తలై కిక్కిసకాడ లైన
కాలునేతులు గలిగి యిక్కడ మెలంగు
నీమె యొకవేదము త్తైదు వేమొ యనుచు. 15

వ. ఇంచుక చని భీమరాజుం బోలినహావభావంబు లామెకడం గొన్ని కానిపించుటుం జేసియుఁ దొల్లి చూచినవిగ్రహంబువలెం దోచుటుం జేసియు దమయంతి యగునో యని సంశయించి దానిచెంతకుం జని.

తే. కరతలంబులు గో ళ్లరకాళ్లు కన్నుఁ
గొలుకు లధరంబు నరుణిమఁ గలిగి యుంట
మఱియు శుభలక్షణము లెన్నొ వఱలుచుంట
నేలయేలిక చెలి యని నిశ్చయించి. 17

వ. మఱియుం దరియ వచ్చి భూమిమధ్యంబునం గలతిలకాలకముం గని కృతార్థుండ నైతి నని సంతసించుచు. 18

సుదేవుఁడు చేదిపురంబున దమయంతిం దిలకించుట.

శా. రాకాచంద్రనిభాననప్రభఁ దమిస్రంబుం దొలంగించుచుఁ
నాకన్నుంగవకు న్మనంబునకు నానందంబు సంధించు నీ
లోకైకేడ్యపవిత్రగాత్రి గరిమఁ లోకోత్తరుండై విద
ర్భాకాంతుం డగుభీమభూపతికిఁ బోల్పఁ గర్భవాసం బగున్. 19

వ. ఇప్పరమపతివ్రతావతంసం బిప్పుడు పతివిరహంబునం బరితపించునదియై జలోద్ధృతం బైనమృణాళియుం బోలె శుష్క-స్రోతం బైననదియుం బోలె నీలాభ్రసంవృతం బైనచంద్రరేఖయుం బోలె శోభింప నేరక. కృశాంగియు భోగవిహీనయుఁ బాంసుపటలచ్ఛన్నయు మలినవస్త్ర ధారిణియు దుఃఖస్వరూపిణియు నై భర్తృసందర్శనాపేక్షఁజేసి దేహంబు ధరించి యున్న దని నిశ్చయించి. 20

చ. సతికి విభూషణంబు పతి సాధ్వి విభూషణ మెన్న భర్తకుఁ
బతి విడి పత్ని పత్ని విడి భర్తయునుం బ్రదుకంగ లే రిలం
బతిఁ బెడఁబాయుటఁ బగచుభామిని దీనిఁ గనుంగొనంగ నా
మతియుఁ దపించుచున్న దిఁక మానినిబంధులఁ జెప్ప నేటికిన్. 21

ఉ. ఎన్నఁడు గల్గునో? వగ పి జేఁగుట లెన్నఁడు సౌఖ్య మబ్బునో?
యెన్నఁడు వీరు రోహిణియు నిందుఁడునుం బలె గూడి యుందురో?
యెన్నఁడు రాజ్యమంది సుఖయించెడువీరలఁ జూడఁ గందుమో
యెన్నఁడు భీముఁడుం బ్రజయు నింతియు నెంతయు సంతసింతురో.

వ దుఃఖాక్రాంతచిత్తయు నార్తయు నై ధ్యానతత్పర యగునీసంపూర్ణ పూర్ణిమాచంద్రముఖి నే నిపు డాశ్వాసించెదం గాక యని సుదే వుండు దమయంతిచెంతకుం జనుదెంచి యాశీర్వదించి యి ట్లనియె.

మానిని.—

నేను సుదేవుఁడు నాఁబడువాఁడను నీసయిదోడున కిష్టుఁడ నో
మానిని! నీపితృనాజ్ఞను వచ్చితి మక్కువతో నిను రోయఁగ నీ
స్థానమునం గనుఁగొంటిని నీదగుతల్లియుఁ దండ్రియు సోదరులుఁ
సూనులు నేమమునం గల రచ్చట శోక మొకం డగు నీకతనన్. 24

క. నిను రోయ బ్రాహ్మణోత్తము
లను నూర్లుగఁ బుచ్చి భూతలమునఁ దిరుగ నీ
జనకుం డం దొకఁడను నే
గనుఁగొంటి న్నిన్ను మంచికాలం బగుటన్. 25

మ. అనినం గన్నులు విచ్చి చూచి యతనిఁ హా! తల్లి! హా! తండ్రి! హా!
యనుగుంజుట్టములార! మీమనికి శ్రోత్రానందకందంబుగా

వినఁ గల్గె న్వినిపించె నీఘనుఁడు నాప్రేమాస్పదుం డైననా
థుని విన్పించెడువిద్వదగ్రజుని నెందుం జూతునో యిం కిటన్. 26

వ. అని మిగుల వగలం బొగులుచు వాని నానవాలుపట్టి తనబంధువర్గం
బులయు సుహృదులయు కుశలం బడిగి బాష్పపూరితనయనయుగ
ళయై గోడుగోడున నేడువ సాఁగె నంత. 27

క. కన్నీ రురులఁగ నేడ్చెడు
నన్నారి సునంద చూచి యతిరభసమునన్
దన్నుం గన్నజనిత్రికి
నున్నట్లు వచించెఁ బోయి యుదిలకొనుమదిన్. 28

తే. చేదిపతిమాత యపుడు చెచ్చెర గమించి
భైమి వసియించుచోటి కాభూమిసురునిఁ
జేర ర మ్మని పిలిచి పూజించి పలికె
వినయవినమితగాత్రియై వెలఁదిఁ జూపి. 29

తరళము.—

అనఘ! యెవ్వనికూఁతు రెవ్వనియాలు బంధుల భర్త నెం
దునను బాసె నెటీ వెఱింగితి తోయజాననవృత్తముఁ
వినఁగ నిష్ట మిదంతయు న్వినిపింపు నా నుపవిష్టుఁడై
ఘనుఁడు బ్రాహ్మణవర్యుఁ డాయమఁ గాంచి యి ట్లనియెం దగన్. 30

తరువోజ.—

అతివరో! విను విదర్భాధీశుఁ డనఘుఁ
డగుభీముపుత్రి యీయమ వీరసేన
సుతుఁడు నలుం డనుక్షోణీశుపత్ని
సుమి దమయంతి యన్ సుదతి; విభుండు
హృతరాజ్యుఁడై వని కేఁగినఁ దాను
నేఁగె నాతనివెంట నిది భీముఁ డెఱిఁగి
క్షితిసురులను బుచ్చె క్షితియెల్ల రోయఁ
జెప్పి నే నిట వచ్చి చెలి దీనిఁ గంటి. 31

వ. దీనిభ్రూమధ్యంబున మేఘచ్ఛన్నం బైనచంద్రబింబంబువలె మాలిన్య
సంవృతం బై పద్మసంకాశం బై శుభలక్షణలక్షితం బగుపిప్లువుం దిల
కించి రాజపుత్రిగా నిర్ణయించుకొంటి నని మఱియును. 32

చ. సిరి గలపుట్టుమచ్చ యిది చేయఁబడె న్విధిచేత దీని కీ
ధరణితలంబునం గలుగుతామరసేక్షణ లెవ్వరేనియుం
బురు డన రాదు లచ్చి యనఁ బోలును రూపున నీమె ధూళిధూ
సరితశరీరయై నివురుచాటున నిప్పువలె న్వెలింగెడిన్. 33

వ. అనిన నివ్వెఱంపడి రాజమాత దమయంతినుదుటం గలమాలిన్యంబు
పోఁ దుడిచి పుట్టుమచ్చం బరిశోధించి మించినవేడ్కం దానిం గట్టు
కొని కంట నీరు వెట్టుకొనుచుండె నప్పుడు సునంద తల్లిం గాంచి
యి ట్లనియె. 34

శా. అమ్మా! యిమ్మహిళాశిరోమణి యెవర్తో భీమభూజానిపే
రమ్మాన్యాఖ్యుఁడు చెప్పినప్పుడ భవత్స్వాంతంబునం దెంతయే
సమ్మోద మ్ముదయించినట్లు తెలియం జాలెన్మదీయాత్మ నా
కిమ్మాడ్కిన్ వివరించి చెప్పఁగదె నీ కే లిట్లు గారాబముల్. 35

వ. అని యడుగుచుండ రాజమాత రాసుత నక్కునం జేర్చుకొని
లాలించుచు ని ట్లనియె. 36

ఉ. కూఁతుర వైతి నీ విపుడు కోమలి! నేనును నీదుతల్లియుం
గూఁతుల మాదశార్ణములకుం బతి యైనసుదామనామభూ
నేత కతండు భీమునకు నీజనని న్నను వీరబాహు వి
ఖ్యాతమహామహీశునకు నాండ్రుగఁ జేకొన నిచ్చె ముచ్చటన్. 37

క. నిను నేఁ బుట్టినయప్పుడ
కనుఁగొంటి దశార్ణమందు గాదిలిబిడ్డా!
విను నీపితృగృహ మెట్టిది
యన వచ్చునొ యిదియు నట్టి దన వచ్చుఁ జుమీ. 38

వ. నాయైశ్వర్యం బంతయు నీయైశ్వర్యంబ యని కరం బాశ్వాసించు
చున్నంత దమయంతియు నత్యంతప్రహృష్టాంతరంగయై తల్లికి
సాష్టాంగనమస్కారంబు గావించి చెల్లెలిం గౌఁగిలించుకొని. 39

చ. చెలియల! న న్నెఱుంగకయె చేసితి వీవు మహోపచారముల్
చెలిమియు నాపయిం గలదు చెప్పెడిదే మఱి సర్వసౌఖ్యముల్
గలిగెను నాకు నీకడ నొకానొకనేగియు లేక యెప్పుడుం
దలఁచెద నిన్ను నీదయను నాతను వుండినయంతకాలమున్. 40

దమయంతి విదర్భాపురంబు జేరుట.

వ. అని తల్లిం జూచి. 41

మ. నను నైరంధ్రిని గా నెఱింగియుఁ బనుల్ నాచేతఁ జేయింప కె
ప్పును నీకూఁతు సునందనుం బలె గృపాపూర్ణాంతరంగంబునఁ
గనుచుం బ్రేముడి నాదరించితివి నీకంఱె న్మదీయాంబ హె
చ్చని నే నెన్నఁడుఁ గాని యెంచుకొన నిం దైనట్టి యీనాళ్లలోన్.

ఆ. గట్టువాలుదానిఁ గా ననుఁ జేకొని, కన్నబిడ్డకన్న మిన్న యైన
గారవంబుతోడఁ గని యాదరించితి, వెన్నఁ దరమె ననుఁగన్నతల్లి.

వ. అని తల్లికూఁతులు సంభాషించుకొనుసమయంబునఁ జేదిపురీశ్వరుం
డగు సుబాహుం డావృత్తాంతం బంతయుం గంచుకివలన విని వడి
వడిం దల్లిగృహంబునకుం బఱచి వచ్చి దమయంతి నక్కునం జేర్చి
కన్నీరు నించుచు ని ట్లనియె. 44

ఉ. చెల్లెల! నిన్ను మాజనని చేర్చిన దంచు నెఱింగి గట్టువాల్
పల్లవపాణి యైనఁ బరభామిని యుండెడుచోటి కేఁగుటల్
చెల్ల దటంచుఁ దల్లిని భజించుతలంపును మానివైచితిం
జెల్లెల వైతి నే నెపుడొ చేసినపుణ్య మిటుల్ ఫలించెఁ బో. 45

వ. అని పలుకుచున్నయన్నం గాంచి నమస్కరించి దమయంతి యి
ట్లనియె. 46

చ. ఇడుమలకై వగం బొగలి యెక్కడనో పడకుండఁ గీడులో
నడచె నొకింత మే లనఁగ నాదగునన్నయుఁ దల్లి చెల్లెలున్
గడిమి నెసంగుచోటఁ బడఁ గల్గితిఁ గావున నాదుమాన మి
వ్వడువునఁ గాచుకోఁ గలిగి వర్తిలుచుండఁగ నైతి నగ్రజా. 47

వ. అని నంత నెల్లరు నుల్లాసంబునం జేలుచుండి రపుడు దమయంతి
వారలం గాంచి. 48

క. ఎడఁబాటు నైఁప విడిచితి
బుడుతలఁ దడ వయ్యెఁ జూడ బుద్ధి జనించెఁ
విడ నోప మిము న నైనఁ
వెడలెద మీయాజ్ఞ యైనఁ బితృగృహమునకున్. 49

వ. అనిన నన్నయుఁ దల్లియు వల్లె యని సుదేవుం బహూకరించి నీవు పొమ్ము దమయంతి రేపటి మాపటి బయలుదేఱి వచ్చు నని విదర్భేశ్వరునకుం జెప్పు మని యంపిపుచ్చి మఱునాఁ డరుణోదయంబున గతిపయసేనాసమేతంబుగా నొక్కచతురంతయానంబున నామెం గూరుచుండంబెట్టి మంత్రిజనంబుఁ దోడిచ్చి విదర్భాపురంబున కంపిపుచ్చుటయును. 50

చ. కతిపయవాసరంబులకుఁ గాంచనగంధి విదర్భ కేఁగి తా
సుతులను దల్లిదండ్రులను జుట్టుల నందఱఁ జూచి వారిచేఁ
గుతుకముతోడఁ జూడఁబడి కొంతనరానివియోగదుఃఖముఁ
మతిఁ గొని సద్వ్రతంబులను మానక చేయుచు నుండె మెండుగన్.

క కలికి నిజదేహసౌఖ్యం
బులకు న్వెలి యగుచు నలుని పొందుఁ దలఁచుచుఁ
మలినార్ధవస్త్రముఁ విడ
కలయక గురుదేవపూజ లపుడు పొనర్చెన్. 52

క. తనయింట వచ్చియుండిన
తనయం గని భీమరాజు తద్దయుఁ బ్రీతిం
గొని యిచ్చె సుదేవునకుఁ
ధనములు ధాన్యములు గోశతంబులు భక్తిన్. 53

మ. వ్రతముల్ సేయుచు గౌరినిం గొలుచుచుఁ బ్రాహ్మీమహాదేవికిఁ
నతు లర్పించుచుఁ గందమూలములె భోనం బట్లుగా దేహయా
త్ర తగం దీర్చుచు నాఁటివస్త్రమె సదా తాల్పంగనై స్థండిల
క్షితిమీఁదఁ శయనించుచుం గడవఁ జేసెం భైమి యక్కాలమున్.

వ. ఇట్లు కొన్నిదినంబులు గడచినవెనుక నాదమయంతి తల్లి కేకాంతంబున ని ట్లనియె. 55

చ. నను బ్రదికించునిష్టము మనంబున నీ కగునేని తల్లిరో
వినిచెద విన్ము నావిభుని వీరవరేణ్యుని నైషధేశ్వరున్
గనుఁ గొని తేరఁ బుచ్చు మని కాళులపైఁ బడ లేవ నెత్తియుం
గనులను వేడినీ రురులగం బ్రతి పల్కఁగ లేక రాజ్ఞియున్. 56

క. వగఁ బొగిలె నయ్యవస్థన్
నగరుసఁ గలభామినీజనము గని మిగులన్
బొగిలెన్ హాహారవ మపు
డగు దెంచెన్ రాజభవన మది నిండుకొనన్. 57

వ. ఆవృత్తాంతం బంతయు భీముండు భార్యవలన విని జామాత నన్వే
షింప సమర్థులగుమతికొందఱు బ్రాహ్మణుల నియోగించుటయు వైదర్భి
వారిం గని యి ట్లనియె. 58

అలసగతి. నలుఁ డిపుడు మాఱుదల నల్వతో మెలంగున్
దెలియుట యసాధ్య మగు దేవతల కేనిన్
లలితగతి మీ రిల మెలంగుచు సభాంత
స్థలముల వచింపుఁ డిటు సారెకును దీనిన్. 59

తరువోజ.—

జూదరీ! నీ విట్లు శోచనీయముగ
శ్రుతివిహితార్థంబు చులుకన మీఱి
నాదగువస్త్రంబు నడిమికిఁ జించి
నడ డడ్డి నిదురించు నను వని వీడి
పోఁ దగునే భార్యఁ బ్రోవ భర్తకును
బోలును గాదె యీబుద్ధి యెట్లబ్బె?
నీదుధర్మజ్ఞత నీదువంశంబు
నేఁ డైనఁ దలఁచి నన్ నెఱిఁ బ్రోవ రావె.

వ. ఇట్లు మీ రెల్లకడలం బలుకునది దీన మీ కెవ్వఁడు దీనుండై వగచుచు
నతిప్రయత్నంబునం బ్రతివచనం బిచ్చు నతం డెట్టిరూపున నున్న
మీ రెఱింగి నా కెఱింగింపుఁ డని గౌరవించి పంచినం బని విని చని
బ్రాహ్మణు లెల్లరాష్ట్రంబులు నెల్లపురంబులు నెల్లగ్రామంబులు నెల్ల

ఘూపంబులు నెల్లయాశ్రమంబులు నెల్లవనంబులం దిరిగి తిరిగి దమ
యంతిపలుకు లెల్లకడలం బలికి పలికి నలు నెఱుంగ నోడి మగిడి వచ్చి
రంతఁ గొంతకాలంబునకుఁ బర్ణాదుం డనుద్విజుండు వచ్చి దమయంతిం
దర్శించి. 61

పర్ణాదుఁడు నలునిజాడ లెఱిఁగించుట.

క. తేపులు మాపులు న్నడచి తెక్కలు గల్గినయట్లు పోయి నే
నీపుడమిం గలట్టివను లేఱులు పల్లెలు పత్తనంబులుఁ
జూపులఁ గట్టి మెట్టుచును సోబనపుంగళ నొప్పునాయయో
ధ్యాపురి కేఁగి నీపలుకు లన్నియుఁ బల్కితి నోలగంబునన్. 62

గ. అవి విని వినయట్లు ఋతుపర్ణుండు లోనగువా రేరును మాఱు
వలుక కుండి రహుడు హ్రస్వబాహుండును గురూపియు శిష్యుయాన
కుశలుండును సూదక్రియానిపుణుండును సూతుండు నగునొక్క
పురుషుండు బాహుకనామధేయుండు నన్ను ము న్నెఱింగినవాఁడుం
బోలె పలుకరించి విజనస్థలంబునకుం బిలిచి నిట్టూర్పు నిగిడించుచు. 63

గా. ఈ వేదేశమునందు నుండుదువు ని న్నే రేని పుత్తెంచిరో?
నీవే వచ్చితో? యేమికార్యమున కీనీవృత్తులం దిర్గు దే
యేవిద్యల్ గణియించి తర్థులను మీపృథ్వీశుఁ డాలింపఁడో
చేవ ల్దేరినవాఁడు కాఁడో? సుఖమై చెలొ్వందునో? చెప్పవే. 64

న. అనవుడు నే విదర్భపురియం దగువాఁడను మామహేశ్వరుం
డనఘుఁడు సౌఖ్యవంతుఁ డన నౌ నయినం దనకూఁతు రల్లుఁడుఁ
వనిఁ బడి పోయి రీనడుమ వచ్చెను గూఁతురు మాత్ర మల్లుఁ డిం
కను గనరాఁడు నే నతనికై తిరుగాడుచు నుంటి నిగ్గతిన్. 65

క. అని పలికితిం బలికినంత నతండు వెండియు నోద్విజపుంగవా!
నీ విపు డోలగంబున నుడివినది ధర్మార్థవచనంబు గానోపు నా
కర్ణింపుము. 66

న. పురుషనియంతుఁ దప్పయినఁ బొల్తుక సైఁచినయేని పుణ్యపుం
దెరువునఁ బోవు నీలువునఁ దేరినవా రిటు లల్ల రెప్పుడుఁ

సిరి చెడి రాజ్యహీనుఁ డయి సిల్లున కై తుథ నొంది మందుఁ డై
దురపిలువాఁడు భార్య నటు త్రోచిన దోషము నొందఁ డారయన్.

ఆ. అనుచుఁ బలికి పోయె నతఁ డంత నే నిట్లు
విని వచింప వచ్చితిని బ్రమాణ
బుద్ధి యయ్యె దేని భూమీశునకుఁ జెప్పి
పోలినట్లు నేయఁ బోలు నీకు. 68

వ. అని చెప్పిన పర్ణాదునకు వేనవేలు ధనం బిచ్చి యంపిపుచ్చి దమయంతి తల్లికడకుం జని తద్వృత్తాంతం బంతయు జెప్పి యిప్పు డొకయుపాయంబు గంటి నది మాతండ్రికిం జెప్పిన నొప్పండు శాస్త్రంబు నొప్పదు నామనంబు నొప్ప ద ట్లయిన నిట్లు చేసినం గాని నీయల్లునిం దెలిసి తెచ్చుట యసాధ్యం బిది కార్యసాధనక్రమంబ కాని మఱొండు గా దని చెప్పి యొప్పించి తండ్రికిం దెలియకుండ సుదేవు నయోధ్యకుం బుచ్చెద నాతండు నన్నుఁ దెచ్చినట్లు నలుం దేర నోపు ననితదనుజ్ఞం గొని సుదేవు రాఁ బనిచి యి ట్లనియె. 69

సుదేవుఁ డయోధ్యలో ద్వితీయస్వయంవరము చాటుట.

చ. బ్రదికెనొ చచ్చెనో నలునిపల్కు వినంబడ రామి భీముఁ డం
గద దమయంతికిఁ మఱియు గారవ మార స్వయంవరోత్సవం
బొదవఁగఁ జేయ నెంచె నరుణోదయమం దగు నెల్లి దాని కే
గుదురు నరేంద్రు లంద ఱటకుం బ్రియ మేనియు నీవు నేఁగుమా.

వ. అని నీ వయోధ్యాపురంబున ఋతుపర్ణునకుం జెప్పి ర మ్మనిన సమ్మతించి సుదేవుం డతిత్వరితప్రయాణంబులం జని ఋతుపర్ణునకుం జెప్పిన నతండు బాహుకుం గని యి ట్లనియె. 71

చ. అరుగఁ దలంచినాఁడ దమయంతిస్వయంవర మారయ న్మహో
త్తర మది నేఁడ పోఁ దగు విదర్భకు నె ట్లొనఁగూడునో యనఁ
దురపిలి బాహుకుండు మదిఁ దొట్రిలుచుఁ సతి యి ట్లొనర్పఁగా
దొరకొనునే యి దెల్ల ననుఁ దోకొనిపోవునుపాయ మేమొకో! 72

చ. ఖలుఁడు మహోగ్రముఁ సలిపెఁ గా దన కంచుఁ బరిత్యజించి చం
చల మగుస్త్రీస్వభావమున సాధ్వియ యైనను గామదీప్త యై

తలఁచెనొ యిట్లు మార్గనిఁ దామరనేత్రుణ గాంచె బిడ్డలఁ
సలుపునె దోషకార్య మిట సత్య మసత్య మెఱుంగఁ బోలెడున్. 73

వ. అని కార్యంబు నిశ్చయించుకొని బాహుకుండు కృతాంజలియై ఋతు
పర్ణున కిట్లనియె. 74

తే. తెలిసితిని రాజ! నీపల్కు లెలమి నొక్క-
పగట నేను విదర్భకుఁ బఱప నేతు
నరద మిటు చూడు మనుచు లాయమున కపుడ
యేఁగి నడఁదీఱుహయముల నేఱి తెచ్చె. 75

తే. అవి పృథుప్రోతములు మహోహనువులు కుల
శీలసంపన్నములు గురుశిక్షితములు
వరదశావర్తకలితముల్ వాతరంహ
ము లవలక్షణవర్జితములు తలంప. 76

క. వానిఁ గనినంత నొడయఁడు
మానసమునఁ గోప మూని మహి నల్పబల
ప్రాణము లియ్యవి మహద
ధ్వాన మ్మెటు నడవ నోపుఁ దగ వివి యనుడున్. 77

తే. ఒకటి నుదుటను రెండు మస్తకమునందుఁ
బార్శ్వముల రెండు రెం డుపపార్శ్వములను
వఱుమున రెండు ప్రోథమునై నొకండు
సుడులు గలిగిన గుఱ్ఱంబు వడి మెలంగు. 78

క. ఇవియె సలక్షణవాహము, లవు నేఁడ విదర్భ కరుగు నైనను నీ కో
యవనీశ! యేవి నచ్చిన, నవియే నేఁ దెచ్చి కూర్తు నానతి యిడుదే.

వ. అనిన ఋతుపర్ణుండు మెచ్చి నీవు హయతత్త్వజ్ఞుండవు నీకుం బోలి
నట్లు చేయు మనిన నతం డాహయచతుష్టయం బరదంబునకుం బూన్చిన
నృపుండు దానిపై నధిరోహించుటయును. 80

ఋతుపర్ణుండు నలునితో రథం బెక్కి విదర్భకు వచ్చుట.

ఉ. మోఁకరిలంగ నశ్వములు భూమిపయిం బడె నప్డు బాహుకుం
డాఁక దొఱంగఁ బగ్గముల నట్టిటు నొత్తుచు నిల్వ సూపుచున్

వీకఁ గొనంగఁ జేసి తనవెన్నడి సూతుని నిల్పి ధే! యనఁ
నాకపథంబు ముట్టి జవనంబునఁ బాఱె నొగిఁ రథాశ్వముల్. 81

తే. వాయువేగంబునఁ బాఱువాహనముల
నరసి ఋతుపర్ణుఁ డెంతయు స్వాంతమందు
విస్మయము నొంది ముద మంది వేయిగతులఁ
బొగడుచును మెచ్చె బాహుకుఁ దగిలి తగిలి. 82

వ. అంత వార్ష్ణేయుండు వానివాహనసంగ్రహణంబు గని రథఘోషంబు
విని బాహుకుని హయజ్ఞతకు మెచ్చుచుఁ దనమనంబున. 83

సీ. ఈతండు నిర్జననేతసారథి యైన
మాతలియో లేక మాన్యుఁ డైన
శాలిహోత్రుఁడో కాక జగదేకవీరుఁ డై
నలువు మీఱెడునట్టినైషధుండో
కేవలనరుఁ డైన మావులశాస్త్ర మి
త్తెఱఁగున బాహుకుం డెఱుఁగఁ గలఁడె
నలలక్షణంబు లీనరునందుఁ జూపట్టు
వయసు, విద్యయు, బుద్ధి వఱలు సమత

తే. ఘనులు దైవోపహతు లయి జను లెఱుంగ
కుండఁ బ్రచ్ఛన్నవృత్తిమై నుందు రిట్లు
వికృతరూపముతో నున్నవీనియందు
భేదభావ మొకింతయు లేదు నాకు. 84

ఉ. ఈరథవేగముం దొరయ నీదయు నేదియు లేదు గాని యి
చ్ఛారతి నొప్పునప్పు డొకస్వాంతము నే ననుచుండు నీరవం
బారయ ఘుంఘుమార్భటుల నంబుధిఁ ద్రచ్చెడునాటినాదమో
నా రహి గొల్పెడిఁ మది కనారతమ్ము శ్రవణాతిపర్వమై. 85

చ. నలరథఘోష మే యిది యన న్వొనుదీయను గాని బాహుకుం
డలనిషధాధినాథుఁ డగునా యని సందియ మావహిల్లెడిం
దెలియ నితండు సర్వజగతీతలనాథుఁడ యై స్వరూపముం
దెలుపుచు నొడ్లఁగొల్పు పని నిల్చుట లొప్పమి ని ఖ్లెసంగునో. 86

మ. ఇదియుం గాక యితండు నన్నుఁ గని ము న్నేనాఁడో మిత్రత్వముం
బొదలం జేసినవాఁడు నాఁ బలుకు రేపు ల్మాపు లేకాకియై
సుదతీ లో నిడికొంచు నేమియొ వచించుం దన్నుఁ దా నంచు వి
న్నది విన్న ట్లను జీవలుం డరయ నీతం డానలుండే యగున్. 87

వ అని నలసారథి తనమనంబునం దలంచుచుండె నప్పుడు. 88

మ. దవులం బ్రక్కలఁ బొల్చువస్తువులు చెంతం బ్రక్కలం బొల్చువ
స్తువులుఁ ముందుకు వెన్కకుం బొలమునఁ దోర్లాడి రాఁ బోఁ గనుం
గవకుం దోఁపఁగ మున్ను చూచినది వెన్కం జూడ సాధ్యంబు గా
కవుధా! నా నరదంబు వాఁతె నొగి నానారణ్యముల్ దాఁటుచున్.

మ. నడుమఁ వాఁగులు నేళు లడ్డ మయినఁ జంకించుచు న్వాగురా
లొడికం బేర్పడ లాగి పట్టి యటు ని ట్లొక్కాఁపునం దాఁటిపో
నడగండ్ల న్నడిపించుచుఁ గడియకుఁ గవ్యూతు లెన్నే ని గాఁ
బుడమిం దోలె రథం బహస్కరథంబుం బిచ్చుకుంటో యనన్. 90

వ. ఇట్లు వాయువేగంబున రథం బేగుచున్నయప్పు డయోధ్యాపురాధి
నాథుండు బాహుకుం జూచి నాయుత్తరీయం బిదె పైనుండి జారి
పడియె దాని నీవాఱేయుండు పోయి తెచ్చునంతకు హయంబుల
నాఁగఁ బట్టు మనిన నతం డతని కిట్లనియె. 91

క. నీపటము పడినచో టిట
కోపరివృఢ! తెలియ నొక్కయోజనదూరం
బేపగిదిఁ దేర శక్యం
బో పలుకుము నాఁగ మెచ్చె నుర్విపుఁ డెడఁదన్. 92

వ. అంతలోన నానాదేశంబు లతిక్రమించి పోవుచుండ నొక్కచో నొక్క
ఫలవంతం బైనవిభీతకవృక్షంబు లోచనగోచరం బగుటయు ఋతు
పర్ణుండు బాహుకుదిక్కు మొగంబై. 93

ఉ. అందఱు నన్నియుం దెలియునట్టిరు గా రొకరుండు దక్కఁగ
గొందఱు కొన్నియే యెఱిఁగికొందురు నాకును లెక్కలందుఁ బెం
పొందు వివేక మే నరసియుండినమా త్రన యెట్టిసంఖ్యయుం
బొందుగఁ జెప్ప నేరుతు నపూర్వ మటంచు జనుల్ నుతింపఁగన్. 94

వ. ఈతాండ్రవృక్షంబునం గలపర్ణఫలంబులలెక్క చెప్పెద వినుము శాలినపర్ణంబులు నూటయొక్కటి, ఫలంబులు నూఱు, శాఖాంతరంబులం గూడినయూ రెండుశాఖలయందు నైదుకోట్లుపర్ణంబులు, రెండువేలతొంబదిరైదు ఫలంబులు నున్న వని చెప్పిన విస్మయంబడి బాహుకుండు రథంబు నిలిపి రాజుదిక్కు మొగంబై. 95

మ. ఇది ప్రత్యక్షము చేసికోఁగ మన మయ్యెఁ దేవ! నే నెన్ని వ
చ్చెద నొక్కించుకలోన రశ్మిలను వార్ష్ణేయుం డిటం బట్టు నా
ముదితుం డైనన రేంద్రుఁ డిందుఁ దడయం బొల్పొందఁ బో దన్న నె
మ్మది నౌత్సుక్యము పాయ రాని దగుటం బ్రార్థించుచు న్నాటికిన్. 96

తే. బాహుకుం డను ఋణమాత్ర వత్తు నీవు
నంతదనుకఁ బ్రతీక్షింపు మట్లు కాద
యేని వార్ష్ణేయసారథివై నడువుము
దారి చక్కని దింతలోఁ జేరుకొందు. 97

వ. అనిన నాభాంగాసురి ప్రసన్నుండై నాకు నీవ సారథివి నిన్ను విడిచి నేఁ బోవువాఁడం గాను విదర్భకుం బ్రొద్దు గ్రుంకకుండం బోఁ గలవాఁడ వేని నీసందియంబు దీర్చుకొని ర మ్మనిన నతండు రథావతరణంబు నేసి చని విభీతకంబు నురలం ద్రోచి పండ్లు నెన్ని చెప్పిన యన్నియ యున్న విస్మితుండై మరలి వచ్చి. 98

చ. ఇది పరమాద్భుతంబు ధరణీశ్వర! నీ వెటు చెప్ప నేర్చితో
మదికి సుమంత తోఁప దతిమానుష మం చన వచ్చె నాఁగ ని
య్యది నెగడొందు నక్షహృదయం బనునుత్తమవిద్య దీనినిఁ,
హృదయమునం దలంచునరుఁ డెప్పుడు దోషము లంట కొప్పెడున్.

వ. అనిన బాహుకుం డేను నీకశ్వహృదయం బిచ్చెద నాకు నీవక్షహృదయం బి మ్మని యడిగిన ఋతుపర్ణుం డశ్వహృదయం బపేక్షించి దాని వలసినప్పుడ కొనువాఁడై వాని కప్పు డక్షహృదయం బుపదేశించెఁ దత్ప్రభావంబున. 100

సీ. నలు నాశ్రయించినకలి యప్డు వానిదే
హాముసుండి కరోకటకాహివిషము
గ్రక్కుచు వెలివచ్చి కానంగఁ బడుటయు
నలుఁడు శపింప లోఁ దలఁచెఁ గనలి
తలఁకి భీతుం డయి కలి కరంబులు మోడ్చి
ననుఁ గావు మయ్య యోనరవరేణ్య!
దమయంతి శాపంబు దగిలి నే నీలోన
నహివిషంబునఁ గాల నైతి నిపుడు

తే. జగముల న్నిన్నుఁ గీర్తించుజనుల కెపుడుఁ
గాని నావలన భయంబు గలుగఁ బోవ
దన నలుఁడు నల్క విడి కలి కాజ్ఞ యొసఁగె
నతఁడు నవ్విభీతకవృక్ష మాశ్రయించె. 101

వ. దానంజేసి విభీతకం బప్రశస్తం బయ్యె నిది కలిమాయంజేసి యొరు లెఱుంగ కుండి రంత నలుండు విగతజ్వరుం డయ్యు వికృతరూపుండై వచ్చి రథం బెక్కి రథ్యంబుల కిలువ సూపుటయు నవి విహంగంబుల లెఱుంగున నెగసి నిమేషమాత్రంబునఁ గుండినపురంబు సేరం జనియె నంత సాయాహ్నంబున ఋతుపర్ణుండు భీమరాజాసుజ్ఞాతుండై నిజ రథఘోషం బెల్లదిక్కులం బర్వఁ బురప్రవేశంబు నేసె. 102

దమయంతి రథఘోషంబు విని సంతసించుట.

క. ఆరథనిర్ఘోషము విని
సారెకు వారిధులు గదల సకిలించు చటక్
జేరిన నలునశ్వంబులు
మోరలు పై కెత్తి చూచె మురిపెం బెసఁగన్. 103

తే. హర్మ్యములయందు శాలల నలరుచున్న
నెమ్ములును వారణమ్ములు నెమ్మి గలుగ
నాడె ఘింకార మొనరించె నన్నలురథ
రవము విని మేఘురవ మనుభ్రాంతి గదుర. 104

చ. నలుఁడు నలుం డటం చొగి ననారతముఁ జపియించుభైమి య
న్నలరథఘోషము న్వీని మనంబున నెంతయు సంతసించుచుఁ
నలుఁడ యితండు కానపుడు నా దిటు లొప్ప రథంబు దోలునే
తెలియుదుఁ గాక యం చపుడు తేఱినమోహభరంబుపెంపునన్. 105

వ. ప్రాసాదోపరిభాగంబునకుం జని తేరిపై నెక్కి వచ్చువారిం జూచు
చుండె నప్పుడు బాహుకవార్ష్ణేయులు దిగిన వెనుక ఋతుపర్ణుండు
రథావతరణంబు చేసి భీమరాజుం దరియ వచ్చిన నతం డతని నతి
గౌరవంబున నెదురేఁగి తోడితెచ్చి పూజించి స్వాగతంబు వలుకుచు
నాగమనకారణం బడిగిన ఋతుపర్ణుం డట స్వయంవరం బనుమాటయు
వినక విస్మితుండై వివేకంబున నతని కిట్లనియె. 106

క. వచ్చితిని నిన్నుఁ గనుఁగొని
ముచ్చట దీఱంగ నాడి పో నరవర! నా
మెచ్చి యను భీముఁ డిటు దయ
వచ్చుట నే ధన్యతముఁడ వసుధానాథా! 107

వ. అని ప్రీతిపూర్వకంబుగాఁ బ్రియవచనంబు లాడి వాని నొక్కదివ్య
భవనంబున నధివసింపం జేసి. 108

క. మాయట్టిగుణసముద్రులు
మాయింటికి రాకఁ జేసి మానుష్యఁడఁ గానీ
మాయల్లుఁడు నలుఁ డడవుల
నై యింకను గానరామి నంగదపడుదున్. 109

తే. అనిన ఋతుపర్ణుఁ డనియె నే నది యెఱింగి
నినుఁ బలుకరించి పోయెడుమనముఁ జేసి
యే యిటకుఁ వచ్చితిని నలుం డింతలోనె
మీకు దర్శన మిచ్చెడు మిడుకు టుడుగ. 110

వ. అని సమయోచితసంభాషణంబు గావించె నంత బాహుకుం డా
రథంబు రథశాలకుం దోలుకొని పోయి రథ్యంబులకుఁ జేయంగల
యుపచారంబులు చేసి రథసమీపంబున విశ్రమించి నలుగడం బరి
కించి తనమనంబున, 111

చ. పురమున నెందునుఁ సవడి పోల్పఁగరాదు స్వయంవరోత్సవం
బరయఁగ రాజు లేరును సమాగతు లౌట కనంగ రా దలం
కరణము లేదు బాంధవనికాయము వచ్చి వసించినట్లు గో
చరమును గా ది దెల్ల సతి సన్మతిఁ బన్నినపన్నకం బగున్. 112

క. నాజాడ లెఱిఁగి రేవే
రాఁ జెల్లు సతీస్వయంవరంబున కనుచున్
రాజాస్య తెలిపె నేఁ గా
కేజనుఁడుం జాలఁ డనుచు నెఱిఁగినదగుటన్. 113

వ. అని పలుదెఱంగులం బలవరించుచు. 114

క. ఎఱిఁగినపుర మది గావున
నెఱిఁగినవా రరుగుదేర నే మే నడుగఁ
నెఱి చూపుఁ గాని సందియ
మఱిగొర నేయంగ నడుగ కాఱడి వోవున్. 115

వ. దమయంతియు నట్లు రథావతరణంబు సేసినమువ్వురిలో బాహుకుం
డెవండో యెఱుంగఁజాలక. 116

దమయంతి బాహుకునికడకుఁ గేశినిం బుచ్చుట.

క. నలరథఘోషమువోలెఁ
దెలియంబడె ఘోష మిపుడు తెలియం బడఁ డా
నలుఁ డిందుఁ గుఱుచచేతులు
గలవికృతాంగుండు నలుఁడు గావలయునొకో. 117

వ. అని కేశిని యనుదూతిం బిలిచి. 118

తరళము. కుఱుచచేతులతోడఁ దేరికిఁ గూయిగా శయనించె నా
పొఱఁకువాఁడు నలుం డొకో యని పోలఁ దోఁచెడు నోసి! నీ
వఱిగొఱల్ గొన కేఁగి మెత్తగ నాడి వేడుక నిక్కువం
బెఱిఁగి ర మ్మిపు డిచ్చ హెచ్చెడి నింద యుండినయట్లుగన్.

వ. అని పుచ్చి తాను దనమేడపై నుండి చూచుచుండె నంతలోఁ గేశిని
యుం జని బాహుకుం గని కుశలం బడిగి మాదేవి వినఁగోరుచున్న
యది నీ విందుల కేల వచ్చితివి నిజంబు సెప్పు మనుటయు నతండు.

మ. ధరణీశుం డగుభీమరాజు సుతకుఁ దాల్మిఁ ద్వితీయస్వయం
వరముం జేయఁగ నెంచె నెల్లి యసుచుఁ వాక్యం బయోధ్యాపురీ
శ్వరుఁ డాబ్రహ్మముఖంబున న్వినిమహేచ్ఛ న్వచ్చె నిం దెంతయే
ధర నీనాటన దాఁటి నే నతనివెంట న్వచ్చితిఁ సాదినై. 121

వ. అనుటయు మీలో మూఁడవవాఁ డెవ్వండు నీ వెవ్వండ వెందుల
కీఁబుతుపర్ణ నాశ్రయించితి వని యడిగిన కేశిని కతండు వెండియు.122

తే. అతఁడు వార్ష్ణేయుఁ డనుసూతుఁ డతివ! నలుని
సారథి నలుండు నష్టుఁడై చనుఁడు వచ్చి
చేరె భాంగాసురి న్నేను వారువముల
దిద్ద వండ నయ్యేలికయొద్ద నుంటి 123

వ. అనుడు నది వార్ష్ణేయుండు నలుండు నష్టుఁ డైనతెఱం గెఱుంగునో
యనుటయు నతండు. 124

తే. నలునిబిడ్డల నిటఁ బెట్టి వెలలి పోయె
నాతఁ డేమి యెఱుంగు నె ట్లన్న్య లెఱుఁగఁ
జాలుదురు రూపు చెడి గూఢచారి యైన
వాని వాఁ డెఱుంగును వానివనిత యెఱుఁగు. 125

వ. అనినం గేశిని యి ట్లనియె ని ట్లయోధ్యాపురంబునకుఁ దొల్లి పర్ణా
దుండు వచ్చి. 126

తరువోజ.—

జూదరీ! నీ విట్లు శోచనీయముగ
శ్రుతివిహితార్థంబు చులకన మాఱి
నాదగువస్త్రంబు నడిమికిఁ జించి
నడ డస్సి నిదురించునను వని వీడి
పోఁ దగునే భార్యఁ బ్రోవ భర్తకును
బోలును గాదె యీబుద్ధి యె ట్లబ్బె
నీదుధర్మజ్ఞత నీదువంశంబు
నేఁ డైనఁ దలఁచి న న్నెఱిఁ బ్రోవ రావె.

వ. అని చదివినప్పుడు నీ యిచ్చినప్రతివచనంబు మాదమయంతి నీవలన
విన నభిలషించుచున్న దనిన నతండు వ్యధితహృదయుండు నశ్రు
పూర్ణలోచనుండు నై లోనిదుఃఖం బెఱుకపడనీయక గద్గదకంఠంబు
వెట్టుకొని. 128

చ. పురుషునియందుఁ ద ప్పయినఁ బొల్తుక సైఁచినయేని పుణ్యపుం
దెరువునఁ బోవు నీలువునఁ దేఱినవా రిట నల్ల రెప్పుడుఁ
సిరి చెడి రాజ్యహీనుఁ డయి సిల్గులకై తుథ నొంది మందుఁడై
దురపిలువాఁడు భార్య నటు ద్రోఁచిన దోషము నొందఁ డార్యయన్.

వ. అని పలికితి నని కంట నీరు వెట్టుకొనియె నది యంతయుఁ గేశిని దమ
యంతి కెఱిఁగించిన నామె వాని నలునిఁగా శంకించి వెండియుంబోయి
విశేషంబు లరసి ర మ్మని పుచ్చిన నది పోయి వచ్చి. 130

క. అతిమానుష మత్యద్భుత
మతిచిత్ర మదృష్టపూర్వ మశ్రుతపూర్వం
బతనిచరిత్రము గన నా
కతఁ డొకవే ల్పనుచుఁ బోల్ప నయ్యె న్వింతే. 131

సీ. పృథ్వీపతికి వండి పెట్టంగఁ బాశవ
పలలంబు రా నల్లబానసీఁడు
మనమునం దలఁచినమాత్రన జలములు
మెండయి కడవల నిండుకొనియెఁ
దృణముష్టిఁ గొని సవితృనకుఁ జూపుడు దానఁ
బ్రభవించి యనలంబు ప్రజ్వరిల్లెఁ
బ్రొయ్యిలోఁ బెట్టిన నెయ్యెడకేనియుఁ
గాలవు వానికిఁ గాలునేతు

తే. లహహా వానికరద్వయ మందు వాడి
వత్త లయ్యను బూ లెంతవడికి నైనఁ
దావి వీడవు చెడ వొండుదారిఁ బడవు
వానిమాహాత్మ్య మెంతన వలయు నమ్మ. 132

వ. అనిన దమయంతి దానిచే బాహుకుండు వండినవేడినంజుళ్లు

దెప్పించుకొని తిని నలుం డని నిశ్చయించి వానికడకుఁ దనబిడ్డలం బుచ్చుటయును. 133

చ. కొడుకును గూఁతునుం దిగిచి క్రుచ్చి కవుంగిటఁ జేర్చి శీర్షముం
బుడుకుచు ముద్దు వెట్టుకొని మోమున మోము గదించి యంకమం
దిడుకొని బాష్పబిందువుల నెంతయు వింతగ వారిమేనులం
దడుపుచు మేఁగగు రొప్పుడువ నైషధుఁ డొప్పె వికార మేర్పడన్. 134

వ. అంతలో వారిం దనతొడనుండి డింపి కేశినిం జూచి వీం డ్రిద్దఱు నాబిడ్డలం బోలి యుండుటంజేసి యిట్లు చేసితి నీవు నాకడ కిట్లు పలు మాఱు వచ్చి పోవుచున్నం బ్రజ లొండొరు తెఱుంగునం దలంతు రింక రా వలదు పొమ్మనుటయు నది మగిడి వచ్చి సర్వంబును దమయంతికి నివేదించిన నామె తల్లికడకుం జని యి ట్లనియె. 135

దమయంతి బాహుకుం దనకడకుఁ బిలిపించుట.

చ. జనని! పరీక్ష చేసితిని సర్వవిధంబుల బాహుకుండు స
జ్జననుతుఁ డైనయైషధుఁడు సందియ మెందును లేదు గాని రూ
పున నిసుమంత యుండె నది పోలఁ గనుంగొన నెంతుఁ గాన నా
తనిఁ బిలిపింతువో యిటకుఁ దా నయి నే నటఁ బోవుదాననో? 136

తే. అనుమతి యొసంగు మనుడు నాయమ విదర్భ
పతికిఁ దత్సర్వ మెఱిఁగింప నతఁడు దనరి
నలుని రావించె దమయంతి మెలఁగుచోటి
కపుడు తనుఁ గాంచి దుఃఖించు నతనిఁ గాంచి. 137

వ. దుఃఖించుచు నాటిమలినార్ధవస్త్రంబ కట్టుకొని జటిలయై యున్న దమ యంతి వాని కి ట్లనియె. 138

చ. అలసి వనంబున న్ని దురనందినదానిఁ బరాపవాదముం
దలఁపనిదాని సాధ్వి యగుదానిఁ బ్రజావతి యైనదాని నే
కలతకుఁ గానిదానిఁ గులకాంత నయో నలుఁ బోలి వీడిపోఁ
గలిగినవాని నొక్కరుని గంటివొకో యెట నేని బాహుకా. 139

క. దేవతలం గా దనుచుఁ, నే వరియించితిని వాని నేదైవముగా
భావించితి నిట్టిననుం, బో విడుచుట ధర్మ మగునె పో! వాని కిలన్.

మహాస్ర.—

అనుచుం గన్నీళు లేళ్లై యటఁ బఱవఁగ దుఃఖార్తయై యున్న పత్నిం
గని శోకవ్యాకులుండై కలుషరహితుఁడక్కాశ్యపీంద్రుండు దా ని
ట్లనియెం గాంతామణీ! నే నలకలినిహతిఁ బోవడిం బొంది ని న్న
ట్లనురాగం బేఁగ దుష్కార్య మనక విడఁగా నై వగం గుంద నైతిన్.

వ. కలిదోషవిముక్తుండ నైననే నిపుడు నీద్వితీయస్వయంవరం బిటఁ
బ్రవర్తిల్లుచుండుటం జేసి మూఁకాజేంద్రునితో నిన్నుఁ జూడ వచ్చితి
నా కొండుప్రయోజనంబు లేదు వినుము. 142

క. అనురక్తు ననువ్రతు జన,వినుతుం బతి విడిచి సుదతి వేఱొకపతినిం
గోనఁ నెంచి కోర్కిఁ దగ, జను టనురూపంబె చెపుమ జలజాతాక్షీ!

వ. అనిన వెఱచఱచి దమయంతి ప్రాంజలి యై. 144

సీ. ఇందు నాతప్పని యెంతె వేల్పుల రోసి
నిను వరించితి నన్ను నీ వెఱుఁగవె
భవదభిగమనార్థ మవనీసురులు కడ
లకు నేఁగి నానుడుల్ పలికి రందుఁ
బర్ణాదుఁ డెఱిఁగె నిఁ బ్రతివచనం బిడ్డ
కతన నయోధ్య నొక్కవిధమునను
నినుఁ దేరఁగ నుపాయ మని స్వయంవరము నే
నెసఁగించితిని దండ్రి యెఱుఁగకుండ

ఆ. నీవు గాక యొకరుఁ డేకాహ్నమున నూఱు
యోజనములదారి వాజుల నడ
పుటకు నోపఁ డనుచు మూర్త మెల్లియ యొప్పు
ననుచుఁ దెలుపు మంటి నవనినాథ! 145

పంచ. స్వయంవరంబు మాట నిక్కువంబ యేని భూమిభృ
చ్ఛయం బ దేది యొక్కరుం డెసంగుచుంటఁ గంటివే?
యయంబ నేఁడ యైనఁ బత్తనాలయాంగణాద్యలం
క్రియ లొప్పసంగి యుండె నక్టె? రిత్తనేలఁ జూడవే. 146

క. త్రికరణశుద్ధిగఁ బలికితి, నకలంకమనస్కురాల నని నే నిటఁ దా
వకపదము లంటి చేసెద, సకలజగం బెఱుఁగ బాస సదమలహృదయా!

చ. తగ దన కే నొకింతయినఁ ద ప్పానరించితి నేని రేబవల్
జగముల లోపల న్వెలుపల న్వెలుఁగొందెడుచంద్రసూర్యులుఁ
మృగహాయుఁడు న్ననుం గినిసి మిత్తికి నిత్తురు గాక కానిచోఁ
దగవరులై యథార్థమును దాఁపక తారు వచింత్రు గావృతన్. 148

వ. అని పలుకుచున్న సమయంబున నంతరిక్షంబునుండి వాయుభట్టారకుం
డెల్లరు విన ని ట్లనియె. 149

మ. నిషధాధీశ! నిజంబు వల్కెద నిటఁ నీదేవి యేయింత క
ల్మషముం బొంది యిఱుంగ దే మెపుడుఁ బోలం గాంచుచున్నార మీ
విషవర్షంబులు మూఁడు; ని న్నిటకు రావింపంగ నీతీఱునఁ
మిష గల్పించె నశంకితాత్ముఁ డయి దీనిం బొందుమీ పొందుగన్.

వ. అని పలుకుచున్న సమయంబున. 151

మాలిని. సురలు విరులవానల్ సోనలై కుప్పతిల్లఁ
గురిసిరి ధర యెల్లఁ దుందుభిధ్వాన మొప్పెఁ
విరిసెఁ జదలు కాంతిఁ నిర్మలంబై శివంబై
సరవిఁ గుబులుకొంచుం జల్లఁగా గాలి వీచెన్. 152

నలుఁడు కర్కోటకప్రభావంబున నిజరూపంబు నొందుట.

సీ. అంత నయ్యద్భుత మంతయు నారసి
నలుఁ డంతరంగమునం దనర్చి
దమయంతిఁ బ్రేమించి తలఁచెఁ గర్కోటకు
నతనియిచ్చినవస్త్ర మది ధరింపఁ
దత్ప్రభావంబునఁ దనతొంటిరూపము
నలరాజునకు వచ్చె నలువమీఱి
సైజదేహచ్ఛవిఁ దేజరిల్పతిఁ గాంచి
తగఁ గొఁగిలించె విదర్భతనయ

తే. నలుఁడు నాసతి నక్కునఁ నలరఁ జేసి
కొడుకునుం గూఁతుఁ బ్రీతిమైఁ గ్రుచ్చి యెత్తె

మగువ మగనియురంబుపై మొగముఁ జేర్చి
యూర్చె నతఁడును వగఁ దక్కి కూర్చి పేర్చె. 153

వ. అంత నలదమయంతులవృత్తాంతంబు విని విదర్భేశ్వరుండు వడివడిం జనుదెంచి సంజాతసస్య యై యబ్దవారి నాప్యాయిత యైనభూతధాత్రి యుంబోలెఁ బతిఁగూడి యపగతతాపయై శీతాంశునిఁగూడినత్రియా మయుం బోలె వెలుంగుచున్న కూఁతుం గాంచి సంతసించి తనకభి వాదనంబు సేయువారి నభినందించి యాశీర్వదించి దేవాయతనంబులం బూజలు సేయించి పురం బలంకరింపం బంచి పరమోత్సవంబునం బొందె నంత. 154

శా. ఆవైదర్భియు నైషధుండు నపు డన్యోన్యానురాగంబునఁ
భావం బొప్పఁగ నాటిరేయి విలసత్పల్యంకభాగంబులై
శేవం బొల్చి వనంబులం దమకుఁ బాటింపంగ నైనట్టిపా
ట్లావేళ న్వచియించుకొంచు మిగులఁ హార్షించి రుత్కంఠమై. 155

ఆ. నాలుగేండ్ల కట్టు లాలు మగండును, గలిసికొనినయట్టికారణమునఁ
గనిరి వారు సర్వకామార్థసిద్ధులు,గలిగి ముదము నొంది రెలమి నపుడు

వ. అంతఁ బ్రభాతం బగుటయు. 157

తే. గోముఖశ్రీలు మేలుమ్రుగ్గులును దోర
ణములు ధ్వజములు నల్లడ నలువుమీఱఁ
జేసి ప్రో లెల్ల మిగులఁ గైసేసి కారు
లెల్ల హృష్టాంతరంగులై యెసఁగి రపుడు. 158

మ. ఋతుపర్ణుం డది యంతయు న్విని నలు న్వీక్షించి విశ్వంభరా
పతి వీ వక్కట! బాహుకుం డనఁగ నై ప్రచ్ఛన్నవృత్తి న్వసిం
చితి నాచెంతను; నీచకార్యములు నీచే నేను జెయించితిఁ
క్షితినాథాగ్రణి! తప్పు సైఁచి దయ న న్వీక్షించి రక్షింపవే. 159

తే. అనుడు నలుఁ డి ట్లనియె నోమహామహీశ!
నాకు సంబంధి వీవు నే నీకడఁ గడు
నొప్పియుంటిని నాయింట నుండినట్లు
తప్పు చేసితి ననుఁ టది యొప్పునయ్య! 160

26071
25-3-73.

వ. అని నలుండు వాని నాదరించి పూజించి వాని కశ్వహృదయం బిచ్చి పుచ్చుటయు నతండును భీమరాజసత్కృతుండై యనుపంబడి వారి వీడ్కొని నలసారథి నంద విడిచి యొండొక్కసారథిం దోడ్కొని నిజపురంబునకుం జనియె నంత నైషధుండును గుండిననగరంబున నొక్కమాసం బుండి భీమరాజు నామంత్రించి యొక్కరథంబును, బదియాఱుగజంబులును, నేబదిహయంబులును, నాఱునూర్లపదాతులును, గల స్వల్పబలంబుఁ దోడుకొని త్వరత్వర ప్రయాణంబులం గదలి నిషధకుం జని పుష్కరం గని యి ట్లనియె. 161

తరువోజ.—

వినుము పుష్కర! నాకు విత్తంబ యగుచు
వెలఁది యుండె విదర్భవిషయాధినాథు
తనయ పణం బిడఁ దలఁచితిఁ దానిఁ
దగ నీవు పణ మిడు ధారుణీరాజ్య
మును జూద మాడఁగ బుద్ధియే్క లేక
మొనసి నాతో నాలమునకేని రమ్ము
మనము పోరుద మందు మడసినవాని
మహిరాజ్య మొర్చినమానిసి నొందు.

తే. అని నలుఁడు వల్కఁ బుష్కరుఁ డాల మైన
మొప్ప మగు జూద మొప్పు నే మున్న వీని
నొడిచి యుంటి జయం బగుఁ బడతి నొంగ
వచ్చు నని లోన నెంతయు మెచ్చుకొనుచు. 163

ఉత్సాహము. నలునిఁ గాంచి యిట్లు పల్కె నాకు దేవనంబునఁ
గలదు ప్రీతి గాన నాడఁ గడఁగు మేను గెల్చినఁ
నెలతమిన్న నాది యగును నీవు గెల్చితేని నా
కలరు రాజ్య మెల్ల నీది యగునుజుమ్ము నావుడున్. 164

నలుఁడు పుష్కరు నోడించి నిజరాజ్యంబు వడయుట.

సుగంధి. వీరసేనసూతి బాహువీర్యగర్వయుక్తుఁడై
పోర లావు చాలనట్టిబుద్ధిహీను వానినిఁ

జేరి వారిజాక్షిఁ గొమ్ము చిట్టకమ్ముగా నటం
చారటమ్ము దీఱఁ బిల్చి యాఁడి గెల్చె వ్రేల్మిడిన్. 165

వ. ఇట్లశ్రమమ్మున జూదమ్మునం గెలిచి వానిం జూచి నవ్వుచు ని ట్లనియె.

పద్మనాభము.—

ని న్నిట్టు లోడించితిం గాన రాజ్యంబు
నేఁ గైకొనం గల్గె నీ కింక భైమిక్
గ న్నెత్తి చూడంగ నాడంగ శక్యంబు
గా దయ్యె దాసుండ వై తీవు మాకున్
ము న్ననున్న జూదంబునం గెల్తు నంచుం బ్ర
మోదమ్మునఁ గర్వముం గొంచు వింతే
నెన్నంగ లే వక్కలీంద్రప్రసక్తిఁ ర
హిం దూలి పో నైషధుం డయ్యె నంచున్.

మత్త. ఈవు నాపినతండ్రిపుత్త్రుఁడ వింత కెక్కువ నీకు నే
నేవిధంబున నెగ్గు సేయఁగ నెంతు రాజకులాధమా!
పోవు మెచ్చటికే శరీరముఁ బ్రోచికో నగువిత్తమున్
జీవలంతిగఁ గొ మ్మొసంగితిఁ జెల్మి నింపితి నీపయిన్. 168

వ. అని సత్కరించి వాని నంపిపుచ్చి నలుం డనల్పవైభవంబునఁ బురప్రవే
శంబు చేసి పౌరుల నాశ్వాసించి మంత్రుల మన్నించి పరమోత్సవం
బెసంగఁ బూజ్యసామ్రాజ్యంబుఁగొని దమయంతిం బిలువనంపుటయు.

స్రగ్ధర.

ప్రీతిఁ భీముండు కూఁతుం బ్రియసుతసహితం బిల్చి నీప్రాణనాథుం
డేతన్మాత్రంబులో నాకృపణు గెలిచి ని న్నింతలో రాఁగఁ బంచెఁ
జేతోమోదంబుతో నీచెలువునిఁ గనుఁగోఁ జెల్లుఁ బొ మ్మంచు లోక
ఖ్యాతం బౌరీతిఁ బుచ్చెం గడుధన మిడి సత్కారముం జేసి వేడ్కన్.

తోదకము. కొడుకును గూఁతురుఁ గోర్కి దలిర్పం
గడుకొని వెంబడి గాఁ జనుదేరఁ

---

పద్మనాభవృత్తమునకు 7 తగణములు, 2 గురువులు, 13-వ యక్షరము యతిస్థానము.

గడువిభవంబునఁ గ్రాలుచు నంతఁ
బడతి ప్రియంబున భర్తను జేరెన్. 171

వ. ఇట్లు వచ్చినధర్మపత్నిం గూడి నైషధేశ్వరుండు దేవేంద్రవైభవంబునం దేజరిల్లుచు విధిదృష్టవిధానంబున వివిధయజ్ఞంబు లొనరించి జంబూద్వీపంబునందలితనరాజ్యం బేలుచు సుఖంబుండె ధర్మజా! నీవు నట్లు నీదుఃఖం బెల్లఁ జల్లార రాజ్యంబు వడసి సకలబంధుపరివృతుండవై సుఖంపఁ గలవు. పరిదేవనంబు సేయకుండు మని బృహదశ్వుండు వెండియును. 172

క. నలరాజున్ దమయంతిం, గలితయశుఁ డగుబుతుపర్ణుఁ గర్కోటకునిం
దలఁచినవారల కెప్పుడు, కలికల్మషనాశనంబు కాఁ గల దరయన్.

ఉ. ఈయితిహాసముఁ వినిర యేని పఠించిర యేని నిచ్చలుఁ
బాయక యొడ్లకుం దెలియఁ బల్కిర యేని సమస్తదోషముల్
వాయు శుభంబు డాయుఁ గలిబాధ ల వన్నియు మాయు రోగముల్
పాయవడుం బ్రశస్తియు నపారయశంబును గల్గు నిద్ధరన్. 174

వ. అని బృహదశ్వుండు ప్రహృష్టమనస్కుండై ప్రార్థించిన ధర్మరాజునకు నక్షహృదయం బెఱింగించి యశ్వశిరస్తీర్థంబునకు యథేచ్ఛం జనియె. 175

క. అని శౌనకాదిమునులకు వినిపించెఁ సూతుఁ డిట్లు వినయముతోఁ ని
య్యనఘు మగునైషధీయంబును ధీనిన్వినిన శ్రేయములు సమకూడున్.

ఆశ్వాసాంతము.

సుగంధి. వేడికోలు రాకమున్నె వేనవేలుసొమ్ములం
గూడునర్థికోటి కిచ్చి కోర్కిఁ దీర్చుదాత మే
లాడువాఁడు కామయార్యనాత్మజుండు వానికిఁ
వీడనట్టిసౌఖ్య మిచ్చి వేడ్కఁ బ్రోవు మీశ్వరా.

గద్యము. ఇది శ్రీమహామహోపాధ్యాయ, కలాప్రపూర్ణ, కవిరాజ, కవిసార్వభౌమ శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి ప్రణీతంబయిన నైషధీయచరితం బనుశృంగారతరంగిణియందు షష్ఠతరంగము.

శ్రీ. శ్రీ. శ్రీ.

చెన్నపురిః 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము—1941.